

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 98

శనివారం 29-6-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

జోయాలుక్కాస్
వరల్డ్స్ ఫేవరేట్ జ్యువెలర్



Joyalukkas
World's favourite jeweller



ఫ్లాట్



% తగ్గింపు

మజూరీ ఛార్జీలు (వి.ఏ.)పై
గోల్డ్, డైమండ్స్, ప్రెషస్ &
సిల్వర్ జ్యువలరీ కోసం







మళ్లీ వచ్చింది అతుల్యమైన జ్యువలరీ సేల్

2024 యొక్క అత్యంత ఆకర్షణీయమైన ఆఫర్, గోల్డ్, డైమండ్స్, ప్రెషస్ & సిల్వర్ జ్యువలరీ కోసం
మజూరీ ఛార్జీలు (వి.ఏ.)పై ఫ్లాట్ 50% డిస్కౌంట్ ఆనందించండి. ఇప్పుడే పెద్ద షాపింగ్ చేయండి.

VIJAYAWADA • CHITTOOR • NELLORE: RAMAMURTHY NAGAR | GOMATHI NAGAR • KADAPA • GUNTUR • ONGOLE • VISAKHAPATNAM • GAJUWAKA
KAKINADA • RAJAHMUNDRY • TIRUPATI • ANANTAPUR • KURNOOL I HYDERABAD: PUNJAGUTTA • A.S RAO NAGAR
KONDAPUR: SIGNATURE TOWERS | FORTUNE CYBER • KUKATPALLY • DILSUKHNAGAR • HABSIGUDA SIDDIPET • MEHDIPATNAM
SUCHITRA • CHARMINAR • CHANDA NAGAR • KHAMMAM • KARIMNAGAR • WARANGAL • NIZAMABAD

INDIA • USA • UK • UAE • KSA • QATAR • BAHRAIN • KUWAIT • OMAN • SINGAPORE • MALAYSIA

www.joyalukkas.com



ముఖ్య అతిథి
శ్రీ మల్లు భట్టి విక్రమార్క
తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి
29 జూన్ 2024న
ఉ॥ 10 గం॥ నుండి
ఆల్వాల్, అత్తాపూర్, నాగారంలో
GRAND OPENING
ఆల్వాల్ • అత్తాపూర్ • నాగారం
NIYANSHI
Furnitures & More
Your Favourite Place to Shop
గతంలో ఎన్నడూ చూడని డిజైన్లతో ప్రత్యేకంగా కోరుకునే ఫర్నిచర్ కొరకు గమ్యస్థానం
పూర్తి ఫర్నిచర్ అవకాశాలు | 25,000 చ.అ.స్టోర్ | 300+ ఎక్స్‌క్లూజివ్ మోడల్స్
5 DAYS GRAND SALE
29th June to 3rd July, 2024. Don't miss!
UPTO 54% OFF
ఉచితం జంటకు గోవా ట్రిప్ రూ. 99,998 కొనుగోలుపై
ఉచితం రూ. 49,998/- కొనుగోలుపై 43" TV రూ. 79,998/- కొనుగోలుపై 55" TV
ఉచితం Shop before 2:00 PM Get Silver Coin or Surprise gift
0 డౌన్-పేమెంట్, వడ్డీ, ప్రాసెసింగ్ ఫీజు
24 నెలల EMI
ఏదైనా కొనుగోలుపై
కల్కి 2898ఎడి టికెట్లు
ఉచితం
పొందండి 27% OFF ఎక్స్ఛేంజ్‌పై
మలేషియన్ రిక్లైనర్ సోఫా సెట్ MRP ₹1,59,996 ₹79,998/- EMI Per Month ₹3933/-
ఐర్లాండ్ రిక్లైనర్ సోఫా MRP ₹99,996 ₹49,998/- EMI Per Month ₹2458/-
లగ్జరీ 10 సీటర్ సోఫా సెట్ 3+2+ రాణి దివాన్ + 2 పఫీస్ MRP ₹79,996 ₹39,998/- EMI Per Month ₹1967/-
యూరోప్ సోఫా సెట్ 3+2+1 MRP ₹59,996 ₹29,998/- EMI Per Month ₹1474/-
లిజియాన్ 8 సీటర్ సోఫా సెట్ 3+2+1+2 పఫీస్ MRP ₹55,996 ₹27,998/- EMI Per Month ₹1377/-
మావెరిక్స్ కార్నర్ సోఫా 2+2+1+C MRP ₹45,996 ₹22,998/- EMI Per Month ₹1131/-
మార్బుల్ టాప్‌తో టేకఉడ్ డైనింగ్ టేబుల్ 4 కుర్చీలు + 1 బెంచ్ MRP ₹69,996 ₹34,998/- EMI Per Month ₹1721/-
టేకఉడ్ డైనింగ్ టేబుల్
6 సీట్స్ + 4 కుర్చీలు + 1 బెంచ్ MRP ₹41,996 ₹20,998/- EMI Per Month ₹1032/-
4 సీట్స్ + 2 కుర్చీలు + 1 బెంచ్ MRP ₹33,996 ₹16,998/- EMI Per Month ₹836/-
లగ్జరీ ఇటాలియన్ మార్బుల్ డైనింగ్ టేబుల్ - 1+6 MRP ₹2,99,996 Starts from ₹1,49,998 EMI Per Month ₹7374/-
ఎస్టోనియా బెడ్ రూమ్ సెట్ MRP ₹99,996 ₹49,998/- EMI Per Month ₹2458/-
టేకఉడ్ బెడ్స్ MRP ₹49,996 ₹24,998 + Free Mattress EMI Per Month ₹1229/-
టేకఉడ్ బెడ్స్
కింగ్ సైజ్ MRP ₹41,996 ₹20,998 + Free Mattress EMI Per Month ₹1032/-
క్వీన్ సైజ్ MRP ₹37,996 ₹18,998 + Free Mattress EMI Per Month ₹934/-
ఫుల్ ఇంటీరియర్ ప్యాకేజ్
MRP ₹1,59,996 రూ. 79,998/-లకే EMI Per Month ₹3933/- ఉచితం 4 సీటర్ డైనింగ్ టేబుల్
MRP ₹1,99,996 1BHK @ రూ. 99,998/- మాత్రమే EMI Per Month ₹4917/-
MRP ₹2,99,996 2BHK @ రూ. 1,49,998/- మాత్రమే EMI Per Month ₹7375/- ఉచితం 43" TV
MRP ₹3,99,996 3BHK @ రూ. 1,99,998/- మాత్రమే EMI Per Month ₹9833/- ఉచితం 55" TV
వార్డ్‌రోబ్స్
2 డోర్ MRP ₹29,996 ₹14,998/- EMI Per Month ₹737/-
3 డోర్ MRP ₹37,996 ₹18,998/- EMI Per Month ₹934/-
4 డోర్ MRP ₹43,996 ₹21,998/- EMI Per Month ₹1082/-
టివి స్టాండ్ MRP ₹13,996 Starts from ₹6,998/-
డిజైనర్ లైట్స్ MRP ₹3,998 Starts from ₹1,999/-
కంప్యూటర్ టేబుల్ ఉచితం కుర్చీ MRP ₹15,996 ₹7,998/-
షూ ర్యాక్స్ 2 డోర్ MRP ₹5,596 ₹2,798/- 3 డోర్ MRP ₹7,596 ₹3,798/-
స్టడీ చైర్‌తో స్టడీ టేబుల్ ఉచితం కుర్చీ MRP ₹11,996 ₹5,998/-
The opening will be graced by the presence of our esteemed promotional partners
Adnan Sajid Khan Insta ID: @adnansajidkhan
Aashu Reddy Insta ID: @ashu_uuu
Jabardasth Varsha Insta ID: varsha999_99
Urmila Chauhan Insta ID: urmilachauhan___
డిజిటల్ పార్ట్నర్స్:
040-4500 4362
89774 78444 | 89774 87444
బల్క్ ఎంక్వైరీలకు: niyanshifurnitures@gmail.com
మమ్మల్ని అనుసరించండి: niyanshifurnitures
స్టోర్ లోకేషన్స్: ఆల్వాల్ అత్తాపూర్ నాగారం

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 98

శనివారం 29-6-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'



ఈసారి వదలొద్దు!

నేడు భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య టి20 ప్రపంచకప్ టైటిల్ పోరు -16లో



షఫాలీ విశ్వరూపం

దక్షిణాఫ్రికాతో టెస్టులో తొలి రోజు భారత మహిళల జట్టు పరుగుల వరద -16లో



విమానాశ్రయంలో కూలిన పైకప్పు

భారీ వర్షాలకు ఢిల్లీ విమానాశ్రయంలో టెర్మినల్ 1 పై కప్పు పాక్షికంగా కూలి.. కార్లపై పడింది. ఒకరు మృతి చెందారు.

వివరాలు 6లో ▸



హేమంత్ సోరెన్‌కు బెయిల్

భూకుంభకోణం– మనీ లాండరింగ్ కేసులో జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌కు ఆ రాష్ట్ర హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.

వివరాలు 6లో ▸



ట్రంప్ జోరు.. బైడెన్ బేజారు

అమెరికా అధ్యక్ష ఎన్నికల రేసులో మాజీ అధ్యక్షుడు ట్రంప్ దూకుడు పెంచారు. డిబేట్ పోడియం ప్రెసిడెంట్ బైడెన్ తడబడ్డారు.

వివరాలు 6లో ▸



ఓటుబ్యాంకు రాజకీయాలు

భారత్‌లో మతస్వేచ్ఛకు భంగం కలుగుతోందని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ నివేదిక ఇవ్వడంపై భారత విదేశాంగ శాఖ మండిపడింది.

వివరాలు 6లో ▸

'ఆరు' నూరవకుండా..

వలసల అడ్డుకట్టపై బీఆర్ఎస్ అధిష్టానం ఫోకస్



ఎర్రవల్లిలో శ్రేణులతో మాట్లాడుతున్న కేసీఆర్

- అధికార పార్టీ వలలో నేతలు, ఎమ్మెల్యేలు
- ఇప్పటికే కారు దిగిన అరడజను మంది ఎమ్మెల్యేలు
- కేకే, కడియం, ఇంద్రకరణ్ లాంటి ముఖ్య నేతలూ జంప్
- పదవులు అనుభవించిన నేతలే వెళుతుండటంతో శ్రేణుల్లో అయోమయం
- ఎమ్మెల్సీలతో పాటు మరింత మంది నేతలపై కాంగ్రెస్ దృష్టి
- కేసీఆర్ అప్రమత్తం.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో లంచ్ భేటీలు
- ద్వితీయ, తృతీయ శ్రేణి నేతలతో వరుస సమావేశాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో వలసల రాజకీయం జోరుగా సాగుతోంది. విపక్ష బీఆర్ఎస్ పార్టీకి చెందిన నేతలకు అధికార కాంగ్రెస్ వల విసురుతోంది. ఇప్పటికే పలువురు ముఖ్య నేతలు కారు దిగి హస్తం గూటికి చేరగా, తాజాగా కాలె యాదయ్య చేరికతో ఇప్పటివరకు కాంగ్రెస్ కండువా కప్పుకున్న గులాబీ ఎమ్మెల్యేల సంఖ్య ఆరుకు చేరింది. శాసనమండలిలో అధికార పార్టీకి నామమాత్ర సంఖ్యాబలం మాత్రమే ఉండటంతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు లక్ష్యంగా కూడా ఆ పార్టీ కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ అప్రమత్తమైంది. పార్టీ బీ ఫామ్‌పై గెలిచిన నేతలు చేజారకుండా చూసేందుకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు స్వయంగా రంగంలోకి దిగారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాజకీయ పరిణామాలను ఎప్పటికప్పుడు గమనిస్తున్న కేసీఆర్.. వలసలకు అడ్డుకట్ట వేయడంపై దృష్టి సారించారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సుదీర్ఘ భేటీలు జరుపుతూ బీఆర్ఎస్‌లో కొనసాగితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని భరోసా ఇస్తున్నారు. మరోవైపు పార్టీ ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులతోనూ ఎర్రవల్లి నివాసంలో వరుస భేటీలు జరుపుతూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు.

ఒకరొకరుగా కీలక నేతల నిష్క్రమణ

గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో కీలక నేతలు ఒకరొకరుగా పార్టీ నుంచి నిష్క్రమించడం మొదలు పెట్టారు. వీరంతా పార్టీ అధికారంలో కొనసాగిన కాలంలో కీలక పదవులు అనుభవించిన వారే కావడం గమనార్హం. పార్లమెంటరీ

మిగతా 3వ పేజీలో ▶

కార్యకర్తలనే నేతలుగా చేస్తా

- దొంగల్లో కలిసేటోళ్ల గురించి బాధ వద్దు
- ఆలోచించాల్సిన అవసరం అసలు లేదు
- ఒక్కరు బయటకు వెళ్తే పది మందిని తీర్చిదిద్దుకునే సత్తా మనకుంది

నేతలు, కార్యకర్తలతో కేసీఆర్

- వివరాలు 3లో ▶

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య 3 లో

ఫిరాయింపుదారులకు పదవులు ఉండవు

కాంగ్రెస్ బీఫామ్‌పై గెలిచిన వారికే పదవులు

- ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్య
- వచ్చే నెల తొలివారంలో మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి నియామకం
- రుణమాఫీ మా తొలి ప్రాధాన్యత.. మూడు, నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు
- హైదరాబాద్ పాతబస్తీ విద్యుత్ నిర్వహణ అదానీ సంస్థకు అప్పగిస్తాం
- రాష్ట్రానికి 7 లక్షల కోట్ల అప్పులున్నాయి.. వడ్డీలు తగ్గించుకునే పనిలో ఉన్నాం
- కొత్త బీసీ కమిషన్ నియామకం తర్వాతే కులగణన చేపడతామని వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వస్తున్న వారికి రాష్ట్ర మంత్రి వర్గంలో చాన్సుగానీ, నామినేటెడ్ పదవులుగానీ ఇచ్చే అవకాశం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ''రాష్ట్ర మంత్రివర్గంలో, పీసీసీ, నామినేటెడ్ పదవుల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులకే పదవులు దక్కుతాయి. కొత్తగా వచ్చి చేరిన నేతలకు పదవులు ఉండవు. కేవలం కాంగ్రెస్ నుంచి బీఫామ్‌లు తీసుకుని గెలిచిన వారికి, కాంగ్రెస్‌లో ఉన్న వారికే పదవులు వస్తాయి..'' అని చెప్పారు. పార్టీ అనుబంధ సంఘాల్లో క్రియాశీలకంగా పనిచేసిన నేతలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇస్తామన్నారు. రేవంత్ గురువారం ఢిల్లీలోని తన నివాసంలో మీడియాతో చిట్‌చాట్ చేశారు.

వచ్చే నెల తొలివారంలో నియామకాలు

కేబినెట్ విస్తరణ, పీసీసీ పదవుల విషయంలో అధిష్టానంతో చర్చ జరిగిందని.. అయితే ఎవరెవరికి ఇవ్వాలన్న దానిపై ఏ నిర్ణయం జరగలేదని రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో సామాజిక న్యాయం ఎప్పుడూ ఉంటుందని.. పదవులు పొందేవారిలో మహిళలు, పురుషులు, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ ఇలా ఎవరైనా ఉండవచ్చని చెప్పారు. జూలై మొదటి వారంలో మంత్రి వర్గ విస్తరణతోపాటు పీసీసీ అధ్యక్షుడి నియామకం

మిగతా 2వ పేజీలో ▶

పేర్లు ఫైనల్.. మిగిలింది ప్రకటనే!

- ఖర్గే, కేసీల భేటీలో మంత్రి పదవులు, పీసీసీ చీఫ్, నామినేటెడ్ పోస్టుల జాబితా ఖరారు

2 లో

న్యూస్‌రీల్

రానున్న రెండ్రోజులు తేలికపాటి వానలు



రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉత్తర, తూర్పు ప్రాంత జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

- వివరాలు 18లో ▶

435 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీ



ఎంబీబీఎస్ అర్హతతో సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది. 435 పోస్టులకు తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు శుక్రవారం నోటిఫికేషన్ జారీచేసింది.

- వివరాలు 18లో ▶

టెన్త్ అడ్వాన్స్‌డ్‌లో 73.03 శాతం ఉత్తీర్ణత



పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో 34,126 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 20,694 మంది, బాలికలు 13,432 మంది పాసయ్యారు. 73.03 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

- వివరాలు 18లో ▶


కుక్కలదాడిలో బాలుడి మృతి



కుక్కల దాడిలో ఆరేళ్ల బాలుడు మృతి చెందాడు. బిహార్‌కు చెందిన బాల్కన్, ప్రమీల దంపతులు ఇస్నాపూర్‌కు వలస వచ్చారు. వీరి చిన్న కుమారుడు బిశాల్ బహిర్భూమికి వెళ్లగా, 4 కుక్కలు దాడిచేశాయి. స్థానికులు వెళ్లి చూసేసరికే బాలుడు మృతిచెందాడు.

- వివరాలు 5లో ▶





ఎక్కడా పక్షపాతం లేదు

విద్యుత్ ఒప్పందాలపై నిష్పక్షపాతంగానే జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ విచారణ.. హైకోర్టులో ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు

- ఎంక్వైరీ కమిషన్ పేరుతో జ్యుడీషియల్ కమిషన్ వేయడం చట్టవిరుద్ధమన్న కేసీఆర్ తరపు న్యాయవాది ఆదిత్య సోంధీ
- పిటిషన్‌ను విచారణకు అనుమతించాలని విజ్ఞప్తి
- వాదనల అనంతరం తీర్పు రిజర్వు చేసిన సీజే ధర్మాసనం

3 లో

జూలై 18 నుంచి డీఎస్సీ పరీక్షలు

- ఆగస్టు 5 వరకు..
- తొలిసారి ఆన్‌లైన్‌లో పరీక్షలు
- షెడ్యూల్ విడుదల చేసిన విద్యాశాఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 11,062 టీచర్ పోస్టుల భర్తీకి నిర్వహించనున్న డీఎస్సీ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకు తొలిసారిగా ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 11,062 టీచర్ పోస్టుల కోసం 2,79,956 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే, గతంలో జూలై 17 నుంచి 31 వరకు మాత్రమే పరీక్షలుంటాయని

మిగతా 2వ పేజీలో ▶

పార్లమెంట్‌లో 'నీట్' రగడ

పరీక్షలో అక్రమాలపై వెంటనే చర్చించాలని విపక్షాల డిమాండ్



- అంగీకరించని లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్
- నిరసనలతో హోరెత్తించిన ప్రతిపక్ష సభ్యులు
- ఉభయ సభలు పలుమార్లు వాయిదా
- రాజ్యసభలో వెల్‌లోకి ఖర్గే దూసుకు రావడంపై జగదీప్ ధన్‌ఖడ్ ఆగ్రహం

- వివరాలు 6లో

రక్తసిక్తం...



పరిశ్రమలో పేలుడు జరిగిన ప్రదేశం

గ్లాస్ తయారీ పరిశ్రమలో ఘోర ప్రమాదం

- ఆటోక్లేవ్ యూనిట్ వద్ద పేలిన బాయిలర్
- ఐదుగురు కార్మికుల మృతి...13 మందికి తీవ్రగాయాలు
- చెల్లాచెదురుగా మృతదేహాలు.. షాద్‌నగర్ పరిధిలో ఘటన

- వివరాలు 5లో

ప్రాణం తీసిన అతివేగం

- రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న మేకల లోడ్ లారీ
- ఐదుగురు అక్కడికక్కడే మృతి..
- చేగుంట శివార్లలో దుర్ఘటన

5 లో




లారీ, టెంపో ఢీ 13 మంది మృతి

కర్ణాటకలోని హావేరి జిల్లాలో రోడ్డు ప్రమాదం

6 లో

ఇదండీ జోక్



చేతబడి ఉందని నమ్మి.. మూఢ నమ్మకాలను ప్రోత్సహిస్తున్నందుకు ముందు మిమ్మల్ని అరెస్టు చేయాలంటున్నార్సార్!

రూటు మారినా.. జర్నీ అదే!

- ధరణి దరఖాస్తుల పరిష్కారంలో ఒక్క అడుగే ముందుకు
- ఏ దరఖాస్తు వచ్చినా తహసీల్దార్‌కు కనపడే ఆప్షన్ అందుబాటులోకి
- మిగిలిన ప్రక్రియ అంతా యథాతథం.. తహసీల్దార్ నుంచి కలెక్టర్ వరకు చక్కర్లు కొట్టాల్సిందే
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పేరిట మొత్తం 4 సార్లు కిందికి.. పైకి తిరగాల్సిందే
- ఈ ప్రహసనంలో మార్పు వస్తేనే ధరణి దరఖాస్తుల శీఘ్ర పరిష్కారానికి అవకాశం
- నేడు జిల్లా కలెక్టర్లతో ధరణి పోర్టల్‌పై సీసీఎల్‌ఏ వీడియో కాన్ఫరెన్స్



సాక్షి, హైదరాబాద్: ధరణి దరఖాస్తుల పరిష్కార రూటు మారింది. గతంలో ధరణి పోర్టల్ ద్వారా వ్యవసాయ భూముల సమస్యల పరిష్కారానికి ఏ దరఖాస్తు వచ్చినా, ఆ దరఖాస్తు కేవలం కలెక్టర్ లాగిన్‌లో మాత్రమే కనిపించేది. కలెక్టర్ వేలిముద్రతో తన లాగిన్‌ను ఓపెన్ చేసి సదరు దరఖాస్తును కిందిస్థాయికి పంపాల్సి వచ్చేది. కానీ తాజాగా ధరణి పోర్టల్‌లో ఓ ఆప్షన్ అందుబాటులోకి వచ్చింది. ధరణి కింద ఏ దరఖాస్తు వచ్చినా అది తహసీల్దార్‌కు కనిపించేలా, తహసీల్దార్ ఆ దరఖాస్తును పరిశీలించి నిర్ణయం కోసం పైఅధికారులకు పంపేలా లాగిన్ లభించింది.

ప్రయోజనం లేదంటున్న తహసీల్దార్లు

దరఖాస్తు పరిష్కారం చేసే రూటు మారింది కానీ ఆ పరిష్కారం కోసం సదరు దరఖాస్తు చేయాల్సిన ప్రయాణం (జర్నీ) మాత్రం మారలేదని, అలాంటప్పుడు రూటు మార్చడం వల్ల ఒనగూరే ప్రయోజనం కూడా ఏమీ లేదని తహసీల్దార్లు చెబుతున్నారు.

➤ ప్రస్తుతమున్న విధానంలో ధరణి దరఖాస్తులను తహసీల్దార్ ఓపెన్ చేసినా..ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రికార్డులను ఆర్డీఓ, జేసీ, కలెక్టర్లకు నాలుగు స్థాయిల్లో పంపాలని, ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేసి ఆన్‌లైన్‌లో, ప్రింట్లు తీసి ఆఫ్‌లైన్‌లో పంపాల్సి వస్తోందని వాపోతున్నారు.

➤ ఇలా కాకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు పరిశీలించిన తర్వాత ఆన్‌లైన్‌లోనే రిమార్క్స్ పంపితే సరిపోతుందని, ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లతో కూడిన

మిగతా 2వ పేజీలో ▶



పేర్లు ఫైనల్.. మిగిలింది ప్రకటనే!



- ఖర్గే, కేసీల భేటీలో మంత్రి పదవులు, పీసీసీ చీఫ్, నామినేటెడ్ పోస్టుల జాబితా ఖరారు
- సీనియారిటీ, సామాజికవర్గాల ఆధారంగా ఎంపిక చేసిన హైకమాండ్, రాష్ట్ర నేతలు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించే నేతల పేర్లను కాంగ్రెస్ అధిష్టానం దాదాపు ఖరారు చేసినట్లు తెలిసింది. దీనితోపాటు పీసీసీ కొత్త చీఫ్ ఎంపిక, నామినేటెడ్ పదవుల జాబితానూ కొలిక్కి తెచ్చినట్లు సమాచారం. జిల్లాల ప్రాతినిధ్యం, సామాజిక వర్గాలు, పార్టీలో పనిచేసిన అనుభవం, సీనియారిటీ ఆధారంగా కొత్త మంత్రుల ఎంపిక జరిగినట్టు సమాచారం. కాంగ్రెస్ నుంచి పోటీ చేసి, గెలిచిన వారికే మంత్రివర్గంలో చోటు కల్పించాలని, ఎన్నికల తర్వాత ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి అవకాశం ఇవ్వకూడదని అధిష్టానం నిర్ణయించినట్టు పీసీసీ వర్గాలు చెప్తున్నాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు కీలక పదవులు దక్కే అవకాశం లేదని అంటున్నాయి.

వరుసగా నేతలతో భేటీలు..

కీలక పదవుల పంపకాలపై ఢిల్లీలో ఐదు రోజులుగా వరుసగా భేటీలు జరుపుతున్న రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శుక్రవారం కూడా విడివిడిగా చర్చలు జరిపారు. సీఎంతో భేటీకి ముందే దీపాదాస్ మున్షీ తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబులతో గంటన్నర పాటు చర్చించారు. మంత్రివర్గంలో తీసుకునేందుకు పరిశీలనలో ఉన్నవారందరి పేర్లపై అభిప్రాయం తీసుకున్నారు. ఒకరిద్దరి పేర్లపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనా.. మిగతా పేర్లపై ఏకాభిప్రాయం వచ్చినట్టు తెలిసింది. ఈ భేటీ అనంతరం దీపాదాస్ మున్షీ సహా నేతలంతా సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. ఏకాభిప్రాయం వ్యక్తమైన పేర్లపై చర్చించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకాటి శ్రీహరి పేర్లకు అందరూ ఆమోదం తెలిపినట్టుగా సమాచారం. మిగతా పేర్లలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్‌రెడ్డి, బల్మూరి వెంకట్, ప్రేమ్‌సాగర్‌రావు, వివేక్, బాలూనాయక్ తదితరుల పేర్లపై కొంత భిన్నాభిప్రాయాలు వచ్చినట్టు తెలిసింది. దీంతో వీటి నుంచి ఫైనల్ చేసే బాధ్యతను అధిష్టానంకు కట్టబెట్టాలని నిర్ణయించినట్టు సమాచారం.

కొత్తగా చేరినవారికి ఎలా?

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెల్లం వెంకట్రావ్, కాలె యాదయ్య, సంజయ్‌కుమార్‌లలో ఒకరికి మంత్రి పదవి ఇవ్వాలన్న ప్రతిపాదనపైనా భేటీలో చర్చించినట్టు తెలిసింది. దీనికితోడు మరికొందరు ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు సిద్ధమైన దృష్ట్యా.. వారికి ఎలాంటి హామీ ఇవ్వాలన్న దానిపైనా చర్చ జరిగినట్టు సమాచారం. చివరిగా ఈ భేటీ అనంతరం దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి తదితరులు.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లతో భేటీ అయ్యారు. పరిశీలనలో ఉన్న ఎమ్మెల్యేల పేర్లు, ఏకాభిప్రాయం కుదిరిన పేర్లపై వారితో చర్చించారు. పీసీసీ అధ్యక్ష నియామకం విషయంలో నేతల అభిప్రాయాలను వారి దృష్టికి తెచ్చారు. రాష్ట్ర నేతలు తెలిపిన పేర్లను పరిశీలించి ఒకట్రెండు రోజుల్లో తెలియజేస్తామని.. జూలై మొదటివారంలో మంత్రివర్గ విస్తరణ చేసుకోవచ్చని అధిష్టానం పెద్దలు చెప్పినట్టు తెలిసింది. ఇక మంత్రి పదవులు, నామినేటెడ్ పోస్టులేవీ కొత్తగా చేరిన వారికి అవకాశం ఇవ్వకుండా.. పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న వారికే అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది.

బీసీకే పీసీసీ చీఫ్ పదవి!

పీసీసీ చీఫ్‌గా బీసీ వర్గ నేతకే చాన్స్ ఇవ్వాలని నేతలంతా అభిప్రాయపడ్డట్టు తెలిసింది. ఈ లెక్కన ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్‌లలో ఒకరికి అవకాశం దక్కవచ్చని టీపీసీసీ వర్గాలు చెప్తున్నాయి. వీరి విషయంలో ఏకాభిప్రాయం రాని పక్షంలో ఎస్టీ సామాజిక వర్గం నుంచి ఎంపీ బలరాం నాయక్ పేరు పరిశీలనలో ఉందని అంటున్నాయి.

క్లుప్తంగా...

రాష్ట్రంలో రోడ్ల విస్తరణ పనులకు సహకరించండి

కేంద్రమంత్రి గడ్కరీతో భేటీలో బీజేపీ ఎంపీ ఈటల



ఢిల్లీలో శుక్రవారం కేంద్రమంత్రి గడ్కరీతో భేటీ అయిన ఎంపీ ఈటల

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులకు కేంద్రప్రభుత్వం పూర్తిగా సహకరించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఈటల ఢిల్లీలో నితిన్ గడ్కరీని కలసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో ఈటల మీడియాతో మాట్లాడుతూ...కొంపల్లిలో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్ పనులు, నత్తనడక నడుస్తున్న ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్, శామీర్‌పేట రోడ్డు, ఎల్బీనగర్ అండర్ పాస్, హుజూరాబాద్ రోడ్డు సమస్యలపై చర్చించామన్నారు. హుజూరాబాద్‌లో సింగాపూర్, రాంపూర్, రంగాపూర్, పెద్దపాపాయపల్లిలో రైతులకు ఇబ్బంది లేకుండా సర్వీస్ రోడ్డు నిర్మాణం చేయాలని కోరినట్లు తెలిపారు. కాగా, వీటికి గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు.

అసెంబ్లీ, కౌన్సిల్ ప్రోరోగ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ, శాసన మండలి సమావేశాలను ప్రోరోగ్ చేస్తూ ఇన్‌చార్జి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ నోటిఫికేషన్ జారీ చేశారు. మూడో అసెంబ్లీ రెండో సభా సమావేశాలు, కౌన్సిల్ 20వ సమావేశాలు ఈ ఏడాది ఫిబ్రవరి 8న ప్రారంభం కాగా.. ఈ నెల 27వ తేదీతో ముగించినట్టు (ప్రోరోగ్) పేర్కొన్నారు. ఈ మేరకు గవర్నర్ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారని అసెంబ్లీ కార్యదర్శి వి.నరసింహాచార్యులు తెలియజేశారు.

ఆదాయపు పన్ను పరిమితిని రూ.10 లక్షలకు పెంచండి

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు టీఎన్జీవో, టీజీఓ నాయకుల వినతి

సాక్షి, న్యూఢిల్లీ: ఉద్యోగ, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయ, పెన్షనర్స్, కార్మికులకు ఆదాయ పన్ను పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచాలని టీఎన్జీఓ, టీజీఓ నాయకులు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించేట్లుగా ఊరట కల్పించాలని టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, గెజిటెడ్ అధికారుల సంఘం ఏలూరి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం ఢిల్లీలో నిర్మలా సీతారామన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న పన్ను విధానంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లు దాదాపుగా మూడు నెలల వేతనాన్ని ఆదాయపన్ను పరిధి కింద కోల్పోతున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

గ్రూప్ 1,2,3,4 పోస్టులు పెంచాలి: ఆర్.కృష్ణయ్య



సీఎస్ శాంతికుమారికి వినతిపత్రం అందజేస్తున్న కృష్ణయ్య తదితరులు

కాచిగూడ (హైదరాబాద్): గ్రూప్ 1,2,3,4 పోస్టులు పెంచి నోటిఫికేషన్ విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణలతో కూడిన ప్రతినిధి బృందం శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతి కుమారిని కలిసి గ్రూప్ పోస్టులు, టీచర్ పోస్టులను 25వేలకు పెంచాలని వినతిపత్రం అందజేసింది.

ప్రభుత్వరంగ సంస్థల భూములను వెనక్కి ఇవ్వండి

- పెట్టుబడుల ఉపసంహరణ కింద విక్రయిస్తున్నారు
- ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమను పునరుద్ధరించాలి
- కేంద్ర పరిశ్రమల మంత్రికి శ్రీధర్‌బాబు వినతిపత్రం



కుమారస్వామికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ గోడెం నగేశ్, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలకు (పీఎస్‌యూ) రాష్ట్ర ప్రభుత్వం గతంలో కేటాయించిన భూములను తిరిగి వెనక్కి ఇవ్వాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి శ్రీధర్‌బాబు కాంగ్రెస్, బీజేపీ నేతలతో కలిసి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామితో భేటీ అయ్యారు. పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను విక్రయిస్తోందని, వీటి ఆధీనంలో ఉన్న మిగులు భూములను రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి అప్పగించాలని శ్రీధర్‌బాబు కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన 70 ఏళ్లలో అనేక ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేసిందని, వాటి ఏర్పాటు కోసం అప్పట్లో వేలాది ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇదిలా ఉంటే ఆదిలాబాద్ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ఖాయిలా పడిన ఆదిలాబాద్ సీసీఐ పునరుద్ధరణ ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. 4 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సీసీఐ ఆదిలాబాద్ యూనిట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 2,100 ఎకరాల సున్నపురాతి గనులతో పాటు మొత్తం 2,290 ఎకరాల భూమిని ఉచితంగా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత అనుకూల వాతావరణం ఉందని, సులభతర వాణిజ్యంలోనూ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములు, నీరు, విద్యుత్ తదితర మౌలిక వసతులు ఉన్నాయని, వీటితో పాటు నైపుణ్యం కలిగిన మానవ వనరులు కూడా ఉన్నాయని, పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలని శ్రీధర్‌బాబు కోరారు. త్వరలో హైదరాబాద్‌లో పర్యటించి శ్రీధర్‌బాబు ప్రస్తావించిన అంశాలపై అధికారులతో చర్చిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. ఈ భేటీలో ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేశ్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

జూలై 18 నుంచి డీఎస్సీ పరీక్షలు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రకటించిన విద్యాశాఖ.. తాజాగా జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకు పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించింది. ప్రతిరోజూ సీబీఆర్టీ విధానంలో రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. తొలిరోజు జూలై 18న స్కూల్ అసిస్టెంట్ (సోషల్, ఫిజికల్ సైన్స్) తెలుగు మీడియం పోస్టులకు ఫస్ట్ షిఫ్ట్‌లో, సెకండ్ షిఫ్ట్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకు పరీక్ష నిర్వహించనున్నారు. చివరి రోజు ఆగస్టు 5న ఫస్ట్ షిఫ్ట్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) పోస్టులకు, సెకండ్ షిఫ్ట్‌లో లాంగ్వేజీ పండిట్ (హిందీ) పోస్టులకు పరీక్ష జరగనుంది.

రూటు మారినా.. జర్నీ అదే!

▶ మొదటి పేజీ తరువాయి

ఆఫ్‌లైన్ రికార్డును నిక్షిప్తం చేసి సదరు దరఖాస్తులకు పరిష్కారం చూపెడితే బాగుంటుందని వారంటున్నారు.

- నాలుగుసార్లు ఆన్‌లైన్‌లో, నాలుగుసార్లు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చక్కర్లు కొట్టిన తర్వాత పరిష్కారానికి ప్రత్యేక ఫైల్‌పెట్టి మళ్లీ ఆన్‌లైన్‌లో పరిష్కరించాల్సి వస్తుందని, ఈ పద్ధతిలో మార్పు తీసుకురావడంపై ఉన్నతస్థాయిలో సమీక్ష జరగాల్సి ఉందని వారంటున్నారు.
- ఆ మార్పు జరిగినప్పుడే ధరణి దరఖాస్తులను వేగంగా పరిష్కరించే వెసులుబాటు ఉంటుందని చెబుతున్నారు.

మూడు వారికి... రెండు వీరికి..

ధరణి దరఖాస్తుల పరిష్కారంలో భాగంగా క్షేత్రస్థాయిలో ఉండే తహసీల్దార్లు, ఆర్డీఓలకు ప్రస్తుతం చాలా తక్కువ అధికారాలున్నాయి. జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ, గ్రీవెన్స్ ల్యాండ్‌మ్యాటర్స్ (కులం, ఆధార్‌కార్డుల్లో తప్పులు నమోదు, పేర్లలో అక్షర దోషాలు సవరించడం) లాంటి అధికారాలు తహసీల్దార్లకు ఉండగా, కోర్టు కేసుల సమాచారం, పాస్‌బుక్ లేకుండా నాలా, సంస్థాగత పాస్‌బుక్కులిచ్చే అధికారాలు మాత్రం ఆర్డీఓలకు ఉన్నాయి. ఈ అధికారాలు మినహా అన్ని అంశాల్లో నిర్ణయాలు తీసుకునే బాధ్యతలు కలెక్టర్లకున్నాయి. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టుగా వికేంద్రీకరణ వీలైనంత త్వరగా జరగాలని, క్షేత్రస్థాయిలో పరిష్కారం కాగలిగిన దరఖాస్తులను అక్కడే పరిష్కరించే అధికారాలు సదరు సిబ్బందికి కల్పించినప్పుడే ధరణి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ ముందుకు సాగుతుందని రెవెన్యూ వర్గాలంటున్నాయి.

నేడు వీడియో కాన్ఫరెన్స్‌లు

ధరణి దరఖాస్తుల పురోగతిపై రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్‌మిత్తల్ శనివారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. హైదరాబాద్ నుంచి నిర్వహించనున్న ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు సిరిసిల్ల, భూపాలపల్లి, జగిత్యాల, మహబూబ్‌నగర్, మంచిర్యాల, వికారాబాద్, వనపర్తి, వరంగల్, ములుగు, నిర్మల్ జిల్లాలు, 12 నుంచి ఒంటి గంట వరకు మిగిలిన జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని సీఎంఆర్‌ఓ పీడీ వి. లచ్చిరెడ్డి విడుదల చేసిన షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

మన్నెగూడ రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం వద్దు

- మర్రి వృక్షాల తరలింపు ప్రక్రియ ప్రారంభించండి
- ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశం
- రీజినల్ రింగురోడ్డు పూర్తయితే పెట్టుబడులు వస్తాయన్న మంత్రి

సాక్షి, హైదరాబాద్: పోలీసు అకాడమీ నుంచి మన్నెగూడ వరకు బీజాపూర్ హైవే విస్తరణ పనుల్లో ఎక్కడా జాప్యం లేకుండా వెంటనే ప్రారంభించాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను ఆదేశించారు. ఈ రోడ్డు మీద ఉన్న 930 మర్రి చెట్లను ట్రాన్స్‌లొకేట్ చేసే పనులను వెంటనే చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రీలొకేట్ చేసే 330 చెట్లకు సంబంధించి నిర్మాణ సంస్థతో వెంటనే తాను మాట్లాడతానని మిగతావాటి తరలింపు పనులను ఎన్‌హెచ్‌ఏఐ వెంటనే చేపట్టాలని మంత్రి ఆదేశించారు. శుక్రవారం కోమటిరెడ్డి వెంకటరెడ్డి 'న్యాక్'లో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో జాతీయ రహదారుల ప్రాజెక్టులపై సమీక్షించారు. మన్నెగూడ రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యంపై సాకులు వెతక్కుండా ఇకనైనా పనులు మొదలుపెట్టాలని, ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తేవాలని సూచించారు.

ఆ రహదారి విస్తరణ పనులకు కొత్త టెండర్లు

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆదేశం మేరకు విజయవాడ హైవే విస్తరణ పనుల టెండర్లు రద్దు చేసి వచ్చేనెలలో కొత్త టెండర్లు పిలిచి సెప్టెంబరులో పనులు మొదలుపెట్టాలని కోమటిరెడ్డి ఆదేశించారు. అదేవిధంగా ఉప్పల్–ఘట్కేసర్ వంతెన పనులకు సంబంధించి పాత టెండర్లు రద్దు చేసి కొత్త టెండర్లు పిలవాలని కూడా సూచించారు. ఆర్మూరు–మంచిర్యాల జాతీయ రహదారి కోసం 630 హెక్టార్ల భూమి కావాల్సి ఉండగా, ఇప్పటికే 530 హెక్టార్లు సేకరించామని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. రీజినల్ రింగురోడ్డు పూర్తయితే డిస్నీల్యాండ్ సంస్థలు ఎంటర్‌టైన్‌మెంట్ ప్రాజెక్టుల విషయంలో పెట్టుబడికి ముందుకొస్తాయని, పారిశ్రామిక క్లస్టర్లు, ట్రాన్స్‌పోర్టు హబ్‌లు ఏర్పడతాయని మంత్రి వారికి వివరించారు.

జూలైలో రాష్ట్రానికి ఉన్నతాధికారుల బృందం

జూలైలో ఢిల్లీ నుంచి రాష్ట్రానికి జాతీయ రహదారుల విభాగం ఉన్నతాధికారుల బృందం వస్తున్నందున, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు సంబంధించిన పూర్తి సమాచారంతో అధికారులు సిద్ధంగా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి ఆదేశించారు. ఎల్బీనగర్–మల్కాపూర్ మధ్య మన్నెగూడ వద్ద ప్రమాదకరంగా ఉన్న జాతీయ రహదారి మలుపుపై బ్రిడ్జి నిర్మాణానికి ఉన్న సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ ఇచ్చారు. సమావేశంలో రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, జాయింట్ సెక్రటరీ హరీశ్, ఎన్‌హెచ్‌ఏఐ ఆర్‌ఓ రజాక్, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఆర్‌ఓ కుష్వాతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫిరాయింపుదారులకు పదవులు ఉండవు

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తవుతాయని వెల్లడించారు.

రుణమాఫీకే మొదటి ప్రాధాన్యత

తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత రైతు రుణమాఫీ అని రేవంత్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి మూడు, నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేస్తామన్నారు. రైతు భరోసాను అసెంబ్లీ సమావేశాల తర్వాత ఇస్తామన్నారు. ఒక కుటుంబానికి రూ.2లక్షల వరకు మాత్రమే పంట రుణమాఫీ ఉంటుందని.. కుటుంబాలను గుర్తించడానికి రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకుంటామని వివరించారు. కుటుంబంలోని వారు మూడు, నాలుగు లోన్లు తీసుకుని ఉన్నా.. అందరికీ కలిపి గరిష్టంగా రూ.2లక్షలు మాత్రమే మాఫీ చేస్తామని స్పష్టం చేశారు. గతంలో డబ్బున్నవారికి, ఫామ్‌హౌజ్‌లకు కూడా పథకాల సొమ్ము ఇచ్చారని.. నిజమైన లబ్ధిదారులకు పథకాలు అందాలన్నదే తమ ప్రభుత్వం లక్ష్యమని చెప్పారు. భవిష్యత్తులో తప్పు జరగవద్దనే రైతు భరోసాపై కేబినెట్ సబ్ కమిటీ వేశామన్నారు.

రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్ల అప్పు

రాష్ట్ర ప్రభుత్వానికి బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులే రూ.7లక్షల కోట్ల మేర ఉన్నాయని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇతరత్రా మరో లక్ష కోట్లు అప్పులు ఉంటాయని చెప్పారు. ప్రతి నెలా రూ.7వేల కోట్లు అప్పులు కడుతున్నామన్నారు. కొత్త లోన్ల కోసం ప్రయత్నిస్తూ, వడ్డీలు తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. ఆగస్టు చివరి నాటికి బీసీ కమిషన్ కాల పరిమితి పూర్తవుతుందని.. కొత్త కమిషన్ నియామకం తర్వాతే రాష్ట్రంలో కులగణన చేపడతామని రేవంత్ తెలిపారు.

ఆర్టీసీ లాభాల్లోకి వస్తుంది

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్టీసీలో ఆక్యుపెన్సీ 80శాతానికి పెరిగిందని రేవంత్ చెప్పారు. ప్రతి నెలా ఆర్టీసీకి రూ.350కోట్లు చెల్లిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఆర్టీసీ లాభాల్లోకి వస్తుందన్నారు.

జిల్లాలపై కమిషన్ వేసి నిర్ణయం

రాష్ట్రంలో జిల్లాలను కుదిస్తామనిగానీ, పెంచుతామనిగానీ తాము చెప్పలేదని రేవంత్ తెలిపారు. నియోజకవర్గాల డీలిమిటేషన్‌కు ఎలా కమిషన్ వేస్తారో.. అలా జిల్లాలపై ఒక కమిషన్ వేస్తామని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి, అందరి అభిప్రాయాల మేరకే నిర్ణయాలు తీసుకుంటామని వివరించారు. గత ప్రభుత్వం రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటులో నిబంధనలు పాటించలేదని విమర్శించారు.

పాతబస్తీలో విద్యుత్ నిర్వహణ అదానీ సంస్థకు..

హైదరాబాద్ పాతబస్తీలో సరఫరా చేసిన విద్యుత్‌లో కేవలం 60శాతమే బిల్లులు వస్తున్నాయని రేవంత్ చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు పైలట్ ప్రాజెక్టు కింద పాతబస్తీ విద్యుత్ నిర్వహణ బాధ్యతను అదానీ సంస్థకు అప్పగించాలని నిర్ణయించామని తెలిపారు. ప్రధాని మోదీలా తాము ప్రభుత్వ రంగ సంస్థలను పల్లీబటానీల్లా ప్రైవేటుకు బదలాయించబోమని చెప్పారు. అదానీ వ్యాపారమేదీ చేయవద్దని రాహుల్ గాంధీ ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇప్పుడు తాము హైదరాబాద్‌లో అదానీ సంస్థకు ఆస్తులు రాసివ్వడం లేదని.. వారితో పెట్టుబడి మాత్రమే పెట్టిస్తున్నామని చెప్పారు. రాష్ట్రానికి ఏది లాభమైతే అదే చేస్తామని.. గదుల్లో కూర్చుని, ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోబోమని పేర్కొన్నారు.



పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

దేశ ఆర్థిక ప్రగతిని పీవీ పరుగులు పెట్టించారు

- ప్రధానిగా ఎన్నో సంస్కరణలు తెచ్చారు
- పీవీ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావు దేశ ఆర్థికప్రగతిని పరుగులు పెట్టించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. ఆయన తెచ్చిన ఎన్నో సంస్కరణలు నేటికీ ఆదర్శంగా ఉన్నాయని చెప్పారు. పీవీ 103వ జయంతి సందర్భంగా ఢిల్లీలోని తన నివాసంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్, కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డిలతో కలసి రేవంత్ పీవీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ విద్యావ్యవస్థలో పెనుమార్పులు తెచ్చి విద్యను అన్నివర్గాల వారికి అందించిన వ్యక్తి పీవీ అన్నారు. ప్రధానిగా, ఉమ్మడి ఏపీ సీఎంగా, కేంద్రంలో వివిధ శాఖల మంత్రిగా దేశానికి, రాష్ట్రానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు.

తెలంగాణ భవన్‌లో..

తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన పీవీ జయంతి కార్యక్రమానికి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ లక్ష్మణరావు, ఎమ్మెల్యే శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఆర్థిక అసమానతలు తొలగించేందుకు సంస్కరణలు తెచ్చిన వ్యక్తి పీవీ అని భట్టి తెలిపారు. మంథని నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్రంలో పీవీ అనేక విద్యామార్పులు తెచ్చారని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. అనంతరం బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, గోడెం నగేశ్, టీడీపీ ఎంపీ కృష్ణప్రసాద్, బీఆర్ఎస్ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కేఆర్.సురేశ్‌రెడ్డి, దివికొండ దామోదర్‌లు నివాళులర్పించారు.

ఆరుసార్లు మైక్ కట్.. మంత్రుల అసహనం

భట్టి ప్రసంగిస్తుండగా మైక్ కట్ అయ్యింది. తొలుత సాంకేతికలోపం అనుకున్న భట్టికి మరో ఐదుపర్యాయాలు మైక్ కట్ అవ్వడం, మాట్లాడే మాట సరిగ్గా అర్థం కాకపోవడంతో అసహనానికి గురయ్యారు. ఓ పక్క ఆడిటోరియంలో జనాలు లేక మరోపక్క మైక్ సమస్యతో తన ప్రసంగాన్ని మధ్యలో ముగించేసిన భట్టి సీఎం నివాసానికి వెళ్లిపోయారు. అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడేటప్పుడు కూడా మైక్ కట్ అవ్వడంతో ఆయన కూడా ప్రసంగాన్ని మధ్యలోనే ముగించి వేదికపై కూర్చున్నారు.కార్యక్రమం ముగిసిన వెంటనే కింద ఉన్న డిప్యూటీ కమిషనర్ సంగీతను భవన్ లో ఎంత మంది పనిచేస్తున్నారని ప్రశ్నించారు. 120 మంది అని సమాధానం ఇవ్వడంతో.. పట్టు మని పదిమందిని తీసుకురాలేకపోయారు మీరేం ఆర్గనైజ్ చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

పీవీకి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాళులు



శుక్రవారం పీవీ ఘాట్ వద్ద పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

రాంగోపాల్‌పేట్: దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాళులర్పించారు. శుక్రవారం నెక్లెస్‌రోడ్‌లోని పీవీ ఘాట్‌కు చేరుకుని పీవీని స్మరించుకుంటూ ఆయన చేసిన సేవలను కొనియాడారు. తన సంస్కరణలతో దేశానికి దిశానిర్దేశం చేసిన పీవీ తెలంగాణ ముద్దుబిడ్డ అని కోమటిరెడ్డి పేర్కొన్నారు. పీవీ స్మారకార్థం రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కార్యక్రమాలను తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపినట్లు చెప్పారు. పీవీ కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీ వాణీదేవి, పీవీ ప్రభాకర్‌రావు ఆయనకు నివాళులర్పించారు.

దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చిన మేధావి పీవీ



తెలంగాణ భవన్‌లో పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో పీవీ కుమార్తె వాణీదేవి, జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్ తదితరులు

- పీవీ జీవితచరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి: కేటీఆర్
- తెలంగాణభవన్‌లో పీవీ జయంతి వేడుకలు

సాక్షి, హైదరాబాద్: దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చిన గొప్ప మేధావి మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అని, ఆయన జీవితచరిత్ర నేటితరానికి తెలిసేలా పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశంగా చేర్చాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. ఆర్థికంగా అతలాకుతలమై ప్రమాదం అంచున ఉన్న భారత్‌ను ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి పీవీ కాపాడారని కొనియాడారు. తెలంగాణభవన్‌లో పీవీ జయంతి వేడుకలు నిర్వహించారు. 'అసామాన్యమైన తెలివితేటలు, బహు భాషా పాటవంతో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన మేధావి పీవీ. కవి, కథకుడు, సంస్కరణశీలిగా ఆయన చరిత్రను దేశం ఎన్నడూ మరిచిపోదు. భారత్ ఉన్నంతకాలం ఆయన పేరును దేశ ప్రజలు గుర్తుంచుకుంటారు. రాజకీయాలతో సంబంధం లేని మన్మోహన్‌సింగ్ లాంటి ఆర్థికవేత్తను ఆర్థికమంత్రిగా నియమించి ఆర్థిక సంస్కరణలతో దేశానికి కొత్త దిశ చూపారు. భూసంస్కరణలు, నవోదయ, గురుకుల విద్యాసంస్థల ఏర్పాటు ద్వారా ఎనలేని సేవలు అందించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పక్షాన గతంలో పీవీ శతజయంతి ఉత్సవాలు నిర్వహించాం. ఆయనకు భారతరత్న ఇవ్వాలని కేంద్రాన్ని కోరగా సానుకూలంగా స్పందించి ప్రకటించింది. దేశ, విదేశాల్లో పీవీ విగ్రహాల ఏర్పాటు, నెక్లెస్ రోడ్డుకు పీవీ పేరిట నామకరణం, విగ్రహం ఏర్పాటు వంటి ఎన్నో పనులు గత ప్రభుత్వం చేసింది'అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ నుంచి అద్భుతమైన రాజకీయ నాయకుడిగా సమస్యల వలయంలో ఉన్న దేశాన్ని పీవీ చక్కదిద్దారని ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ వాణీదేవి వ్యాఖ్యానించారు.

అసెంబ్లీలో..

పీవీ జయంతి సందర్భంగా శాసనసభ ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందరరెడ్డి , శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి పూలమాల వేసి నివాళి అర్పించారు. తెలంగాణ గడ్డమీద పుట్టి దేశ ఆర్థికవ్యవస్థను గాడిలో పెట్టిన మహానుభావుడు పీవీ అని గుత్తా కొనియాడారు.

ఎమ్మెల్సీ కవితతో హరీశ్‌రావు భేటీ

ధైర్యంగా ఉండాలని సూచన



శుక్రవారం తిహార్ జైలు వద్ద హరీశ్‌రావు

సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో మాజీ మంత్రి హరీశ్‌రావు భేటీ అయ్యారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో తిహార్ జైలులో రిమాండ్‌లో ఉన్న కవితను శుక్రవారం ఉదయం ములాఖత్‌లో భాగంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న హరీశ్‌రావు ధైర్యంగా ఉండాలని సూచించారు. తిహార్ జైలులో ఉన్న కవితకు సీబీఐ కేసులో విధించిన జ్యుడీషియల్ కస్టడీని జూలై 5 వరకు పొడిగిస్తూ న్యాయస్థానం జూన్ 21న ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే. కవితను మార్చి 15న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్ట్ చేయగా... రౌస్ అవెన్యూ కోర్టు 10 రోజుల ఈడీ కస్టడీ తర్వాత కవితను తిహార్ జైలుకు తరలించారు. అప్పటి నుంచి తిహార్ జైలులోనే ఉన్న కవితను ఏప్రిల్ 11న సీబీఐ అరెస్టు చేసింది. ఈడీ కేసులో జ్యుడీషియల్ కస్టడీ జూలై 3 వరకు ఉన్న విషయం తెలిసిందే. ఇటీవలే మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బాల్క సుమన్‌లు కవితతో తీహార్ జైలులో ములాఖత్ అయిన విషయం విదితమే.

క్లుప్తంగా...

చంద్రబాబు వంటి తెలంగాణ వ్యతిరేకుల పంచన రేవంత్: జగదీశ్‌రెడ్డి

రేవంత్ గేట్లు తెరిస్తే.. మాకు సుప్రీంకోర్టు గేట్లు ఉన్నాయి



సాక్షి, హైదరాబాద్: చంద్రబాబు వంటి తెలంగాణ వ్యతిరేకుల పంచన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేరారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. దేశంలో ఫిరాయింపులు మొదలు పెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని, ఫిరాయింపుల నిరోధక చట్టం తెచ్చింది కూడా ఆ పార్టీయేనని గుర్తు చేశారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంలో కాంగ్రెస్ పార్టీ గురివిందగింజ వైఖరి చూపుతోందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను పార్టీ మారాలంటూ రేవంత్ ఇంటింటికీ తిరుగుతూ ప్రలోభాలకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేల చేరికకు గేట్లు తెరిస్తే తమకు సుప్రీంకోర్టు గేట్లు ఉన్నాయన్నారు. దేశంలో జరుగుతున్న అనర్థాలకు కాంగ్రెస్ పార్టీయే కారణమని, గతంలో ఆ పార్టీ విధానాలు నచ్చనందునే 12 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ పార్టీలో చేరారని జగదీశ్‌రెడ్డి అన్నారు.

సీజన్ మొదలైనా అందని సాయం: కొప్పుల



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ సీజన్ మొదలైనా రైతులకు ప్రభుత్వం నుంచి నయాపైసా సాయం అందడం లేదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ఆయన బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రైతుబంధు డబ్బు ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందో తెలియక రైతులు ఎదురు చూస్తున్నారన్నారు. రైతుబంధు పథకాన్ని రైతుభరోసా పేరిట అమలు చేస్తామని రేవంత్ ప్రభుత్వం ప్రకటించినా, అమలుపై ప్రభుత్వానికి స్పష్టత లేదన్నారు. రైతు రుణమాఫీకి ఎవరు అర్హులనే విషయమై ఎలాంటి స్పష్టత లేదన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి ఆనవాళ్లు లేకుండా చేయాలనే దుర్మార్గపు ఆలోచనలో రేవంత్ ప్రభుత్వం ఉందని ఆరోపించారు. నకిలీ విత్తనాలు అరికట్టేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోనే నకిలీ విత్తనాలు పట్టుబడ్డాయని కొప్పుల ఈశ్వర్ విమర్శించారు.

ఘనంగా చిన్నారెడ్డి జన్మదిన వేడుకలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి 70వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజాభవన్‌లోని ప్రణాళిక సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన వేడుకల్లో వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు, ఆత్మీయుల సమక్షంలో కేక్ కట్ చేసిన చిన్నారెడ్డి ప్రజాభవన్ ప్రాంగణంలో మొక్క నాటారు.

విద్యుదుత్పత్తి కేంద్రాలు జెన్‌కోనే నిర్మించాలి


తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భవిష్యత్‌లో నిర్మించనున్న విద్యుదుత్పత్తి కేంద్రాలన్నింటినీ జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ కోరింది. ఈ మేరకు జేఏసీ చైర్మన్ సాయిబాబు, వైస్ చైర్మన్‌లు వజీర్, అనిల్‌కుమార్, నాయకులు ఎ.వెంకట్‌నారాయణరెడ్డి, ఈశ్వర్‌గౌడ్, సదా నందం తదితరులు ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రొనాల్డ్ రాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. టీఎస్‌జెన్‌కోకు చెందిన రామగుండం థర్మల్ పవర్‌స్టేషన్‌ను మూసివేసి 580 ఎకరాల స్థలాన్ని సింగరేణికి అప్పగించి విద్యుదుత్పత్తి కేంద్రాన్ని నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచన కారణంగా వేలాది మంది విద్యుత్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. థర్మల్, హైడల్, సోలార్ విద్యుత్ ప్రాజెక్టులన్నింటినీ జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని కోరామని, ఈ విషయమై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మాట్లాడుతానని రొనాల్డ్ రాస్ హామీ ఇచ్చారని జేఏసీ నేతలు వెల్లడించారు.

ఎక్కడా పక్షపాతం లేదు

'విద్యుత్ ఒప్పందాలపై నిష్పక్షపాతంగానే జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ విచారణ

- హైకోర్టులో ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు
- తీర్పు రిజర్వ్ చేసిన సీజే ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ రంగానికి సంబంధించి గత ప్రభుత్వ నిర్ణయాలపై విచారణకు ఏర్పాటైన జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి ఏకసభ్య కమిషన్ ఎక్కడా పక్షపాత ధోరణితో వ్యవహరించలేదని, నిష్పక్షపాతంగా విచారణ చేస్తోందని అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. దీనిపై దాఖలైన పిటిషన్‌ను విచారణకు అనుమతించ వద్దని కోరారు. దీనిపై పిటిషనర్, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు తరఫు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఆదిత్య సోంధీ అభ్యంతరం వ్యక్తం చేశారు. కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీ యాక్ట్–1952 ప్రకారం జ్యుడీషియల్ కమిషన్ వేసినందున విచారణకు స్వీకరించాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటితో కూడిన ధర్మాసనం తీర్పు రిజర్వు చేసింది.

పిటిషన్‌ను అనుమతించాలా? వద్దా?

ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలు, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణంపై ఒప్పందాలు, ఎంవోయూలు చేసుకోవడంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ..వీటిపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం గత మార్చి 14న జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్‌ను నియమించింది. విచారణ ప్రారంభించిన కమిషన్ పలువురికి నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కమిషన్ ఏర్పాటును సవాల్ చేస్తూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కానీ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డిని వ్యక్తిగతంగా ప్రతివాదిగా చేర్చడంపై రిజిస్ట్రీ అభ్యంతరం చెబుతూ పిటిషన్‌కు నంబర్ కేటాయించలేదు. అయితే గురువారం విచారణ చేపట్టిన సీజే ధర్మాసనం నంబర్ చేయాలని ఆదేశించింది. పిటిషన్‌ను విచారణకు స్వీకరించాలా.. వద్దా అన్న అంశంపై విచారణ చేపట్టింది. ఈ అంశంపైనే వాదనలు వినిపించాలని, కేసు మెరిట్స్‌లోకి వెళ్లవద్దని సూచించింది.

ప్రజలకు వివరాలు తెలిస్తే నష్టం లేదు: ఏజీ

'కమిషన్ నియామకమైన నాటి నుంచి ఇప్పటివరకు 20 మందికిపైగా సాక్షులను విచారించింది. అందులో మాజీ సీఎండీ ప్రభాకర్‌రావుతో పాటు ట్రాన్స్‌కో, జెన్‌కో అధికారులున్నారు. వివరాలు ఇవ్వాలని కేసీఆర్‌ను కూడా కమిషన్ కోరింది. ఏప్రిల్‌లోనే నోటీసులు జారీ చేసింది. అయితే తాను ఓ జాతీయ పార్టీ అధ్యక్షుడినని, పార్లమెంట్ ఎన్నికలు ఉన్న కారణంగా వివరాలు ఇచ్చే సమయం లేదని ఆయన బదులిచ్చారు. జూలై తర్వాత వస్తానని చెప్పారు. కమిషన్ గడువు జూన్ 30 వరకే ఉండటంతో జూన్ 15న వివరాలు తెలియజేయాలని కమిషన్ సూచించింది. వివరాలు ఇతరులతో పంపినా సరిపోతుందని, స్వయంగా వస్తానంటే ఆ మేరకు ఏర్పాట్లు చేస్తామని కూడా తెలిపింది. అయినా కేసీఆర్ వివరాలు అందజేయలేదు. గతంలోనూ కమిషన్లు మీడియాకు వివరాలు వెల్లడించిన సందర్భాలున్నాయి. ఇది ప్రభుత్వం ఏర్పాటు చేసిన బహిరంగ కమిషన్. ఇందులో దాపరికం అంటూ ఏదీ లేదు. ప్రజలకు వివరాలు తెలిస్తే వచ్చే నష్టం కూడా లేదు. జస్టిస్ నరసింహారెడ్డి పక్షపాత ధోరణితో మాట్లాడారనడం అసంబద్ధం. ఆయన ఎవరిపైనా వ్యక్తిగతంగా వ్యాఖ్యలు చేయలేదు. 8బీ నోటీసులు ఇచ్చే అధికారం కమిషన్‌కు ఉంది. గతంలో మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డిపై ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ ఆయనకు నోటీసులు జారీ చేయడమే కాదు.. మీడియాకు వివరాలు వెల్లడించింది. ఆ కమిషన్ విచారణను అడ్డుకోలేమని నాడు కోర్టులు కూడా చెప్పాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా గతంలో పలుమార్లు అంతకు ముందు ప్రభుత్వాల నిర్ణయాలపై కమిషన్లు వేస్తామని అసెంబ్లీలోనే పేర్కొంది. ఛత్తీస్‌గఢ్ నుంచి చేసిన విద్యుత్ కొనుగోలుపై విచారణ జరిపించుకోవచ్చని మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. అలాంటప్పుడు ఈ కమిషన్ చట్ట వ్యతిరేకం ఎలా అవుతుంది? కమిషన్ల విచారణలో కోర్టులు కలుగజేసుకోలేవు. పిటిషన్‌ను విచారణకు స్వీకరించవద్దు.' అని ఏజీ ఎ.సుదర్శన్‌రెడ్డి కోరారు.

గతంలో ఏ కమిషన్ ఇలా వ్యవహరించలేదు: సోంధీ

'ఎల్.నరసింహారెడ్డి కమిషన్ మీడియా భేటీలో గత ప్రభుత్వ తీరును తప్పుబట్టింది. కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని పేర్కొంది. గతంలో ఏ కమిషన్ ఇలా పక్షపాత ధోరణితో వ్యాఖ్యలు చేయలేదు. ఎంక్వైరీ కమిషన్ పేరుతో జ్యుడీషియల్ కమిషన్ వేయడం చట్టవిరుద్ధం..'అని సోంధీ వాదించారు. దీంతో కమిషన్‌కు న్యాయపరమైన అధికారాలు లేనప్పుడు నివేదిక ఇచ్చినా ఏమీ జరగదు కదా అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇరుపక్షాల వాదనలు పూర్తి కావడంతో తీర్పును వాయిదా వేసింది. సోమవారం తీర్పు వెల్లడించే అవకాశం ఉంది.



శుక్రవారం ఢిల్లీలో దీపా దాస్‌మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే కాలె యాదయ్య

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే

కాలె యాదయ్యకు కండువాకప్పి స్వాగతం పలికిన సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ/ రంగారెడ్డి జిల్లా: బీఆర్ఎస్ చేవెళ్ల సిట్టింగ్ ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ సమక్షంలో యాదయ్య కాంగ్రెస్ గూటికి చేరారు. యాదయ్యకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. అనంతరం.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పనిచేయాలనే సంకల్పంతో కాంగ్రెస్‌లో చేరినట్లు ఖర్గేకు యాదయ్య తెలిపారు. 2014లో కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించిన యాదయ్య బీఆర్ఎస్‌లో చేరారు. గత ఎన్నికల్లో ఆయన కేవలం 268 ఓట్ల స్వల్ప మెజారిటీతో విజయం సాధించారు. ఇటీవల మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కూడా కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే.

త్వరలోనే పూర్తిస్థాయి ఎన్నికల బదిలీలు

ట్రెసా బృందానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సందర్భంగా బదిలీ చేసిన తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లను తిరిగి పాత స్థానాలకు పంపే విషయాన్ని త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి పరిష్కరిస్తానని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగ రవీందర్‌రెడ్డి, కె.గౌతమ్‌కుమార్‌ల నేతృత్వంలోని ప్రతినిధి బృందం శుక్రవారం సచివాలయంలో మంత్రి పొంగులేటిని కలిసింది. క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతిపత్రం అందజేసింది. ఎన్నికల సందర్భంగా బదిలీ అయిన తహసీల్దార్లను పాత స్థానాలకు బదిలీ చేయడం, ఈ నెలలోనే పదవీ విరమణ పొందే వారిని తక్షణమే పాత స్థానాలకు పంపాలని, బాలానగర్ గిర్దావర్ వెంకట్‌రెడ్డి సస్పెన్షన్‌ను నిలిపివేయాలని ఈ సందర్భంగా మంత్రిని కోరామని, అన్ని అంశాలపై ఆయన సానుకూలంగా స్పందించారని ట్రెసా వెల్లడించింది.

ఏడుగురికి బదిలీ ఉత్తర్వులు

ఎన్నికల సందర్భంగా ఇతర ప్రాంతాలకు బదిలీ అయి ఈ నెలలో, వచ్చే నెలలో పదవీ విరమణ పొందుతున్న రాష్ట్రంలోని ఏడుగురు తహసీల్దార్లను వారి పాత స్థానాలకు బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిత్తల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఆరుగురు ఈ నెలలో పదవీ విరమణ పొందనుండగా, మరొకరు వచ్చే నెలలో రిటైర్ అవుతున్నారు.

నేడు వరంగల్‌కు ముఖ్యమంత్రి రేవంత్

- సీఎం అయ్యాక తొలిసారి ఓరుగల్లులో పర్యటన
- సీఎం రాక సందర్భంగా భారీ ఏర్పాట్లు



సాక్షి ప్రతినిధి, వరంగల్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం వరంగల్‌లో పర్యటించనున్నారు. వాస్తవానికి శుక్రవారం సీఎం పర్యటన ఖరారు అయినప్పటికీ ఢిల్లీ కార్యక్రమాలలో బిజీగా ఉన్నందున శనివారానికి వాయిదా పడింది. గ్రేటర్ వరంగల్ సమగ్ర అభివృద్ధితో పాటు పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్షించేందుకు ఆయన శనివారం గ్రేటర్ వరంగల్‌లో పర్యటించనున్నారు. ఈ మేరకు సీఎంవో వర్గాలు శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి పర్యటన వివరాల్ని విడుదల చేశాయి.

ఇదీ షెడ్యూల్...

ఢిల్లీ నుంచి శనివారం ఉదయం హైదరాబాద్ చేరుకోనున్న ఆయన శంషాబాద్ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 1.30 గంటలకు కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌కు చేరుకుంటారు. 1.30 నుంచి 1.50 గంటల వరకు టెక్స్‌టైల్ పార్క్ సందర్శిస్తారు. అక్కడి నుంచి రంగంపేట వద్ద నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ని సందర్శిస్తారు. 2.10 నుంచి 2.30 గంటల వరకు ఆస్పత్రి సందర్శన అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకుంటారు. 2.45 నుంచి 3.00 గంటల మధ్య మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభిస్తారు. తర్వాత గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి కార్యకలాపాలు, సమస్యలపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. 5.40 నుంచి 6.10 వరకు హంటర్ రోడ్డులోని మెడికోవర్ ఆస్పత్రిని ప్రారంభించి 6.10 గంటలకు బయల్దేరి 6.30 గంటలకు హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌కు చేరుకుంటారు. అనంతరం హెలికాప్టర్లో 7.20 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.

మొహర్రంకు పటిష్ట ఏర్పాట్లు చేయండి

అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: మొహర్రం పురస్కరించుకుని నిర్వహించే కార్యక్రమాలకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. మొహర్రం పవిత్ర మాసం ఏర్పాట్లపై శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీతో కలిసి సంబంధిత శాఖల అధికారులు, షియా మత పెద్దలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ...మొహర్రం కార్యక్రమాలు నిర్వహించే ఆషుర్ ఖానాల వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రధాన ఊరేగింపు ప్రారంభం కానున్న బీబీ–కా–ఆలం పరిసరాల ప్రాంతంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, సంతాపం తెలిపేందుకు ఆషుర్ ఖానాలకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలని షబ్బీర్ అలీ కోరారు. వారి కోసం మినీ బస్సులను ఏర్పాటు చేయాలని, వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమీక్షలో ఎమ్మెల్సీలు ఎఫెండీ, మీర్జా రహమత్ బేగ్, బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్ మెరాజ్, కౌసర్ మొహియుద్దీన్, మీర్ జుల్ఫెకర్ అలీ, మేయర్ గద్వాల విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ఇందిరను వాజ్‌పేయి దుర్గామాతగా అభివర్ణించారు

- ఇందిరమ్మ ఒక్కసారే ఎమర్జెన్సీ పెట్టారు...
- మోదీ హయాంలో 100 ఎమర్జెన్సీల పాలన: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఇందిరాగాంధీ గుండె ధైర్యం ఉన్న నాయకురాలని, ఆమెకు ధైర్యం ఉంది కాబట్టే ఎమర్జెన్సీ విధించారని, ఆ తర్వాత దేశ ప్రజల సంపూర్ణ విశ్వాసం పొంది ప్రధాని పీఠాన్ని అధిష్టించారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రధాని మోదీకి ధైర్యం లేదు కాబట్టే పరోక్షంగా ఈడీ, సీబీఐలను ఉపయోగించుకుని పాలిస్తున్నారని ఎద్దేవా చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ ఫిషర్‌మెన్ సెల్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మూడోసారి అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఉపయోగపడే అంశాల గురించి మోదీ మాట్లాడతారని అందరూ భావించారని, కానీ ఆయన మాత్రం ఎప్పుడో జరిగిపోయిన ఎమర్జెన్సీ గురించి మాట్లాడుతూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. బ్యాంకుల జాతీయీకరణ గురించి మాట్లాడుతూ గతంలో ఇందిరాగాంధీని వాజ్‌పేయి దుర్గామాతగా అభివర్ణించారని, మోదీకి ఆ విషయం ఎందుకు గుర్తు రాదని, ఆ విషయాలపై లోక్‌సభ స్పీకర్ ఎందుకు చర్చ పెట్టరని ప్రశ్నించారు. ఇందిరాగాంధీ హయాంలో ఒక్కసారి ఎమర్జెన్సీ పెడితే, మోదీ హయాంలో 100 ఎమర్జెన్సీలతో సమానమైన హింస జరిగిందని వ్యాఖ్యానించారు. పీసీసీ అధ్యక్ష పదవి గురించి తనను ఎవరూ సంప్రదించలేదని, సోనియా, రాహుల్‌లు ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని చెప్పారు. భవిష్యత్తులో పీసీసీ అధ్యక్షుడిని అవుతానని, ముఖ్యమంత్రిని కూడా అవుతానని జగ్గారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

కార్యకర్తలనే నేతలుగా చేస్తా



ఎర్రవల్లి నివాసంలో జిల్లాల నుంచి వచ్చిన నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

దొంగల్లో కలిసేటోళ్ల గురించి బాధ వద్దు

- ఆలోచించాల్సిన అవసరం అసలు లేదు
- ఒక్కరు బయటకు వెళ్తే పది మందిని తీర్చిదిద్దుకునే సత్తా మనకుంది
- పార్టీ నాయకులు, కార్యకర్తలతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నుంచి వెళ్లి దొంగల్లో కలుస్తున్న నాయకుల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని, వారి గురించి బాధ పడొద్దని భారత్ రాష్ట్ర సమితి అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. సమైక్యవాదులతో నిలబడి కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ శ్రేణులకు ప్రస్తుత పరిస్థితులు ఎంతమాత్రం లెక్క కాదన్నారు. ఒక్కరు పార్టీ నుంచి బయటకు వెళ్తే పది మంది నాయకులను తీర్చిదిద్దుకునే సత్తా బీఆర్ఎస్‌కు ఉందని చెప్పారు. 'తెలంగాణ ఉద్యమ సాధన కోసం నడుం కట్టినపుడు మనతో ఎవరున్నారు? నాడు, నేడు, ఏనాడైనా నాయకులను పార్టీయే తయారు చేసుకుంటుంది. పార్టీ తయారు చేసిన జగిత్యాల ఎమ్మెల్యే దొంగల్లో కలిశాడు. భవిష్యత్తులో అంతకన్నా మెరుగైన నాయకత్వాన్ని పార్టీ తయారు చేసుకుంటుంది. భవిష్యత్తులో కార్యకర్తల నుంచి మెరికల్లాంటి యువ నాయకులను సృష్టిస్తా..'అని కేసీఆర్ అన్నారు. జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం ఎర్రవల్లి నివాసంలో ఆయన భేటీ అయ్యారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడారు.

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేది బీఆర్ఎస్సే

'తెలంగాణ ప్రగతి ప్రస్థానంలో చేరుకోవాల్సిన మైలురాళ్లు అనేకం మిగిలి ఉన్నాయి. తెలంగాణ ఆకాంక్షలు, కలలు నెరవేర్చగలిగే అవగాహన బీఆర్ఎస్‌కు మాత్రమే ఉంది. తెలంగాణ ఆత్మను అర్థం చేసుకుంటూ సమస్యల లోతును పట్టుకుని పరిష్కరించగలిగే సత్తా ఉద్యమాన్ని నడిపించి రాష్ట్రాన్ని సాధించిన మన పార్టీకే ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో అబద్ధపు ప్రచారాలకు లోనై కొన్నిసార్లు ప్రజలు బోల్తా పడుతుంటారు. మొన్నటి ఎన్నికల్లో అలా జరిగినంత మాత్రాన నిరుత్సాహపడొద్దు. అధికారం ఉంటేనే పని చేస్తామనే పద్ధతిని వీడి ఏ హోదాలో ఉన్నా ప్రజల కోసం పనిచేయాలి. తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధి బీఆర్ఎస్ అంతిమ లక్ష్యం. నెరవేరాల్సిన ప్రజల కలలను పూర్తి స్థాయిలో నెరవేర్చేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమే..' అని కేసీఆర్ చెప్పారు.

రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలి

'మనం రెట్టించిన ఉత్సాహంతో భవిష్యత్తులో ఇంకా బాగా ప్రజల కోసం పనిచేయాల్సి ఉంది. ప్రజలు పదేళ్ల అధికారమిస్తే కులమతాలకు అతీతంగా పనిచేసి వ్యవసాయం, సాగునీరు, విద్యుత్ తదితర రంగాల్లో మౌలిక వసతులు మెరుగుపరిచి ప్రజా సమస్యలు పరిష్కరించాం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాం..'అని బీఆర్ఎస్ అధినేత పేర్కొన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ వైద్యుడిగా, ఎమ్మెల్యేగా ప్రజా సేవతో మన్ననలు పొందుతున్నారని అభినందించారు. ఈ భేటీలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్‌రెడ్డి, జాజుల సురేందర్, గంప గోవర్దన్, హనుమంతు షిండే, ఎమ్మెల్సీ ఎల్.రమణ, జగిత్యాల జెడ్పీ చైర్మన్ దావా వసంత సురేశ్, పెద్దపెల్లి బీఆర్ఎస్ నేత ఉష తదితరులు పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లా నేతలతో ప్రత్యేకంగా జరిపిన భేటీలో పార్టీ బలోపేతంపై కేసీఆర్ చర్చించారు.

సందడిగా ఎర్రవల్లి పరిసరాలు

కేసీఆర్‌ను కలిసేందుకు ఎర్రవల్లి నివాసానికి పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు భారీగా తరలివస్తుండటంతో ఫామ్ హౌస్ పరిసరాలు సందడిగా మారాయి. వాహనాల రద్దీతో హడావుడి నెలకొంది. నినాదాలు చేస్తూ పోటెత్తుతున్న నేతలు, కార్యకర్తలు కేసీఆర్‌కు పుష్పగుచ్ఛాలు, మొమెంటోలు ఇచ్చి ఫోటోలు దిగేందుకు పోటీలు పడుతున్నారు.

ఆత్మీయ సమావేశాలకు విరామం

మూడు రోజుల పాటు కేసీఆర్‌కు విశ్రాంతి

సాక్షి, హైదరాబాద్: ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు నిర్వహిస్తున్న ఆత్మీయ సమావేశాలకు మూడు రోజుల పాటు విరామం ప్రకటించారు. శని, ఆది, సోమవారాల్లో మూడు రోజుల పాటు కేసీఆర్‌కు విశ్రాంతి ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. ఆత్మీయ సమావేశాలు తిరిగి ఎప్పుడు ప్రారంభమయ్యేది వెల్లడిస్తామని పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది. రెండు వారాలుగా కేసీఆర్ ఆత్మీయ సమావేశాలు కొనసాగిస్తుండగా, పక్షం రోజుల్లో సుమారు 50 వేల మందికి పైగా మంది కార్యకర్తలు, ప్రజలు ఆయనతో భేటీ అయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందస్తు సమాచారం అందుకుని కేసీఆర్‌ను కలుస్తున్నారు. ఎర్రవల్లి నివాసానికి వస్తున్న వారిని కేసీఆర్ పలకరిస్తూ వారితో ఫొటోలు, సెల్ఫీలు దిగుతున్నారు. ఈ ఆత్మీయ సమావేశాలకు సంబంధించి నియోజకవర్గాల వారీగా షెడ్యూల్‌ను ప్రకటిస్తామని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

నల్లగొండ డీసీసీబీ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- పదవి కోల్పోయిన మహేందర్‌రెడ్డి
- జూలై 1న నూతన చైర్మన్ ఎన్నిక

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. డీసీసీబీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో చైర్మన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి 15 మంది డైరెక్టర్లు మద్దతు తెలిపారు. దీంతో ఇప్పటివరకు చైర్మన్‌గా ఉన్న బీఆర్ఎస్ పార్టీకి చెందిన గొంగిడి మహేందర్‌రెడ్డి ఆ పదవి కోల్పోయారు. డీసీసీబీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి సొంత నిర్ణయాలు తీసుకుంటూ డైరెక్టర్లను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఈ నెల 10వ తేదీన అవిశ్వాసం నోటీసును జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్‌కు అందజేశారు. అప్పుడు మునుగోడు పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి సహా 14 మంది డైరెక్టర్లు నోటీసుపై సంతకాలు చేశారు. అవిశ్వాసంపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇందులో 15 మంది డైరెక్టర్లు అవిశ్వాసానికి మద్దతుగా నిలిచారు. చైర్మన్ పదవిని ఆశిస్తున్న కాంగ్రెస్ పార్టీకి చెందిన కుంభం శ్రీనివాసరెడ్డితోపాటు 14 మంది డైరెక్టర్లు పాల్గొన్నారు. బ్యాంకులో మొత్తం 19 డైరెక్టర్లు ఉండగా, అవిశ్వాసం నెగ్గాలంటే 14 మంది అవసరం ఉంది. శుక్రవారం 15 మంది పాల్గొనడంతో అవిశ్వాసం నెగ్గింది. గొంగిడి మహేందర్‌రెడ్డిని చైర్మన్ పదవిని తొలగిస్తున్నట్లు జిల్లా సహకార అధికారి ప్రకటించారు. ఇన్‌చార్జి చైర్మన్‌గా ప్రస్తుత వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డిని నియమించారు. కొత్త చైర్మన్ ఎన్నిక జూలై 1వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని జిల్లా సహకార అధికారి (డీసీవో) ప్రకటించారు. కుంభం శ్రీనివాసరెడ్డిని చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే నిర్ణయించిన నేపథ్యంలో పదవి ఆయనకే దక్కనుంది.

'ఆరు' నూరవకుండా..

▶ మొదటి పేజీ తరువాయి

పార్టీ నేత కె.కేశవరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మాజీ అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు పార్టీని వీడిన ముఖ్య నేతల జాబితాలో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తన కుమారుడు అమిత్‌రెడ్డికి బీఆర్ఎస్ టికెట్ ఆశించిన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పార్టీతో అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసీయుద్దీన్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇవ్వజూపినప్పటికీ కడియం కూతురు కావ్య, ఎంపీలుగా ఉన్న రంజిత్ రెడ్డి, బీబీ పాటిల్, పి.రాములు తదితరులు ఇతర పార్టీల్లో చేరి టికెట్లు దక్కించుకున్నారు. ఇక బీఆర్ఎస్‌ను వీడిన మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు పదుల సంఖ్యలోనే ఉన్నారు. కాగా అధికారంలో ఉండగా కీలక పదవులు అనుభవించిన నేతలు కూడా చడీ చప్పుడు లేకుండా రాత్రికి రాత్రే పార్టీ మారడం బీఆర్ఎస్‌కు మింగుడు పడని వ్యవహారంగా మారగా..పార్టీ శ్రేణుల్లో విస్మయం వ్యక్తమవుతోంది.

గ్రేటర్, చుట్టూ జిల్లాలపై కాంగ్రెస్ దృష్టి

అసెంబ్లీ ఎన్నికల్లో 39 మంది బీఆర్ఎస్ తరఫున గెలుపొందారు. అయితే ఇప్పటికే దానం నాగేందర్ (ఖైరతాబాద్), తెల్లం వెంకట్‌రావు (భద్రాచలం), పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ), డాక్టర్ సంజయ్ (జగిత్యాల), కడియం శ్రీహరి (స్టేషన్ ఘనపూర్) గులాబీ పార్టీకి గుడ్‌బై కొట్టారు. తాజాగా కాలె యాదయ్య (చేవెళ్ల) కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. బీఆర్ఎస్‌కు మెజారిటీ సంఖ్యలో ఎమ్మెల్యేలు ఉన్న గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల నుంచి చేరికల కోసం కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో సన్నిహిత సంబంధా లు ఉన్న కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మినహా మిగతా వారు పార్టీ మారతారనే ప్రచారం జరుగుతోంది. ఉద్యమ కాలం నుంచి అనుబంధం ఉన్న కొందరు ఎమ్మెల్యేలు కూడా పార్టీ మారేందుకు విముఖతతో ఉన్నా రు. అయితే 2014, 2018 ఎన్నికల తర్వాత ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరి, ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా ఉన్నవారు ఎందరు పార్టీలో కొనసాగుతారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో పార్టీలో చేరి ప్రత్యేక రాష్ట్రంలో కీలక పదవులు అనుభవించిన నేతలు కేకే, కడియం, పోచారం తదితరులు సైతం పార్టీని వీడటం, మరోవైపు పార్టీ సృష్టించిన నాయకుడు డాక్టర్ సంజయ్ కూడా నిష్క్రమించడంతో ఎవరుంటారో, వీడతారో తెలియని పరిస్థితి బీఆర్ఎస్‌లో ఉందనే చర్చ జరుగుతోంది.

కొత్త నాయకత్వానికి ప్రోత్సాహం

అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించారు. కానీ లోక్‌సభ ఎన్నికలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నిక, 'వరంగల్–ఖమ్మం– నల్లగొండ' పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. దీంతో సమీప భవిష్యత్తులో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసే ఔత్సాహికుల్లో ఆందోళన కనిపిస్తోందని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఉన్న నాయకత్వాన్ని కాపాడుకోవడమే కాకుండా ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని ప్రోత్సహించడంపై కేసీఆర్ దృష్టి సారిస్తున్నారు. ఉద్యమ సమయంలో క్రియాశీలంగా పనిచేసిన యువ నాయకులకు క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ బాధ్యత అప్పగిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గ్యాదరి కిషోర్‌తో పాటు ఎర్రోల్ల శ్రీనివాస్, కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, దూదిమెట్ల బాలరాజు యాదవ్, ఆంజనేయ గౌడ్, తొట్ల స్వామి యాదవ్, తుంగ బాలు వంటి నేతలకు క్రియాశీల బాధ్యతలు అప్పగిస్తున్నారు. పార్టీలో సుదీర్ఘంగా కొనసాగుతున్న వారికి రాష్ట్ర, జిల్లా కమిటీల్లో కీలక స్థానం ఇచ్చే దిశలో కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు.

భరోసా నింపుతున్న కేసీఆర్

పార్టీ ఎమ్మెల్యేలు, కీలక నేతలు ఒకరొకరుగా పార్టీనీ వీడుతుండటంతో కేసీఆర్ అప్రమత్తమయ్యారు. ఎర్రవల్లి నివాసంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నేరుగా లంచ్ భేటీలు జరుపుతున్నారు. పార్టీకి పూర్వ వైభవం వస్తుందని, తన వెంట నిలిచే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందంటూ భరోసా నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఉద్యమ సమయంలోనూ పార్టీని బలహీన పరిచేందుకు కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలు, అప్పట్లో ఎదురొడ్డి నిలిచిన తీరును వివరించి చెప్తున్నారు. ఒత్తిళ్లు, ప్రలోభాలకు లొంగకుండా పార్టీలో కొనసాగాలని బుజ్జగింపు ధోరణిలో కోరుతున్నారు. మరోవైపు కింది స్థాయిలో ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులతోనూ సమావేశమవుతున్నారు. దీంతో జిల్లాల నుంచి పార్టీ నేతలు కేసీఆర్‌ను కలిసేందుకు ఎర్రవల్లి నివాసానికి పోటెత్తుతున్నారు. అయితే కేసీఆర్‌తో భేటీ తర్వాత కూడా కాలె యాదయ్య పార్టీని వీడటం గమనార్హం.



సర్వభూతాల్లోనూ అంతర్యామిగా ఉండే పరమాత్మ ఒక్కడే. ఆ పరబ్రహ్మ ప్రసాదించిన శక్తిసామర్థ్యాల వల్లే, మనస్సు, బుద్ధి, తదితర ఇంద్రియాల సహాయంతో లోకులు వివిధ కర్మలు చూస్తూ తదనుగుణమైన శుభ లేక అశుభ ఫలాలు పొందుతుంటారు.
– కఠోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి
శనివారం, 29 జూన్ 2024

తొలి రౌండ్ ట్రంప్‌దేనా!

లాంఛనంగానైనా కరచాలనాల్లేవు. మర్యాదకైనా చిరునవ్వుల్లేవు. అసలు ఒకరివైపు ఒకరు చూసుకున్న క్షణాలే లేవు. శుక్రవారం దాదాపు 90 నిమిషాలపాటు సాగిన అమెరికా అధ్యక్ష అభ్యర్థుల తొలి సంవాదం అధ్యక్షుడు జో బైడెన్, మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌లపై ఇప్పటికే ప్రజానీకంలో పాతుకుపోయిన అభిప్రాయాలను మరింత దృఢపరిచింది. బైడెన్ తన విజయాలను ఘనంగా చాటలేరు. ట్రంప్ కన్నార్పకుండా అబద్ధాలు వల్లించటం మానుకోలేరు. వృద్ధాప్య ఛాయలు తనలో మచ్చుకైనా లేవని చాటేందుకు 81 యేళ్ల బైడెన్ తాపత్రయపడితే... న్యాయస్థానం తనను అపరాధిగా నిర్ధారించినా ఆత్మవిశ్వాసం మచ్చుకైనా సడల్లేదన్న అభిప్రాయం కలిగించేందుకు 78 యేళ్ల ట్రంప్ తంటాలు పడ్డారు. చిత్రమేమంటే – ఈ అంశాల్లో ఇద్దరికిద్దరూ విఫలమయ్యారు. బైడెన్‌కి ఇప్పటికే ఉన్న పాయింట్లు ఇంకా తగ్గగా... ట్రంప్ కాస్త మెరుగుపడిన మాట నిజమే అయినా అనుకున్నంతగా లేదు. 1960లో అధ్యక్ష పదవికి పోటీపడిన జాన్ ఎఫ్ కెనెడీ, రిచర్డ్ నిక్సన్‌లతో ప్రారంభమైన ఈ సంవాదం ఇంత పేలవంగా సాగిన సందర్భాలు ఎప్పుడూ లేవన్నది విశ్లేషకుల మాట. వచ్చే సెప్టెంబర్ 10న జరగబోయే రెండో సంవాదం సమయానికైనా బైడెన్ మెరుగుపడతారో లేదోనన్న దిగులు డెమాక్రటిక్ పార్టీని నిలువెల్లా వణికిస్తుండగా, రిపబ్లికన్ పార్టీ మాత్రం కులాసాగా సేదతీరుతోంది. బైడెన్ వంటి బలహీనుడు ప్రత్యర్థిగా ఉన్నప్పుడు ఇక చింత ఎందుకన్నది దాని భావన కావొచ్చు. ట్రంప్‌ను మించిన గెలుపు గుర్రం లేదని ఆ పార్టీ ఎప్పుడో నిర్ణయానికొచ్చింది. అధ్యక్ష అభ్యర్థుల సంవాదంలో మన మాదిరిగా అరుపులూ, కేకలూ ఉండవు. ఎదురుగా జేజేలుకొట్టే అభిమానులూ ఉండరు. ఒకరి ప్రసంగాల్లోకి ఒకరు చొరబడే సంస్కృతి కూడా లేదు. ప్రత్యర్థి చెప్పింది పూర్తిగా విని దీటైన, సహేతుకమైన జవాబు చెప్పగలిగినవారికి మద్దతు పెరుగుతుంది. కానీ ఇద్దరికీ అది పట్టలేదు. అడిగిన ప్రశ్నల్ని దాటేసే ట్రంప్ తీరు బుల్‌డోజర్‌ని మరపిస్తే, బైడెన్‌కు మాట పెగలడమే కష్టమైనట్టు కనబడింది. ట్రంప్ సంధించిన ప్రశ్నలకు జవాబివ్వటంతో మొదలుపెట్టినా... హఠాత్తుగా సంబంధంలేని మరో అంశంలోకి వెళ్లి బైడెన్ అయోమయంలో పడిన సందర్భాలు అనేకం. ట్రంప్‌లో గతానికి మించిన మూర్ఖత్వం మూర్తీభవించివున్నదని, ఆయన్ను ఎన్నుకుంటే దేశం ప్రమాదంలో పడుతుందని చెప్పటం బైడెన్ ఉద్దేశం. కానీ అది సమర్థవంతంగా చెప్పలేకపోయారు. 2020 నాటి సంవాదం స్థాయిలోనైనా మాట్లాడలేకపోయారు. తన హయాంలోని వైఫల్యాలను కప్పిపుచ్చటమే కాదు... బైడెన్ విజయాలను మరుగుపరచటంలో ట్రంప్ విజయం సాధించారు.

వేరే దేశాల ఎన్నికలు ఎవరికీ పెద్దగా పట్టవు. కానీ ప్రపంచాన్నే శాసించే అమెరికాలో జరిగే ప్రతిదాన్నీ జాగ్రత్తగా గమనిస్తారు. యూరప్ ఖండం మొదలుకొని ఉత్తర కొరియా వరకూ అందరూ ఆసక్తి కనబరుస్తారు. సహజంగానే ఉక్రెయిన్‌లో రష్యా... గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న దురాక్రమణ యుద్ధాలూ, నాటోతో సంబంధాలూ, ప్రపంచంలో అమెరికా పరువు ప్రతిష్ఠలూ చర్చకొచ్చాయి. అలాగే దేశ ఆర్థిక వ్యవస్థ, వలసలు, ద్రవ్యోల్బణం, అబార్షన్లు సైతం ప్రధాన భాగం ఆక్రమించాయి. పుతిన్‌ను ప్రోత్సహించింది నువ్వంటే నువ్వని పరస్పరం ఆరోపణలు చేసుకోవటం ఆసక్తి కలిగించే అంశం. యూరప్ దేశాలు నాటో వ్యయంలో తమ వాటా చెల్లించకపోతే సంస్థనే మూసేస్తానని ట్రంప్ బెదిరించటం పరోక్షంగా పుతిన్‌ను సమర్థించినట్టేనని బైడెన్ వాదించగా... అసలు ఉక్రెయిన్‌పై దాడికి పురిగొల్పిందే బైడెన్ అని ట్రంప్ ఎదురు దాడి చేయటం గమనించదగ్గది. అఫ్గాన్ నుంచి వైదొలగే క్రమంలో జరిగిన భంగపాటే పుతిన్‌కు ధైర్యాన్నిచ్చిందని ఆయన దబాయించారు. ఉక్రెయిన్‌కు నిధుల వరద పారిస్తూపోతే ప్రజలను మరింత కుంగదీస్తుందన్నది ట్రంప్ వాదన. అయితే ఇజ్రాయెల్ విషయంలో ఇద్దరిదీ ఒకే మాట! కాకపోతే ఆ దేశానికి అన్నివిధాలా మద్దతిస్తున్నామని బైడెన్ అంటే... అదింకా సరిపోదన్నది ట్రంప్ ప్రత్యుత్తరం. యూదు వోటర్లు గణనీయంగా ఉండటంవల్లే ఇలా ఒకరిని మించి ఒకరు ప్రేమ ఒలకబోశారు. పైగా బైడెన్ పాలస్తీనీయుడిగా మారారని ట్రంప్ ఆరోపించారు. బైడెన్ మెతకదనం ఆసరా చేసుకుని వేరే దేశాల ప్రభుత్వాలు జైళ్లు, పిచ్చాసుపత్రులు ఖాళీ చేయించి అందరినీ అమెరికా పంపుతున్నారనడంలోని అంతరార్థం శ్వేత జాతి వోటర్లను ప్రసన్నం చేసుకునేందుకే! దేశంలో ద్రవ్యోల్బణం క్రమేపీ తగ్గుతున్నా అల్పాదాయ, మధ్యాదాయ వర్గాలను ఇంకా వేధిస్తూనే వుంది. అయితే మాంద్యం బెడద తొలగింది. ఉపాధి అవకాశాలు పెరిగాయి. ధరలూ తగ్గాయి. కానీ వీటిని బైడెన్ గట్టిగా చెప్పలేకపోగా, కార్మిక వర్గం సమస్యల్లో ఉందన్న ట్రంప్ వాదనతో ఏకీభవించారు. ట్రంప్ హయాంలో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిన వైనాన్ని అందరికీ గుర్తు చేయటంలో బైడెన్ విజయం సాధించారు. అబార్షన్‌కు వాడే మాత్రకు తాను వ్యతిరేకం కాదని ట్రంప్ చెప్పక తప్పలేదు. ఇది మహిళల ఘనవిజయం.

ప్రత్యర్థితో గంటన్నరపాటు వాగ్యుద్ధానికి తలపడినప్పుడు ఏదో ఒక సమయంలో ఓటమి ఎదురయ్యే పరిస్థితి రావొచ్చు. కానీ తొలి పది నిమిషాలూ నిబ్బరంగా లేనివారు ఓటమి నుంచి తప్పించుకోలేరంటారు. సంవాదంలో బైడెన్‌కు అదే జరిగింది. ఆయన ప్రసంగం తడబాట్లతో మొదలైంది. చాలాసార్లు సణుగుడుగా మిగిలిపోయింది. ట్రంప్ అడుగుతున్నప్పుడు నోరు తెరుచుకుని ఉండటం కూడా వీక్షకులను నిర్ఘాంతపరిచింది. మొత్తానికి తొలి రౌండ్‌లో ట్రంప్‌దే పైచేయి.

ఎందుకీ ప్రజాస్వామ్య పతనం?

విశ్లేషణ



టంకశాల అశోక్

భారతదేశం ప్రపంచ ప్రజాస్వామ్యానికే మాతృక అని మోదీ కొద్ది సంవత్సరాల క్రితం సగర్వంగా ప్రకటించారు. ఆ మాట చారిత్రకంగా వాస్తవమని ఏ చరిత్రకారుడు కూడా అన్నట్లు లేదు. ఆధునిక సమాజాలు స్థిరపడినా కొద్దీ ఆధునిక ప్రజాస్వామ్యాల దశ మొదలైంది. అటువంటి ప్రాంతాలలో భారతదేశం కూడా ఒకటనటంలో సందేహం లేదు. ప్రపంచ ప్రజాస్వామ్యం వేల ఏళ్ళుగా రూపుదిద్దుకున్న చరిత్రలో భారత భూమి భాగస్వామ్యం ఉండటం గర్వించదగ్గ విషయం. అయితే, 'వి–డెమ్' ప్రకారం ప్రపంచ ప్రజాస్వామ్య దేశాల ర్యాంకింగ్స్‌లో ఇండియా స్థానం 104. మొత్తం 179 దేశాలతో పోల్చినప్పటి స్థితి ఇది. భారత్ లాంటి మహత్తర దేశస్థానం ఎందువల్ల పడిపోయినట్లు? ఆ పతనానికి బాధ్యులెవరు?

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ నెల 27న పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించినప్పుడు, నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆమె ద్వారా ఒక ముఖ్యమైన మాటను చెప్పించగలదో లేదోనని ముందుగా కొంత అనుమానం కలిగింది. చివరకు చెప్పించటం చూసి సంతోషం కలిగింది. భారతదేశం 'మదర్ ఆఫ్ డెమోక్రసీ' అని అభివర్ణించారామె. ప్రపంచ చరిత్ర పుటలలోకి వెళ్ళి చూసినట్లయితే ఆ మాటకు కొంత విలువ ఉంటే ఉండవచ్చు. కనుక అది చారిత్రక దృష్టితో సంతోషించదగిన మాటే. అయితే, రాష్ట్రపతితో ఆ మాట చెప్పించిన మోదీ పాలనలో, ప్రపంచ ప్రజాస్వామ్య దేశాల ర్యాంకింగ్స్‌లో మన స్థానం 104కు ఎందుకు పతనమైందన్నది భారతీయుల సందేహం.

భారతదేశం ప్రపంచ ప్రజాస్వామ్యానికే మాతృక అని మోదీ కొద్ది సంవత్సరాల క్రితం సగర్వంగా ప్రకటించారు. ఆ మాట చారిత్రకంగా వాస్తవమని ప్రపంచంలో ఏ చరిత్రకారుడు కూడా అన్నట్లు లేదు. అయితే, క్రీస్తు పూర్వం అనేక శతాబ్దాల క్రితం ప్రపంచంలోని పలు సమాజాలు నాగరికమైనా కొద్దీ అక్కడ ప్రజాస్వామ్య వ్యవస్థల లక్షణాలు కనిపించసాగాయి. నిజానికి అందుకు బీజాలు ఆదిమ తెగల సమాజాలలోనే ఉన్నట్లు మానవ వికాస శాస్త్రజ్ఞులు చెప్తారు. ఆ తర్వాత దశలో ఆధునిక సమాజాలు స్థిరపడినా కొద్దీ ఆధునిక ప్రజాస్వామ్యాల దశ మొదలైంది. అటువంటి ప్రాంతాలలో భారతదేశం కూడా ఒకటనటంలో సందేహం లేదు. అవే పరిణామాలు గ్రీసు, ఈజిప్టు, ఇతర మధ్యధరా సముద్ర తీర ప్రాంతాలు, చైనా వంటి చోట్ల కూడా చోటు చేసుకున్నాయి. ఆ విధంగా ఇవన్నీ క్రీస్తు పూర్వ కాలపు అక్క చెల్లెల్లన్నమాట. అందుకు అనుగుణంగానే ఈ ప్రాంతాలన్నింటా ప్రజాస్వామిక తత్త్వవేత్తలు, సంఘ సంస్కర్తలు, పరిపాలనా శాస్త్రవేత్తలు అప్పటినుంచే ఆవిర్భవించటం మొదలైంది.

మొత్తానికి ఆ విధంగా ప్రపంచ ప్రజాస్వామ్యం వేల ఏళ్ళుగా రూపుదిద్దుకున్న చరిత్రలో భారత భూమి భాగస్వామ్యం ఉండటం మనమంతా గర్వించదగ్గ విషయం. అయితే, అటువంటి మహత్తర దేశస్థానం ప్రపంచ ప్రజాస్వామ్య దేశాల ర్యాంకింగ్స్‌లో ఇపుడు 104కు ఎందువల్ల పడిపోయినట్లు? ఆ పతనానికి బాధ్యులెవరు? ఆ స్థితి భారతీయులకు గర్వించదగ్గ విషయమా? ప్రజాస్వామ్య దేశాలు, వ్యవస్థలన్నింటిని ఎప్పటికప్పుడు మదింపు చేసే ప్రపంచ స్థాయి సంస్థ పేరు 'వి–డెమ్'. దాని నివేదికలు కొద్ది సంవత్సరాల క్రితమే ఇండియాను 'ఇటీవల అతి హీనంగా నియంతృత్వీకరణ చెందుతున్న దేశాలలో ఒక'టనీ, 'ప్రపంచంలోని మొదటి పది నియంతృత్వ దేశాలలో ఒక'టనీ అభివర్ణించాయి. తర్వాత 2018 వచ్చేసరికి, అనగా గత ఎన్నికల కన్నా ముందే, 'ఎన్నికైన నియంతృత్వం' స్థాయికి పడిపోయింది. 2018 నుంచి 2023 వరకు అయిదేళ్ళ పాటు కూడా అదే స్థాయిలో కొనసాగింది. ఈ 2024 ర్యాంకింగ్స్ వచ్చేసరికి పరిస్థితి



ఏమి కాగలదో చూడాలి. ఇది వి–డెమ్ పరిశీలించిన మొత్తం 179 దేశాలతో పోల్చినప్పటి స్థితి అన్నమాట. వి–డెమ్ సంస్థ స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్ యూనివర్సిటీకి చెందిన పొలిటికల్ సైన్స్ విభాగం నుంచి పనిచేస్తుంది. ఒక ప్రజాస్వామ్యం ఏవిధంగా పనిచేస్తున్నదో మదింపు వేసేందుకు ఆ సంస్థకు ఐదు కొలమానాలు ఉన్నాయి. అవి, ఎన్నికల తీరు, ఉదారవాదం, ప్రజల భాగస్వామ్యం, చర్చలకు గల అవకాశం, ప్రజా సంక్షేమం.

వి–డెమ్ మాత్రమే కాదు, కొన్ని తేడాలతో ఇతర ప్రముఖ సంస్థలు కూడా హీనమైన ర్యాంకులే ఇస్తూ వస్తున్నాయి. ఉదాహరణకు ప్రపంచ ప్రసిద్ధ 'ఎకానమిస్టు' మేగజైన్ 2020లో 53వ ర్యాంక్‌నిచ్చింది. ప్రజాస్వామ్య సూచీలలో పత్రికా స్వేచ్ఛ ఒకటని భావిస్తే, 'రిపోర్టర్స్ విత్‌అవుట్ బార్డర్స్' నివేదిక ప్రకారం, ఈ 2024లో ఇండియా ర్యాంకు 180 దేశాలలో 159వది. మానవ హక్కుల విషయంలో 165 దేశాలలో 109వది. నిజానికి ప్రధానంగా ధనిక వర్గాలకు లాభం చేసే ఆర్థికాభివృద్ధి సూచీల మాట ఎట్లున్నా, సామాన్య ప్రజలకు సంబంధించిన మానవాభివృద్ధి సూచీలు కూడా ప్రజాస్వామ్యం గురించేనని భావిస్తే, ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం మనది 134వ స్థానం.

గమనించదగినదేమంటే, ఈ సూచీలన్నీ నరేంద్ర మోదీ పాలనలో క్రమంగా పడిపోతున్నాయి. అయినప్పటికీ ఆయన ప్రభుత్వం ఇటువంటి నివేదికలను, వాటిలో పేర్కొన్న వాస్తవాలను, తమ తీవ్రమైన అప్రజాస్వామికతను విస్మరించి, భారతదేశం మదర్ ఆఫ్ డెమోక్రసీ అనే ప్రకటనలు నిర్భయంగా చేయటాన్ని బట్టి వారి తెగువను మెచ్చుకోవాలి. దేశంలో ప్రజలేమన్నా, ప్రపంచం ఏమన్నా, ఈ మాటను కూడా గోబెల్స్ ప్రచారం వలె సాగించినట్లయితే అదే నిజంగా స్థిరపడగలదన్నది మోదీ నమ్మకం అయి ఉండాలి. ఇందులోని గమనించదగ్గ మెలిక ఏమంటే, భారతదేశం మదర్ ఆఫ్ డెమోక్రసీ అయినా కాకున్నా ప్రజాస్వామ్యానికి బీజాలు వేసిన భూభాగాలలో ఒకటన్నది నిజమే గాని, దానిని వర్ధిల్ల చేయటంలో మోదీ పాత్ర ఏమిటన్నది ప్రశ్న. మనది మదర్ ఆఫ్ డెమోక్రసీ అనే ప్రచారం చాటున ఆయన తన అప్రజాస్వామికతను, పైన పేర్కొన్న తరహా ర్యాంకింగుల అప్రతిష్ఠను కప్పిపెట్టుకో జూస్తున్నారనిపిస్తున్నది. గోబెల్స్ తరహా ఎత్తుగడలలో ఇది ఒకటి.

ఈ సందర్భంగా, ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో మోదీ సాగించిన భయం గొలిపే విషప్రచారం అనివార్యంగా గుర్తుకువస్తుంది. ఆ ప్రచారాన్ని చివరకు ఆరెస్సెస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ సైతం బహిరంగంగా ఆక్షేపించవలసి వచ్చిందంటే, మోదీ తీరును ప్రజాస్వామికమని ఎవరైనా అనగలరా? భారతదేశం మదర్ ఆఫ్ డెమోక్రసీ అని సగర్వంగా చాటుకోగల నాయకుని ధోరణి అదేనా? ఈ దేశపు గత చరిత్రను, ప్రజాస్వామిక సంప్రదాయాన్ని ప్రస్తావించే నైతిక హక్కు ఆయనకు ఉంటుందా? పైన పేర్కొన్న ర్యాంకింగ్‌లన్నీ మొన్నటి ఎన్నికల విష ప్రచారం కన్నా ముందటివి. ఆ తర్వాతవి ఏ విధంగా ఉండగలవో చూడాలి.

మోదీ ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా చెప్పించిన మరొక విశేషం ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ. ఈ ప్రస్తావనలు ప్రధానితో పాటు బీజేపీకి చెందినవారు గత కొద్దిరోజులుగా చేస్తున్నారు. అది చాలదన్నట్లు సాక్షాత్తూ రాష్ట్రపతి ద్వారా మాట్లాడించారు. ఎమర్జెన్సీ విధింపు పూర్తి అప్రజాస్వామికమనటంలో ఎటువంటి సందేహం లేదు. ఆ చర్య తీసుకున్న పరిస్థితులు, అది అమలైన తీరు అన్నీ ప్రజాస్వామ్య విరుద్ధమే. దానిని అందరూ ఖండించటమే గాక, తిరిగి ఎన్నడూ ఏ రూపంలోనూ ఆ ధోరణులను ప్రదర్శించకూడదు. కానీ, దానిని ఇంతగా ఖండించే మోదీ చేస్తున్నదేమిటీ? తన నాయకత్వాన ఇండియాకు ప్రజాస్వామ్య ర్యాంకింగ్‌లు వరుసగా పడిపోతూ నియంతృత్వ ర్యాంకింగులు ఎందుకు వస్తున్నాయి? ఇందిర ఎమర్జెన్సీ తన వ్యక్తిగత అధికార పరిరక్షణకు ప్రజాస్వామ్యాన్ని, సమాజాన్ని ఒక పరిమిత కాలం పాటు భంగపరిచిన చర్య. అంతే తప్ప ఆ చర్య దీర్ఘకాలిక ప్రభావం చూపలేదు. అందుకు భిన్నంగా మోదీ చర్యల వల్ల భారత సమాజమే విషప్రాయమవుతున్నది. ఆ ప్రభావాలు దీర్ఘకాలం పాటు ఉండనున్నాయి. తన తీరు చివరకు ఆరెస్సెస్‌కు సైతం ఇబ్బందికరం, అభ్యంతరకరం అవుతున్నది. అటువంటి నాయకుడు కనీసం ఎన్నికల ఎదురుదెబ్బలతోనైనా పాఠాలు గ్రహించి తన ధోరణిని మార్చుకోవటం అవసరం. భారతదేశం మదర్ ఆఫ్ డెమోక్రసీ అనే నీతులు ఎవరికీ చెప్పనక్కరలేదు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

దేవుడే దిక్కు



బైడెన్, ట్రంప్ మధ్య జరిగిన చర్చ చూసిన తర్వాత ఒకటి మాత్రం స్పష్టంగా అర్థమైంది. కేవలం దేవుడు మాత్రమే అమెరికాను కాపాడగలడు. దేవుడా! అమెరికాను దీవించు!

– అమ్జద్ తాహా, విశ్లేషకుడు

దారుణమైన చీడ



'అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం'తో నిర్మించిన ఒక విమానాశ్రయపు పైకప్పు, భారీ దూలాలు పడిపోవడానికి ఒక వాన కారణమవుతున్నదంటే– తెగులు చాలా లోతుగా, మూలాల్లో ఉంది. అది 2009లో నిర్మించినది అన్నది విషయం కాదు. ఒక ప్రాణం పోయింది, అది క్షమించలేనిది. ప్రతి ప్రాజెక్టునూ దాని కాలవ్యవధిని బట్టి సమీక్షించాలి. (ఢిల్లీ విమానాశ్రయపు టెర్మినల్ 1 పైకప్పు కూలిన నేపథ్యంలో.)

– అద్వైత కళ, స్క్రీన్ రైటర్

ఢిల్లీ జలమయం



ఢిల్లీలోని నా మొత్తం ఇంట్లో ప్రతీ గదిలోకి అడుగులోతు నీళ్లు వచ్చాయి. కార్పెట్లు, ఫర్నిచర్, అసలు నేల మీద ఉన్న ప్రతిదీ పాడైంది. విద్యుదాఘాతాలకు దారి తీస్తుందన్న కారణంగా పొద్దున ఆరింటి నుంచి కరెంటు నిలిపేశారు. పడవ లేకుండా నేను రాలేనేమోనని నా పార్లమెంటు సహచరులకు చెప్పాను. చివరకు రోడ్ల మీద నిలిచిన నీటిని తొలగించడంతో సమయానికి చేరుకున్నాను.

– శశి థరూర్, కాంగ్రెస్ ఎంపీ

రాత సమస్యలు



నాకు ఎవరూ స్నేహితులు లేరన్న కారణంగా నేను రాయాలనుకున్నాను. తీరా నలభై ఏళ్ల తర్వాత కూడా నేను రాస్తున్నాను. కాబట్టి నాకు ఎవరూ స్నేహితులుగా మిగల్లేదు.

– సహానా అహ్మద్, రచయిత్రి

ఇండియా కీలకం




కేవలం రష్యాతో ఇండియా స్నేహం మాత్రమే ప్రపంచాన్ని 'బహు ధ్రువం'గా ఉంచుతున్నది. అది పోయిందంటే, మనం 'ద్వి ధ్రువ' ప్రపంచంలో బతకాల్సి ఉంటుంది... చైనా, రష్యా, ఇరాన్, ఉత్తర కొరియా ఒక కూటమిగా; అమెరికా, ఇండియా, యూరప్, జపాన్, దక్షిణ కొరియా, సౌదీ అరేబియా మరో కూటమిగా!

– నోవా స్మిత్, విశ్లేషకుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

'ఉపా'ను తలదన్నే సెక్షన్ 113

కొత్త నేర చట్టాలు జూలై 1 నుండి దేశవ్యాప్తంగా అమల్లోకి రాబోతున్నాయి. ఈ చట్టాలపై ఒకవైపు తీవ్రమైన విమర్శలూ, మరొకవైపున పొగడ్తలూ వినబడుతున్నాయి. ఎవరి వాదం ఎలా ఉన్నా... భారతీయ న్యాయ సంహిత (భారతీయ శిక్షా స్మృతి)లోని సెక్షన్ 113 మాత్రం ఒక ప్రత్యేక విషయంగా నిలుస్తుందని చెప్పక తప్పదు. ఎందుకంటే ఇది ప్రజా వ్యతిరేకమైనది కాబట్టి. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక (ఉపా) చట్టంలోని ఉగ్రవాద చర్యలకు సంబంధించిన సెక్షన్ 115ను యథా తథంగా భారతీయ న్యాయ సంహితలో సెక్షన్ 113గా చేర్చారు. కేవలం చట్ట వ్యతిరేక కార్యకలాపాలకే ఉపాను పరిమితం చేయకుండా, మొత్తం దేశ సమగ్రతనూ, సార్వభౌమత్వాన్నీ ఉగ్రవాద చర్యలతో భంగం కలిగించేవారి వరకూ ఉపా చట్టాన్ని విస్తృత పరిచారు. అయితే ఈ రెండు అంశాలను ఒకే చట్టంగా ఏకరూపంలోకి తీసుకురావడంలో అభ్యంతరాలు ఉన్నాయి.



ఉగ్రవాద చర్యలలో వ్యక్తులు లేదా సంస్థలకు భాగస్వామ్యం ఉందని భావిస్తే... ముందుగా ఆ యా వ్యక్తులకు లేదా సంస్థలకు ఉపా చట్టంలోని సెక్షన్లు 35, 36ల ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేయడం, అభ్యంతరాలు తెలుసుకోవడం, ఆరోపణలపై విచారణ చేయడం వంటివి పూర్తి చేసిన అనంతరం... చివరికి తేలే అంశాన్ని బట్టి కేంద్ర ప్రభుత్వం ఆ యా వ్యక్తులను లేదా సంస్థలను ఉగ్రవాద జాబితా నుండి తొలగిస్తుంది లేదా కొనసాగిస్తుంది. అలాగే ఈ ప్రక్రియ ద్వారానే ఉగ్రవాదులు లేదా ఉగ్రవాద సంస్థలపై పోలీసువారు లేదా నేర విచారణ సంస్థలు ఉపా చట్టం పరిధిలో కేసులు నమోదు చేసి తమ విచారణను కొనసాగించవచ్చు. ఇవీ అసలు ఉపా కింద సాగాల్సిన విధివిధానాలు. అయితే ఇటీవల రాజ్యాంగబద్ధంగా ఉన్నటువంటి సంస్థలపై, అలాగే మానవ హక్కుల సంస్థలపై, కార్యకర్తలపై, వ్యక్తులపై ఉపా చట్టాన్ని మోపడం కనిపిస్తోంది. కానీ ఆరోపణలకు గురైనవారు తాము ఉగ్రవాద సంస్థలకు చెందినవారం కాదని న్యాయపోరాటాలు చేస్తున్నారు. అంటే ఉపా చట్టం ఎంత లోపభూయిష్టంగా ఉందో అర్థమవుతుంది. ఈ ఇబ్బందులను, లోపాలను భారతీయ న్యాయ సంహిత ద్వారా పరిహరించడానికి భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 113ను రంగంలోకి దించారు. అంటే ఇక భారతీయ న్యాయ సంహిత ద్వారా నేరుగా ఏ వ్యక్తిపైనైనా ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్నాడని నేరుగా పోలీసులు... పోలీసు సూపరింటెండెంట్ అనుమతితో కేసులు కట్టవచ్చు. అందుకే ఈ సెక్షన్ ఉపా చట్టం కన్నా ప్రమాదకరమైంది. ప్రభుత్వాలు తలచుకుంటే చాలా తేలికగా ఇక ఎవరిపైనైనా ఉగ్రవాద ముద్ర వేసి జైలుకు పంపవచ్చు. రాబోయే రోజుల్లో జరగబోయే ప్రజాస్వామ్య హననాన్ని ప్రశ్నించే ప్రతీ గొంతుకనూ అణచివేసే పనిముట్టుగా సెక్షన్ 113 ఉపయోగంలోకి రాబోతోంది. కాబట్టి ప్రజలు ఈ నల్ల సెక్షన్‌కు వ్యతిరేకంగా పోరాడితే కానీ దాని ఉపసంహారణ జరగదు.

– అంకాళ్ళ పృథ్వీరాజ్ I ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది

ప్రతిపక్ష హోదా ఎగ్గొట్టడానికి అబద్ధాలా?

అభిప్రాయం



పూనూరు గౌతమ్‌రెడ్డి

రాజ్యాంగంలోనూ, చట్టాల్లోనూ లేని అంశాలను సాకుగా చూపిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న కూటమి శాసన సభలో ప్రతిపక్ష హోదాను ఏకైక ప్రతిపక్ష పార్టీనేతకు ఇవ్వకుండా ఉండేందుకు ప్రయత్నిస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు ప్రతిపక్ష హోదా ఎందుకు ఇవ్వాలో విశదీకరిస్తూ అసెంబ్లీ స్పీకర్‌కు ఒక లేఖ రాశారు. అయితే, ఈ లేఖపై స్పీకర్ స్పందించేలోపే ఆర్థిక, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ స్పందించారు. నిజానికి స్పీకర్ ఈ లేఖకు సమాధానం ఇచ్చిన తర్వాత కానీ మంత్రి స్పందించకూడదు. పోనీ స్పందించారనే అనుకున్నా... మరీ ఇంత అడ్డగోలుగా మాట్లాడ్డం విడ్డూరం. ఈ స్పందనలో ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా ఉండాలని నిర్ణయించినట్లు స్పష్టమవుతోంది.

మంత్రి స్పందనలో ఉండాల్సిన విషయ పరిజ్ఞానం కంటే వ్యంగ్యమే ఎక్కువగా ధ్వనించింది. ప్రతిపక్ష హోదా ఇచ్చే విషయంపై మాట్లాడే క్రమంలో ఇతర పుస్తకాలతో పాటు అప్పుడప్పుడు కౌల్ అండ్ శక్థర్ రాసిన 'ప్రాక్టీస్ అండ్ ప్రొసీజర్ ఆఫ్ పార్లమెంట్' పుస్తకం కూడా చదవాలంటూ వ్యంగ్య బాణం వదిలారు. ఒక పార్టీకి కనీసం 10 శాతం సభ్యులు లేకపోతే ఆ పార్టీ నాయకునికి ప్రధాన ప్రతిపక్ష హోదా రాదన్నారు. ఈ వ్యాఖ్యలను అనేక మంది తప్పుపడుతున్నారు. టీవీ, పత్రికలు, సోషల్ మీడియాల్లో ఇదే ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యింది. అనేకమంది రాజ్యాంగ నిపుణులూ, విశ్లేషకులూ ప్రభుత్వ వాదం ఎంత తప్పో వివరిస్తుండడం తెలిసిందే. ఎమ్ఎన్ కౌల్ అండ్ ఎస్ఎల్ శక్థర్ రాసిన 'ద ప్రాక్టీస్ అండ్ ప్రొసీజర్ ఆఫ్ పార్లమెంట్' పుస్తకం ఆరవ ఎడిషన్‌ను ఎడిట్ చేసిన లోక్‌సభ విశ్రాంత సెక్రటరీ జనరల్ పీడీటీ ఆచారి ఏకంగా ఒక ఆంగ్ల దిన పత్రికలో వ్యాసం రాయడంతో రాజకీయ వర్గాల్లో ప్రతిపక్ష హోదాపై మరింత ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.

మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ 'ఆంధ్రప్రదేశ్ పేమెంట్స్ అండ్ శాలరీస్ చట్టాన్ని జగన్ ప్రస్తావిస్తున్నారు. ఆ చట్టం లీడర్ ఆఫ్ అపోజిషన్‌ను నిర్ణయిస్తుందా' అని ప్రశ్నించారు. కౌల్ అండ్ శక్థర్ పుస్తకంలో 150వ పేజీలో చాలా స్పష్టంగా స్టాట్యూటరీ (రికగ్నిషన్) పొజిషన్ ఆఫ్ ద లీడర్ ఆఫ్ అపోజిషన్ అనేది 'పేమెంట్ ఆఫ్ శాలరీస్ ఆక్ట్ –1977' ఆధారంగానే నిర్ణయించబడిందని పేర్కొడం గమనార్హం. ప్రతిపక్ష హోదా ఇవ్వడానికి పేమెంట్ ఆఫ్ శాలరీస్ ఆక్టే ప్రాతిపదిక అని స్పష్టంగా ఉంది. ఆంగ్ల దిన పత్రికలో పీడీటీ ఆచారి రాసింది కూడా ఇదే. ఇక పుస్తకం 150వ పేజీలో కింద ఫుట్‌నోట్స్‌లో 'ఎ పార్టీ ఇన్ అపోజిషన్ టు ద గవర్నమెంట్ విత్ గ్రేటెస్ట్ నెంబర్' అని ఉంది. అంటే ప్రతిపక్షం స్థానంలో అధిక సంఖ్యాబలం ఉన్న పార్టీ అనే కదా దీనర్థం. 1977 పార్లమెంట్ చట్టంలోనూ ఇదే ఉంది. 'ఆంధ్రప్రదేశ్ పేమెంట్స్ ఆఫ్ శాలరీస్ అండ్ ప్రివెన్షన్ ఆఫ్ డిస్ క్వాలిఫికేషన్' చట్టం సెక్షన్ 12 (బీ) లోనూ ఇదే ఉంది. అంతే కాని 1/10 సభ్యులు ఉండాలని ఎక్కడా లేదు. ఇక రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లో కూడా ఒక్క సభ్యుడున్నా కూడా దాన్ని రాజకీయ పార్టీగానే గుర్తించాలని ఉంది. ఇక 10 శాతం ఉండాలన్న నిబంధన ఎక్కడిది? దీనిపై చర్చ ఎక్కడిది? అంటే జగన్ ప్రస్తావించిన అంశాలు వాస్తవమైనవేనని స్పష్టం అవుతోంది.



కేవలం జగన్ మోహన్ రెడ్డికి ప్రతిపక్ష హోదా రాకుండా అడ్డుకోవాలన్న దురుద్దేశంతోనే అధికార పక్షం కుట్రలకు తెరలేపినట్లు ఈ వ్యవహారం అంతా చూస్తే అర్థమవుతుంది.

వ్యాసకర్త వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు

ఖాళీ మనసుతో ఆరాధిస్తే!

రుక్మిణీ దేవి కృష్ణుని పత్ని. పరమ భక్తురాలు. నిరంతరం కృష్ణుణ్ణే మనసులో నిలుపుకుని సేవించే సాధ్వి. ఆమె ఒకసారి కృష్ణుని చూస్తూ 'ఈ హరి తన మురళిని వాయిస్తూ శ్రోతలను ఆహ్లాదపరుస్తాడు. తన మురళీ గానంతో లోకాలను సమ్మోహన పరుస్తాడు. ఒక్క క్షణం కూడా మురళిని వదలకుండా తన దగ్గరే ఉంచుకుంటాడు. ఈ మురళి ధన్యత ఎంత గొప్పది! ఎల్లప్పుడూ కృష్ణ సాన్నిధ్యం అనుభవించే అదృష్టం ఈ మురళికి కలగటానికి ఏ పుణ్యం చేసుకుందో! నేను కూడా కృష్ణునికి కొంత దూరంగానే ఉంటాను గాని ఈ మురళి అంత నిరంతర సన్నిహితత్వంలో లేను. దీనిని కృష్ణుడెపుడైనా దూరంగా ఉంచితే ఈ విషయం గురించి మాట్లాడాలి' అనుకుంది.

జ్యోతిర్మయం

అందరి మనసులను పసిగట్టగల హరి రుక్మిణి మనసు గుర్తించి, ఒకసారి మురళిని దూరంగా పెట్టి నిద్ర పోతున్నట్లు నటించాడు. రుక్మిణి గబ గబ మురళిని తీసుకుని ఏకాంత ప్రదేశానికి వెళ్లి, దానికి ఏకాగ్రతతో ప్రాణ ప్రతిష్ఠ చేసి అడిగింది.

'నువ్వు శ్రీకృష్ణుని నిరంతర సామీప్యాన్ని పొందటానికి పూర్వ జన్మలో ఏ పూజలు, వ్రతాలు చేశావు? ఏ దేవతలనారాధించావు? ఆ పుణ్య కార్యాలు నాకూ చెపితే నేనూ అదే విధంగా చేసి కృష్ణుని సామీప్యాన్ని పొందుతాను' అని ప్రార్థించింది.

మురళి, తనకే పాప పుణ్యాల గురించి తెలియదని చెప్పింది. తన ఆకారాన్ని పరిశీలించి, తన లోపల ఏమున్నదో చూసి చెప్పమంది. రుక్మిణి మురళిని పైకెత్తి లోపలికి చూసింది. 'ఏమీ లేదు. లోపల ఖాళీగా ఉంది' అని చెప్పింది. అప్పుడు మురళి, 'అదే విశేషం. నా లోపల ఏమీ లేదు. ఎవరైనా తమ మనస్సుల్లో ప్రాపంచిక విషయాల పట్ల ఆసక్తి వదిలి, మనసుని నిర్మలంగా ఉంచుకుంటే వారు నిరంతరం భగవంతుని సమీపంలో ఉండగలుగుతారు' అంది.

ఇది మురళి ద్వారా భగవానుడు జనులకిచ్చిన సందేశం.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు; జ్యేష్ఠ మాసం; **తిథి:** బ.అష్టమి ప.3.41 వరకు; తదుపరి నవమి; **నక్షత్రం:** ఉత్తరాభాద్ర ఉ.10.48 వరకు, తదుపరి రేవతి; **వర్జ్యం:** రా.10.00 నుండి 11.29 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.5.31 నుండి 7.15 వరకు; **అమృత ఘడియలు:** ఉ.6.22 నుండి 7.56 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు; **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు; **సూర్యోదయం:** 5.32; **సూర్యాస్తమయం:** 6.34

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

గ్లాస్ తయారీ పరిశ్రమలో ఘోర ప్రమాదం

ఐదుగురు కార్మికుల మృతి..

13 మందికి తీవ్రగాయాలు
- ఆటోక్లేవ్ యూనిట్ వద్ద పేలిన బాయిలర్
- చెల్లాచెదురుగా మృతదేహాలు.. షాద్‌నగర్ పరిధిలో ఘటన

షాద్‌నగర్: గ్లాస్ తయారీ పరిశ్రమలో ఘోర ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, 13 మందికి తీవ్రగాయాలు అయ్యాయి. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సమీపంలోని బూర్గుల గ్రామశివారులో వాహనాలకు సంబంధించిన గ్లాస్ అద్దాలను తయారు చేసే సౌత్ గ్లాస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ఉంది. ఈ పరిశ్రమలో వివిధ రాష్ట్రాలకు చెందిన 200 మంది కార్మికులు పని చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం పరిశ్రమలోని ఆటో క్లేవ్ యూనిట్‌లో అద్దాలను గ్యాస్, వేడితో అతికించి, బాయిలర్ నుంచి బయటకు తీసే క్రమంలో ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో ఆటో క్లేవ్ యూనిట్ వద్ద ఐదుగురు కార్మికులు పనిచేస్తున్నారు. యూనిట్‌లో తయారైన గ్లాస్‌ను బయటకు తీసే క్రమంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీంతో కార్మికులు తీవ్రంగా గాయపడి మృత్యువాత పడ్డారు. ఈ పేలుడుతో మృతుల శరీరభాగాలు చెల్లాచెదురుగా సుమారు వంద మీటర్ల దూరం వరకు ఎగిరి పడ్డాయి. ఓ కార్మికుడి మృతదేహం పరిశ్రమ షెడ్డు రేకులను చీల్చుకొని బయటకు ఎగిరిపడింది. మరో కార్మికుడి మృతదేహం పూర్తిగా యంత్రంలో ఇరుక్కుపోయింది. ముగ్గురి మృతదేహాలు ఏమాత్రం గుర్తుపట్టలేని విధంగా సుమారు వంద మీటర్ల దూరంలో ఎగిరిపడ్డాయి. శరీరాల నుంచి కాళ్లు, చేతులు, తల, తదితర భాగాలు చెల్లాచెదురుగా ఎగిరిపడ్డాయి. మృతి చెందినవారిలో బిహార్ రాష్ట్రానికి చెందిన చిత్తరంజన్ (25), రాంఆశిష్ (18), రవుకాంత్ (25), రోషన్ (36), రతన్ దేవరియా (30) ఉన్నారు. వీరితోపాటు బిహార్‌కు చెందిన గోవింద్, మంటు, సమీద్‌కుమార్, రోషన్‌కుమార్, సురేంద్ర పాశ్వాన్, జార్ఖండ్‌కు చెందిన మైకేల్ ఎంబ్రామ్, కార్తీక్, సుభోద్, బూర్గుల గ్రామానికి చెందిన పుల్లని సుజాత, కాశిరెడ్డిగూడకు చెందిన నీలమ్మ, మమత, ఒడిశాకు చెందిన రేతికాంత్, రాజేశ్‌లు తీవ్రంగా గాయపడినట్టు అధికారులు తెలిపారు.



పరిశ్రమలో ఎగిరి పడిన కార్మికుడి మృతదేహం



గాయపడిన కార్మికులను పరామర్శిస్తున్న జిల్లా కలెక్టర్ శశాంక

కేటీఆర్ దిగ్భ్రాంతి

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని అన్ని కర్మాగారాల్లో భద్రత తీరుపై పరిశీలన చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రమాద ఘటనపై సీఎం ఆరా

ప్రమాద ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. ఢిల్లీలో ఉన్న ఆయన వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి తగిన వైద్య చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, కార్మిక, పరిశ్రమల శాఖ అధికారులు, వైద్య బృందాలు ఘటనాస్థలిలోనే ఉండి సమన్వయంతో సహాయక చర్యలు ముమ్మరం చేయాలన్నారు. దీంతో కలెక్టర్ శశాంక, శంషాబాద్ డీసీపీ రాజేష్, అడిషనల్ డీసీపీ రాంకుమార్, ఆర్డీఓ వెంకట మాధవరావులు ఘటనా స్థలాన్ని సందర్శించి సహాయక చర్యలు చేపట్టారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు: హరీశ్‌రావు

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పలు పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని పరిశ్రమల్లో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నా, భద్రతా చర్యలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందన్నారు.

కుక్కలదాడిలో బాలుడి మృతి

సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌లో ఘటన

పటాన్‌చెరు టౌన్: బహిర్భూమికి వెళ్లిన ఆరేళ్ల బాలుడిపై కుక్కలు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన బాల్కన్, ప్రమీల దంపతులు బతుకుదెరువు కోసం నెల రోజుల క్రితం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు వలస వచ్చారు. వీరికి ముగ్గురు సంతానం. ఇద్దరిని స్వగ్రామంలో ఉంచి చిన్న కుమారుడు బిశాల్ (6)ను తమ వెంట తీసుకొచ్చారు. ఓ వెంచర్ వద్ద మేస్త్రీ కింద భార్యాభర్తలు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం బిశాల్ బహిర్భూమికి వెళ్లాడు. అదే సమయంలో నాలుగు కుక్కలు ఒక్కసారిగా బాలుడిపై దాడి చేశాయి. మెడపై శరీర భాగాలపై తీవ్రంగా గాయాలు కావడంతో బాలుడు మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ముత్తంగిలో 8 నెలల పాపపై..

పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముత్తంగిలో ఎనిమిది నెలల పాపపై కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గోకిరం, రోట్న దంపతులు బతుకుదెరువు కోసం ముత్తంగి నాగార్జున కాలనీకి వచ్చి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం భార్యాభర్తలిద్దరూ స్వాతి (8 నెలలు)ని పడుకోబెట్టి పక్కనే పని చేసుకుంటున్నారు. అటుగా వచ్చిన కుక్క పాపను కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం చిన్నారిని నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు.

మేడిగడ్డలో 20వ గేటు తొలగింపు

- మరమ్మతు పనులకు వరద తాకిడి
- ప్రాణహిత నుంచి బరాజ్‌కు 8,790 క్యూసెక్కుల వరద రాక



మేడిగడ్డ బరాజ్ వద్దకు చేరిన వరదనీరు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌లోని 7వ బ్లాక్‌లోని 20వ గేటును శుక్రవారం ఇంజనీరింగ్ అధికారులు పూర్తిగా తొలగించారు. దీంతో గతేడాది అక్టోబర్‌లో ఏర్పడ్డ బొరియల్లో మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. షీట్ ఫైల్స్ పూర్తి చేయగా, సీసీ బ్లాక్‌ల్లో పనులు జరుగుతున్నాయి. తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డుకు వరద తాకిడి పెరుగుతుండటంతో తొలగించడానికి సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఎగువ ప్రాణహిత ద్వారా 8,790 క్యూసెక్కుల వరద బరాజ్ వద్దకు చేరుకుంది. మొత్తం 85 గేట్లు ఎత్తివేయడంతో 8,790 క్యూసెక్కుల వరదనీరు దిగువకు తరలిపోతోంది. దీంతో బరాజ్‌లో మరమ్మతు పనులకు తాత్కాలిక అంతరాయం ఏర్పడినట్లు తెలిసింది.

లక్ష్మీ పంపుహౌస్‌లో ఐదో మోటారు టెస్టింగ్ రన్

మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి లక్ష్మీ పంపుహౌస్‌లో వర్షాకాలంలో నీటిని ఎత్తిపోయడానికి ఇంజనీరింగ్ అధికారులు సన్నద్ధం అవుతున్నారు. పంపుహౌస్‌లో మొత్తం 17 మోటార్లకు 11 మోటార్లు మాత్రమే ఎత్తిపోయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. 2022 జూలైలో వచ్చిన వరదల్లో మునిగి ఆరు మోటార్లు ధ్వంసం అయ్యాయి. అప్పటి నుంచి మరమ్మతులు జరుగుతున్నాయి. కాగా, ఖరీఫ్ సీజన్‌లో వరద నీటిని ఒడిసి పట్టి నీటిని అన్నారం (సరస్వతీ) బ్యారేజీకి తరలించడానికి శుక్రవారం సాయంత్రం పంపుహౌస్‌లోని ఐదో నంబర్ మోటారును అరగంటపాటు ఇంజనీరింగ్ అధికారులు టెస్ట్ రన్ చేసినట్లు తెలిసింది. దీంతో గ్రావిటీ కాల్వ వెంట వరద నీరు తరలిపోతోంది. 1 నుంచి 11 మోటార్ల వరకు ప్రతిరోజూ టెస్టింగ్ రన్‌లు నిర్వహించి ఎత్తిపోయడానికి ఇంజనీర్లు సిద్ధం అవుతున్నట్లు తెలిసింది.

మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన సీడబ్ల్యూసీ బృందం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీని శుక్రవారం సీడబ్ల్యూసీ సభ్యుడు దేవేందర్ ఆధ్వర్యంలో నలుగురి బృందం పరిశీలించింది. ముఖ్యంగా నదుల అనుసంధానంపై సర్వే చేసినట్లు ఇంజనీరింగ్ వర్గాల ద్వారా తెలిసింది.

పీసీసీ అధ్యక్షునిగా బీసీని నియమించండి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో సామాజిక న్యాయం జరగాలంటే పీసీసీ అధ్యక్షునిగా బీసీకే అవకాశమివ్వాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి లేఖ రాశారు. 30 ఏళ్లుగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలకు నిబద్ధతతో పనిచేస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ అభ్యర్థిత్వాన్ని పరిగణనలోకి తీసుకోవాలని లేఖలో కోరారు.

బీసీనే పీసీసీ అధ్యక్షుడిని చేయండి



పంజగుట్ట (హైదరాబాద్): టీపీసీసీ పదవిని బీసీలకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షునిగా ఉన్న నేపథ్యంలో.. ఈసారి బీసీలకు ఇవ్వడమే న్యాయమని అభిప్రాయపడ్డారు. ఆయన శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను బతికించింది, జెండాలు మోసింది బీసీలేనని గ్రహించాలని స్పష్టం చేశారు. త్వరలోనే మంత్రివర్గ విస్తరణ చేస్తానని సీఎం చెబుతున్న నేపథ్యంలో.. 50 శాతం మంత్రి పదవులు బీసీలకు ఇవ్వాలన్నారు.

ప్రాణం తీసిన అతివేగం..

రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న మేకల లోడ్ లారీ
- ఐదుగురు అక్కడికక్కడే మృతి.. మరో ఐదుగురికి తీవ్రగాయాలు
- మృతులంతా మధ్యప్రదేశ్ వాసులే..
- అతివేగం, నిద్రమత్తే ప్రమాదానికి కారణం కావొచ్చన్న పోలీసులు



ముందు వెళుతున్న లారీని ఢీకొన్న మేకల లారీ

చేగుంట (తూప్రాన్)/సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: నాగ్‌పూర్ జాతీయ రహదారి రక్తసిక్తమైంది. నాగ్‌పూర్ వైపు నుంచి మేకల లోడుతో హైదరాబాద్‌కు వస్తున్న లారీ.. రోడ్డుపై ఆగి ఉన్న దాణా లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. శుక్రవారం తెల్లవారుజామున మెదక్ జిల్లా చేగుంట శివార్లలో జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతిచెందారు. మరో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మృతులంతా మధ్యప్రదేశ్ వాసులేనని గుర్తించారు. గాయపడ్డవారికి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

హైదరాబాద్‌కు మేకలు తీసుకొస్తూ..

44వ నంబర్ జాతీయ రహదారిపై హైదరాబాద్ వైపు వెళుతున్న ఓ దాణా లారీ శుక్రవారం తెల్లవారుజామున టైర్ పంక్చరై, రోడ్డుపై ఆగిపోయింది. అదే దారిలో నాగ్‌పూర్ వైపు నుంచి మేకల లోడ్ లారీ వస్తోంది. హైదరాబాద్‌లోని చర్లపల్లిలో ఉన్న మేకల మండీకి ఉదయమే మేకలను డెలివరీ చేయాల్సి ఉంటుంది. ఆ ఆత్రుతతోనే డ్రైవర్ వేగంగా లారీని నడిపినట్టు తెలిసింది. ఈ క్రమంలో రోడ్డుపై ఆగి ఉన్న దాణా లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ధాటికి మేకల లోడ్ లారీ క్యాబిన్ పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. అందులో కూర్చుని ఉన్న ఇద్దరు, వెనుకాల ట్రాలీలో మేకలతోపాటు ఉన్న మరో ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. ప్రమాదం విషయం తెలిసిన పోలీసులు.. వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను వెలికితీశారు. తీవ్రంగా గాయపడ్డవారిని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అతివేగం.. నిద్రమత్తుతో!

ప్రమాదం జరిగినప్పుడు మేకల లారీ గంటకు వంద కిలోమీటర్లకుపైగా వేగంతో ప్రయాణిస్తున్నట్టు పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో మూల మలుపు ఉంది. దానికితోడు తెల్లవారుజామున నిద్రమత్తులో ఉన్న డ్రైవర్.. రోడ్డుపై ఆగిఉన్న దాణా లారీని సరిగా గమనించకపోవడం వల్లే ప్రమాదానికి దారితీసి ఉంటుందని చెప్తున్నారు. ప్రమాదంలో లారీలోని 80 వరకు మేకలు కూడా మృతి చెందాయి.

మృతులంతా మధ్యప్రదేశ్ వాసులు

ఈ ప్రమాదంలో మృత్యువాత పడిన వారంతా మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారని గుర్తించారు. క్యాబిన్‌లో ప్రయాణిస్తున్న మేకల వ్యాపారులు చిక్వారాజు(57), చిక్వా మనీశ్‌కుమార్ (30), వెనకాల ట్రాలీలో మేకలతోపాటు కూర్చున్న కార్మికులు ఎండీ ఇబ్రహీం (21), ఎండీ షబ్బీర్ (48), ఎండీ జిసాన్ (21) అక్కడికక్కడే చనిపోయారు. డ్రైవర్ బుట్టాసింగ్, మేకల వ్యాపారి లాల్‌మణి, రమేశ్‌లాల్, మహేశ్‌లాల్, శుక్లాల్ తీవ్రంగా గాయపడ్డారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు.

సెప్టెంబర్ వరకు ప్రత్యేక రైళ్లు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు మార్గాల్లో నడుపుతున్న 36ప్రత్యేక రైళ్లను సెప్టెంబర్ వరకు పొడిగించినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై నెలాఖరుతో ఈ స్పెషల్ ట్రైన్స్ గడువు ముగియనుండగా, మరికొంతకాలం పొడిగించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఇప్పటికే పలు మార్గా ల్లో నడుస్తున్న ప్రత్యేక రైళ్ల సెప్టెంబర్ నెలాఖరు వరకు ప్రయాణికులకు అందుబాటులో ఉండనున్నాయి.

भारत सरकार
భారత ప్రభుత్వం
चिकित्सा अधीक्षक का कार्यालय
మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయం
सफदरजंग अस्पताल एवं वी.एम.एम. कॉलेज
VMMC & సఫ్దర్‌జంగ్ హాస్పిటల్
नई दिल्ली - ११००२९ న్యూఢిల్లీ - 110029

File No.: RECTT-1/2/2023-RECRUITMENT CELL తేది: 22.02.2024

వెకెన్సీ సర్క్యులర్

విషయం:– సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌లో డిప్యూటేషన్ ప్రాతిపదికన ఉద్యోగాలు భర్తీచేయుటకు – సంబంధించి

VMMC & సఫ్దర్‌జంగ్ హాస్పిటల్, న్యూఢిల్లీలో డిప్యూటేషన్ ప్రాతిపదికన దిగువ తెలిపిన ఉద్యోగాలు భర్తీ చేయడానికి అర్హతగల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.

2. ఖాళీల వివరాలు/ పేబ్యాండ్ దిగువ విధంగా ఉన్నాయి:

క్ర.సం.	ఉద్యోగం పేరు	పేమ్యాట్రిక్స్ ప్రకారం లెవెల్	మొత్తం ఖాళీలు
1	ఆఫీసర్ ఇంచార్జ్ (అంబులెన్స్)	లెవల్–7 (రూ.44900–142400)	01
2	సీనియర్ ప్లాస్టర్ టెక్నీషియన్	లెవల్–4 (రూ.25500–1100)	01
3	అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్	లెవల్–8 (రూ.47600 –151100)	04

గమనిక: పైన తెలిపిన అన్ని ఉద్యోగాలలో ఎలాంటి అబ్జార్షన్ పాసిబిలిటీ లేదు.

3. సవివరమైన ప్రకటన, సూచనలు, అర్హత యోగ్యతలు, వయస్సు పరిమితి, దరఖాస్తు ఫారాలు, అనుబంధాలు మొదలైనవాటి కోసం సఫ్దర్‌జంగ్ హాస్పిటల్ వెబ్‌సైట్ (www.vmmc-sjh.nic.in) దర్శించండి.

4. సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌లో లభించే ప్రకటనలోని నోటీసులో వివవరించబడిన విధంగా అన్ని ఆవశ్యకమైన డాక్యుమెంట్లతో పాటు దరఖాస్తులను నిర్దేశిత నమూనాలో దాఖలు చేయవలెను. దరఖాస్తులు డెయిరీ సెక్షన్, గేట్ నం.2 దగ్గర, VMMC & సఫ్దర్‌జంగ్ హాస్పిటల్, న్యూఢిల్లీలో ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో ఈ ప్రకటన జారీ తేదీ నుండి 30 రోజులలోగా అన్ని పనిరోజులలో అంటే సోమవారం నుండి శుక్రవారం ఉ. 9.00 గం. నుండి సా.4.00 గం. వరకు మరియు శనివారం ఉ.9.00 గం. నుండి మ.1.00 గం. వరకు స్వీకరించబడును (అయితే, దరఖాస్తుల దాఖలు చివరి తేది జాతీయ సెలవుదినం, ఆదివారం లేదా ఏదేని ఇతర సెలవుదినముగా భారత ప్రభుత్వంచే ప్రకటించబడితే, తదుపరి పనిరోజు ముగింపు తేదీగా భావించవలెను)

సం/– (అశోక్‌కుమార్ పాల్), డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్)
CBC 17145/11/0002/2425 తేది: 26-02-2024

నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా
విద్యా మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం
www.nbtindia.gov.in, ఫోన్: 011-26707873
nbt.india
Rashtriya e-Pustakalaya

ఆసక్తి వ్యక్తీకరణ (EOI) కోరుతూ ప్రకటన

నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా (NBT-India) అనేది భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ యొక్క నోడల్ సంస్థ, భారతదేశంలో పుస్తకాలు మరియు పఠనాన్ని ప్రోత్సహించడానికి బాధ్యత వహిస్తుంది. చిన్నారులు మరియు కౌమారుల కోసం ఒక డిజిటల్ లైబ్రరీ అయిన రాష్ట్రీయ ఇ-పుస్తకాలయను కూడా NBT నిర్వహిస్తోంది.

పుస్తకాలు, పఠనం మరియు డిజిటల్ పఠనాన్ని ప్రోత్సహించే వివిధ ప్రోగ్రామ్‌లు మరియు ఈవెంట్లకు సంబంధించిన ప్రమోషనల్ మెటీరియల్ ప్రదర్శించడానికి DAVP ఎంప్యానెల్డ్ అవుట్‌డోర్ మీడియా ఏజెన్సీల నుండి NBT-ఇండియా మరియు రాష్ట్రీయ ఇ-పుస్తకాలయ సెక్రటేరియట్ సంయుక్తంగా ఆసక్తి వ్యక్తీకరణ (EOI) కోరుచున్నాయి. ఇందులో న్యూఢిల్లీ వరల్డ్ బుక్ ఫేర్ 2025 మరియు ఏడాది పొడవునా జరిగే నేషనల్ బుక్ ఫెయిర్స్ ఉంటాయి.

ఢిల్లీ/NCR, బెంగళూరు, పాట్నా, ముంబై, కోల్‌కతా, డెహ్రాడూన్, గువాహటి, శ్రీనగర్, షిల్లాంగ్, నాగ్‌పూర్, లక్నో, పుణె, అహ్మదాబాద్, ప్రయాగ్‌రాజ్, సంబల్‌పూర్, భువనేశ్వర్, హైదరాబాద్ మరియు జమ్ము వంటి నగరాలలో సంస్థల ఆవశ్యకతల ప్రకారం **ఆగస్టు 2024 నుండి మార్చి 2025** మధ్య **2 వారాల నుండి 9 నెలల** కొరకు కాలవ్యవధి కోసం ఈ ప్రచారాలు నిర్వహించబడునని ఆశాభావం వ్యక్తం చేయడమైనది.

దరఖాస్తు ఫారం మరియు సవివరమైన నియమ నిబంధనల కోసం మా వెబ్‌సైట్ **www.nbtindia.gov.in** దర్శించండి. కోరబడిన EOI ని ఆసక్తి గల బిడ్డర్లు దిగువ తెలిపిన చిరునామా వద్ద 15 జూలై 2024 లేదా ఆలోగా 17:00:00 గం. వరకు దాఖలు చేయవలెను. భవిష్యత్తులో, EOI దాఖలుకు ఏవేని సవరణలు/ ఎక్స్‌టెన్షన్స్ ఉంటే పైన తెలిపిన వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేయబడును.

ఏజెన్సీల ఎంప్యానెల్‌మెంట్ మరియు పనుల కేటాయింపుపై డైరెక్టర్, NBT- ఇండియా వారి నిర్ణయమే తుదిగా ఉంటుంది మరియు దానికి కట్టుబడి ఉండాలి.

EOI దాఖలుకు చిరునామా:
Public Relations Department,
Rashtriya E-Pustakalaya and National Book Trust, India
5, Institutional Area, Vasant Kunj, New Delhi - 110070
Email: **public-relations@nbtindia.gov.in, prnbtindia@gmail.com** CBC 21103/12/0002/2425

ఏబీవీపీ నేతలపై లాఠీచార్జీకి ప్రభుత్వానిదే బాధ్యత

తీవ్రంగా ఖండించిన బీజేపీ

సాక్షి, హైదరాబాద్: పాఠశాల విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులపై పోలీసులు లాఠీచార్జీ చేయడాన్ని రాష్ట్ర బీజేపీ తీవ్రంగా ఖండించింది. పోలీసులు విచక్షణారహితంగా బూట్ కాళ్లతో తన్నడం, విద్యార్థులను కొట్టడం వంటి చర్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేసింది. నిరసన ప్రదర్శనలపై ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి నియంతృత్వ ధోరణి విడనాడాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.ఎస్ ప్రకాశ్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని అన్ని వర్గాల ప్రజలు కోరుతున్నా అసలు పట్టింపు లేకుండా వ్యవహరించడం సరికాదన్నారు.

గౌరవ వేతనాలివ్వండి

సాక్షి, హైదరాబాద్: జూలై 4న జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం ముగిసేలోగా ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వారి గౌరవ వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్ డిమాండ్ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు సకాలంలో జీతాలతో పాటు పదవీ కాలం ముగియడానికి ముందే పదవీ విరమణ ప్రయోజనాలు అందించి గౌరవిస్తున్నట్టే.. వీరిని కూడా గౌరవించాల ని చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. గ్రామాల పటిష్టానికి కృషి చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు గౌరవ వేతనం ఇవ్వకపోవడం అవమానకరమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మాదిగలకు టీపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వండి

రాహుల్‌గాంధీకి మాదిగ రాజకీయ పోరాట వేదిక లేఖ

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్ష పదవి మాదిగ సామాజిక వర్గానికి ఇవ్వాలని తెలంగాణ మాదిగ రాజకీయ పోరాట వేదిక కోరింది. ఈ మేరకు వేదిక చైర్మన్ వి.సోమచంద్రశేఖర్ శుక్రవారం లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీకి లేఖ రాశారు. జనాభాలో 12 శాతంగా, దళితుల్లో 75 శాతంగా ఉన్న మాదిగ సామాజిక వర్గానికి టీపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని, రాష్ట్ర మంత్రివర్గంలో రెండు బెర్తులు మాదిగలకు కేటాయించాలని ఆ లేఖలో కోరారు.



పార్లమెంట్‌లో నీట్ రగడ

పరీక్షలో అక్రమాలపై వెంటనే చర్చించాలని విపక్షాల డిమాండ్

అంగీకరించని స్పీకర్, చైర్మన్ • ఉభయ సభలు పలుమార్లు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష–అండర్ గ్రాడ్యుయేట్(నీట్–యూజీ) వ్యవహారం పార్లమెంట్ ఉభయ సభలను కుదిపేసింది. నీట్ పరీక్షలో అవినీతి అక్రమాలపై, పేపర్ లీకేజీపై వెంటనే చర్చ చేపట్టాలని శుక్రవారం ప్రతిపక్షాలు గట్టిగా పట్టుబట్టాయి. నినాదాలతో హోరెత్తించాయి. ఇతర వ్యవహారాలు పక్కనపెట్టి నీట్ అభ్యర్థుల భవితవ్యాన్ని కాపాడడంపై చర్చ ప్రారంభించాలని డిమాండ్ చేశాయి. తర్వాత చర్చిద్దామని సభాపతులు కోరినప్పటికీ ప్రతిపక్ష నేతలు శాంతించలేదు. దీంతో సభలను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది.



లోక్‌సభలో మాట్లాడుతున్న స్పీకర్ బిర్లా

దిగువ సభలో విపక్షాల ఆందోళన


లోక్‌సభ శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగానే సుశీల్‌కుమార్ మోదీ సహా పలువురు మాజీ సభ్యుల మృతి పట్ల స్పీకర్ ఓం బిర్లా సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం విపక్ష సభ్యులు నీట్ అంశాన్ని లేవనెత్తారు. తక్షణమే చర్చ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. స్పీకర్ స్పందిస్తూ... రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తెలిపే తీర్మానంపై చర్చ వాయిదా వేయడం కుదరని, ఈ నేపథ్యంలో జీరో అవర్ చేపట్టలేమని అన్నారు. కాంగ్రెస్ పక్షనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ... అభ్యర్థుల ఆందోళనను దృష్టిలో పెట్టుకొని నీట్–యూజీపై చర్చించాలని అన్నారు. డీఎంకే, టీఎంసీ, కాంగ్రెస్ ఎంపీలు వారి సీట్ల వద్దే నిల్చొని నినాదాలు ప్రారంభించారు. రాహుల్ గాంధీ విజ్ఞప్తిని స్పీకర్ తిరస్కరించారు. ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలు ప్రారంభించారు. కేంద్ర న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ మాట్లాడుతుండగా విపక్ష సభ్యులు నినాదాలు ప్రారంభించారు. సభాపతి ఎంతగా వారించినా వినకుండా నినాదాలు కొనసాగించారు. తొలుత రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చిద్దామని, ఆ తర్వాత నీట్‌పై చర్చకు సమయం కేటాయిస్తానని సభాపతి పేర్కొన్నప్పటికీ విపక్షాలు పట్టువీడలేదు. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేస్తున్నట్లు ఓం బిర్లా ప్రకటించారు. సభ పునఃప్రారంభమైన తర్వాత పశ్చిమ బెంగాల్‌కు చెందిన నురుల్ హసన్‌తో ఎంపీగా స్పీకర్ ప్రమాణం స్వీకారం చేయించారు. అనంతరం లోక్‌సభలో కమిటీల ఏర్పాటుకు సంబంధించి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటన చేశారు. మరోవైపు నీట్–యూజీపై విపక్షాలు తమ ఆందోళన కొనసాగించాయి. అభ్యర్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని కాంగ్రెస్ సభ్యుడు గౌరవ్ గొగోయ్ డిమాండ్ చేశారు. సభ సజావుగా సాగేందుకు విపక్ష సభ్యులు సహకరించాలని స్పీకర్ కోరారు. అయినప్పటికీ విపక్ష సభ్యులు శాంతించకపోవడంతో లోక్‌సభను స్పీకర్ సోమవారానికి వాయిదా వేశారు.




లోక్‌సభలో నీట్‌పై చర్చకు డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తదితరులు

రాజ్యసభలో వెల్‌లోకి దూసుకొచ్చిన ఖర్గే

నీట్ అంశంపై చర్చ చేపట్టకుండా ప్రభుత్వం ఎందుకు వెనుకంజ వేస్తోందని రాజ్యసభలో ప్రతిపక్షాలు నిలదీశాయి. విపక్షాల నిరసనలు, నినాదాల వల్ల శుక్రవారం ఎగువ సభను చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ మూడుసార్లు వాయిదా వేశా రు. రాష్ట్రప తి ప్ర సంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానంపై చర్చను చేపట్టగా విపక్షాలు అడ్డుకున్నాయి. నీట్‌పై చర్చించాలని పట్టుబట్టాయి. నీట్‌లో అక్రమాలపై దర్యాప్తు జరుగుతోందని జేడీ(ఎస్) సభ్యుడు హెచ్.డి.దేవెగౌడ గుర్తుచేశారు. సభ సక్రమంగా జరిగేలా విపక్ష సభ్యులంతా సహకరించాలని కోరారు. నీట్‌పై ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుంటుందని, అప్పటిదాకా అందరూ ఓపిక పట్టాలని చెప్పారు. నీట్‌పై చర్చించాలని కోరుతూ ప్రతిపక్షాల నుంచి 22 నోటీసులు వచ్చాయని, వాటిని తిరస్కరిస్తున్నానని ధన్‌ఖడ్ చెప్పారు. దీనిపై విపక్ష ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెల్‌లోకి దూసుకొచ్చి బిగ్గరగా నినాదాలు చేశారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే సైతం వెల్‌లోకి దూసుకురావడంపై రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతిపక్ష నాయకుడు వెల్‌లోకి రావడం రాజ్యసభ చరిత్రలో ఇదే మొదటిసారి అని, పార్లమెంట్‌కు ఇదొక మచ్చ అని ఆక్షేపించారు. పార్లమెంటరీ సంప్రదాయం ఈ స్థాయికి దిగజారిపోవడం తనను ఆవేదనకు గురిచేస్తోందన్నారు. ఈ ఘటన దేశంలో ప్రతి ఒక్కరినీ మానసికంగా గాయపర్చిందని చెప్పారు. నీట్‌పై చర్చకు సభాపతి అనుమతి ఇవ్వకపోవడంతో ప్రతిపక్ష ఎంపీలు వాకౌట్ చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగింది. ఇదిలా ఉండగా, సభలో మాట్లాడేందుకు చైర్మన్ ధనఖడ్ అవకాశం ఇవ్వకపోవడం వల్లే తాను వెల్‌లోకి వెళ్లాల్సి వచ్చిందని కాంగ్రెస్ ఎంపీ మల్లికార్జున ఖర్గే వివరణ ఇచ్చారు. అయితే, ధన్‌ఖడ్ చెబుతున్నట్లుగా రాజ్యసభలో ప్రతిపక్ష నేత వెల్‌లోకి వెళ్లడం ఇదే మొదటిసారి కాదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ వెల్లడించారు. 2019 ఆగస్టు 5న రాజ్యసభలో అప్పటి విపక్ష నేత గులాం నబీ ఆజాద్ వెల్‌లోకి వెళ్లారని గుర్తుచేశారు.





స్పృహతప్పి పడిపోయిన కాంగ్రెస్ ఎంపీ

రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ ఫూలోదేవి నేతమ్ శుక్రవారం స్పృహ తప్పి పడిపోయారు. అధిక రక్తపోటు కారణంగా ఆమె అనారోగ్యానికి గురయ్యారు. పార్లమెంట్ సిబ్బంది ఆమెను ఆసుపత్రిలో చేర్చారు. నేతమ్ ఆరోగ్య పరిస్థితి మెరుగైందని, కోలుకుంటున్నారని, ఈ మేరకు ఆసుపత్రి నుంచి తనకు సమాచారం అందిందని చైర్మన్ ధన్‌ఖడ్ సభలో ప్రకటించారు.

హేమంత్ సోరెన్‌కు బెయిల్

- భూకుంభకోణం కేసులో జార్ఖండ్ హైకోర్టు ఉత్తర్వులు
- జైలు నుంచి విడుదలైన హేమంత్ సోరెన్

రాంచీ: భూకుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, జార్ఖండ్ ముక్తిమోర్చా(జేఎంఎం) కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్(48)కు భారీ ఊరట లభించింది. ఈ కేసులో జార్ఖండ్ హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ హేమంత్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ రంగోన్ ముఖోపాధ్యాయ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. హేమంత్ సోరెన్‌కు బెయిల్ ఇస్తే మళ్లీ ఇదే తరహా అవినీతికి పాల్పడే అవకాశం ఉందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తరఫు న్యాయవాది ఎస్.వి.రాజు పేర్కొన్నారు. ఆయనకు బెయిల్ ఇవ్వొద్దని కోరారు. ఈడీ వాదనను ధర్మాసనం తిరస్కరించింది. ప్రాథమిక ఆధారాలను బట్టి చూస్తే హేమంత్ ఏ నేరమూ చేయలేదని, బెయిల్‌పై బయట ఉన్నప్పుడు ఆయన నేరం చేసే అవకాశం లేదని, అందుకే బెయిల్ ఇస్తున్నామని స్పష్టంచేసింది. హేమంత్ రూ.50 వేల పూచీకత్తు సమర్పించాలని, ఆయనకు ష్యూరిటీ ఇస్తూ మరో ఇద్దరు రూ.50 వేల చొప్పున పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తాము సుప్రీంకోర్టుకు వెళ్తామని, ఈ బెయిల్ తీర్పుపై 48 గంటలపాటు స్టే విధించాలని ఈడీ తరఫున మరో న్యాయవాది జోహబ్ హుస్సేన్ విజ్ఞప్తి చేయగా ధర్మాసనం తిరస్కరించింది. జార్ఖండ్ రాజధాని రాంచీలో 8.86 ఎకరాల భూకుంభకోణం కేసులో హేమంత్ సోరెన్‌ను ఈ ఏడాది జనవరి 31న ఈడీ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

తప్పుడు కేసులో ఇరికించారు: హేమంత్

తనను తప్పుడు కేసులో ఇరికించి, ఐదు నెలలపాటు జైల్లో పెట్టారని హేమంత్ సోరెన్ ఆరోపించారు. జైలు నుంచి విడుదలైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రంలోని అధికార బీజేపీపై నిప్పులు చెరిగారు. ప్రతిపక్ష నేతలు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టుల గొంతులను ప్రభుత్వం అణచివేస్తోందని మండిపడ్డారు.



జైలు నుంచి విడుదలై వచ్చిన సోరెన్‌కు ఇంటి వద్ద హారతిస్తున్న భార్య కల్పనా సోరెన్

విదేశాంగ కార్యదర్శిగా విక్రం మిశ్రీ నియామకం

న్యూఢిల్లీ: జాతీయ భద్రతా డిప్యూటీ సలహాదారు విక్రమ్ మిశ్రి (59) విదేశాంగ శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. వినయ్ క్వాత్రా స్థానంలో ఆయన బాధ్యతలు చేపడతారు. క్వాత్రాను అమెరికాలో భారత రాయబారిగా నియమించొచ్చని సమాచారం. 1989 బ్యాచ్ ఇండియన్ ఫారిన్ సర్వీస్‌కు చెందిన మిశ్రి నియామకం జులై 15 నుంచి అమల్లోకి వస్తుందని ప్రభుత్వం పేర్కొంది. ఐకే గుజ్రాల్, మన్మోహన్ సింగ్, నరేంద్ర మోదీ రూపంలో ఏకంగా ముగ్గురు ప్రధానులకు వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసిన అరుదైన రికార్డు మిశ్రి సొంతం. చైనాతో సంబంధాలు దిగజారిన వేళ ఆ దేశ వ్యవహారాల నిపుణుడిగా పేరున్న మిశ్రి నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది. 2019–21 మధ్య ఆయన చైనాలో భారత రాయబారిగా పని చేశారు.



శుక్రవారం ఢిల్లీ విమానాశ్రయం టెర్మినల్ 1లో కూలిన పై కప్పు



కుప్పకూలిన సపోర్ట్ బీమ్‌ల కింద నలిగిపోయిన కార్లు

ఢిల్లీ విమానాశ్రయంలో కూలిన పైకప్పు

- ఒకరి మృతి, ఆరుగురికి గాయాలు
- విమాన సర్వీసులకు అంతరాయం

న్యూఢిల్లీ: భారీ వర్షాలకు దేశ రాజధానిలోని ఇందిరాగాంధీ జాతీయ విమానాశ్రయంలో టెర్మినల్ 1 (పాతది) పై కప్పు పాక్షికంగా కుప్పకూలింది. కొంత భాగం కూలి నేరుగా కింద ఉన్న కార్లపై పడింది. దాంతో రమేశ్ కుమార్ (43) అనే ట్యాక్సీ డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. ఆరుగురు గాయపడ్డారు. శుక్రవారం ఉదయం 5:30 గంటల సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. అగ్నిమాపక యంత్రాలు హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టాయి. కూలిన బీమ్‌ల కింద ఉన్న కారులోంచి ఒకరిని కాపాడారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. ''శుక్రవారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న భారీ వర్షంతో రూఫ్ షీట్, సపోర్ట్ బీమ్‌లు కూలాయి. పార్క్ చేసిన 4 కార్లు దెబ్బతిన్నాయి'' అని అధికారులు తెలిపారు. ఈ ఘటనతో టెర్మినల్ 1 నుంచి అన్ని విమాన సేవలనూ నిలిపివేశారు. చెకిన్ కౌంటర్లను కూడా మూసేశారు. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ విమానాల్లో వసతి కల్పించారు. కొందరికి టికెట్ డబ్బులు తిరిగిచ్చారు. ఈ టెర్మినల్‌లో ఇండిగో, స్పైస్‌జెట్ దేశీయ విమాన కార్యకలాపాలు సాగిస్తాయి. అవి కార్యకలాపాలను తాత్కాలికంగా టెర్మినల్ 2, 3కి మార్చాయి. విస్తరించిన టెర్మినల్ 1ను ప్రధాని మోదీ మార్చిలో ప్రారంభించారు.

పూర్తిస్థాయి విచారణ: కింజరాపు

పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు టెర్మినల్ 1ను సందర్శించారు. అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణకు ఆదేశించినట్టు చెప్పారు. మృతుని కుటుంబానికి రూ.20 లక్షలు, క్షతగాత్రులకు రూ.3 లక్షల పరిహారం ప్రకటించారు.

ప్రచార యావ వల్లే: ప్రతిపక్షాలు

మోదీ సర్కారు ప్రచార యావ వల్లే టెర్మినల్ పై కప్పు కూలిందని విపక్షాలు ఆరోపించాయి. నిర్మాణం పూర్తవకుండానే లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం మోదీ దాన్ని హడావుడిగా ప్రారంభించారంటూ ఆప్ దుయ్యబట్టింది. ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యమే దీనికి కారణమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు.

నీట మునిగిన ఢిల్లీ

- భారీ వానలతో అతలాకుతలం
- 88 ఏళ్ల తర్వాత రికార్డు వర్షం
- ఎంపీల నివాసాల్లోకీ వరద నీరు
- నరకం చూపిన ట్రాఫిక్ జామ్‌లు

న్యూఢిల్లీ: దేశ రాజధాని నీట మునిగింది. రికార్డు స్థాయి భారీ వర్షాలకు అతలాకుతలమైంది. ఢిల్లీతో పాటు జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్సీఆర్)లో వరుసగా శుక్రవారం రెండో రోజూ భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి ఉరుములు, మెరుపులతో ఎడతెగని వర్షం పడింది. దాంతో భరించలేని ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ఢిల్లీ వాసులకు ఉపశమనం కలిగినా నగరంలో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఢిల్లీలోని పలు ప్రాంతాలతో పాటు ఎన్సీఆర్ రోడ్లను వరదలు ముంచెత్తాయి. వరద నీటి ధాటికి చాలాచోట్ల డ్రైనేజీ వ్యవస్థ స్తంభించిపోవడంతో సమస్య మరింత విషమించింది. సమీప ప్రాంతాలన్నింటినీ వరద ముంచెత్తింది. ఢిల్లీ జల మంత్రి ఆతిశితో పాటు శశి థరూర్ తదితర ఎంపీల నివాసాలు కూడా నీట మునిగాయి. వారి ఇళ్లలోని ఫర్నిచర్ తదితరాలు వరద నీటిలో తేలియాడుతూ కన్పించాయి. వర్షాలు, సంబంధిత ఉదంతాల్లో ఐదుగురు మరణించారు. నీటితో నిండిపోయిన అండర్‌పాస్‌ల్లో వాహనాలు తేలియాడాయి. పలుచోట్ల వాటిలో ప్రయాణికులు గంటలపాటు చిక్కుకున్నారు. గుర్గావ్‌లోని పలు నివాస ప్రాంతాలు నీట మునిగాయి. దీంతో ట్రాఫిక్ గందరగోళం ఏర్పడింది. తూర్పు ఢిల్లీలోని అక్షరధామ్ నుంచి గాజీపూర్ దాకా, అక్షరధామ్–సరాయ్ కాలే ఖాన్ రహదారిపైనా... ఇలా ఎక్కడ చూసినా ట్రాఫిక్ గంటల తరబడి నిలిచిపోయి జనాలకు చుక్కలు చూపింది. ఎక్కడ చూసినా మోకాలి లోతు, అంతకు మించి వరద కన్పించింది. పలు చోట్ల మెట్రో స్టేషన్లు కూడా నీట మునిగాయి. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ వాతావరణ కేంద్రంలో ఏకంగా 153.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈదురు గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు, కరెంటు స్తంభాలు విరిగిపడ్డాయి.

జూలై 3 దాకా వానలే

ఢిల్లీ–ఎన్సీఆర్‌లో గురువారం నుంచి శుక్రవారం ఉదయం దాకా 24 గంటల్లో 228 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అక్కడ గత 88 ఏళ్లలో అత్యధిక వర్షపాతంగా రికార్డుకెక్కింది. జూన్‌లో ఢిల్లీలో సగటున 80.6 మి.మీ వర్షం కురుస్తుంది. ఢిల్లీలో ఏడు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కొనసాగవచ్చని భారత వాతావరణ శాఖ పేర్కొంది. జూలై 3 దాకా ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ''ఈదురుగాలులతో భారీ వర్షాలు పడొచ్చు. జూలై 1, 2 తేదీల్లో ఉరుములతో కూడిన వర్షం పడుతుంది'' అని పేర్కొంది.

ట్రంప్ జోరు బైడెన్ బేజారు

తొలి డిబేట్‌లో ట్రంప్ దూకుడు • తడబడ్డ బైడెన్

పదాల కోసం పదేపదే తడుముకున్న అధ్యక్షుడు

గొంతులో వణుకు, మాటల్లో అయోమయం

బైడెన్ తీరుపై డెమొక్రాట్లలో తీవ్ర ఆందోళన



తొలి అధ్యక్ష డిబేట్‌లో తలపడ్డ ట్రంప్, బైడెన్

అట్లాంటా: అమెరికా అధ్యక్ష ఎన్నికల రేసులో రిపబ్లికన్ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (78) దూకుడు పెంచారు. దేశాధ్యక్షుడు, డెమొక్రాట్ల అభ్యర్థి జో బైడెన్‌తో తొలి ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శించారు. శుక్రవారం (భారత కాలమానం ప్రకారం) సీఎన్ఎన్ చానల్లో దాదాపు 90 నిమిషాల పాటు జరిగిన వాదనలో బైడెన్ సర్వశక్తులూ ఒడ్డారు. తన వయసుపై విమర్శలు, అధ్యక్ష బాధ్యతలను సజావుగా నిర్వర్తించడంపై అమెరికన్లలో నానాటికీ పెరుగుతున్న అనుమానాలను కొట్టిపారేసేందుకు అన్ని ప్రయత్నాలూ చేశారు. ట్రంప్ తనకంటే కేవలం మూడేళ్లే చిన్నవాడని పదేపదే చెప్పుకున్నారు. కానీ డిబేట్ పొడవునా బైడెన్ పదేపదే తడబడ్డారు. ప్రసంగం మధ్యలో ఉన్నట్టుండి మౌనాన్ని ఆశ్రయించారు. మాటల కోసం తడుముకున్నారు. తనలో తానే గొణుక్కుంటూ కన్పించారు. మాట్లాడుతున్న అంశాన్ని అర్ధంతరంగా వదిలేసి మరో విషయం ఎత్తుకుని ఆశ్చర్యపరిచారు. కొన్నిసార్లు బైడెన్ ఏం చెప్తున్నదీ ఎవరికీ అర్థం కూడా కాలేదు. పలు అంశాలపై ట్రంప్ పచ్చి అబద్ధాలు చెప్పినా వాటిని ఎత్తిచూపడంలో, సొమ్ము చేసుకోవడంలో ఆయన పూర్తిగా విఫలమయ్యారు. తనకు అనుకూలమైన గణాంకాలను సమయానుకూలంగా ప్రస్తావించడంలో కూడా చతికిలపడ్డారు. డిబేట్‌లో ట్రంపే నెగ్గారని సీఎన్ఎన్ పోలింగ్‌లో ఏకంగా 67 శాతం మంది ఓటర్లు పేర్కొన్నారు. బైడెన్‌కు 33 శాతం ఓట్లే లభించాయి. న్యూయార్క్ టైమ్స్ వంటి ప్రఖ్యాత వార్తా పత్రికలు కూడా తొలి డిబేట్ ట్రంప్‌దేనని పేర్కొన్నాయి. ''బైడెన్‌పై వయోభారం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. ఆయన మాటతీరులోనూ అది స్పష్టంగా ప్రతిఫలించింది. ఆయన చెబుతున్న విషయాల్లో పొందికే లేకుండా పోయింది'' అంటూ విమర్శలు గుప్పించాయి. దూకుడుకు మారుపేరైన ట్రంప్‌కు 81 ఏళ్ల బైడెన్ ఏ మేరకు పోటీ ఇవ్వగలరోనంటూ డెమొక్రాట్లలో ఇప్పటికే గట్టిగా ఉన్న అనుమానాలు కాస్తా తాజా డిబేట్ నేపథ్యంలో ఆందోళనగా మారాయి. వాదనలో బైడెన్ తొలుత కాస్త వెనకబడ్డారని ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ కూడా అంగీకరించారు. అయితే క్రమంగా పుంజుకుని సమర్థంగా ముగించారని చెప్పుకొచ్చారు. బైడెన్ భార్య జిల్ మాత్రం తన భర్త భలే బాగా మాట్లాడారంటూ ప్రశంసించారు! ''ప్రతి ప్రశ్నకూ చక్కగా బదులిచ్చావు. అన్ని సమాధానాలూ తెలుసు నీకు!'' అంటూ ఆయన్ను మెచ్చుకున్నారు. కానీ ఈ డిబేట్ నేపథ్యంలో బైడెన్ అధ్యక్ష రేసు నుంచి తప్పుకోవాలంటున్న వారి సంఖ్య డెమొక్రాట్లలో క్రమంగా పెరుగుతోంది. ట్రంప్, బైడెన్‌లను అధ్యక్ష అభ్యర్థులుగా ఇంకా లాంఛనంగా ప్రకటించాల్సి ఉంది. జూలై 15–18 మధ్య జరిగే సదస్సులో రిపబ్లికన్లు, ఆగస్టు 19న సదస్సులో డెమొక్రాట్లు తమ అభ్యర్థుల పేర్లను అధికారికంగా ప్రకటిస్తారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబర్ 5న జరగనున్నాయి.

పరస్పర విమర్శల వర్షం...

అమెరికా ఆర్థిక వ్యవస్థ, అబార్షన్ చట్టం, విదేశీ వ్యవహారాలు, వలసల వంటి పలు అంశాలపై ట్రంప్, బైడెన్ మధ్య వాడివేడి వాదనలు సాగాయి. ఆ క్రమంలో నేతలిద్దరూ తిట్ల పర్వానికి దిగారు. ''నువ్వే అబద్ధాలకోరు. అమెరికా చరిత్రలోనే అత్యంత చెత్త ప్రెసిడెంట్ కూడా నువ్వే'' అంటూ పరస్పరం దుయ్యబట్టుకున్నారు. పలు రకాల విమర్శలు చేసుకున్నారు. హష్ మనీ కేసు దోషి అంటూ ట్రంప్‌కు బైడెన్ చురకలు వేశారు. ''జరిమానాలుగా నువ్వు ఎన్ని బిలియన్ డాలర్లు కట్టాలో గుర్తుందా? భార్య గర్భవతిగా ఉండగా నీలి చిత్రాల తారతో గడిపావు. నైతికత విషయంలో వీధుల్లో విచ్చలవిడిగా తిరిగే పిల్లి కంటే కూడా హీనం'' అంటూ విమర్శల వర్షం కురిపించారు. బైడెన్‌తో పాటు ఆయన కుమారుడు హంటర్ కూడా క్రిమినలేనంటూ మాజీ అధ్యక్షుడు ట్రంప్ కూడా విరుచుకుపడ్డారు. అస్తవ్యస్తమైన వలసల విధానంతో దేశ భవితవ్యాన్నే బైడెన్ ప్రమాదంలోకి నెట్టారంటూ దుయ్యబట్టారు. డిబేట్ ఆరంభం నుంచే ట్రంప్ పై చేయి కనబరిచారు. ఆయనను ఇరుకున పెట్టేందుకు బైడెన్ చేసిన ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు.

ఆగస్టు 21 నుంచి యూజీసీ-నెట్

న్యూఢిల్లీ: పీహెచ్‌డీల్లో ప్రవేశాల కొరకు నిర్వహించే యూజీసీ- నెట్‌కు కొత్త తేదీలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 4 దాకా ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తామని శుక్రవారం రాత్రి ప్రకటించింది. తొలుత జూన్ 18న యూజీసీ- నెట్‌ను నిర్వహించారు. అవకతవకలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో మరుసటి రోజు ఈ పరీక్షను రద్దు చేసిన విషయం తెలిసిందే. అలాగే వాయిదా పడ్డ సీఎస్ఐఆర్- యూజీసీ-నెట్‌ను జూలై 25 నుంచి 27 వరకు నిర్వహించనున్నారు. వాయిదా పడ్డ నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (ఎన్‌సీఈటీ)ని జూలై 10న నిర్వహిస్తామని ఎన్‌టీఏ వెల్లడించింది.

నీట్ అభ్యర్థుల భవితవ్యాన్ని కాపాడాలి

కేంద్రానికి రాహుల్ గాంధీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: నీట్–యూజీ పరీక్షలో అక్రమాలకు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయని, లక్షలాది మంది యువత భవిష్యత్తుకు సంబంధించిన ఈ వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చించాలని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఉభయ సభల్లో గౌరవప్రదమైన, ఫలవంతమైన చర్చ జరగాలని తాము కోరుకుంటున్నట్లు చెప్పారు. విద్యార్థుల ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వం, ప్రతిపక్షం కట్టుబడి ఉన్నట్లు ఒక స్పష్టమైన సందేశాన్ని, హామీని పార్లమెంట్ నుంచి ఇవ్వాల్సిన అవసరం ఉందని సూచించారు. రాహుల్ శుక్రవారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. చట్టసభల్లో చర్చించడానికి నీట్–యూజీ కంటే పెద్ద అంశం ఇంకేం ఉంటుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈరోజు ఇదే అత్యంత ముఖ్యమైన అంశమని స్పష్టం చేశారు. చర్చకు ప్రతిపక్షాలు సిద్ధంగా ఉన్నాయని, ప్రభుత్వానికి అభ్యంతరం ఏమిటని నిలదీశారు.

నీట్ నుంచి మినహాయించండి

కేంద్రాన్ని కోరుతూ తమిళనాడు అసెంబ్లీ మళ్లీ తీర్మానం

చెన్నై: నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్)నుంచి తమ రాష్ట్రాన్ని మినహాయించాలని తమిళనాడు కేంద్ర ప్రభుత్వాన్ని మరోసారి కోరింది. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షకు బదులుగా ప్లస్ టూలో పొందిన మార్కుల ప్రాతిపదికన రాష్ట్ర విద్యార్థులను వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు అనుమతించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం సీఎం ఎంకే స్టాలిన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. నీట్ విధానం వివక్షాపూరితమని, పేద, గ్రామీణ విద్యార్థులకు వైద్య విద్య అందకుండా చేస్తోందని సీఎం స్టాలిన్ ఈ సందర్భంగా ఆరోపించారు. దీనివల్ల, వైద్య విద్య ప్రవేశాలకు ప్లస్ టూ మార్కుల ఆధారంగా విద్యార్థులను చేర్చుకునే హక్కు రాష్ట్రాలకు దూరమైందన్నారు.

నేటి నుంచి అమర్‌నాథ్ యాత్ర

శ్రీనగర్/జమ్మూ: అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య వార్షిక అమర్‌నాథ్ యాత్ర నేడు ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా మొదటి విడతలో 4,603 మంది యాత్రికుల బృందం శుక్రవారం కశ్మీర్‌కు చేరుకుంది. జమ్మూలోని భగవతి నగర్ బేస్ క్యాంపు నుంచి శుక్రవారం ఉదయం బయలుదేరిన యాత్రికులకు అధికారులు, పోలీసులు, స్థానిక ముస్లింలు దారి పొడవునా సాదర స్వాగతం పలికారు. జూన్ 29 నుంచి ఆగస్ట్ 19వ తేదీ వరకు 52 రోజుల పాటు ఈ యాత్ర రెండు మార్గాల్లో సాగుతుంది.

నోరు మూయించేందుకు డబ్బులిచ్చారు!

యడియూరప్పపై కోర్టులో సీఐడీ చార్జిషీటు

బెంగళూరు: కర్ణాటక మాజీ సీఎం యడియూరప్ప(81)పై లైంగిక వేధింపుల కేసులో బెంగళూరు సీఐడీ పోలీసులు ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన చార్జిషీటులో కీలక విషయాలు వెల్లడించారు. బాధితురాలి(17)తోపాటు ఆమె తల్లి నోరు మూయించేందుకు యడియూరప్ప, మరో ముగ్గురు వారికి డబ్బులిచ్చారని పేర్కొన్నారు. ఇందుకు గాను అరుణ్ వైఎం, రుద్రేశ్ ఎం, మరిస్వామి ఎం అనే యడియూరప్ప అనుచరులపై ఐపీసీలోని 204, 214 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు.

'నీట్-యూజీ' కేసులో ప్రిన్సిపాల్ అరెస్ట్

న్యూఢిల్లీ: నీట్–యూజీ పేపర్ లీక్ కేసులో సీబీఐ అధికారులు శుక్రవారం జార్ఖండ్‌కు చెందిన ఓ స్కూలు ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌లను అదుపులోకి తీసుకున్నారు. మే 5న జరిగిన నీట్ పరీక్షకు హజారీబాగ్‌లో స్థానిక ఒయాసిస్ స్కూలు ప్రిన్సిపాల్ ఎహ్సానుల్ హక్‌ను కోఆర్డినేటర్‌గాను, వైస్ ప్రిన్సిపాల్ ఇంతియాజ్ ఆలంను అబ్జర్వర్‌గాను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నియమించింది. వీరిద్దరూ కలిసి నీట్ పేపర్‌ను లీక్ చేసినట్లు సీబీఐ ఆరోపించింది. ప్రశ్నాపత్రాలున్న బాక్స్‌ను నిబంధనలకు విరుద్ధంగా వీరు తెరిచినట్లు తెలిపింది. వీరి నుంచి పట్నాలో సంజీవ్ కుమార్ అలియాస్ లుటాన్ ముఖియా గ్యాంగ్‌కు పేపర్ చేరినట్లు సీబీఐ అనుమానిస్తోంది.

లారీ, టెంపో ఢీ: 13 మంది మృతి

సాక్షి, బళ్లారి: కర్ణాటకలోని హావేరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లారీని టెంపో ట్రావెలర్ ఢీకొన్న ఘటనలో ఏడుగురు మహిళలు, ఇద్దరు చిన్నారులు సహా 13 మంది చనిపోయారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. బ్యాడగి తాలూకా గుండెనహళ్లి వద్ద శుక్రవారం 3.45 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. శివమొగ్గ జిల్లా ఎమ్మెహట్టి గ్రామానికి చెందిన ఆదర్శ్ కొత్తగా కొనుగోలు చేసిన టెంపో ట్రావెలర్ వాహనంలో కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి మహారాష్ట్రలోని తుల్జా భవాని, సొదత్తిలోని ఎల్లమ్మ, చించోళిలోని మాయమ్మ ఆలయాల్లో మొక్కులు చెల్లించుకుని వస్తున్నారు. తిరుగు ప్రయాణంలో వీరి వాహనం పుణె- బెంగళూరు 48వ జాతీయ రహదారి పక్కన నిలిపి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొంది. 11 మంది అక్కడికక్కడే చనిపోయారు. తీవ్రగాయాలపాలైన ఇద్దరు ఆస్పత్రికి వెళ్లేసరికే కన్నుమూశారు. నలుగురి పరిస్థితి విషమంగా ఉంది.

ఓటు బ్యాంకు రాజకీయాలు

అమెరికా నివేదికపై విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ ధ్వజం

న్యూఢిల్లీ: భారత్‌లో మత స్వేచ్ఛకు భంగం కలుగుతోందని, మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ 'అంతర్జాతీయ మత స్వేచ్ఛ'పై అమెరికా తాజాగా విడుదల చేసిన నివేదికను కేంద్రం శుక్రవారం తీవ్రంగా ఖండించింది. నివేదిక పూర్తిగా పక్షపాతపూరితమని, ఓటు బ్యాంకు అంశాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించినట్లు కనిపిస్తోందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఆక్షేపించారు. భారత్‌లో సామాజిక పరిస్థితులపై అమెరికా అధికారులకు అవగాహన లేదని స్పష్టమవుతోందన్నారు. భారత్ వ్యతిరేక కథనాన్ని సృష్టించడమే లక్ష్యంగా కేవలం కొన్ని ఘటనలను పరిగణనలోకి తీసుకున్నారని చెప్పారు. భారత కోర్టుల తీర్పుల విశ్వసనీయతను సవాలు చేసేలా అసత్యాలు అచ్చువేశారని మండిపడ్డారు.

నెహ్రూ కన్నా మోదీ మిన్న

రాజ్యసభలో సుధాన్షు త్రివేది వ్యాఖ్యల దుమారం

న్యూఢిల్లీ: ''ప్రధాని నరేంద్ర మోదీ సాటిలేని నేత. తొలి ప్రధాని నెహ్రూతో ఆయనకు పోలికే లేదు. నెహ్రూ కంటే మోదీ అన్ని విషయాల్లోనూ ఎంతో మిన్న'' అని బీజేపీ ఎంపీ సుధాన్షు త్రివేది అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శుక్రవారం రాజ్యసభలో చర్చను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెహ్రూ ఘనతను మోదీ ఏనాటికీ అందుకోలేరన్న విపక్షాల వ్యాఖ్యలను ఎద్దేవా చేశారు. ''నెహ్రూతో మోదీకి పోలిక లేదని విపక్షాలంటున్నాయి. నిజమే. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ పడితే మహాత్మా గాంధీ మద్దతిచ్చినా ఒక్క ఓటూ సాధించుకోలేని చరిత్ర నెహ్రూది. మోదీ మాత్రం బీజేపీకి సారథ్యం వహించేందుకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారిద్దరికీ పోలికే లేదు'' అని అన్నారు. ''నెహ్రూతో పోలిస్తే మోదీ అత్యంత సమర్థుడైన ప్రధాని. దేశం ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యల పరిష్కారంలో నెహ్రూ కన్నా మోదీదే అత్యంత సమర్థమైన వ్యవహార శైలి'' అని అభిప్రాయపడ్డారు. ''నెహ్రూది అతి సంపన్న కుటుంబ నేపథ్యం. మోదీ ఏమో పేద కుటుంబం నుంచి వచ్చారు. చిరిగిన బట్టలతో బాల్యం గడిపారు. నెహ్రూ తన విమర్శకులను జైల్లో తోయిస్తే మోదీ ఎప్పుడూ అలాంటి చర్యలకు పాల్పడలేదు. నెహ్రూ తనకు తానే భారత రత్న ఇచ్చుకున్నారు. మోదీ మాత్రం పార్టీలకు అతీతంగా భరతమాత ముద్దుబిడ్డలను ఆ పురస్కారంతో సమున్నతంగా గౌరవించారు.



ధగ ధగ.. దగా!

గ్లోబల్ సిటీ.. సగం చీకటి

- ఎల్ఈడీ వీధిదీపాల నిర్వహణలో ఈఈఎస్ఎల్ వైఫల్యం
- జీహెచ్ఎంసీ స్ట్రీట్‌లైట్ డాష్‌బోర్డు చెబుతున్న నిజమిదీ..
- కాలనీలు, మారుమూల ప్రాంతాలే కాదు ప్రధాన రహదారుల్లోనూ ఇదే పరిస్థితి
- 'ఆ రెండు' జోన్లలోనే 98 శాతానికి పైగా వెలుగులు
- నిబంధనల మేరకు లైట్లు వెలగకున్నా ఈఈఎస్ఎల్‌కు చెల్లింపులు?
- రాత్రివేళ చీకట్లో ప్రమాదాలపై ప్రజల ఆందోళన

సీహెచ్. వెంకటేశ్

రాత్రి వేళ వీధి దీపాల వెలుగులో మెరిసిపోవాల్సిన హైదరాబాద్ మహానగరంలో చాలాచోట్ల చీకటే రాజ్యమేలుతోంది. ఎక్కువ కాంతిని వెదజల్లడమే కాకుండా, విద్యుత్ చార్జీలు కూడా తగ్గుతాయనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ వీధిదీపాలు అనేక ప్రాంతాల్లో వెలగడం లేదు. రాత్రిళ్లు అన్ని లైట్లూ వెలుగుతాయని ఈఈఎస్ఎల్ (ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్), జీహెచ్ఎంసీ చెబుతున్నా ఆ మేరకు వెలగడం లేదని జీహెచ్ఎంసీ స్ట్రీట్‌లైట్ డాష్‌బోర్డే స్పష్టం చేస్తోంది. అన్ని స్ట్రీట్ లైట్లూ సీసీఎంఎస్ (సెంట్రలైజ్డ్ కంట్రోల్ అండ్ మానిటరింగ్ సిస్టమ్) బాక్స్‌లకు అనుసంధానమైనందున సర్వర్ నుంచి అందే అలర్ట్స్‌తో సమస్యలు వెంటనే పరిష్కారమవుతాయని, చీకటి పడ్డప్పుడు మాత్రమే లైట్లు వెలుగుతూ, తెల్లారగానే ఆరిపోయేలా ఆటోమేటిక్ వ్యవస్థ పనిచేస్తుందన్నది కూడా మాటలకే పరిమితమైంది. ఎల్ఈడీల ఏర్పాటుకు ముందు ఏటా దాదాపు రూ.150 కోట్ల విద్యుత్ చార్జీలు ఉండగా, వీటిని ఏర్పాటు చేశాక ఆ వ్యయం రూ.100 కోట్ల లోపే ఉంటోందని జీహెచ్ఎంసీ పేర్కొంటోంది. పొదుపు సంగతేమో కానీ.. కోటిమందికి పైగా ప్రజలు నివసిస్తున్న భాగ్యనగరంలోని రోడ్లపై అంధకారం నెలకొంటుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, దొంగలు, సంఘ వ్యతిరేక శక్తులకు కూడా ఈ పరిస్థితి అనుకూలంగా మారుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



గురువారం ఇదీ పరిస్థితి

→ గురువారం (27వ తేదీ) అర్ధరాత్రి 1.20 గంటలు. ఆ సమయంలో జీహెచ్ఎంసీ స్ట్రీట్‌లైట్ డాష్‌బోర్డు మేరకే నగరంలో 43.79 శాతం వీధిదీపాలు మాత్రమే వెలుగుతున్నాయి. అయితే అది కూడా తప్పే. సీసీఎంఎస్ బాక్సులకు కనెక్టయిన లైట్లలో 43.79 శాతం వెలుగుతున్నాయన్న మాట. వాస్తవానికి ఈ వివరాలు నమోదయ్యే డాష్ బోర్డు లింక్‌ను ఎవరికీ తెలియనివ్వరు. మొత్తం లైట్లలో 98 శాతం లైట్లు వెలిగితేనే వీటిని నిర్వహిస్తున్న ఈఈఎస్ఎల్‌కు చార్జీలు చెల్లించాలి. కానీ ఎవరికే లింకులున్నాయో కానీ చెల్లింపులు మాత్రం నిరాటంకంగా జరిగిపోతున్నాయి.

ఇదీ లెక్క..

మొత్తం స్ట్రీట్ లైట్స్	5,10,413
కనెక్టెడ్	3,05,018
లైట్స్ ఆఫ్	1,71,455
లైట్స్ ఆన్	1,33,563
గ్లో రేట్	43.79 %

ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో?



→ గత 4 రోజులుగా మా ఏరియాలో స్ట్రీట్‌లైట్లు వెలగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షం కురిసినప్పుడు డ్రైనేజీ మ్యాన్‌హోళ్లతో ఎప్పుడు, ఎక్కడ, ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడాల్సి వస్తోంది. అధికారులకు పలు పర్యాయాలు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

– కె.రాజశేఖరరెడ్డి, ఓల్డ్ మలక్‌పేట

రాత్రివేళ రక్షణ కావాలి



→ అడ్డగుట్ట వీధుల్లో దీపాలు వెలగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో లైట్ల చుట్టూ పెరిగిన చెట్ల కొమ్మల కారణంగా వెలుతురు రోడ్లపై పడటం లేదు. చెట్ల కొమ్మలు తొలగించాలని, వెలగని విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేయాలని అధికారులను కోరుతున్నా స్పందించడంలేదు. కొన్ని బస్తీల్లో పగటి వేళ కూడా లైట్లు వెలుగుతున్నాయి. ఇప్పటికైనా చెట్ల కొమ్మల్ని తొలగించి, మరమ్మ తులు చేసి రాత్రి వేళల్లో మాకు రక్షణ కల్పించాలి.

– సంతోషమ్మ , అడ్డగుట్ట

ఎక్కువ ఫిర్యాదులు దీనిపైనే..

నగరంలో భారీ వర్షం కురిసి రోడ్లు జలమయమైనప్పుడు.. రాత్రివేళ స్ట్రీట్‌లైట్లు వెల గక, కనిపించని గుంతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ విధులు నిర్వహించేవారు ముఖ్యంగా మహిళలు పని ప్రదేశాల నుంచి ఇళ్లకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితులు నెలకొంటుండగా, వృద్ధులు, పిల్లలు ప్రమాదాల బారిన పడుతున్నారు. జీహెచ్ఎంసీకి ఎక్కువ ఫిర్యాదులందే అంశాల్లో వీధిదీపాలు వెలగకపోవడం ఒకటి. ఈఈఎస్ఎల్ పనితీరుపై పలు సందర్భాల్లో మేయర్, కమిషనర్ హెచ్చరించినా ఎలాంటి ఫలితం లేదు.

ప్రధాన రహదారుల్లోనూ..

కాలనీలు, మారుమూల ప్రాంతాలే కాదు ప్రధాన రహదారుల్లోనూ లైట్లు వెలగడం లేదు. సికింద్రాబాద్ జోన్‌లోని బైబిల్ హౌస్, ముషీరాబాద్, బోయిగూడ, నామాలగుండు, ఆనంద్‌బాగ్, మోండా మార్కెట్, మల్కాజిగిరి రామాలయం, ఎల్బీనగర్ జోన్‌లోని నాగోల్ ఎన్‌క్లేవ్, లక్ష్మీ రాఘవేంద్ర కేజిల్, చింతల్‌కుంట, స్నేహపురి కాలనీ, ఎస్బీహెచ్ కాలనీ, చార్మినార్ జోన్‌లోని మైలార్ దేవ్‌పల్లి, అత్తాపూర్, ఖైరతాబాద్ జోన్‌లోని బేగంబజార్, అఫ్జల్‌గంజ్, కూకట్‌పల్లి జోన్‌లోని కూకట్‌పల్లి, బోయిన్‌పల్లి సహా వందలాది ప్రాంతాల్లో లైట్లు వెలగక అంధకారం రాజ్యమేలుతోంది.

వీఐపీలకే వెలుగులా!?

→ డాష్‌బోర్డులో జీహెచ్ఎంసీలోని అన్ని జోన్లు, సర్కిళ్ల వారీగా డేటా నమోదు కావాల్సి ఉండగా చార్మినార్, సికింద్రాబాద్, ఎల్బీనగర్ జోన్లకు సంబంధించిన డేటా అందుబాటులో లేదు. సంపన్నులు, రాజకీయ నేతలు, ఉన్నతాధికారులు, తదితర వీఐపీలు ఎక్కువగా ఉండే ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్లకు సంబంధించిన వెలుగుల వివరాలే డాష్ బోర్డులో ఉన్నాయి. ఖైరతా బాద్, శేరిలింగంపల్లి జోన్లలో మాత్రమే 98 శాతానికి పైగా (కనీసం 98% లైట్లు వెలగాలనే నిబంధనకు అనుగుణంగా) వెలుగులుండటం గమనార్హం. కాగా మిగతా జోన్లలో చాలా తక్కువ శాతం మాత్రమే వెలుగు తున్నాయి.

అధిక చెల్లింపులు?

→ విద్యుత్ ఖర్చుల పొదుపు పేరిట జీహెచ్ఎంసీ నగరమంతా ఎల్ఈడీ లైట్ల ఏర్పాటుకు, ఏడేళ్ల నిర్వహణకు ఈఈఎస్ఎల్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. మొత్తం వ్యయం రూ.563.58 కోట్లు. ఎల్ఈడీలతో వెలుగులు బాగుంటాయని, సాధారణ స్ట్రీట్‌లైట్స్ వ్యయంతో పోలిస్తే ఏడేళ్లలో జీహెచ్ఎంసీకి రూ.672 కోట్లు మిగులుతాయని జీహెచ్ఎంసీ ప్రాజెక్టు ఒప్పంద సమయంలో పేర్కొంది. అలా పొదుపయ్యే నిధులనే ఈఈఎస్ఎల్‌కు చెల్లిస్తామని తెలిపింది. ఇలా ఇప్పటివరకు రూ.400 కోట్లు చెల్లించినట్లు సమా చారం. కాగా వీధిదీపాలు వెలగాల్సిన మేర వెలగ కున్నా చెల్లింపులు జరిగాయనే ఆరోపణలున్నాయి. మరోవైపు ఒప్పందం మేరకు 5,40,494 వీధి దీపాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ప్రస్తుతం 5,10,413 మాత్రమే ఉండటం గమనార్హం. అయితే ఒప్పందం మేరకు వెలగాల్సిన లైట్లు వెలగనప్పుడు ఈఈఎస్ఎల్‌కు చెల్లింపులు చేయడం లేదని, కొన్ని సందర్భాల్లో పెనాల్టీలు కూడా విధించామని జీహెచ్ఎంసీ అధికారులు చెబుతున్నారు.

పనులు చేయని థర్డ్‌పార్టీ..

→ ఈఈఎస్ఎల్ తాను నిర్వహించాల్సిన పనుల్ని సబ్ కాంట్రాక్టుకు అప్పగించింది. వారికి చెల్లింపులు చేయకపోవడంతో సబ్ కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదు. బల్బు పోయిందని ఫిర్యాదులొస్తే బల్బు తీస్తున్నారు కానీ కొత్తది వేయడం లేదు. అలాగే ఇతరత్రా పనులూ చేయడం లేదు.

- పెరిగిన రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రతలు
- నాణ్యమైన నిద్రకు దూరమవుతున్న నగరవాసి
- ఏటా 50-80 రోజుల పాటు అధికంగా రాత్రి ఉష్ణోగ్రతలు
- దక్షిణాది నగరాలతో పోలిస్తే మన దగ్గరే అత్యధిక వేడి
- ఎక్కువగా ముంబైలో 92 రోజులు ఉష్ణ తాపం
- అర్బన్ హీట్ ఐలాండ్, శిలాజ ఇంధనాల దహనమే కారణం
- క్లైమేట్ సెంట్రల్ అండ్ క్లైమేట్ ట్రెండ్స్ అధ్యయనంలో వెల్లడి

'ఆకలి రుచి ఎరగదు, నిద్ర సుఖమెరగదు' అని సామెత. ఆకలి సంగతి సరే..కానీ నగరవాసికి సుఖనిద్ర కరువైంది. ఆఫీసులో పని ఒత్తిడి, రోడ్ల మీద ట్రాఫిక్ రద్దీ, రణగొణ ధ్వనులు ముప్పేట దాడి చేస్తున్నాయి. ముఖ్యంగా వాతావరణంలో అకస్మాత్తు మార్పులు.. కంటి నిండా నిద్రను కలగా మారుస్తున్నాయి. గ్లోబల్ వార్మింగ్ కారణంగా 2014–23 మధ్యకాలంలో 718 రోజులు రాత్రి కనిష్ట ఉష్ణోగ్రతలు 25 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా నమోదయ్యాయి. ఏటా 50–80 రోజుల పాటు రాత్రి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటున్నాయని 'క్లైమేట్ సెంట్రల్ అండ్ క్లైమేట్ ట్రెండ్స్' తాజా అధ్యయనంలో వెల్లడైంది. లక్ష కంటే ఎక్కువ జనాభా ఉన్న 300 నగరాల్లో ఈ అధ్యయనం జరిగింది.

రాత్రి వేడి.. నిద్రపై దాడి!



సాక్షి, హైదరాబాద్

రాత్రిపూట గది ఉష్ణోగ్రతలు 24 డిగ్రీలుగా ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సూచించింది. కానీ ఏటా నగరాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 25 డిగ్రీలకు మించి నమోదవుతున్నాయి. అత్యధికంగా ముంబైలో 92 రోజుల పాటు రాత్రి ఉష్ణోగ్రతలు పరిమితికి మించి నమోదు కాగా.. మంగళూరులో 31.8, నాగ్‌పూర్‌లో 39.3, న్యూఢిల్లీలో 3.8 రోజులు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక దక్షిణాది నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లోనే రాత్రి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి. బెంగళూరులో రాత్రిపూట ఉష్ణోగ్రతల్లో ఎలాంటి మార్పులు చోటుచేసుకోలేదు. కానీ హైదరాబాద్‌లో 13, చెన్నైలో 0.7 రోజుల పాటు రాత్రిపూట ఉష్ణోగ్రతలు 25 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ నమోదయ్యాయి. ఇదే సమయంలో కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, పంజాబ్, జమ్మూకశ్మీర్, ఆంధ్రప్రదేశ్‌లోని పలు నగరాల్లోనూ ఏటా 50 నుంచి 80 రోజులు రాత్రిపూట పరిమితికి మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అధిక జనాభా కూడా కారణమే

➔ ఉష్ణ మండల దేశమైన ఇండియాలో జనాభా ఎక్కువగా ఉండటం కూడా అధిక ఉష్ణోగ్రతలకు మరొక కారణంగా చెప్పొచ్చు. ఎందుకంటే పేదరికం ఎక్కువగా ఉండే మన దేశంలో ప్రతి ఒక్కరికీ శీతలీకరణ పరికరాలను కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత ఉండదు. దీంతో ఆయా ఇళ్లలో గదిలోని ఉష్ణోగ్రతల వేడిమి బయటి గాలి కంటే చాలా ఎక్కువగా ఉంటుంది. దీంతో అధిక సాపేక్ష ఆర్ద్రత (ఆర్‌హెచ్) కారణంగా శరీరం చల్లబడటం చాలా కష్టం.

మెదడు, జ్ఞాపకశక్తి పెరుగుదలకు, భావోద్వేగాల నియంత్రణకు మనిషికి నిద్ర అతి ముఖ్యమైనది. సాధారణంగా మనిషి నిద్రకు ఉపక్రమించే ముందు శరీరం చల్లబడాలి. కానీ గదిలోని అధిక ఉష్ణోగ్రతల కారణంగా వేడెక్కుతుంది. దీంతో వేగవంతమైన కంటి కదలి కల

నిద్రలేమి ప్రాణాంతకమే..

(ఆర్ఈఎం)తో నాణ్యమైన నిద్ర తగ్గుతుంది. మెదడులో ఆలోచనలు పెరిగి, శ్వాస, హృదయ స్పందన రేటు పెరుగుతాయి. ఫలితంగా ఎక్కువ సమయం మేల్కొని ఉంటున్నారని అధ్యయనంలో వెల్లడైంది. గది లోని అధిక వేడి కారణంగా అలసట పెరగడంతో పాటు హార్మోన్ల ఉత్పత్తి అధికమవు తుంది. ఇలా నిద్రలేమి ప్రాణాంతకంగా మారుతుందని వైద్యులు చెబుతున్నారు.

అర్బన్ హీట్ ఐల్యాండ్ అంటే..


➔ సహజ సిద్ధమైన భూభాగాన్ని భవనాలు, రోడ్లు, ఫుట్‌పాత్‌లు వంటి వేడిని గ్రహించే ఉపరితలాలు ఆక్రమించడాన్నే అర్బన్ హీట్ ఐల్యాండ్‌గా పేర్కొంటున్నారు. ఈ కారణంగా వేడి పెరగడం, తద్వారా వాతావరణంతో సంబంధం లేకుండా శిలాజ ఇంధన వినియోగం కూడా ఎక్కువవుతూ వాతావరణ, వాయు కాలుష్య స్థాయిలు అధికంగా నమోదవుతుంటాయి.

ఈ వేసవిలో రికార్డులు బద్దలు

ఈ వేసవిలో రాత్రి ఉష్ణోగ్రతలు గత 5 దశాబ్దాల రికార్డులను అధిగమించాయి. అర్బన్ హీట్ ఐలాండ్, అధిక స్థాయిలో శిలాజ ఇంధనాల దహనం కారణంగా నగరాల్లో వేడి ఎక్కువ అవుతోంది. దీంతో పగటిపూట మాత్రమే కాకుండా రాత్రి సమయాల్లోనూ గరిష్టంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

– ఆర్తీ ఖోస్లా, డైరెక్టర్, క్లైమేట్ ట్రెండ్స్







పాతబస్తీ విద్యుత్ పంపిణీ ప్రైవేటుకు!

- విద్యుత్ సరఫరా మొదలు బిల్లుల జారీ వరకు..
- అదానీ సంస్థకు అప్పగించే దిశగా అడుగులు
- పైలట్ ప్రాజెక్టుగా హైదరాబాద్ సౌత్ ఏరియా ఎంపిక
- తర్వాత నగరమంతా విస్తరణకు చర్యలు
- విద్యుత్ సంస్థను నష్టాల నుంచి గట్టెక్కించేందుకేననే వాదన
- ఢిల్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి సూచనప్రాయ ప్రకటన



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ పాతబస్తీలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను ప్రైవేటుకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. ఇక్కడ సరఫరా చేస్తున్న విద్యుత్, వసూలవుతున్న బిల్లులకు పొంతన లేకపోవడంతో ఏర్పడుతున్న నష్టాలను తగ్గించుకోవడానికి ఈ ఆలోచనకు వచ్చినట్టు తెలిసింది. ఈ క్రమంలో పాతబస్తీ మొత్తం విద్యుత్ పంపిణీ వ్యవస్థను అదానీ కంపెనీకి అప్పగించేందుకు సిద్ధమైంది. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు.

హైదరాబాద్ సౌత్ సర్కిల్ లెక్క ఇదీ!

మొత్తం విద్యుత్ కనెక్షన్లు	7.21 లక్షలు
గృహ విద్యుత్ కనెక్షన్లు	5.68 లక్షలు
వాణిజ్య కనెక్షన్లు	1.40 లక్షలు
హెచ్‌టీ కనెక్షన్లు	241
డివిజన్లు	బేగంబజార్, చార్మినార్, ఆస్మాన్‌ఘడ్
సబ్ డివిజన్లు/ సెక్షన్లు	9/ 30
33 కేవీ ఫీడర్లు	59
11 కేవీ ఫీడర్లు	321
డీటీఆర్‌లు	7,400
సగటున ప్రతి నెలా రావాల్సిన బిల్లులు	రూ.120 కోట్లు

41 శాతం నష్టాలు ఇక్కడే..

➔ గ్రేటర్ హైదరాబాద్‌లో తొమ్మిది సర్కిళ్లు ఉండగా.. 60 లక్షలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అయితే డిస్కం సరఫరా చేస్తున్న విద్యుత్‌కు, వసూలవుతున్న బిల్లులకు మధ్య తీవ్ర వ్యత్యాసం ఉంటోంది. నిర్వహణ లోపాలు, పంపిణీ నష్టాలకు తోడు ఇతర కారణాలతో సంస్థ నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ సౌత్ సర్కిల్‌లో అత్యధికంగా 41 శాతం నష్టం వస్తోంది. హైదరాబాద్ సెంట్రల్‌లో 12.5 శాతం, రాజేంద్రనగర్ సర్కిల్‌లో 10%, సరూర్‌నగర్ 9.25 శాతం, సైబర్ సిటీలో 9, బంజారాహిల్స్‌లో 8 శాతం, హబ్సిగూడలో నాలుగు శాతం చొప్పున నష్టాలు వస్తున్నాయి. ఇందులో విద్యుత్ చౌర్యం, లైన్ లాసెస్, ఉద్దేశపూర్వకంగా బిల్లుల ఎగవేత వంటివాటితో హైదరాబాద్ సౌత్ సర్కిల్‌లో నష్టాలు ఎక్కువగా ఉన్నట్టు అధికారులు చెప్తున్నారు. భారీ ఎత్తున బిల్లుల బకాయిలు ఉన్నా వసూలు చేయలేకపోతున్నామని అంటున్నారు. ఇక్కడి పరిస్థితుల కారణంగా క్షేత్రస్థాయిలోని ఇంజనీర్లు, సిబ్బంది దీనిని సరిదిద్దలేకపోతున్నా రని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో నష్టాలు తగ్గించుకునేందుకు ప్రైవేటుకు అప్పగించాలని సర్కారు నిర్ణయించింది.



పైలట్ ప్రాజెక్టుగా..

పాతబస్తీలో నష్టాల బారి నుంచి గట్టెక్కేందుకు కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు, నిర్వహణ, మీటర్ రీడింగ్, కనెక్షన్ల జారీ ప్రక్రియను పైలట్ ప్రాజెక్టుగా ప్రైవేటుకు కట్టబెట్టేందుకు సర్కారు సిద్ధమైంది. ఇందుకోసం హైదరాబాద్ సౌత్ (పాతబస్తీ) సర్కిల్‌ను అదానీ సంస్థకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల మధ్య రెవెన్యూ చెల్లింపులు 75:25 శాతం చొప్పున ఉండవచ్చని అధికారులు చెప్తున్నారు. ఈ పైలట్ ప్రాజెక్టు సత్ఫలితాలనిస్తే మిగతా సర్కిళ్లకూ విస్తరించాలని సర్కారు భావిస్తున్నట్టు పేర్కొంటున్నారు.



కదలండి బాస్!

నిశ్చల జీవనశైలితో రోగాలే..

- దేశంలో శారీరక శ్రమ లేనివారు 49.4% మంది..
- పురుషులతో పోలిస్తే.. మహిళల్లో 57% ఎక్కువ
- నగరంలో ఫిజికల్ యాక్టివిటీ లేనివాళ్లు 53.6% మంది
- 15-49 ఏళ్ల మధ్య వయస్కుల్లోనే ఈ పరిస్థితి అధికం
- ది లాన్సెట్ గ్లోబల్ హెల్త్ మెడికల్ జర్నల్‌లో వెల్లడి

- వివరాలు 13లో

సాక్షి
హైదరాబాద్
శనివారం । 29 । జూన్ । 2024



బీఆర్‌ఎస్‌కు షాక్
చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చర్చనీయాంశమైంది. కొన్నాళ్లుగా పార్టీ మారుతారనే ప్రచారం చివరికి నిజమైంది. -10లో



11 నిమిషాల్లో రూ.18 లక్షలు సేఫ్!
ఫెడెక్స్ ఫ్రాడ్‌లో రూ.18 లక్షలు కోల్పోయిన బాధితుడు 'గోల్డెన్ అవర్'లో మేల్కోవడంతో సొమ్ము సేఫ్ అయ్యింది. సైబర్ నేరగాళ్లకు సొమ్ము చేరకుండా పోలీసులు బ్లాక్ చేయించారు. -12లో

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం
రానున్న 24 గంటల్లో నగరంలో తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టం 32, కనిష్టంగా 25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చు. 8 నుంచి 12 కి.మీ వేగంతో ఉపరితల గాలులు వీచే అవకాశముంది.



శిథిలావస్థకు చేరుకున్న ఉస్మానియా ఆస్పత్రి భవనం

- కొత్త భవనం కోసం పేద రోగుల ఎదురుచూపులు
- శిథిలావస్థకు చేరుకుని పెచ్చులూడుతున్న భవనం
- పాత బిల్డింగ్ కూల్చివేతపై కొనసాగుతున్న మీమాంస
- కూలగొట్టి కడితేనే బహుళ ప్రయోజనమంటున్న కొందరు
- హెరిటేజ్ భవనాన్ని కూల్చొద్దంటున్న మరికొందరు
- కోర్టు పరిధిలో వివాదం.. ఎంతకూ తేల్చని ప్రభుత్వం



ఉస్మానియా ఆస్పత్రి స్థలం వివరాలు

- మొత్తం: 24.41 ఎకరాలు
- మతపరమైన స్థలం: 0.6 ఎకరాలు
- శ్మశానవాటిక: 1.28 ఎకరాలు
- పోలీస్ స్టేషన్: 0.32 ఎకరాలు
- అందుబాటులో ఉన్న స్థలం: 22.20 ఎకరాలు

హుష్‌మానియా!

ఉస్మానియా జనరల్ ఆస్పత్రి నిర్మాణంలో ఊగిసలాటలు



మహా నగరంతో పాటు పరిసర జిల్లాల ప్రజలకు వందల ఏళ్ల నుంచి ప్రాణ ప్రదాయిని. లక్షలాది మంది పేద రోగులకు ప్రాణభిక్ష పెట్టిన ఘన చరిత్ర. అద్భుతమైన భవన నిర్మాణ శైలికి ప్రతీక.. అడుగడుగునా ఉట్టిపడే కళా సౌందర్యం. కానీ.. కాలం రివ్వున తిరిగింది. అన్నింటికీ ఎక్స్‌పైరీ డేట్ ఉన్నట్టే ఆ కళాఖండం కూడా చరమాంక దశకు చేరుకుంది.. అదే నగర నడిబొడ్డున శతాబ్దం క్రితం నిర్మించిన ఉస్మానియా జనరల్ ఆస్పత్రి. శిథిలావస్థకు చేరిన ఉస్మానియా పాత భవనం స్థానంలో కొత్తది నిర్మించి రోగులకు మెరుగైన వసతులు కల్పించాలని కొందరు.. చారిత్రక కట్టడాలను కూల్చవద్దని మరికొందరు వాదిస్తుండటంతో ఈ వివాదం కోర్టుకు చేరింది. ప్రభుత్వం కూడా ఎటూ తేల్చకుండా సందిగ్ధావస్థలో పడింది. ఈ నేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం.

– సాక్షి, సిటీబ్యూరో/అఫ్జల్‌గంజ్

చిక్కుముడులు విప్పేందుకు కృషి..



కొత్త భవనం నిర్మించేందుకు కృషి చేస్తున్నాం. ఒక అడుగు ముందుకు పడితే రెండడుగులు వెనక్కి అన్నట్టుగా పరిస్థితి ఉంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం కూడా ఎంతో నిబద్ధతతో ముందుకు వెళ్తోంది. కానీ.. చిక్కుముడులు మాత్రం వీడట్లేదు. ఎలాగైనా కొత్త భవనం నిర్మించి రోగులకు మేలైన సేవలు అందించాలనేదే నా కోరిక.

– డాక్టర్ బి.నాగేందర్, సూపరింటెండెంట్, ఉస్మానియా ఆస్పత్రి

పాత భవనంతో ప్రయోజనం లేదు..



పాత భవనం అలాగే ఉంచితే అసాంఘిక కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంది. ఆ భవనాన్ని కూల్చేసి కొత్త భవనం నిర్మిస్తే పేద రోగులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. పాత భవనాన్ని చూసుకుంటూ కూర్చుంటే ఏమొస్తుంది. ఎప్పుడు కూలిపోతుందో.. ఎప్పుడేం అవుతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నాం.

– వి.నర్సింగ్ రావు, జియాగూడ

ఉస్మానియా జనరల్ ఆస్పత్రిని 1910లో రూ.50 వేల వ్యయంతో 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ హయాంలో నిర్మితమైంది. డంగు సున్నం, గచ్చుతో రెండంతస్తుల్లో దీనిని నిర్మించారు. అప్పట్లో 200 మంది రోగులు చికిత్స పొందేవారు. పెరుగుతున్న రోగుల తాకిడితో పాత భవనం ప్రాంగణంలోనే 1971లో ఓపీ బ్లాకును నిర్మించారు. 1992లో కులీ కుతుబ్‌షా బ్లాక్‌ను నిర్మించారు. ప్రస్తుతం రోజూ సుమారు 2 వేల మంది అవుట్ పేషెంట్లు, మరో 200 మంది రోగులు ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు. దేశంలోని అత్యున్నత బోధనాసుపత్రుల్లో ఉస్మానియా ఆస్పత్రి ఒకటి.

ప్రమాదకారిగా మారి..

ఎంతో మందికి ఎనలేని సేవలందిస్తూ వచ్చిన ఉస్మానియా ఆస్పత్రి భవనం ఇప్పుడు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పెచ్చులూడిపోయి.. ఎప్పుడు కూలిపోతుందో తెలియని దుస్థితికి చేరుకుంది. జులై 2020లో భారీ వర్షాల కారణంగా వరద నీరు ఆస్పత్రి ప్రాంగణంలోకి చేరుకుంది. దీంతో చికిత్స పొందుతున్న రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యుద్ధ ప్రాతిపదికన ఉస్మానియా ఆస్పత్రి పాత భవనాన్ని ఖాళీ చేయించారు. రోగులను వేరే భవనాల్లోని ఇతర వార్డుల్లో సర్దుబాటు చేశారు. పరిపాలనా విభాగంతో పాటు శస్త్రచికిత్సల విభాగాలను కూడా ఖాళీ చేయించారు. ఇప్పుడు ఉన్న భవనాల్లో కొత్త పేషెంట్లను చేర్చుకోవడం, రోగులకు సేవలందించడం చాలా కష్టంగా మారిపోయింది.

ఎన్నాళ్లుగానో ఎదురుచూపులు..

ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవనం కోసం వేల మంది రోగులు కళ్లల్లో వత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. కాకపోతే ఆదిలోనే హంసపాదు అన్నట్టుగా ఆస్పత్రి భవనం నిర్మాణానికి సవాలక్ష సవాళ్లు ఎదురవుతున్నాయి. చిక్కుముడుల వలలో చిక్కుకుపోతోంది. వందేళ్ల కింద నిర్మించిన భవనం కావడం.. హెరిటేజ్ భవనాల జాబితాలో ఉండటంతో దీన్ని కూల్చడం కష్ట సాధ్యంగా మారింది. దీన్ని ఇలాగే ఉంచి మిగిలిన ప్రాంతంలో కొత్త భవనం నిర్మించాలని కొందరు అంటున్నారు. అయితే.. పాత భవనాన్ని కూల్చేసి పూర్తిగా కొత్త భవనం నిర్మిస్తే పూర్తి స్థాయిలో రోగులకు అన్ని రకాల వసతులు అందుబాటులోకి తీసుకురావొచ్చని చెబుతున్నారు. గత ప్రభుత్వం కూడా పాత భవనాన్ని కూల్చి కొత్త భవనం నిర్మాణం చేపట్టాలని భావించింది. కొందరు దీనిపై కోర్టుకెళ్లారు. దీంతో ప్రతిష్టంభన కొనసాగుతోంది.

కమిటీ ఇలా చెప్పింది..

ఉస్మానియా ఆస్పత్రి పాత భవనం స్థితిగతులు, కొత్త భవనం నిర్మాణం సాధ్యాసాధ్యాలపై అప్పటి ప్రభుత్వం ఓ కమిటీ ఏర్పాటు చేసింది. పాత భవనం ఉపయోగించేందుకు పూర్తిగా పనికి రాదని తేల్చింది. భవనానికి మరమ్మతులు చేయొచ్చని, ఆస్పత్రి కోసం కాకుండా వేరే వాటి కోసం వాడుకోవచ్చని సూచించింది. ఇలా చేస్తే ఆస్పత్రికి కొత్త భవనాన్ని నిర్మించే స్థలం తక్కువ అవుతుందని పలువురు అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో మళ్లీ కథ మొదటికి వచ్చింది.

25 ఎకరాల్లో పది అంతస్తుల్లో..

పాత భవనాన్ని కూల్చేసి కొత్త భవన సముదాయాన్ని దాదాపు 25 ఎకరాల్లో నిర్మించాలని ఆస్పత్రి పరిపాలనా విభాగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఒక్కో టవర్‌లో సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు పది అంతస్తుల్లో భవనం నిర్మించాలని సూచించింది. ఒక్కో టవర్‌ను 6 లక్షల చదరపు అడుగుల స్థలంలో నిర్మించాలని పేర్కొంది. దీంతో రోగులతో పాటు, వైద్య విద్యార్థులు, డాక్టర్లకు అన్ని రకాల సదుపాయాలు అందించవచ్చని తెలిపింది. నర్సింగ్ కాలేజీ కూడా నిర్మించే అవకాశం ఉంటుందని వివరించింది. ఇలా మొత్తం 35,75,747 చదరపు అడుగుల స్థలం అవసరం ఉంది.

అక్కడ నిర్మించాలని ప్రతిపాదన..

పాత భవనం హెరిటేజ్ జాబితా కిందకు రావడంతో దాన్ని కూల్చకుండా మధ్య మార్గంలో వేరే ప్రాంతంలో ఉస్మానియా ఆస్పత్రిని నిర్మిస్తే ఎలా ఉంటుందని కొందరు అంటున్నారు. చంచల్‌గూడ, కొత్తపేట మార్కెట్, గోషామహల్‌లోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ప్రాంతాలను పరిశీలించారు. కానీ.. అందుకు కొందరు అంగీకరించట్లేదు. ఇప్పుడున్న ప్రాంతంలోనే భవనం నిర్మించాలని పట్టుబడుతున్నారు.

బోనాల ఉత్సవాలకు | నిరంతర విద్యుత్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో బోనాల సందర్భంగా నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని.. ప్రముఖ ఆలయాల వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం సీజీఎంలు, ఎస్‌ఈలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. జులై 2 నాటికి సంబంధిత సీఈలు/ఎస్‌ఈలు ఆలయ ప్రాంగణాలను సందర్శించి 24 గంటల విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ దేవాలయానికి ఒక నోడల్ అధికారి/ఏఈని కేటాయించాలన్నారు. ఆర్‌అండ్‌బీ, ఆలయ కమిటీలతో సమన్వయం చేసుకోవడంతో పాటు డీటీఆర్‌లు, అదనపు లైట్లు, ఎయిర్ కండిషనింగ్, సౌండ్ సిస్టంకు తగినట్లు విద్యుత్ లోడ్ ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన చోట ప్రత్యామ్నాయ సామగ్రిని సమకూర్చుకోవాలన్నారు. ప్రజలు గుమిగూడే చోట విద్యుత్ స్తంభాలు షాక్ కొట్టకుండా ముందే చెక్ చేయాలన్నారు. విద్యుత్ లీకేజీలను పూర్తిగా అరికట్టాలన్నారు. అన్ని పంపిణీ కేంద్రాల్లోనూ టంగ్ టెస్టర్ ద్వారా ఎర్తింగ్‌ను చెక్ చేయడంతో పాటు ప్రతి గంటకోసారి రీడింగ్ తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు నందకుమార్, డాక్టర్ నర్సింహులు, సీజీఎంలు కె.సాయిబాబా, ఎల్.పాండ్య, వి.శివాజీ, పి.భిక్షపతి, పి.ఆనంద్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.





ఆగేనా.. సాగేనా!

డోలాయమానంలో మూసీ బ్రిడ్జిల పనులు

- సందిగ్ధావస్థలో పడిపోయిన అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: చారిత్రక మూసీ– ఈసా నదులపై గత ప్రభుత్వం నిర్మించతలపెట్టిన 15 హైలెవెల్ బ్రిడ్జిల పరిస్థితి డోలాయమానంలో పడింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కేవలం మూసారాంబాగ్ వద్ద బ్రిడ్జి పనులకు మాత్రమే పచ్చజెండా ఊపింది. మిగతా వాటిపై ఎలాంటి నిర్ణయమూ వెల్లడించకపోవడంతో అధికారులు ఏం చేయాలో తెలియక అయోమయంలో పడ్డారు.



సన్‌సిటీ– చింతల్‌మెట్ వద్ద నిలిచిన పనులు

మొత్తం 15 హైలెవెల్ బ్రిడ్జిలను అద్భుతంగా నిర్మించాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించడంతో పాటు ప్రతిపాదనల మేరకు రూ. 545 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు కూడా మంజూరు చేసింది. మొత్తం 15 హైలెవెల్ బ్రిడ్జిలకుగాను మూడు చోట్ల మూసారాంబాగ్, ఫతుల్లాగూడ, సన్‌సిటీ–చింతల్‌మెట్ ల వద్ద పనులు ప్రారంభించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు, నిధులు లేకపోవడంతో ఫతుల్లాగూడ, సన్‌సిటీల వద్ద పనులను పెండింగ్‌లో ఉంచారు. ఆ పనులు ఇరవై శాతం వరకు జరిగినట్లు తెలిసింది.

రివర్‌ఫ్రంట్ పనులకు ప్రాధాన్యం..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ రివర్‌ఫ్రంట్‌ను పర్యావరణపరంగా, అందంగా తీర్చిదిద్దడమే కాక పర్యాటక, వాణిజ్య ప్రాంతంగానూ అభివృద్ధి చేయాలనే తలంపుతో ఉన్నారు. దానికి అధిక ప్రాధాన్యత నిస్తున్నారు. లండన్‌లోని థేమ్స్ నది మాదిరిగా దాన్ని అభివృద్ధి చేసేందుకు ఎన్ని నిధులైనా వెనుకాడేది లేదనీ పేర్కొన్నారు. అందుకనుగుణంగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుగా 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న మూసీని ప్రక్షాళన చేయడంతో పాటు అభివృద్ధి చేసేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. దానికి ప్రాధాన్యత ఇస్తున్నందున హైలెవెల్ బ్రిడ్జిల పనులు తర్వాత చూద్దాంలే అనే ధోరణిలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలోని మూసారాంబాగ్ పనులు మాత్రమే జరుగుతున్నాయి. వర్షాలు, యుటిలిటీస్ షిఫ్టింగ్ వంటి సమస్యలతో ఆ పనులు కుంటుతున్నాయి. మిగతా 14 బ్రిడ్జిల పనులు అసలు జరుగుతాయా? లేదా? అన్నది అధికారులు చెప్పలేకపోతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సైతం నాలుగు హైలెవెల్ బ్రిడ్జిల పనులు చేసేందుకే జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. అందుకుగాను రూ. 168 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలవడంతో పాటు ప్రాజెక్ట్ మానిటరింగ్ కన్సల్టెన్సీలకు సైతం టెండర్లు ఆహ్వానించింది.

బ్రిడ్జిలు.. వాటి అంచనా వ్యయం ఇలా..

హైలెవెల్ బ్రిడ్జి	అంచనా (రూ.కోట్లు)
1. ఇబ్రహీంబాగ్ కాజ్‌వే	39.00
2. మూసారాంబాగ్	52.00
3.చాదర్‌ఘాట్	42.00
4.అత్తాపూర్	35.00
మొత్తం	168.00

త్వరలో హైదరాబాద్-విజయవాడ 6 లేన్ల రోడ్డు పనులు

రాంగోపాల్‌పేట్: హైదరాబాద్-విజయవాడ ఆరు లేన్ల రహదారి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. పీవీ ఘాట్ వద్ద శుక్రవారం నివాళులర్పించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల నుంచి తాను చేసిన పోరాటం కారణంగా నేడు ఈ పనులకు మోక్షం కలుగుతుందని చెప్పారు. సెప్టెంబర్ నెల వరకు భూసేకరణ, టెండర్లు తదితర పనులన్నీ పూర్తి చేసుకొని పనులు మొదలవుతాయని ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి గడ్కరి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో పనులు ప్రారంభం అవుతాయన్నారు. రెండు సంవత్సరాల్లో ఈ పనులు పూర్తవుతాయని, అప్పుడు హైదరాబాద్ నుంచి విజయవాడకు రెండు గంటల్లో చేరుకోవచ్చని ఆయన వివరించారు. ఘట్‌కేసర్-ఉప్పల్ పనులు 2018లో మొదలయ్యాయని, ఇన్నేళ్ల కాలంలో ఈ పనుల గురించి కేటీఆర్ అసలు పట్టించుకోలేదన్నారు. యాదగిరిగుట్ట, స్వర్ణగిరి దేవాలయంతో పాటు తెలంగాణాలో ఎంతో ముఖ్యమైన వరంగల్ నగరానికి ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని తెలిపారు. ఇలాంటి రోడ్డు పనులు ఆగిపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడ్డాయని, ఇటీవల కేంద్ర మంత్రి గడ్కరితో కూడా ఈ పనుల గురించి చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. గత కాంట్రాక్టర్‌తోనే ఈ పనులు పూర్తి చేయించాలని ప్రయత్నించినా అవి ఫలించలేదని, కొత్త టెండర్లు పిలిచి మళ్లీ పనులు ప్రారంభించేందుకు కేంద్ర మంత్రి ఒప్పుకున్నారని చెప్పారు. రెండు, మూడు నెలల్లో ఈ పనులు ప్రారంభమై ఏడాదిన్నరలో పూర్తి చేస్తామని తెలిపారు.

రిటైర్డ్ ఆర్మీ జవానుకు 20 ఏళ్ల జైలు



పెరియాటి శ్రీధరన్

రాంగోపాల్‌పేట్: ఓ మైనర్ బాలికను బెదిరించి లైంగికదాడికి పాల్పడిన ఓ రిటైర్డ్ ఆర్మీ జవానుకు పోక్సో స్పెషల్ సెషన్స్ కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధించింది. మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన 2017 సంవత్సరంలో జరిగింది. మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం ఓ మైనర్ బాలిక రెజిమెంటల్‌బజార్‌లోని హోంలో ఉంటూ 31బస్టాప్ ప్రాంతంలోని పాలికాబజార్‌లో ఉండే ఓ టైలరింగ్ సెంటర్‌లో టైలరింగ్ నేర్చుకుంటోంది. 2017 జూలై 24వ తేదీన ఉదయం 11గంటలకు టైలరింగ్ సెంటర్‌కు వెళ్తుండగా ఆర్మీలో పదవి విరమణ పొందిన యాప్రాల్‌లో నివాసం ఉండే పెరియాటి శ్రీధరన్(59) బాలికను ఆపి భోజనం చేశావా అంటూ ప్రశ్నించాడు. భోజనం పెట్టిస్తానని ముత్యాలమ్మ దేవాలయం ప్రాంతంలోని ఓ హోటల్‌కు తీసుకుని వెళ్లి భోజనం పెట్టించాడు. అక్కడి నుంచి ఆ బాలికను హోటల్‌కు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. అటు తర్వాత మనోహర్ థియేటర్ ప్రాంతంలోని ఓ లైన్‌లో ఆ బాలికను విడిచి వెళ్లిపోయాడు. ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని బెదిరించాడు. బాలిక హోంకు వెళ్లి రెండు రోజుల పాటు ఏడుస్తూ విచారంగా ఉంది. హోంలోని ఓ ఆరోగ్య కార్యకర్త గమనించి ఆరా తీయగా జరిగిన విషయం చెప్పింది. వెంటనే 27వ తేదీన హోం నిర్వాహకులు మంజుల, పద్మ బాలికను తీసుకుని వెళ్లి మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. ఆ తర్వాత పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించి చార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించారు. పోక్సో ప్రత్యేక సెషన్స్ జడ్జి పుష్పలత కేసును విచారించి పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలతో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష ఖరారు చేశారు. మరో రూ.20వేల జరిమానా కూడా విధించారు. ఈ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతాప్‌రెడ్డి బాలిక తరఫున వాదనలు వినిపించి శిక్ష పడేలా చూశారు.

బీఆర్ఎస్‌కు షాక్



- సొంత గూటికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- అంతర్మథనంలో బీఆర్ఎస్ శ్రేణులు
- కలవరంలో కాంగ్రెస్ నాయకులు
- ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశం

నియోజకవర్గ అభివృద్ధి కోసమే..

నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. అందరినీ కలుపుకొని సమన్వయంతో కాంగ్రెస్ పార్టీలో ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం సాయంతో నెరవేరుస్తానని చెప్పారు. మూడుసార్లు నియోజకవర్గ ప్రజలు అవకాశం కల్పించారని.. వారికి ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు.

చేవెళ్ల/మొయినాబాద్: చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పలువురు ఎమ్మెల్యేలు పార్టీ మారతారనే సంకేతాలు వచ్చినప్పుడల్లా కాలె యాదయ్య పేరు కూడా ప్రధానంగా వినిపిస్తూ వచ్చింది. ఆయన మాత్రం ఎప్పటికప్పుడు దీనిని కొట్టిపారేస్తూ పార్టీ మారే ప్రసక్తే లేదంటూ ప్రకటిస్తూ వచ్చారు. చివరికి పార్టీ మారతారనే ప్రచారాన్ని నిజం చేశారు.

కాంగ్రెస్ పార్టీతోనే రాజకీయ జీవితం

కాలె యాదయ్య రాజకీయ జీవితంలో అధిక భాగం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగింది. ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాతే ఆయన బీఆర్ఎస్ లోకి మారారు. ఇప్పుడు బీఆర్ఎస్‌లో గెలిచి సొంతగూటికి చేరుకున్నారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం చించల్‌పేట గ్రామానికి చెందిన కాలె యాదయ్య 1980లో రాజకీయరంగ ప్రవేశం చేశారు. మొదట డీసీఎంఎస్ డైరెక్టర్‌గా, తర్వాత సింగిల్ విండో చైర్మన్‌గా, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్‌గా పనిచేశారు. 1995లో నవాబుపేట జెడ్పీటీసీగా ఎన్నికయ్యారు. 2001 నుంచి 2006 వరకు నవాబుపేట ఎంపీపీగా పనిచేశారు. 2009లో చేవెళ్ల నియోజకవర్గంలోకి నవాబుపేట మండలం కలవడం.. ఎస్సీగా రిజర్వుకావడంతో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకున్నారు. ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కేఎస్ రత్నం చేతిలో 2,249 ఓట్లతో ఓటమి పాలయ్యారు. 2014లో మళ్లీ పోటీ చేసి అప్పటి టీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసిన కేఎస్ రత్నంపై 781 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఏడాదిలోనే అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి 33,552 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి కేఎస్ రత్నంపై గెలుపొందారు. 2023లో జరిగిన ఎన్నికల్లో రెండోసారి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా పోటీ చేసి 268 ఓట్ల స్వల్ప మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్‌పై గెలుపొందారు.

సంశయంలో బీఆర్ఎస్ నాయకులు

నిన్నటి వరకు తమకు రాష్ట్రంలో అధికారం లేకపోయినా స్థానికంగా ఎమ్మెల్యే ఉన్నాడని భావించిన బీఆర్ఎస్ శ్రేణులు ఆయన కాంగ్రెస్ పార్టీలోకి మారడంతో అంతర్మథనంలో పడ్డారు. కొందరు ఆయనతో వెళ్లాలా.. వద్దా అన్న సంశయంలో ఉండగా మరికొంతమంది ఆయనతోనే వెళ్తామని బాహాటంగానే చెబుతున్నారు. యాదయ్య గెలుపుకోసం పార్టీలో కష్టపడి పనిచేసిన కొందరు కార్యకర్తలు ఆయన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. గ్రామాల్లో తమకు గతంలో ఎదురైన ఘటనలు, భవిష్యత్తులో ఎదురయ్యే పరిస్థితులను అంచనా వేసుకుంటున్నారు.

కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన

మరోవైపు కాలె యాదయ్య కాంగ్రెస్‌లో చేరడంతో కాంగ్రెస్ నాయకులు కలవరపడుతున్నారు. నామినేటెడ్ పదవులు, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్యే తన మనుషులకే సముచిత స్థానం ఇచ్చే అవకాశం ఉంటుందని చర్చించుకుంటున్నారు. మరో వైపు ఎమ్మెల్యే యాదయ్యపై స్వల్ప మెజార్టీతో ఓటమిపాలైన కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్ ఆయనతో కలిసి పనిచేస్తారా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కార్యకర్తలంతా భీమన్నా.. మేమంతా నీ వెంటే అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

మియాపూర్‌లోని భూఆక్రమణ కేసులో మరో ముగ్గురికి రిమాండ్

మియాపూర్: మియాపూర్‌లోని హెచ్‌ఎండీఏ సర్వే నంబర్-100, 101 భూవివాదంలో ఆందోళన చేసిన మరో ముగ్గురు వ్యక్తులను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గతవారం మియాపూర్‌లోని హెచ్‌ఎండీఏ భూమిలో ఇళ్ల స్థలాలు ఇస్తున్నారనే ప్రచారాలు జరగడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన జనాలు గుడిసెలు వేసి ఆక్రమించేందుకు యత్నించారు. అడ్డుకున్న పోలీసులపై రాళ్లదాడికి దిగారు. దాడికి పాల్పడిన నిందితుల్లో రమేష్, రవీందర్, సబావత్ వెంకటేష్‌పై కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

పొట్టకూటి కోసం వలస వచ్చి.. కడుపుకోత మిగిల్చుకొని

హెచ్‌ఎండీఏ నర్సరీ నీటి సంపులో పడి రెండేళ్ల బాలుడి మృతి



మృతి చెందిన రెండేళ్ల బాలుడు

శామీర్‌పేట్: పొట్టకూటి కోసం వలస వచ్చిన దంపతులకు కడుపు కోత మిగిలింది. నర్సరీ నీటి సంపులో పడి రెండేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రేష్మ, సురేంద్ర దంపతులకు మానవ్(2) కుమారుడు ఉన్నాడు. కాగా హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో తూంకుంట మున్సిపాలిటీలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న నర్సరీలో కూలి పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం దంపతులు నర్సరీలో పనిచేస్తుండగా అక్కడే ఆడుకుంటున్న రెండేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న నీటి ట్యాంకులో పడి నీళ్లలో మునిగాడు. స్థానికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితులను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ టీమ్

బంజారాహిల్స్: అమీర్‌పేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎండీఎంఏ డ్రగ్స్ విక్రయించేందుకు ప్రయత్నించిన వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ టీమ్ అదుపులోకి తీసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు బంజారాహిల్స్‌లో ఎండీఎంఏ డ్రగ్స్ విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు శనివారం దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి 2.65 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు ఆదిభట్లలో దాడులు నిర్వహించి అక్కడ ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 12.48 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, 326 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం వారిని అమీర్‌పేట ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. ఎండీఎంఏ డ్రగ్, ఎండు గంజాయిని నిందితులు బెంగుళూరు నుంచి తెచ్చి ఆదిభట్ల, అమీర్‌పేట ప్రాంతాల్లోని కస్టమర్లకు విక్రయిస్తారని పోలీసుల విచారణలో తేలింది. దాడుల్లో ఎస్‌టీఎఫ్ సూపరింటెండెంట్ ప్రదీప్‌రావు, ఇన్‌స్పెక్టర్ బిక్షారెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ బాలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్య



ప్రియాంక మృతదేహం

శంషాబాద్: ఏం కష్టమొచ్చిందో.. ఏం జరిగిందో తెలియదు.. ఇద్దరు పిల్లలకు గుర్తుతెలియని విషం ఇచ్చి తల్లి ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆర్‌జీఐఏ ఇన్‌స్పెక్టర్ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన సోమశేఖర్, ప్రియాంక దంపతులు కొంతకాలంగా పట్టణంలోని ఆర్‌బీనగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. పట్టణంలోని ఓ కొరియర్ కంపెనీలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న సోమశేఖర్ శుక్రవారం తెల్లవారు జామున పనికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే ఇంట్లో ఫ్యాన్‌కు వేలాడుతున్న భార్య ప్రియాంకతో పాటు స్పృహ లేకుండా పడిపోయి ఉన్న ఇద్దరు పిల్లలను వెంటనే ఆస్పత్రికి తరలించి ఆర్‌జీఐఏ పోలీసులకు సమాచారం అందించాడు. ప్రియాంక మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించగా కుమారుడు అద్విక్(3) ఆరాధ్యకు 7 నెలల వయస్సు వెంటనే అక్కడి నుంచి నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అద్విక్ ఆరోగ్యం నిలకడగా ఉండగా ఆరాధ్య ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఇంకా స్పష్టత రాలేదని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతురాలి బంధువులు ఎవరూ ఇంకా ఫిర్యాదు చేయలేదన్నారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రియాంక మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాళాలు పగులగొట్టి ఇంట్లో చోరీ

30 తులాల బంగారం అపహరణ

హయత్‌నగర్: తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసిన దొంగలు రెండు ఇళ్ల తాళాలు పగులగొట్టి ఒక ఇంట్లో సుమారు 30 తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లిన ఘటన శుక్రవారం హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ప్రియదర్శిని కాలనీలో నివసించే పసుపులేటి స్వాతి తెలిసిన వారు చనిపోతే గురువారం ఇంటికి తాళం వేసి సూర్యాపేట్‌కు వెళ్లింది. శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని సుమారు 30 తులాల బంగారు అభరణాలు కనిపించలేదు. పక్కింటి తాళాలు కూడా పగులగొట్టిన దొంగలకు ఆ ఇంట్లో ఎలాంటి వస్తువులు దొరకలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ పేరుతో వల.. బాలికపై లైంగిక దాడి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శంకర్

- ఇన్‌స్టాలో పరిచయమైన మైనర్ బాలిక
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు
- రిమాండ్‌కు తరలించిన పోలీసులు

హిమాయత్‌నగర్: ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన ఓ మైనర్ బాలికకు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిని నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో సుల్తాన్‌బజార్ ఏసీపీ కె.శంకర్, ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్, అడ్మిన్ ఎస్సై జి.నరేష్ కుమార్‌తో కలిసి కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం వెల్లడించారు. ఆగాపురాకు చెందిన షేక్ అర్బాస్(23) బైక్ మెకానిక్. ఇన్‌స్టాగామ్‌లో 13 ఏళ్ల మైనర్ బాలికను పరిచయం చేసుకున్నాడు. ప్రతిరోజూ చాటింగ్ చేస్తూ ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పాడు. ఈ నెల 24న పాఠశాలకు వచ్చిన బాలికను తనతో పాటు గుల్బర్గాకు తీసుకెళ్లాడు. దీంతో బాలిక ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు అఘాపురాకు చెందిన షేక్ అర్బాస్ బాలికను తీసుకెళ్లినట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేశారన్న విషయం తెలుసుకున్న నిందితుడు భయంతో బాలికను తన కుటుంబ సభ్యులకు అప్పగించి పరారయ్యాడు. బాలికను భరోసా సెంటర్‌కు తరలించి, వాఙ్మూలం రికార్డ్ చేసిన పోలీసులు నిందితుడు రెండు రోజుల పాటు బాలికతో లాడ్జీలో ఉండి లైంగిక దాడికి పాల్పడ్డాడని గుర్తించారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు, శుక్రవారం నాంపల్లి రైల్వేస్టేషన్‌లో షేక్ అర్బాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ శంకర్ తెలిపారు.

ఇంటీరియర్‌లో ఆర్కిటెక్ట్స్ కీలకం



ప్రదర్శనను ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- 'ఐఐఐడీ షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్' ప్రారంభం
- హైటెక్స్‌లో 3 రోజుల పాటు కొనసాగనున్న ఎగ్జిబిషన్

సాక్షి, సిటీబ్యూరో: మెట్రోపాలిటన్ నగరాల్లో అగ్రగామిగా కొనసాగుతున్న హైదరాబాద్‌ను మరింత అభివృద్ధి దిశలో తీసుకెళ్లడానికి విభిన్న ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ ఇంటీరియర్ డిజైనర్స్(ఐఐఐడీ) ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వేదికగా ఏర్పాటు చేసిన 'ఐఐఐడీ షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్-2024' ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో ఆర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, ఐఐఐడీ జాతీయ అధ్యక్షులు సరోష్ వాడియా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో ఐఐఐడీ హైదరాబాద్ చాప్టర్‌లోని ఆర్కిటెక్టులు, ఇంటీరియర్ డిజైనర్లతో పాటు పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. 50 ఏళ్ల ఐఐఐడీ చరిత్రలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఐఐఐడీ షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్ 5వ ఎడిషన్‌ను స్వాగతిస్తున్నామని అన్నారు. హైదరాబాద్‌లో ఇలాంటి మరిన్ని ప్రదర్శనలను ఆహ్వానిస్తున్నామని, ప్రస్తుత తరుణంలో బిల్డర్ల కంటే ఆర్కిటెక్ట్స్ పాత్ర చాలా ముఖ్యమైందని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో నగర అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ట్రిపుల్‌ఆర్ రింగ్ రోడ్డు వంటి భారీ ప్రాజెక్టులతో మరిన్ని అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

అధిక లాభాల పేరిట కుచ్చుటోపీ

ఎక్స్‌సీఎస్‌పీఎల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: అధిక లాభాలు ఆశ చూపించి అమాయకులను మోసం చేసిన ఎక్స్‌ఐటీఓ. కన్సల్టెన్సీ సర్వీసెస్(ఎక్స్‌సీఎస్‌పీఎల్) సంస్థ ఫైనాన్షియల్ అడ్వైజర్ కడప జిల్లాకు చెందిన గాదిరాజు గురు ప్రసాద్‌రాజును సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం(ఈఓడబ్ల్యూ) పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇప్పటికే ఈ కేసులో ఈ ఏడాది ఫిబ్రవరిలో డైరెక్టర్ బీఎన్ సతీష్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరుకు చెందిన సతీష్, అవలకొండప్ప వెంకట చలపతి 2015లో బెంగళూరులో ఎక్స్‌సీఎస్‌పీఎల్ పేరుతో కంపెనీ ప్రారంభించారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు చెందిన గాదిరాజు రాజేంద్ర ప్రసాద్ రాజు, గాదిరాజు గురుప్రసాద్‌రాజు, పాసం వెంకట ప్రసాద్, బైరెడ్డి జ్యోతితో కలిసి హైదరాబాద్‌లో కేపీహెచ్‌బీలోని మంజీరా ట్రినిటీ భవనంలో 11వ అంతస్తులో బ్రాంచ్ ఆఫీసును ఏర్పాటు చేశారు. అధిక లాభాలు ఆశించి డిపాజిట్లు సేకరించడమే ఈ కంపెనీ ఉద్దేశంగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎక్స్‌సీఎస్‌పీఎల్.కామ్ వెబ్‌సైట్‌ను సృష్టించారు. పెట్టిన పెట్టుబడులకు సమానమైన 'ఎక్స్' నాణేలతో పాటు 3 నెలలు లాకిన్ పీరియడ్‌తో 3 నెలల్లో 1:1, ఏడాదిలో 1:4 రాబడులు అందిస్తామని అమాయకులను నమ్మించారు.

150-200 బాధితులు..

ఈక్రమంలో సైబరాబాద్‌కు చెందిన టీ.రాజేంద్ర ప్రసాద్‌తో సహా 150-200 మంది నుంచి రూ.2 కోట్లు పెట్టుబడులు పెట్టారు. మూడు నెలల తర్వాత ఇన్వెస్టర్లు డబ్బులు విత్‌డ్రా చేయడానికి ప్రయత్నించగా.. యాప్ పనిచేయలేదు. ఈ విషయమై కంపెనీ ప్రతినిధుల దృష్టికి తీసుకుపోయినా వారు స్పందించకపోగా రాత్రికి రాత్రే కంపెనీని మూసివేశారు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన రాజేంద్ర ప్రసాద్, పలువురు బాధితులు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాంకేతిక ఆధారాలను సేకరించిన పోలీసులు నిందితుడు గురుప్రసాద్‌రాజు నోయిడాలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ప్రత్యేక బృందం అక్కడికి వెళ్లి ఈ నెల 26న రాజును అరెస్టు చేసి, ట్రాన్సిట్ వారెంట్‌పై శనివారం నగరానికి తీసుకొచ్చి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Automobiles

VEHICLE FOR SALE

■ TATA LPT 1613/USED/2012, AP31TD2968. EICHER PRO 2110H CAB/USED/2020, TS35T9587. EICHER PRO 1110 H CAB & HSD 19 FTBSIII/USED/2017, TS12UD1419. ASHOK LEYLAND 3118 / USED / 2017, TS30T0869. TATA LPT 3118 / USED / 2016, TS05UB3677. Kanaka Durga Finance Ltd. Ph: 9848824077 [H-778825]

■ For Sale, Model: Jeep New Compass Limited Edition. Leather Seats Fully Loaded, Single Owner, Company Owned. Excellent Condition. Contact: 7842615091 / 9063108385 [HA-97752]

Real Estate

FLAT FOR SALE

■ కూకట్‌పల్లి, కొల్లూర్ 2 BHK & 3 BHK (1585 sft, 1755 sft, 3545 sft) ఫ్లాట్స్ అమ్మకానికి కలవు. East, West, North Facings. సంప్ర: 7330928822 [HA-15723]

■ 39 lakhs only Nagole & Boduppal East & West Facing 2 BHK & 3 BHK 1000, 2000 Sft In Prime Location. Car Park Avail. Ph: 6309345838, 9502937289. [HA-15729]

■ Luxury 3 BHK Ready To Occupy Flats, Near Habsiguda / Mallapur. Last Few Flats For Sale. Highrise Gated Community. Modern Amenities. Must Visit ! Call: Ph: 08069045562 [HA-311]

■ Ready to Occupy New 3 BHK 1575 & 1675 Sq.Ft Super Deluxe Flats for sale at Mallapur, Nacharam. Rathi Constructions. Mahesh: 9848577552, 6302946914 [H-778926]

LAND FOR SALE

■ Rs. 7300 గజం ఈస్ట్ ఫేసింగ్ 240 + 240 మొత్తం 480 గజాల రెండు ప్లాట్లు అమ్మబడును @ మహేశ్వరం. A.I City - Medical College - Electronic City దగ్గర DTCP ఫైనల్ అప్రూవల్. ఫోన్: 9966521191 [H-800425]

PLOT FOR SALE

■ VIJ హైవేకు బౌటువుల్ మున్సిపాలిటీలో 50 ఎకరాల HMDA & RERA ప్లాట్లు కలవు & ఇబ్రహీంపట్నం టౌన్‌కి దగ్గరలో BDL కంపెనీ ప్రక్కన 100 ఫీట్స్ రోడ్డుకు ప్లాటు కలవు. ఫోన్: 9603541641, 9030511941 [HA-4007]

■ షాద్‌నగర్ @ కేశంపేట టౌన్‌లో DTCP లేఅవుట్ ఫుల్ డెవలప్‌మెంట్స్‌తో 0% ఇంట్రెస్టుతో 40 EMI పద్ధతిలో ఓపెన్ ప్లాట్స్ కలవు. డైరెక్ట్ కంపెనీ ఆఫర్, సైట్ విజిట్ కొరకు. సంప్ర: 9949695027 [H-796170]

■ VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న నూజివీడు రోడ్డులో కంచికచర్ల దగ్గర ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్ చ॥గ॥ 1,900/- నుండి 18,500/- సంప్ర: ✆ 63028 55524 [B-31]

CLEAR TITLE LAND / PLOTS
SECURITY / WITH COMPOUND WALL
NEAR ORR / SHAMSHABAD
500 / 1000 SQ.YDS.
SPOT REGISTRATION
CALL FOR SITE VISIT
98494 04703

■ నాదర్‌గుల్ MVSR కాలేజ్ దగ్గరలో 150, 200 గజముల ప్లాట్లు E / Face, W / Face అమ్మకమునకు కలవు. ఫోన్: 9603061171 / 8179212346 [H-189677]

■ గజం॥ 2500/- కే విజయవాడ హైవే నార్కట్‌పల్లి దగ్గర 4 లైన్స్‌రోడ్డు ప్రక్కన, ఫామ్‌ల్యాండ్ వెంచర్‌లో స్విమ్మింగ్‌పూల్, ఫామ్ హౌస్, ఎర్రచందనం & పండ్ల మొక్కలతో 1210 గజాలు (10 గుంటలు) ప్లాట్స్ కలవు. 96666 95886 [G-3155]

■ OPEN PLOTS FOR SALE, in Shamshabad, 6k.m from ORR, @ 5500/- & 9000/- Per.yds. Clr Title, Spot Reg. Sawera Township PVT ltd. Ph. 7386777380 [HA-847]

■ TLR Ventures Villa Plots With DTCP & 5 Years Oldmangolress @ Shadnagar Beside Bangalore Highway Bank Loan. 8501881336 [HA-62]

■ Manikonda Panchavati Colony 400 Sq.Yds, N/F, 30' Road, per Sq.Yard Rs.1,55,000/- for Sale. Ph: 9246546336 (10am to 9pm) [HA-4327]

BLOOMDALE Residency @ Genome Valley
2BHK ఫ్లాట్ 35 లక్షలు. ప్రపోజ్డ్ ఎలివేటెడ్ JBS - శామీర్‌పేట్ కారిడార్‌లో 20 నిమిషాల ప్రయాణం. జీనోమ్ వ్యాలీ నుండి అద్దెకు అధిక డిమాండ్.
MODI PROPERTIES
www.modiproperties.com
సంప్రదించండి: 080 6904 5563

Services

BEAUTY CARE

■ Women Care: Obesity, Depression, Physically & Fitness, Body Pains, other Health Problems. Ayur & Herbal, Trmt. Avail. Counciling at your home for appt. Cont: Dr Ram 9346931006 [HA-14370]

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్:9100329739 [H-800419]

HEALTH CARE

■ మెడికల్ మసాజ్ ద్వారా శరీరంలోని వాపును తగ్గించడం (కాళ్ళు, చేతులు), వక్షోజాలు (Breast) సైజ్ పెంచడం, తగ్గించడం, బిగుతుగా చేయడం, (Compression Stockings మరియు Breast Implants) లభించును వివరాలకు. సంప్ర: 8096721180 [H-796121]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Geeta Hedda, D/o. S. B. Hedda, Age 47 Years, Residence of 5-6-85, Sangeet Nagar, Kukatpally, Hyderabad -072, Hereby Declare that after my marriage changed my name as Geeta Lohia, W/o. Gopal Lohia, for all records. [HA-15707]

■ I, Mohammad Hajara Begum W/o Mohammad Ghouseuddin, R/o. H.No. 11-3- 266 /15 / A / 5, Mohamoodguda, Parsigutta, Secunderabad - 500061, Telangana State, have changed my name as Hajra Begum for all records purpose. [HA-97771]

■ I, Pattan Sharif Nayab Rasool S/o PGK Rahamtulla, Do Hereby Solemnly Affirm & Declare, That my Wife's Name Was Entered as Shahida in my minor Daughter's Birth Certificate by the Authorities. Now it has Corrected as Smheeda Shaik vide affidavit dated, 14/06/2024 at Hyd. [HA-13107]

YOGA

■ పరమపూజ్య శ్రీమాతాజీ నిర్మలాదేవి సహజ యోగ ధ్యానం అందరికీ ఆహ్వానం. పూర్తిగా ఉచితం. సహజ యోగ ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం & మానసిక ప్రశాంతత పొందండి కుండలినీ జాగృతి ద్వారా ఆత్మ సాక్షాత్కార అనుభూతిని పొందండి. 1) సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం 28 జూన్ 2024, సా॥ 5 గం॥ల నుండి, 2) నిజాం కాలేజ్ గ్రౌండ్స్ 29 జూన్ 2024, సా॥ 6 గం॥ల. నుండి, 3) PJR స్టేడియం, చందానగర్ 30 జూన్ 2024, సా॥ 5 గం॥ల నుండి. ఫోన్: 8988982200 www.sahajayoga.org.in, www.sahajayogatelangana.org [HA-301]

OLD AGE HOME

■ వృద్ధులు & భార్యాభర్తలు, Rtd ఎంప్లాయిస్, సింగిల్ & షేరింగ్ రూమ్స్, మేడిపల్లి / ఉప్పల్, వృద్ధులు, బెడ్ పేషెంట్లు. Ecil, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతి, 24/7 మెడికల్ సర్వీస్. ఫోన్:7981467036, 9391039990, 8074327715 [H-778817]

Wanted

■ ఉప్పల్ డిపో వద్ద మా ఫార్మా కంపెనీకి అనుభవం గల క్లర్క్ విత్ కంప్యూటర్ ఆపరేటర్, టూరింగ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఫోన్: 7989823219 [H-796308]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి / భోజనం జీతం: 18K ఫోన్: 9160900024 / 9640400073 [H-799897]

■ ప్రముఖ వృద్ధుల సంస్థలో పనిచేయడానికి ITI ఫిట్టర్ / ఎలక్ట్రీషియన్ / డిగ్రీ సిబ్బంది కావలెను. వికారాబాద్ / శంకర్‌పల్లి ప్రాంత నివాసులకు ప్రాధాన్యత. రెజ్యూమ్‌తో హాజరవ్వండి. ఇంటర్వ్యూ తేది: 30-06-2024 ఆదివారం ఉ. 10 గం. నుండి స్థలం: శ్రీ నవజ్యోతి విద్యాలయం, రామయ్యగూడ రోడ్, వికారాబాద్ [H-778745]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పని చేయుటకు లేడీ టెలికాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Fixed Salary ఆకర్షణీయమైన ఇన్సెంటివ్స్. ఫోన్: 8886119595 / 9848103255 [H-796087]

■ క్రాంతిరోడ్ ట్రాన్స్‌పోర్ట్ HYD ఆటోనగర్ ఆఫీస్ నందు గుమాస్తాలుగా పని చేయుటకు 10th ఆపై చదివినవారు 30 సం॥లోపు వయస్సు గల మేల్ అభ్యర్థులు కావలెను. బ్యాచిలర్స్‌కు వసతి సౌకర్యం కలదు ✆ 87901 91999 [B-1]

■ ప్రముఖ ప్రైవేట్ లి. సంస్థకు జిల్లాల వారీగా Sr. మేనేజర్లు, మండలాలలో ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం+ కమీషన్. ఫోన్: 8790465785 [HA-32369]

■ 3 సం॥ల అనుభవం ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ గవర్నమెంట్ టెండర్స్ వేయడానికి కావలెను. సనత్‌నగర్. ఫోన్: 8328622868 [HA-778927]

■ Wanted Females For Front Office Executive, Accountant, BDE For VLMS IT Hardware Service Co., Sec-bad. www.vlms.in. Ph: 9885581121, 9848412744 [H-799898]

FACULTY TEACHERS

■ Wanted Exp and Trained Teachers to Handle 9th, 10th Social, 6th,7th Telugu & Pre-Primary Teachers (Preferably Locals) at Kakatiya High School, Warasiguda, Sec'bad. Ph: 9246224773, 9347616102 E:ktswarasiguda@gmail.com [HA-13692]

■ Raghunatha High School Chaitanyapuri, Dilsukh Nagar, Required Talented Lady Teacher For English 5th - 7th Salary 18 -22,000/- Fluently in English Must. Ph: 24040103 [H-796086]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు). ప్రతి అదనపు లైనుకు రూ. 540/-
గమనిక: ఇకపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని మాగంటి కాలనీ అభయాంజనేయస్వామి 17వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ఫిలింనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్‌రావు ప్రారంభించారు. బస్తీవాసులు ఆవుల రాజన్న, ముత్యాల శ్రీనివాస్‌నాయుడు, బాలరాజు, అంజన్, ఆకుల రాజు, నగేశ్, సాగర్, రవి నాయక్ పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

పంజగుట్ట: రైతులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన మూడు నల్లచట్టాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఉద్యమం సమయంలో ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని కిసాన్ సంయుక్త మోర్చా నాయకులు అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కిసాన్ సంయుక్త మోర్చా సభ్యులు జగ్జీత్ సింగ్ దోలేవాల (పంజాబ్), అభిమన్యు (హర్యానా), శాంతకుమార్ (కర్ణాటక), నల్లమల వెంకటేశ్వర రావు (తెలంగాణ) ఉద్యమం సమయంలో ప్రయోగించిన తుపాకీ తూటాలు, బాష్పవాయి గోళాలను చూపించారు. అనంతరం వారు మాట్లాడుతూ వెంటనే తమ డిమాండ్లు పరిష్కరించాలని లేకుంటే వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఢిల్లీలో 10 వేల మంది రైతులతో సదస్సు నిర్వహిస్తామని హెచ్చరించారు. పాండ్యన్ (తమిళనాడు), పి.చంగల్ రెడ్డి (ఆంధ్రప్రదేశ్), సూర్జిత్ సింగ్ (ఉత్తరప్రదేశ్) పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

హిమాయత్‌నగర్: జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారుణ్య నియామకాలు, ప్రమోషన్లు, ఉద్యోగుల బదిలీలు తదితర సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని కోరామన్నారు.

నూతన చట్టాలను ఉపసంహరించుకోవాలి

లిబర్టీ: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన మూడు చట్టాలను ఉపసంహరించుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐపీసీ స్థానంలో కొత్తగా సవరణలు చేసి మూడు చట్టాలు తెచ్చి జూలై 1వ తేదీ నుంచి అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ప్రజలను ఇక్కట్లకు గురి చేసే చట్టాలు అమలు చేయవద్దని కోరారు.

హుక్కా సెంటర్‌పై దాడి

పంజగుట్ట: అక్రమంగా నిర్వహిస్తున్న హుక్కా సెంటర్‌పై పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 9 మంది యజమానులు, ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో రాజ్‌భవన్ రోడ్డులో నిబంధనలు ఉల్లంఘిస్తూ మియామీ గాలీ కేఫ్ పేరుతో హుక్కా సెంటర్ నిర్వహిస్తున్నారని పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించారు. నిర్వాహకులు టోలీచౌకీకి చెందిన మహ్మద్ అబ్దుల్ లతీఫ్ ఖాన్, పార్సీగుట్టకు చెందిన శ్యాం సుందర్‌తో పాటు మేనేజర్ రేయిన్‌బజార్‌కు చెందిన మహ్మద్ అష్ఫాక్, ఉద్యోగులు మెహిదీపట్నంకు చెందిన మహ్మద్ అస్లాం, ఎం.ఎస్ మక్తాకు చెందిన నందకిశోర్, కుమార్ ధన్, దీపక్ సాహు, అల్తాఫ్, రాజీ భోస్లాను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 2,670 నగదు, లక్ష విలువైన 28 హుక్కా ఫ్లేవర్ బాక్సులు, 48 హుక్కా కుండలు, పైపులు, 36 చిమ్నీలు, ఎలక్ట్రిక్ హీటర్లు, 200 హుక్కా ఫిల్టర్లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ కోసం పంజగుట్ట పోలీసులకు అప్పగించగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాబ్ నోటిఫికేషన్‌పై హర్షం

హిమాయత్‌నగర్: తెలంగాణ వైద్యారోగ్య శాఖలో ఖాళీగా ఉన్న 435 సివిల్ అసిస్టెంట్ సర్జన్ వైద్యుల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేయడంపై తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ (టీపీఎహెచ్‌డీఏ) శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డా. కత్తి జనార్దన్ కతజ్ఞతలు తెలియజేశారు. దీనివల్ల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు పూర్తిస్థాయిలో మెరుగైన సేవలు అందే అవకాశం ఉంటుందని, వీలైనంత త్వరగా ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.

కార్యాలయం ఖాళీ చేయాలని బెదిరింపు

వెంగళరావునగర్ : కార్యాలయాన్ని ఖాళీ చేయాలంటూ ఉద్యోగులను బెదిరింపులకు గురి చేస్తున్న ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ శ్రీనివాసనగర్‌కు చెందిన ఎస్.రమేశ్ ప్రైవేట్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 26వ తేదీ అర్ధరాత్రి పది మంది గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి వాచ్‌మెన్ శ్రీను కుమారుడు ఆ కార్యాలయాన్ని తమకు అగ్రిమెంట్ చేశాడని, ఖాళీ చేయాలని దుర్భాషలాడుతూ తలుపులు తెరిచి లోనికి ప్రవేశించి రమేశ్, సిబ్బందిని బెదిరించి వారి ఫోన్లు లాక్కుని బయటకు వెళ్లగొట్టారు. సిబ్బంది వెంటనే పోలీసులకు ఫోన్ చేయగా వారు పారిపోయారు. ఉదయం వరకు కార్యాలయంలోనే ఉన్న రమేశ్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. అదే సమయంలో పదిమంది మహిళలు, మరో పదిమంది పురుషులు డీసీఎం తీసుకువచ్చి ఆఫీస్ ఫర్నీచర్‌ను తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో డయల్ 100కు ఫోన్ చేయగా పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. గత డిసెంబర్‌లోనూ ఇలాగే వారు బెదిరింపులకు గురి చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని రమేశ్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీపిల్లలు అదృశ్యం

వెంగళరావునగర్ : భార్య, పిల్లలు అదృశ్యమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహమత్‌నగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ రజాక్ వ్యాపారం చేస్తుంటాడు. 2000 సంవత్సరంలో షేక్ సబా అనే మహిళను ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే పెళ్లయిన నాటి నుంచే ఆమె అతనికి, అత్తారింటికి ఎలాంటి సహాయం చేయకపోగా హింసించేది. రజాక్, సబా దంపతులకు ముగ్గురు పిల్లలు పుట్టారు. 2022లో ఎవరికీ చెప్పకుండా పిల్లలను తీసుకుని సబా పుట్టింటికి వెళ్లింది. దీంతో ఆమెను, పిల్లలను తిరిగి తీసుకువచ్చాడు. కుమారుడు ఖాజాకు ఈ ఏడాది ఏప్రిల్‌లో వివాహం చేశారు. ఇటీవల అతని సోదరి బక్రీద్ పండుగకు రాగా ఆమెకు, అతని భార్యకు చిన్నపాటి గొడవ జరిగింది. అదేరోజు రాత్రి రజాక్ భార్య తన పిల్లలు, కోడలును తీసుకుని పుట్టింటికే వెళ్లింది. రజాక్ భార్య, పిల్లలకు ఫోన్లు చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. దాంతో బాధితుడు వారు కనిపించడం లేదంటూ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల భద్రతే లక్ష్యంగా..

- స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పోలీసులు
- రెండురోజులుగా విస్తృతంగా స్కూల్ ఆటోలు, వ్యాన్‌ల తనిఖీ
- మైనర్లు నడిపితే వాహనాల సీజ్
- తల్లిదండ్రులూ, ఆటో యజమానిపై కేసులు
- స్కూల్ వాహనాన్ని నడిపేవారు యూనిఫాం వేసుకోవాల్సిందే
- పరిమితికి మించి ఉంటే జరిమానా


డ్రైవర్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఎస్‌ఐలు శ్రీధర్, నరసింహారావు

బంజారాహిల్స్: విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. రెండు రోజులుగా విస్తృతంగా స్కూల్ ఆటోలు, వ్యాన్‌లను తనిఖీ చేస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 132 మంది డ్రైవర్లకు జరిమానా విధించి కౌన్సెలింగ్ ఇచ్చారు. పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటోలు, వ్యాన్లను ఆపి కౌన్సెలింగ్ ఇచ్చి మరోసారి నిబంధనలు ఉల్లంఘించవద్దంటూ హెచ్చరికలు జారీ చేశారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

- నిబంధనల మేరకే వాహనాల్లో విద్యార్థులను ఎక్కించుకోవాలని సూచించారు. ఆటోడ్రైవర్ తప్పనిసరిగా యూనిఫాం ధరించాలి, లేకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరిస్తున్నారు.
- స్పెషల్ డ్రైవ్ వెస్ట్ జోన్ పరిధిలో ప్రతిరోజూ ఉదయం 7.30 నుంచి 9.30 వరకు, సాయంత్రం 3 నుంచి 5 వరకు కొనసాగుతోంది.
- ముఖ్యంగా ఆటోలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోయినా, లైసెన్స్ లేకుండా, మద్యం తాగి వాహనాన్ని నడిపినా, పరిమితికి మించి విద్యార్థులను కూర్చోబెట్టుకున్నా దృష్టి సారిస్తారు.
- ఇందుకోసం అన్ని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్పెషల్ టీంలు ఏర్పాటు చేశారు.
- స్కూల్ యాజమాన్యాలు, తల్లిదండ్రులతో కూడా సమావేశం ఏర్పాటు చేసి నిబంధనలు ఉల్లంఘించే డ్రైవర్ల వల్ల తలెత్తే ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నారు.
- విద్యార్థుల భద్రతకు తీసుకుంటున్న చర్యలను వివరిస్తున్నారు.



స్కూల్ ఆటో డ్రైవర్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా

- పరిమితికి మించి విద్యార్థులను తీసుకువెళ్లడం, మైనర్ డ్రైవింగ్, డ్రైవర్ పక్కన కూర్చోవడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, యూనిఫాం లేకపోవడం, సరైనా పత్రాలు లేకపోవడం తదితర నిబంధనల ఉల్లంఘనలపై ఈ కేసులు నమోదవుతున్నాయి.
- విద్యాసంస్థల వావానాలు నిబంధనలు ఉల్లంఘిస్తే హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు 'ఎక్స్'లో గానీ, ఫేస్‌బుక్‌లో గానీ, ట్రాఫిక్ హెల్ప్‌లైన్ 9010203626 నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులు..

- ఎస్‌ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్న నలుగురు ఆటోడ్రైవర్లు, యూనిఫాం లేకుండా ఆటోలు నడుపుతున్న 15 మంది డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు.
- జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్న 10 మంది డ్రైవర్లు, యూనిఫాం లేకుండా ఆటోలు నడుపుతున్న 10 మందిపై, లైసెన్స్ లేని మరొకరిపై కేసులు నమోదు చేశారు.
- బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్న ఇద్దరు, యూనిఫాం లేకుండా ఉన్న 23 మందిపై మొత్తం 25 మందిపై కేసులు నమోదు చేశారు.
- పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్న ఇద్దరు ఆటోడ్రైవర్లు, యూనిఫాం లేకుండా నడుపుతున్న 23 మందిపై కేసులు నమోదు చేశారు.

తల్లిదండ్రులు గమనించాలి..



తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూల్‌కు పంపే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలి. ఆటో, వ్యాన్ డ్రైవర్లు మైనరా..? కాదా..? అని, అలాగే లైసెన్స్ ఉందో లేదో చెక్ చేసుకోవాలి. ఆయా వాహనాలకు అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయో పరిశీలించాలి. ప్రమాదాలు జరిగినప్పుడు బాధ పడే కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో మేలు. నా పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్‌ఆర్‌నగర్, పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రెండు రోజులుగా నిబంధనలు ఉల్లంఘించిన 132 మంది ఆటోడ్రైవర్లపై కేసులు నమోదు చేశాం. వారికి మా సీఐలు, ఎస్‌ఐలు కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌ను కొనసాగిస్తాం. పరిమితికి మించి తీసుకెళ్తూ ఎవరైనా పట్టుబడితే విద్యార్థులు చదువును దృష్టిలో పెట్టుకుని కానిస్టేబుల్‌ను ఎస్కార్ట్‌గా ఇచ్చి విద్యార్థులను స్కూల్‌లో దింపి వచ్చిన తర్వాతనే డ్రైవర్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యాలు కూడా సహకరించాలి. – హరిప్రసాద్ కట్టా, ఏసీపీ వెస్ట్‌జోన్ ట్రాఫిక్

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి

బంజారాహిల్స్: విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలని రిటైర్డ్ డీజీపీ సయీద్ అన్వరుల్లా హుదా అన్నారు. శుక్రవారం నిర్వహించిన బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం వార్షికోత్సవంతో పాటు ప్రాజెక్ట్ ఎక్స్‌పో కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే ఉపకరణాలను విభిన్న రీతిలో తయారు చేయాల్సిన అవసరం ఉందని, అలాంటి వారికి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆయన ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన విభిన్న రకాల ఉపకరణాలను పరిశీలించి అభినందించారు. ఈ ఎక్స్‌పోలో విద్యార్థులు పెడల్ పవర్ వాషింగ్ మెషిన్ , సోలార్ పవర్ కటింగ్ మిషన్, సర్వేలైన్స్ కోసం రోబో డాగ్, ఎలక్ట్రిక్ బైక్ వంటి విభిన్న రకాల ఉపకరణాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సుల్తాన్ ఉలూం ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి జాఫర్ జావెద్, ప్రిన్సిపాల్ మహిపాల్ సింగ్ రావత్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్, ప్రొఫెసర్ ఇష్రత్ మీర్జా , లక్ష్మీకుమారి, రిజిస్ట్రార్ నర్సింహారావు, డీన్ స్టూడెంట్స్ అఫైర్ ఫర్హతుల్లా హుస్సేనీ తదితతరులు పాల్గొన్నారు.


విద్యార్థుల నమూనాలు పరిశీలిస్తున్న అన్వరుల్లా

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి


ఏబీవీపీ నాయకులను తరలిస్తున్న పోలీసులు

ఖైరతాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, ఫీజు నియంత్రణ, విద్యా హక్కు చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యాశాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్. కార్పొరేట్ స్కూళ్లలో అధిక ఫీజులను నియంత్రించాలని, నిబంధనలకు విరుద్ధంగా బుక్స్, యూనిఫాంలు అమ్ముతున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నిబంధనలను పాటించని ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని, వెంటనే డీఈఓ, ఎంఈఓ అధికారులను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, మెగా డీఎస్సీ ద్వారా 24వేలకు పైగా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు సీట్లు కేటాయించాలని పేర్కొన్నారు. ధర్నా నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ, కమల్ సురేశ్, జీవన్, శ్రీకాంత్, మహేశ్, రాజు, కల్యాణి తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు.

బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేస్తాం

హిమాయత్‌నగర్: బహుజన రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ ఆవిర్భవించిందని ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్.నారగోని అన్నారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం ఆవిర్భావ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు సీట్లు ఇవ్వని పార్టీలకు ఓట్లు వేయవద్దంటూ ఓటు నిరాకరణ ఉద్యమాన్ని జూలై 15 నుంచి చేపడుతామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సభలు, సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. 6 రాజకీయ పార్టీలు, 12 కుల సంఘాలు, మేధావులు, విద్యావంతులతో కలిసి ఈ ఫ్రంట్ ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఫ్రంట్ వైస్ చైర్మన్లు సలీం భాషా, ఎం.సూర్యనారాయణ, కన్వీనర్లు ఎం.నర్సయ్య, గోపి బోయ, బాలాజీ నాయక్, కె.లక్ష్మణ్ పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్.నారగోని

బ్లూ ఎకనామీపై అవగాహన అవసరం

పంజగుట్ట: బ్లూ ఎకనామీపై అవగాహన పెంచుకోవాలని మారిటైమ్ రీసెర్చ్ సెంటర్ పాలకమండలి సభ్యులు, బ్లూ ఎకనామీ నిపుణుడు ప్రఫుల్ తలేరా అన్నారు. యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (వైఎఫ్ఎల్ఓ) ఆధ్వర్యంలో సోమాజిగూడలోని పార్క్ హోటల్‌లో 'బియాండ్ హారిజన్స్: ఎ మెరైన్ ఒడిస్సీ టు ఎండ్‌లెస్ పాసిబిలిటీస్' పేరుతో బ్లూ ఎకనామీ (మహా సముద్రం, సముద్రంలో ఆర్థిక కార్యకలాపాలు)లో అంతులేని అవకాశాలపై శుక్రవారం సెషన్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రఫుల్ తలేరా, నౌకాయానంలో భూగోళాన్ని ఒంటరిగా ప్రదక్షిణ చేసిన మొదటి భారతీయుడు, విశ్రాంత నేవీ ఆఫీసర్ క్యాప్టెన్ దిలీప్ డోండే, భారత నౌకాదళంలో సేవలందించిన ఐశ్వర్య బొడ్డపాటి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ.. త్వరలోనే కేంద్ర ప్రభుత్వం బ్లూ వాటర్ పాలసీని ప్రకటించే అవకాశం ఉందన్నారు. సముద్ర రంగంలో ఆవిష్కరణలు కేవలం సాంకేతికతకు సంబంధించింది కాదని, ఇది రాబోయే తరాలకు స్థిరమైన పురోగతికి సంబంధించిందని చెప్పారు. నేటితరం యువకులు ఇండియన్ నేవీలోకి రావాలని, భారత దేశం 7 వేల కిలోమీటర్ల తీరప్రాంతాన్ని కలిగి ఉందని, వాతావరణం కూడా ఎంతో బాగుంటుందని, వాటర్ స్పోర్ట్స్‌లో కూడా యువత సత్తా చాటవచ్చని తెలిపారు. అనంతరం యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్ రిధి జైన్ ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు.


యంగ్ ఫిక్కీ సభ్యులతో ముఖ్య అతిథులు

బొగ్గు బ్లాకుల వేలాన్ని నిరసిస్తూ సీపీఎం నిరసన


బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

బంజారాహిల్స్: సింగరేణి వేలంపాటను వ్యతిరేకిస్తూ సీపీఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఖైరతాబాద్ జోన్ బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1లో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ జోన్ కార్యదర్శి గోపాస్ కిరణ్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం వేలం వేస్తోందని, సింగరేణి కంపెనీ కూడా వేలంలో పాల్గొనాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అసలు సింగరేణి సంస్థ ఏర్పడ్డదే బొగ్గుబావులు తవ్వడానికేనని, అలాంటి సింగరేణిని కాదని ప్రైవేట్ సంస్థలతో వేలం వేయడంలో కుట్ర దాగి ఉందన్నారు. బీఆర్ఎస్ పాలనలో మోదీ ప్రభుత్వం 4 బ్లాక్‌లు ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టిందన్నారు. సింగరేణిని ప్రైవేట్ పరం చేయబోమని చెబుతున్నారని, కానీ బొగ్గు బ్లాకులు ప్రైవేట్‌కు ఇచ్చిన తరువాత సింగరేణికి మిగిలేది ఏమీలేక మూత పడే ప్రమాదం ఉందని దీంతో రాష్ట్రానికి ఆర్థిక నష్టం, నిరుద్యోగం పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో జోన్ నాయకులు శ్రీనివాస్, కొండల్‌రావు, మన్యం, తదితరులు పాల్గొన్నారు.

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్‌లో సీపీఎం నాయకులు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు చంద్ర శేఖర్‌రావు, శేషగిరిరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని అడ్డుకుంటామన్నారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి స్పందించి వేలాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు స్వామి, దేవాదాస్, అంతారం యాదగిరి, జైపాల్, భాగ్యరాజ్, కేశప్ప, అశోక్ పాల్గొ న్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలి

వెంగళరావునగర్ : శిశువిహార్‌లో విధులు నిర్వహించే ఆయాలు, వర్కర్లకు సకాలంలో వేతనాలు చెల్లించాలని శిశువిహార్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు మహిళా శిశు సంక్షేమశాఖ డిప్యూటీ వెల్ఫేర్ ఆఫీసర్ అక్కేశ్వర్‌రావుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ ఏడాది మే నెలకు సంబంధించిన జీతాలు ఇప్పటివరకు అందలేదన్నారు. దీంతో ఇంటి అద్దె, పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో రిటైర్డ్ అయిన వారికి బెనిఫిట్స్ అందజేయాలని, వారి ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు వెంకటేష్, ఆర్.అశోక్, సుశీల, శ్యామల, ఆదిలక్ష్మి తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

హిమాయత్‌నగర్: డివిజన్‌లో నెలకొన్ని సమస్యలను తర్వగా పరిష్కరించాలని హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఈఈలు రాజు, రాముతో కలిసి డివిజన్‌లోని జనార్దన్ బాడ, దత్తనగర్, ఆదర్శ బస్తీలో శుక్రవారం పర్యటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.రామన్ గౌడ్, మహేశ్, సర్ఫరాజ్, ముజ్జులాల, శ్రీహరి, వసీం పాల్గొన్నారు.

జగన్నాథ టెంపుల్ సందర్శన

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-45లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరు రామారావు స్కూల్ విద్యార్థులు బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని జగన్నాథ టెంపుల్‌ను శుక్రవారం సందర్శించారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం విద్యార్థులు అర్చకుల ఆశీర్వాదం తీసుకున్నారు. అన్ని మతాలు ఒక్కటేనని, దేవుళ్లందరూ సమానమేనని చాటి చెప్పేందుకు, విద్యార్థుల్లో ఐక్యతా భావాన్ని పెంపొందించేందుకే ఈ ఫీల్డ్ ట్రిప్ నిర్వహించామని స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్ తెలిపారు.

పీవీ సేవలు చిరస్మరణీయం

లిబర్టీ: ఆర్థిక సంస్కరణలు చేసి దేశ అభివృద్ధికి బాటలు వేసిన గొప్ప నాయకుడు పి.వి.నర్సింహరావు అని లోక్‌దళ్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పుల్లూరు వెంకటరాజేశ్వరరావు అన్నారు. పీవీ జయంతి సందర్భంగా శుక్రవారం పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీవీ శ్రీనివాసరావు, పీవీ సంకీర్త తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులు చేపట్టాలి

రహమత్‌నగర్: రహమత్‌నగర్ కూడలిలో రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని కోరుతూ డివిజన్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి శేరిలింగపల్లి జోనల్ కమిషనర్‌కు శుక్రవారం వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా సీఎన్ రెడ్డి మాట్లాడుతూ రహదారి విస్తరణ జరగకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై స్పందించిన జెడ్‌సీ త్వరలోనే అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని చెప్పారని తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు ఓర్సు ఆడవయ్య ఉన్నారు.

సెల్‌ఫోన్ చోరీ

వెంగళరావునగర్: ఓంనగర్‌కు చెందిన బి.స్టీఫెన్ కరుణ్‌రాజ్ సెల్‌ఫోన్ చోరీకి గురైంది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరుణ్‌రాజ్ ఈ నెల 27న రాత్రి 11 గంటలకు ఇంటికి వచ్చి నిద్రపోయాడు. ఉదయం లేచి చూసేసరికి ఫోన్ కనిపించలేదు. తలుపు గడియపెట్టకపోవడం వల్ల మహేశ్ అనే వ్యక్తి పరిసరాల్లో సంచరిస్తున్నాడు. గతంలో ఇతను జైలుకు వెళ్లివచ్చాడు. తన ఫోన్ మహేశ్ దొంగిలించి ఉంటాడని స్టీఫెన్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్స్‌లోని గోల్డ్ ..

వెంగళరావునగర్: పర్స్‌లో దాచిన గోల్డ్ చోరీకి గురైంది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధార్థనగర్ వాసి వి.శిరీష తన కుమార్తె శ్రావ్యతో (చైల్డ్ ఆర్టిస్ట్) కలిసి ఈనెల 22న సీరియల్ షూటింగ్ వెళ్లింది. అర్ధరాత్రి షూటింగ్ పూర్తికాగానే కారులో ఇంటికి వచ్చి బంగారు ఆభరణాలు పర్స్‌లో పెట్టి నిద్రపోయారు. ఉదయం లేచి పర్స్ చూసేసరికి ఆభరణాలు కనిపించలేదు. వాటి విలువ దాదాపు రూ.80 వేల వరకు ఉంటుంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌కంట్యాక్స్ డబ్బు రిఫండ్ పేరిట సైబర్ మోసాలు

హిమాయత్‌నగర్: 'మీకు ఇన్‌కంట్యాక్స్ డబ్బు రిఫండ్ అవుతుందని' సందేశాలు పంపిస్తూ సైబర్ నేరగాళ్లు కొత్త తరహా సైబర్ మోసాలకు తెగబడుతున్నారు. ఆయా రిఫండ్ నగదు మీ బ్యాంక్ ఖాతాలోకి బదిలీ చేయాలంటే ఖాతాను అప్‌డేట్ చేసుకోవాలంటూ మోసాలకు పాల్పడుతున్నట్లు నగర సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని క్రైం పోలీసులు సూచిస్తున్నారు.






నేడు బీజేపీ కార్యాలయం ఎదుట నిరసన

హిమాయత్‌నగర్: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా జాతీయ ఆమ్ ఆద్మీ పార్టీ పిలుపు మేరకు ఈ నెల 29న తెలంగాణ బీజేపీ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టనున్నట్లు ఆ పార్టీ తెలంగాణ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని పేర్కొన్నారు. కేజ్రీవాల్ సుప్రీంకోర్టు నుంచి బెయిల్ పొందుతన్నారని తెలిసి సీబీఐని ముందుకు తెచ్చి కేజ్రీవాల్‌ను ఎలాగైనా జైల్లో ఉంచాలని బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు.

నియామకం

పంజగుట్ట: భారతీయ కిసాన్ యూనియన్ (ఎ) రాష్ట్ర అధ్యక్షుడిగా డి.కె.చంద్రశేఖర్ యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు యూనియన్ జాతీయ అధ్యక్షుడు చౌదరీ రిష్‌పాల్ అంబవాటీ, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎం.ముస్తాక్ వాజీద్ అలీ నియామక పత్రాన్ని అందించారని చంద్రశేఖర్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో రైతుల సమస్యలపై ఉద్యమించి వారికి న్యాయం జరిగేలా చూస్తానని పేర్కొన్నారు. త్వరలోనే రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తానని తెలిపారు.


చంద్రశేఖర్ యాదవ్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203



అంబేడ్కర్ వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా సుధారాణి

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ సుధారాణి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం సుధారాణి విశ్వవిద్యాలయంలో చరిత్ర విభాగ సీనియర్ ప్రొఫెసర్‌గా, జీఆర్‌సీఆర్ అండ్ డీ డైరెక్టర్‌గా ఉన్నారు. ప్రొఫెసర్ ఏవీఎన్ రెడ్డి ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు.

అమ్మవారి వస్త్రాల తయారీ పనులు ప్రారంభం

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం సందర్భంగా అమ్మవారికి సమర్పించనున్న వస్త్రాల తయారీ (మగ్గంపై) పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తెలంగాణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కళాకారులతో ప్రతియేటా చీరను తయారు చేయించి అమ్మవారికి సమర్పిస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి వస్త్రాల తయారీ పనులను ప్రారంభించినట్లు ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్ తెలిపారు.




మగ్గంపై వస్త్రాల తయారీ పనులను ప్రారంభించిన కళాకారులు

11 నిమిషాల్లో.. రూ.18 లక్షలు సేఫ్!



ఫెడెక్స్ ఫ్రాడ్‌లో మోసపోయిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

- 'గోల్డెన్ అవర్'లో పోలీసులకు ఫిర్యాదు చేసిన వైనం
- తక్షణం స్పందించిన సైబర్ ఠాణా కానిస్టేబుల్ శ్రీకాంత్
- బాధితుడి డబ్బు మొత్తం బ్లాక్ చేయించడంలో సఫలం



సాక్షి, సిటీబ్యూరో:

సైబర్ నేరాల్లో మోసం పోవడం ఎంత తేలికో.. ఈ కేసులు కొలిక్కి రావడం అంత కష్టం. పోలీసుల చర్యలతో నిందితులు చిక్కినా.. రివకరీలు అనేది దుర్లభం. ప్రతి ఏటా సైబర్ నేరాల్లో రికవరీల శాతం గరిష్టంగా 15 శాతం కూడా ఉండట్లేదు. అయితే ఫెడెక్స్ ఫ్రాడ్ బారినపడిన రూ.18 లక్షలు కోల్పోయిన బాధితుడు 'గోల్డెన్ అవర్'లో అప్రమత్తం కావడంలో అతడి సొమ్ము సేఫ్ అయ్యింది. ఆయన నగర సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఎస్.శ్రీకాంత్ నాయక్ చొరవతో బాధితుడు పోగొట్టుకున్న మొత్తం సైబర్ నేరగాళ్లకు చేరకుండా బ్లాక్ చేయించారు. చట్టపరమైన ప్రక్రియలు పూర్తి చేసిన తర్వాత త్వరలోనే ఈ మొత్తం బాధితుడి ఖాతాలోకి చేర్చడానికి సైబర్ క్రైమ్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

వెరిఫికేషన్ పేరుతో డబ్బు డిమాండ్..

అంబర్‌పేట్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు ఇటీవల గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. కాల్ చేసిన వ్యక్తి తాను ఫెడెక్స్ కొరియర్ ఏజెన్సీ నుంచి మాట్లాడుతున్నట్లు పరిచయం చేసుకున్నాడు. 'మీ ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో ఓ పార్శిల్ ముంబై నుంచి ఇరాన్‌కు బుక్ అయ్యింది. అందులో డ్రగ్స్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మీరు ముంబై సైబర్ క్రైమ్ పోలీసులను స్కైప్ ద్వారా సంప్రదించండి' అంటూ చెప్పాడు. ఇది నిజమని నమ్మిన బాధితుడు వాళ్లు చెప్పినట్లే చేశాడు. పోలీసు యూనిఫాంలో ఉన్న వ్యక్తులు ఇతడితో స్కైప్ కాల్‌లో మాట్లాడారు. ఆ డ్రగ్ పార్శిల్‌కు తనకు ఎలాంటి సంబంధం లేదని వివరణ ఇచ్చాడు. దీన్ని రూఢీ చేసుకోవడానికి భారత ప్రభుత్వానికి చెందిన మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి కావాలని సదరు పోలీసుగా చెప్పుకున్న వ్యక్తి చెప్పాడు. ఈ వెరిఫికేషన్ కోసం రూ.18 లక్షలు తాము చెప్పిన ఖాతాలోకి బదిలీ చేయాలని సూచించాడు.

రుణం తీసుకుని మరీ నగదు చెల్లింపు..

డ్రగ్స్ కేసులో తాను ఇరుక్కోకూడదని, తక్షణం వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టి నగదు తిరిగి బదిలీ చేస్తారని భావించిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ స్కైప్‌లో కనిపించిన వ్యక్తి చెప్పినట్లు చేయడానికి సిద్ధమయ్యాడు. ఆ సమయంలో తన వద్ద డబ్బు లేక పోవడంతో గురువారం ఉదయం బ్యాంకు నుంచి రుణం తీసుకుని మరీ బదిలీ చేశాడు. ఆ మొత్తం తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన బాధితుడు సాయంత్రం 6.58 గంటలకు సైబర్ క్రైమ్ ఠాణాకు వచ్చారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఎస్.శ్రీకాంత్ నాయక్‌ను కలిశాడు. విషయం తెలుసుకున్న శ్రీకాంత్ తక్షణం వివరాలను నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో (ఎన్‌సీఆర్‌పీ) నమోదు చేసి, నగదు బదిలీ అయిన ఖాతా ఫ్రీజ్ అయ్యేలా చూడాలని కోరారు. దీంతో రాత్రి 7.09 నిమిషాలకు రూ.18 లక్షలు బ్లాక్ చేస్తూ ఎన్‌సీఆర్‌పీ సందేశం ఇచ్చింది. కొన్ని ఫార్మాలిటీలు పూర్తి చేసిన తర్వాత ఈ మొత్తాన్ని బాధితుడికి ఇవ్వనున్నారు.

గోల్డెన్ అవర్ ఎంతో కీలకం..

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. ఎంత అప్రమత్తంగా ఉన్నా.. ఒక్కోసారి కొందరు సైబర్ నేరాలబారిన పడుతూ ఉంటారు. ఈ బాధితుడు ఎంత త్వరగా అప్రమత్తమై ఫిర్యాదు చేస్తే అంత ఫలితం ఉంటుంది. దీన్నే పోలీసులు 'గోల్డెన్ అవర్' అని అంటారు. ఆర్థికాంశాలతో ముడిపడి ఉన్న సైబర్ నేరాల్లో బాధితులైన వాళ్లు తక్షణం 1930 నంబర్‌కు కాల్ చేసి లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (https://cybercrime.gov.in) కు లాగిన్ అయ్యి ఫిర్యాదు చేయాలి.

ఇవన్నీ అనుమానించాల్సిన విషయాలే..



- ఇటీవల కాలంలో ఈ తరహా ఫెడెక్స్ ఫ్రాడ్స్ ఎక్కువగా జరుగుతున్నాయి. సైబర్ నేరగాళ్ల వలలో పడుతున్న బాధితులు కొన్ని ప్రాథమికాంశాలను పట్టించుకోవట్లేదు. ఈ తరహా స్కామ్స్‌లో బాధితులుగా మారే ముందు అనుమానించాల్సిన విషయాలను దృష్టిలో పెట్టుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.
- మాదకద్రవ్యాలతో కూడిన డ్రగ్ పార్శిల్‌కు సంబంధించిన కేసులను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ), తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో(టీజీ నాబ్), ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ లేదా సాధారణ పోలీసులు దర్యాప్తు చేస్తారు. అలాంటిది సైబర్ క్రైమ్ పోలీసులు ఎందుకు దర్యాప్తు చేస్తారు?
- డ్రగ్స్ కేసులు నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్(ఎన్డీపీఎస్) యాక్ట్ కింద నమోదవుతాయి. దీనికి మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్‌కు (ఆర్థిక మంత్రిత్వశాఖ) సంబంధం ఏమిటి? అతి పెద్ద ఆర్థిక నేరాలు మాత్రమే దీని పరిధిలోకి వస్తాయి కదా?
- కేవలం మాదకద్రవ్యాలకు సంబంధించినవే కాదు.. ఏ కేసులో అయినా నిందితులకు నోటీసులు జారీ చేసి విచారిస్తారు. అలాంటివేమీ లేకుండా నేరుగా స్కైప్ ద్వారా విచారణ ఏమిటి?
- ఏదైనా ఓ కేసులో అనుమానితుడిగా ఉన్న వ్యక్తి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవడానికి పోలీసులకు అవసరమైన ఆధారాలు సమర్పించాల్సి ఉంటుంది. అలా కాకుండా పోలీసులు డబ్బు ఎందుకు ట్రాన్స్‌ఫర్ చేయమని చెప్తారు?
- ఓ వ్యక్తి పేరు, ఆధార్, ఇతర వివరాలతో డ్రగ్ పార్శిల్ వెళ్లడం నిజమైతే.. ముందు పోలీసు విభాగాలు అప్రమత్తం అవుతాయి. వాళ్లే స్వయంగా రంగంలోకి దిగి విషయం ఏమాత్రం బయటకు పొక్కకుండా వచ్చి అరెస్టు చేస్తారు. అంతే తప్ప కొరియర్ వాళ్లకు విషయం చెప్పి వారితో ఎందుకు ఫోన్ చేయిస్తారు?

అన్యాక్రాంతమైన చెరువు స్థలం స్వాధీనం

బంజారాహిల్స్: ఫిలింనగర్ రోడ్డునెంబర్-11లోని చెరువు బఫర్ జోన్‌ను ఆక్రమించి ప్రముఖ నిర్మాత నార్నే గోకుల్ అక్రమ నిర్మాణాలు చేపట్టగా వాటిని కూల్చివేసిన జీహెచ్ఎంసీ ఈవీడీఎం అధికారులు..ఆక్రమిత బఫర్ జోన్ ప్రాంతాన్ని తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. తవ్వకాలు చేపట్టిన ప్రహరీ వద్ద బారికేడ్లను ఏర్పాటుచేశారు.

రక్షణ కోసం సెక్యూరిటీ గార్డును నియమించారు. గత కొద్ది రోజుల నుంచి నార్నే గోకుల్ అనే వ్యక్తి ఈ ప్రాంతాన్ని ఆక్రమించి దర్జాగా తవ్వకాలు చేపట్టడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. జీహెచ్ఎంసీ ఈవీడీఎం కమిషనర్ ఏవీ రంగనాథ్ ఈ కబ్జాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసంతో పాటు చెరువును కబ్జా చేయడం పట్ల ఆయన సీరియస్ అవడమే కాకుండా అక్రమ నిర్మాణాలను కూల్చివేయించి ఆధీనంలోకి తీసుకున్నారు.



క్రిమినల్ కేసు..

లోటస్‌పాండ్ బఫర్ జోన్‌ను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వ్యాపారవేత్త నార్నే గోకుల్‌పై ఫిలింనగర్ పోలీసులు ఐపీసీ సెక్షన్ 447 (ట్రెస్‌పాసింగ్), 427 (ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం) కింద కేసులు నమోదు చేశారు. ఈవీడీఎం ఏఈ సుజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గోకుల్ అరెస్టుకు రంగం సిద్ధం చేశారు. మార్కెట్ స్పేస్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత కూడా అయిన గోకుల్ ఈ ప్లాట్‌ను ఫిలింనగర్ సొసైటీ నుంచి కొనుగోలు చేసినట్లుగా సంబంధిత డాక్యుమెంట్లను చూపిస్తున్నారు. ఫిలింనగర్ సొసైటీ దీనికి ఎంతవరకు బాధ్యతవహిస్తుందో చూడాల్సి ఉంది. కాగా జీహెచ్ఎంసీ సర్కిల్-18లో అప్పటి టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రాజ్‌కుమార్ 2020లోనే జీహెచ్ఎంసీ అనుమతులు ఇచ్చారు. అయితే అప్పుడు జీహెచ్ఎంసీ అనుమతులు ఎలా వచ్చాయి అనే దానిపై విచారణకు ఆదేశించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

నీట్ లీకేజీపై ప్రధాని మోదీ స్పందించాలి

విద్యార్థి, యువజన సంఘాల డిమాండ్



విద్యార్థి, యువజన సంఘాల నేతలను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

కాచిగూడ: 'పరీక్షా పే చర్చ' నిర్వహించే ప్రధాని మోదీ..నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై మాట్లాడకపోవడం సిగ్గు చేటని ఎన్ఎస్‌యుఐ హైదరాబాద్ నగర అధ్యక్షుడు అభిజిత్ యాదవ్ అన్నారు. నీట్ పరీక్షను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా చూడాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో బర్కత్‌పురలోని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి ఇంటిని ముట్టడించారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి నేతలను కిషన్‌రెడ్డి ఇంటివైపు వెళ్లకుండా బర్కత్‌పురలో అడ్డుకున్నారు. పోలీసులకు విద్యార్థి, యువజన నేతలకు మధ్య తోపులాట జరిగింది. కొద్ది సేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. దీంతో విద్యార్థి, యువజన నేతలను పోలీసులు అరెస్ట్ చేసి కాచిగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నీట్ సమస్యపై చర్చించేందుకు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కోరితే ఇవ్వలేదని, దీంతో ఇంటి ముట్టడికి పిలుపునిచ్చినట్లు విద్యార్థి నేతలు తెలిపారు. దేశంలోనే ఎంతో ప్రతిష్టాత్మకమైన నీట్ లీకేజీపై మోదీ ప్రభుత్వం ఇంతవరకు స్పందించకపోవడం సిగ్గు చేటు అని అభిజిత్ యాదవ్ అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రితీష్ రావు, శ్రీకర్, ఎస్ఎఫ్ఐ, పీవైఎల్, విజేఎస్ తదితర విద్యార్థి, యువజన సంఘాల నేతలు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈఓ సహా పలువురికి షోకాజ్ నోటీసులు



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులకు యూనిఫామ్స్, టెక్స్ట్ బుక్స్ అందించడంలో నిర్లక్ష్యం వహించిన డిప్యూటీ డీఈఓ , డిప్యూటీ ఐఓఎస్, హెడ్మాస్టర్లకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. శుక్రవారం గోల్కొండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, సెకండ్ లాన్సర్ పాఠశాలను ఆయన కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియొద్దీన్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ప్రభుత్వం అందించిన బుక్స్, యూనిఫామ్స్ అందాయా అని విద్యార్థులను అడగగా, కొందరు ఇంకా అందలేదని జవాబిచ్చారు. దీనిపై బుక్స్, యూనిఫామ్స్ ఎందుకు ఇవ్వలేదని డిప్యూటీ డీఈఓ రమణరాజు , డిప్యూటీ ఐఓఎస్ మక్బూల్ అహ్మద్, ప్రధానోపాధ్యాయుడు వాజిద్ హష్మిలను కలెక్టర్ ప్రశ్నించగా వారు సరైన సమాధానం ఇవ్వక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల అలసత్వం, నిర్లక్ష్యం వహించినందున వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని విద్యాశాఖాధికారిని ఆదేశించారు.

నేడు జలమండలిలో 'డయల్ యువర్ ఎండీ'

సాక్షి, సిటీబ్యూరో: జలమండలిలో 'డయల్ యువర్ ఎండీ' కార్యక్రమం జరగనుంది. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి 5.30 గంటల వరకు వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వయంగా ఎండీ అశోక్ రెడ్డి స్వీకరిస్తారు. వివిధ డివిజన్, సర్కిల్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న మంచినీటి సరఫరా, సీవరేజీ, మీటర్, బిల్లింగ్, నల్లా కనెక్షన్, రెవెన్యూ ఇతర అంశాలకు సంబంధించిన సమస్యల్ని వినియోగదారులు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. 040- 23442881 లేదా 23442882 లేదా 23442883 నంబర్లకు కాల్ చేసి తమ క్యాన్ నంబరు గానీ, ఇంటి నెంబరు గానీ, మొబైల్ నంబరు గానీ చెప్పాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో బోర్డు డైరెక్టర్లు సహా..అన్ని సర్కిల్, డివిజన్ ఉన్నతాధికారులు పాల్గొంటారు.

బొగ్గు గనుల వేలం రద్దు చేయాలి



ముషీరాబాద్ చౌరస్తాలో సీపీఎం నేతల నిరసన

ముషీరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాట ఆపాలని, సింగరేణికే నేరుగా గనులను కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జి.నర్సింహారావు డిమాండ్ చేశారు. బొగ్గు గనుల వేలం పాటను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ముషీరాబాద్ చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తెలంగాణలోని బొగ్గు గనులను వేలం వేసి తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. దీనివల్ల సింగరేణి మనుగడకే ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. సింగరేణి సంస్థను బలహీన పరిచి మూతపడే దిశగా మోదీ ప్రభుత్వం నెడుతోందని, ఈ ప్రయత్నాలను యావత్ తెలంగాణ ప్రజానీకం అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ నుంచి ఎన్నికైన బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి నేతృత్వంలోనే తెలంగాణలోని సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఎం.దశరథ్, ఆర్.వెంకటేష్, పద్మ, రమేష్, పాషా, విమల, చారి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

పీవీకి ఘన నివాళి



దివంగత ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు 103వ జయంతి సందర్భంగా పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులు అర్పించారు. శుక్రవారం నెక్లెస్‌రోడ్‌లోని పీవీ ఘాట్‌లో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మాజీ మంత్రులు జానారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, ప్రొఫెసర్ కోదండరామ్, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావుతో పాటు పీవీ కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీ వాణీదేవి, పీవీ ప్రభాకర్‌రావు తదితరులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పీవీ దేశానికి చేసిన సేవలనుస్మరించుకున్నారు.

– రాంగోపాల్‌పేట్



గోల్కొండ ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి కృషి

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ఇన్‌పేషెంట్ వార్డులో కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రి పనితీరు బావుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం ఆయన కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌తో కలిసి గోల్కొండ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఔట్ పేషంట్ విభాగం, ఇన్ పేషంట్ వార్డులు, ఐసీయూ, డయాలసిస్ వార్డులను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోల్కొండ ఏరియా ఆసుపత్రి సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని అన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు. అంతేకాకుండా ఇక్కడ జీహెచ్ఎంసీ మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న ఆపరేషన్ థియేటర్‌ను మరింత ఆధునీకరించడానికి నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే..కలెక్టర్‌ను కోరారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా, వైద్య విధాన పరిషత్ హైదరాబాద్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సునీత తదితరులున్నారు.

155 మంది రైల్వే ఉద్యోగుల పదవీ విరమణ



అడ్డగుట్ట: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ విభాగంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 115 మంది ఉద్యోగులు శుక్రవారం పదవీ విరమణ చేశారు. హెడ్‌క్వార్టర్స్, సికింద్రాబాద్, హైద్రాబాద్ డివిజన్‌లతో పాటు లాలాగూడ వర్క్‌షాపులో వీరు విధులు నిర్వహించారు. పదవీ విరమణ పొందిన వారికి రావాల్సిన గ్రాట్యుటీ తదితర బకాయిలు వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేయడానికి చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. వారికి వచ్చే పెన్షన్ పత్రాలు కూడా అందజేశారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన వారికి సికింద్రాబాద్ రైల్వే కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్మిక సంఘాల నాయకులు సీహెచ్.శంకర్‌రావు, భరణి భాను, షేక్ రవూఫ్‌లు పదవీ విరమణ పొందిన వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.

జులై 1 నుంచి ఫ్యాబ్‌సిటీకి బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: జులై ఒకటో తేదీ నుంచి సికింద్రాబాద్-ఫ్యాబ్ సిటీ మధ్య బస్సులు ప్రవేశపెట్టనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రతి రోజు 4 సిటీ ఆర్డినరీ బస్సులు ఈ రూట్‌లో రాకపోకలు సాగించనున్నాయి. సికింద్రాబాద్ నుంచి మొదటి బస్సు ఉదయం 6 గంటలకు, చివరి బస్సు సాయంత్రం 7.45 గంటలకు బయలుదేరుతుంది. ఫ్యాబ్‌సిటీ నుంచి మొదటి బస్సు ఉదయం 7.40 గంటలకు, చివరి బస్సు రాత్రి 9.35 గంటలకు బయలుదేరుతుంది. ఈ బస్సులు సికింద్రాబాద్, ఆలుగడ్డబావి, తార్నాక, ఎన్‌జీఆర్‌ఐ, సర్వే ఆఫ్ ఇండియా, నాగోల్, అల్కాపురి, సాగర్ రింగ్‌రోడ్డు, గాయత్రీ నగర్, చంపాపేట్, పిసల్‌బండ, ఫూల్‌బాగ్, బార్కాస్, జల్‌పల్లి క్రాస్‌రోడ్ పహడీషరీఫ్, సర్దార్‌నగర్, తుక్కుగూడ, ఇమామ్‌గూడ మీదుగా ఫ్యాబ్‌సిటీకి రాకపోకలు సాగించనున్నాయి.

'టెన్త్ అడ్వాన్స్‌డ్'లో 78.74 శాతం ఉత్తీర్ణత

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్‌లో పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలలో 78.74 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 20,449 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 15,665 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈసారి కూడా బాలికలే పైచేయిగా నిలిచారు. జిల్లాల వారిగా పరిశీలిస్తే హైదరాబాద్‌లో 71.22 శాతం, రంగారెడ్డి జిల్లాలో 77.99, మేడ్చల్ జిల్లాలో 87.03 శాతం ఉత్తీర్ణత సాధించారు.

వైద్య విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

సుల్తాన్‌బజార్: గాంధీ, ఉస్మానియా మెడికల్ కళాశాలలతో పాటు మరో ఏడు మెడికల్ కళాశాలల్లో చదువుతున్న అలైడ్ హెల్త్ సైన్స్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం కోఠి ఉస్మానియా వైద్య కళాశాలలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. తమ సమస్యలు పరిష్కరించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..కేఎన్ఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆల్మనాక్ లేకుండా సిలబస్ బోధన పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలిపి పాస్ చేయాలని డిమాండ్ చేశారు. పాస్ పర్సంటేజ్ 50 శాతం కాకుండా 40 శాతానికి తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే చలో యూనివర్సిటీ నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అన్వేష్, సచిన్, ఈశ్వర్, అఖిల్, సాయి, నవనీత్, చందు, సుష్మిత, దీపిక, సాత్విక పాల్గొన్నారు.

ఆర్టీఏ ఉద్యోగుల పెన్‌డౌన్



నిరసన చేపట్టిన ఆర్టీఏ ఉద్యోగులు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జేటీసీ రమేష్‌పై ఆటోసంఘాల జేఏసీ కన్వీనర్ అమానుల్లాఖాన్ దాడికి పాల్పడడాన్ని నిరసిస్తూ అధికార, ఉద్యోగసంఘాలు శుక్రవారం ఆందోళనకు దిగాయి. తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.రవీందర్ కుమార్, తెలంగాణ గ్రూప్-1 ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.హుస్సేనీ, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు కృష్ణాయాదవ్, రవాణా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎం.ఎస్.అరుణేందర్, డి.ప్రదీప్ రామకృష్ణ తదితర అధికార, ఉద్యోగసంఘాల నాయకులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. అధికారులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి తెలంగాణలోని అన్ని రవాణా కార్యాలయాల్లో పెన్‌డౌన్ చేపట్టారు. దీంతో ఉదయం రెండు గంటల పాటు కార్యకలాపాలు స్తంభించాయి. మరోవైపు ఖైరతాబాద్‌లోని రవాణా కమిషనర్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన ప్రదర్శనలో వివిధ సంఘాలకు చెందిన ప్రతినిధులు పాల్గొని రవాణా కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. తెలంగాణ డ్రైవింగ్ స్కూల్స్ అసోసియేషన్, రవాణాశాఖ కానిస్టేబుళ్ల అసోసియేషన్, తదితర సంఘాలు కూడా జేటీసీ రమేష్‌పై దాడిని తీవ్రంగా ఖండించాయి. కాగా దాడికి పాల్పడిన అమానుల్లాఖాన్‌ను శుక్రవారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, శనివారం, 29, జూన్, 2024

హైటెక్స్‌లో బ్యాటిల్ గ్రౌండ్స్..





దేశంలోని ప్రముఖ ఈ–స్పోర్ట్స్ ఆటగాళ్లు, ఆన్‌లైన్ గేమింగ్ ఔత్సాహికులంతా నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వేదికగా సందడి చేశారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన 'బ్యాటిల్‌గ్రౌండ్స్ మొబైల్ ఇండియా సిరీస్ 2024' (బీజీఐఎస్) ఎగ్జిబిషన్ సెంటర్ వేదికగా శుక్రవారం ప్రారంభమైంది. క్రాఫ్టన్ ఇండియా ఆధ్వర్యంలో భారతదేశపు అతిపెద్ద బ్యాటిల్ రాయల్ ఈ–స్పోర్ట్స్ ఈవెంట్‌లో ప్రావీణ్యులైన 16 ఈ–స్పోర్ట్స్ బృందాలు హోరాహోరీగా తలపడ్డాయి. 2 కోట్ల ప్రైజ్ మనీతో ప్రారంభించిన ఈ బ్యాటిల్‌గ్రౌండ్స్ మొబైల్ ఇండియా సిరీస్ 3 రోజుల పాటు కొనసాగనుంది. మొదటి రోజు ఎలక్ట్రిఫైయింగ్ ఫేస్–ఆఫ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌లు, అనుభవజ్ఞులైన ఆటగాళ్ల గ్రాండ్ ప్రైజ్ కోసం పోటీ పడ్డారు. పోటీలను వీక్షించడానికి ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లను తలపించేలా దాదాపు 2,500 మంది హాజరయ్యారు. మరో 4 వేల మంది వీక్షించడానికి పాస్‌లు కొనుగోలు చేశారని నిర్వాహకులు, క్రాఫ్టన్ ఇండియా ప్రతినిధి కరణ్ పథాక్ తెలిపారు. నగరంలో ఆన్‌లైన్ గేమర్ల సంఖ్య భారీగా పెరిగిందని, క్రాఫ్టన్ ఇండియా ఈస్పోర్ట్స్ యూట్యూబ్ ఛానెల్‌లో ఇంగ్లిష్, హిందీ, తెలుగు, కన్నడ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, తమిళం, మిజో, మలయాళం తదితర భాషల్లో ప్రత్యక్ష ప్రసారం చేశామని, రెండున్నర లక్షల మంది వీక్షించారని పేర్కొన్నారు. పాస్‌ల ద్వారా వచ్చిన ఆదాయాన్ని సాంప్రదాయ క్రీడలకు మద్దతుగా 'అభినవ్ బింద్రా ఫౌండేషన్'కు అందించనుండటం విశేషం. అభిమానులకు ఎంతో ఇష్టమైన ఈస్పోర్ట్స్ వ్యాఖ్యాతలు 'స్పెరో, అంకీ, మేజీ, జానీ తదితరుల థ్రిల్లింగ్ లైవ్ కామెంటరీకి అద్భుత స్పందన లభించింది.

ఆర్ట్ గ్యాలరీలో ఫొటో ఎగ్జిబిషన్..



మాదాపూర్: స్థానిక చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఫొటోగ్రఫీ చిత్రప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. మొమెంట్ అకాడమీ నిర్వహించిన ఈ ప్రదర్శనలో 50 మంది ఫొటోగ్రాఫర్‌లు తీసిన 56 చిత్రాలను అందుబాటులో ఉంచారు. మూడు రోజుల పాటు ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. భాష, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, అనురాధారెడ్డి, చంద్రశేఖర్‌సింగ్, కందుకూరి రమేశ్‌బాబు ప్రదర్శనను తిలకించి ఫొటోగ్రాఫర్‌లను అభినందించారు.

మ్యాక్స్ మాన్యా ప్రారంభం..



నగర ఫ్యాషన్ ఔత్సాహికులను అలరించేందుకు మ్యాక్స్ ఫ్యాషన్ ఆధ్వర్యంలో 'మాన్యా సెల్' ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. అధునాతన ఫ్యాషన్‌కు వేదికైన నగరంతో పాటు దేశవ్యాప్తంగా మ్యాక్స్ ఫ్యాషన్ ప్రియులకు నేటి నుంచి ఆఫర్ అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. ఫ్యాషన్ రంగంలో ఇప్పటి వరకూ ఎక్కడా లేని విధంగా రూ.399 లోపే స్పెషల్ మాన్యా సెల్ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.

'క్యూబిక్'లో తారల సందడి



బంజారాహిల్స్‌లోని 'క్యూబిక్' స్టోర్ వేదికగా ప్రముఖ సినీతార శోభితా ధూళిపాళ సందడి చేశారు. సంప్రదాయం, ఆధునికత వస్త్ర మేళవింపుతో ఏర్పాటు చేసిన క్యూబిక్ స్టోర్ శుక్రవారం ప్రముఖ పారిశ్రామిక వేత్త పింకీ రెడ్డి ప్రారంభించారు. అధునాతన ఫ్యాషన్‌కు వేదికైన నగరంలో క్యూబిక్ తన ప్రశస్తిని చాటుకుంటుందని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన సినీ నటి శోభితా ధూళిపాళ విభిన్నమైన డిజైన్స్ గురించి డిజైనర్లను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ఫ్యాషన్ హంగులు ఆవిష్కృతమవ్వడం అభినందనీయమన్నారు. ప్రముఖ సినీ నిర్మాత ఎలాహె హిప్టూలా, వ్యాపారవేత్త సుధా రెడ్డి, మోడల్స్, క్యూబిక్ యజమాని గురీందర్‌సింగ్, ఫ్యాషన్ ఔత్సాహికులు పాల్గొన్నారు.

మంత్రముగ్ధం.. మన్యం వీరుడి నృత్య రూపకం





గన్‌ఫౌండ్రీ: కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సౌజన్యంతో శంకరానంద కళాక్షేత్ర శతాబ్ది వార్షికోత్సవ వేడుకలు రవీంద్రభారతిలో శుక్రవారం నిర్వహించారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆనందశంకర్ జయంత్ దర్శకత్వం వహించిన అల్లూరి సీతారామరాజు జీవిత గాథను నృత్యరూపకంలో ప్రదర్శించారు. స్వతంత్ర సమరయోధుల విజయ గాథలను నేటి యువతరానికి అందించాలనే లక్ష్యంతో ఈ నృత్య రూపకాన్ని రాసినట్లు తెలిపారు. తాను పుట్టుకతో తమిళ్ అయినప్పటికీ తన ఆత్మ తెలుగే అన్నారు. అంతకు ముందు సంస్థకు చెందిన 21మంది కళాకారులు మన్యం వీరుడి పేరుతో ప్రదర్శించిన నృత్య రూపకం ఆహూతులను మంత్రముగ్ధులను చేసింది. భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, రమాభరద్వాజ్ పాల్గొన్నారు.

ఎన్‌కన్వెన్షన్‌లో డిజైర్ డిజైనర్..

మాదాపూర్: పలువురు డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని ఎన్‌కన్వెన్షన్‌లో శుక్రవారం డిజైర్ డిజైనర్స్ ఎగ్జిబిషన్‌ను ప్రముఖ మోడల్ ఊర్మిళా చౌహాన్, పలువురు మోడల్స్‌తో కలసి నిర్వాహకురాలు అనితా అగర్వాల్ ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఎగ్జిబిషన్‌లో సంప్రదాయ వస్త్రాలతో పాటు వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక డిజైన్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పలువురు మోడల్స్ పాల్గొన్నారు.



కదలండి.. బాస్!

నిశ్చల జీవన శైలితో రోగాలే



- దేశంలో శారీరక శ్రమ లేనివారు 49.4% మంది
- పురుషులతో పోలిస్తే మహిళల్లో 57% ఎక్కువ
- నగరంలో ఫిజికల్ యాక్టివిటీ లేనివాళ్లు 53.6%
- 15–49 ఏళ్ల మధ్య వయస్కుల్లోనే ఈ పరిస్థితి అధికం
- ది లాన్సెట్ గ్లోబల్ హెల్త్ మెడికల్ జర్నల్‌లో వెల్లడి

నగరంతో పాటు దేశవ్యాప్తంగా అధ్యయనం చేసి ది లాన్సెట్ గ్లోబల్ హెల్త్ మెడికల్ జర్నల్‌లో ప్రచురించిన తాజా సమాచారం ప్రకారం.. గత 2022లో ప్రతీ ఇద్దరు వయోజనులలో ఒకరు ఆరోగ్యానికి అవసరమైన కనీసపు శారీరక శ్రమ స్థాయిని కూడా అందుకోలేకపోయారు. ప్రపంచవ్యాప్తంగా, శారీరక శ్రమ లేని పెద్దల శాతం 31% కాగా మన దేశంలో మాత్రం ఇది 49.4% గా ఉంది. మగవాళ్లతో పోలిస్తే మహిళల్లో 57 శాతం మంది కనీసపు శారీరక శ్రమకు సైతం దూరంగా ఉన్నారని అధ్యయనం తేల్చింది. ప్రస్తుత ట్రెండ్ ఇలాగే కొనసాగితే 2030 నాటికి 59.9%కి చేరుతుందని రోగాల నిలయంగా మారుస్తుందని హెచ్చరిస్తున్నారు ఈ నేపథ్యంలో ఫిజికల్ యాక్టివిటీపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

నిశ్చల జీవనశైలి కారణంగా పలు రకాల వ్యాధులకు చిరునామాగా నగరం మారబోతోందని గతంలోనే జరిగిన ఓ అధ్యయనం పేర్కొంది. నగరంలో 53.6 శాతం మంది శారీరక శ్రమకు దూరంగా ఉన్నారని ఉస్మానియా ఆసుపత్రి, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అధ్యయనం స్పష్టం చేసింది. ఈ అధ్యయనం అప్పట్లో ఇండియన్ జర్నల్ ఆఫ్ బేసిక్ అండ్ అప్లైడ్ మెడికల్ రిసెర్చ్‌లో ప్రచురితమైంది. అదే విధంగా అబ్డామినల్ ఒబెసిటీ (పొత్తికడుపు పైన కొవ్వు పేరుకుపోవడం) అనేది మన నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పెరుగుతోందని గత ఏడాది జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తేల్చింది. 15–49 ఏళ్ల మధ్య వయస్కులైన మహిళలు, పురుషుల్లో ఈ పరిస్థితికి కారణం నిశ్చల జీవన శైలేనని స్పష్టం చేసింది.

శ్రమనోచని శరీరం.. వ్యాధుల కుటీరం

ఏదైనా సరే శారీరక కదలికను శారీరక శ్రమగా పరిగణిస్తారు. శరీరాన్ని కాకుండా మెదడుకు అధికంగా కల్పించే పని ఒత్తిడితో నగర జనజీవనం ఒక్కసారిగా మారిపోయింది. ఆఫీసుల్లో గంటల తరబడి పని, ఇంటికి ఆఫీసులకు మధ్య ప్రయాణం, వారాంతపు విరామంలో విశ్రాంతి.. ఇది శారీరక శ్రమ తగ్గిపోవడానికి పోషకాహార లోపాలకు దారితీసింది. శారీరక శ్రమ లోపం .. ప్రపంచ ఆరోగ్యానికి నిశ్శబ్ద ముప్పు, ఇది దీర్ఘకాలిక వ్యాధుల భారానికి గణనీయంగా దోహదం చేస్తుంది. అని డబ్ల్యూహెచ్ఓ హెల్త్ ప్రమోషన్ డైరెక్టర్ డాక్టర్ రూడిగర్ క్రైచ్ అన్నారు. గుండెపోటు స్ట్రోక్‌లతో సహా హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని ఇది పెంచుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇవి కాక మధుమేహం, చిత్తవైకల్యం, రొమ్ము పెద్దపేగు క్యాన్సర్లు ముప్పు వీటన్నింటికీ దారి తీస్తుందంటున్నారు.

అనారోగ్యాలతో ఆస్పత్రుల చుట్టూ..

దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న వారితో పాటు రక్త పరీక్షలు పోషకాహార మార్గదర్శకాల కోసం ప్రతిరోజూ దాదాపు 5–10 మంది నగర ఆస్పత్రులకు వస్తున్నారు. ఈ ధోరణి పేలవమైన ఆహారపు అలవాట్లు అధిక ఒత్తిడి స్థాయిల కలయిక కారణమని, వీటన్నింటికీ మూలం నిశ్చల జీవనశైలి అని చెబుతున్నారు. జీర్ణక్రియ సమస్యలు, మలబద్ధకం, ఉబ్బరం ఆమ్లత్వంతో సహా రోగులలో జీర్ణాశయ సమస్యలు సర్వసాధారణంగా మారాయని చెప్పారు. అలాగే.. అధిక ట్రైగ్లిజరైడ్స్, అధిక రక్తపోటు, డైస్లిపిడెమియా అధిక బరువుతో కూడిన మెటబాలిక్ సింక్రోమ్ కేసులలోనూ పెరుగుదల కనిపిస్తోంది. ఈ పరిస్థితులకు అనారోగ్య జీవనశైలి, ఒత్తిడి క్రమరహిత నిద్ర విధానాలు కారణమని పేర్కొన్నారు. సరైన పోషకాహారం, వ్యాయామం ఆరోగ్యకరమైన జీవనశైలి పద్ధతులను అవలంబించడం ద్వారా మాత్రమే ఈ సమస్యలను ఎదుర్కోవచ్చునని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.



వర్కవుట్.. వ్యాధులు అవుట్..

ప్రపంచ ఆరోగ్య సంస్థ కథనం ప్రకారం.. వారానికి 150 నిమిషాల మితమైన–తీవ్రతతో కూడిన శారీరక శ్రమ లేదా 75 నిమిషాల తీవ్రమైన–తీవ్రతతో కూడిన శారీరక వ్యాయామంలో పెద్దలు పాల్గొనాలి. నడక, సైక్లింగ్, ఆటలు మాత్రమే కాదు శారీరక శ్రమతో కూడిన ఇంటి పనులు చేయడం కూడా శారీరకంగా చురుగ్గా ఉండటానికి వీలు కల్పిస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. సాధారణ శారీరక శ్రమ మధుమేహం ప్రమాదాన్ని 17%, గుండె జబ్బులు, పక్షవాతం 19%, డిప్రెషన్, చిత్తవైకల్యం 28–32% అనేక రకాల క్యాన్సర్‌ల ప్రమాదాలను 8–28% తగ్గిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా వ్యక్తుల్లో చురుకుదనం అవసరమైనంత పెరిగితే , ఏటా 4–5 మిలియన్ల మరణాలను నివారించవచ్చని అంచనా.

కనీస నడక లేకుంటే కష్టాలే..



"ప్రస్తుతం నగరవాసుల్లో చాలా మందికి కనీసపు శారీరక శ్రమ ఉండడం లేదు. వృద్ధాప్యంలో రావాల్సిన రోగాలు యుక్త వయసులోనే వచ్చేస్తున్నాయి. మేం ప్రిస్క్రిప్షన్‌లో మందులు మాత్రమే కాదు వాకింగ్, వ్యాయామాల గురించి కూడా చెబుతున్నాం. ఓ వ్యక్తి రోజుకు కనీసం 5వేల నుంచి 6వేల అడుగులు నడవాలి. యుక్త వయస్కులు 2వేల అడుగులు కూడా నడవడం లేదు. మరి రోగాలు రాకుండా ఎలా ఆపగలం? ముఖ్యంగా హృద్రోగాలు, హార్ట్ ఎటాక్స్ ఇప్పుడు సర్వసాధారణంగా మారిపోవడానికి కదలిక లేని జీవనశైలే కారణం. ముందుగా 15 నుంచి 20 నిమిషాల నడకతో ప్రారంభించి ఏదైనా ఆసక్తి ఉన్న ఆటలు ఆడడం.. ఇలా శారీరక కదలికల్ని రోజువారీ జీవితంలో భాగం చేయాల్సిందే దీనికి ప్రత్యామ్నాయం లేదని అందరూ గుర్తించాలి."

– డా.కిరణ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, ఓనస్ హార్ట్ ఇనిస్టిట్యూట్

కదలికల లోపానికి కారణాలెన్నో..



కోవిడ్ తర్వాత ఒక విధానంగా మారిపోయిన వర్క్ ఫ్రమ్ హోమ్, ఇంట్లో వండిన భోజనం కంటే ఆన్‌లైన్‌లో ఆహారాన్ని ఆర్డర్ చేయడానికి ఇష్టపడటానికి ఫుడ్ డెలివరీ సేవల సౌలభ్యం దారితీసింది దాంతో విపరీతంగా పెరిగిన ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సేవల వినియోగం, పెరిగిన రెడీ–టు–ఈట్ మీల్స్‌కు ప్రాధాన్యం వంటివి నిశ్చల జీవనశైలి పెరగడానికి కారణమని నగర వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ మార్పులు సిటీజనుల ఆహారపు అలవాట్లను తద్వారా ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేశాయని నగరానికి చెందిన పోషకాహార నిపుణురాలు రుచికా చెప్పారు. ఇటీవల రకరకాల ఆరోగ్య సమస్యలు, శారీరక చురుకుదనం లోపించిన కారణంగా నిపుణులను సంప్రదించే వారిలో యువకుల సంఖ్య గణనీయంగా ఉండడం గమనార్హం అంటున్నారామె. 100 కిలోలకు దగ్గరగా ఉన్న 17–19 సంవత్సరాల నగర యువతకు ట్రీట్ చేశానని తెలిపారు. ఈ భయంకర పరిస్థితికి తీవ్రమైన నిశ్చల జీవనశైలి కారణమని స్పష్టం చేశారు. వీరిలో కొందరు ప్రీ–డయాబెటిస్ పరిస్థితిలో ఉన్నారని చెప్పారు.

గోదాట్లో ముంచేసి 'తెల్ల'మోహం!

శ్వేతపత్రం పేరుతో చేతులెత్తేసిన సీఎం చంద్రబాబు ● తన చారిత్రక తప్పిదాలతో జరిగిన విధ్వంసాన్ని వైఎస్ జగన్‌పై నెట్టేయత్నం

సాక్షి, అమరావతి: పోలవరం పనులను ఈనెల 17న క్షేత్రస్థాయిలో పరిశీలించిన సమయంలో వ్యవహరించిన రీతిలోనే శ్వేతపత్రం పేరుతో శుక్రవారం సీఎం చంద్రబాబు మరోసారి పచ్చి అబద్ధాలను కళ్లార్పకుండా చెప్పేశారు! నిజాలను నిస్సిగ్గుగా గోదాట్లో కలిపేశారు! 2014 జూన్ 8 నుంచి 2019 మే 29 మధ్య గతంలో తాను అధికారంలో ఉన్నప్పుడు కమీషన్ల దాహంతో చేసిన చారిత్రక తప్పిదాల వల్ల ప్రాజెక్టులో జరిగిన విధ్వంసం.. ఫలితంగా పనుల్లో జరుగుతున్న జాప్యాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్‌పై నెడుతూ నిస్సిగ్గుగా పచ్చి అబద్ధాలు వల్లించారు. వైఎస్ జగన్‌పై వ్యక్తిగత దూషణలకు దిగి తన ఉక్రోషాన్ని వెళ్లగక్కారు. ప్రాజెక్టును ఎప్పటిలోగా పూర్తి చేస్తారన్నది మాత్రం చెప్పలేకపోయారు. చంద్రబాబు సర్కార్ 2014–19 మధ్య చేసిన చారిత్రక తప్పిదాలను 2019 మే 30న సీఎంగా బాధ్యతలు చేపట్టగానే సరిదిద్దుతూ కరోనా లాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ రికార్డు సమయంలో స్పిల్‌వే, స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్, పైలట్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను వైఎస్ జగన్ పూర్తి చేశారు. 2021 జూన్ 11న గోదావరి వరద ప్రవాహాన్ని స్పిల్‌వే మీదుగా 6.1 కి.మీ. పొడవున మళ్లించారు. కుడి కాలువతో పాటు ఎడమ కాలువలో అత్యంత కీలకమైన వరాహ నదిపై అక్విడెక్టు లాంటి కీలక నిర్మాణాలతో పాటు కుడి, ఎడమ కాలువలను జలాశయంతో అనుసంధానం చేసే కనెక్టివిటీస్‌ను పూర్తి చేశారు. 960 మెగావాట్ల జలవిద్యుత్కేంద్రం పనులను కొలిక్కితెచ్చారు. చంద్రబాబు సర్కార్ చారిత్రక తప్పిదాలకు పాల్పడకపోయి ఉంటే 2022 జూన్ నాటికే వైఎస్ జగన్ పోలవరాన్ని పూర్తి చేసి ఉండేవారని సాగునీటిరంగ నిపుణులు, అధికార వర్గాలు తేల్చిచెబుతున్నాయి. పోలవరాన్ని కమీషన్ల కోసం బాబు ఏటీఎంగా మార్చుకున్నారని 2019లో ప్రధాని మోదీ చేసిన ఆరోపణలే నాడు టీడీపీ సర్కార్ అవినీతికి నిదర్శనమని గుర్తు చేస్తున్నారు.

పోలవరం వైఎస్సార్ స్వప్నం..

పోలవరం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 194.6 టీఎంసీలు కాగా కుడి, ఎడమ కాలువల కింద 7.20 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కృష్ణా, గోదావరి డెల్టాల్లో 23.5 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించవచ్చు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా 8 లక్షల ఎకరాలకు నీళ్లందించవచ్చు. విశాఖ తాగు, పారిశ్రామిక అవసరాలతోపాటు 28.5 లక్షల మంది దాహార్తిని తీర్చవచ్చు. 960 మెగావాట్ల జల విద్యుత్ కూడా అందుబాటులోకి వస్తుంది. అందుకే పోలవరాన్ని ఆంధ్రప్రదేశ్ జీవనాడిగా అభివర్ణిస్తారు. 1941లోనే ఈ ప్రాజెక్టును నిర్మించాలని ప్రతిపాదించినా 2005 వరకూ ఏ ఒక్క సీఎం కూడా కన్నెత్తి చూడటానికి కూడా సాహసించలేకపోయారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేస్తూ 2005లో పోలవరం పనులను ప్రారంభించారు. కుడి, ఎడమ కాలువలలో అధిక భాగం పనులు చేయించారు. జలాశయం పనులకు అవసరమైన భూమిలో అధిక భాగం సేకరించారు. జలాశయం పనులను కొలిక్కి తెచ్చే క్రమంలోనే మహానేత అమరుడయ్యారు. వైఎస్సార్‌కు ముందు 1995 నుంచి 2004 మధ్య ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా ఉన్న చంద్రబాబు ఏ రోజూ పోలవరం పనులు చేపట్టాలని ఆలోచన చేసిన పాపాన పోలేదు.


వైఎస్ జగన్ హయాంలో పూర్తి చేసిన స్పిల్‌వే పనులు


2019 మార్చి నెలలో పోలవరం స్పిల్‌వే పరిస్థితి ఇదీ...

ఇప్పుడు పోలవరాన్ని తన కలగా చంద్రబాబు అభివర్ణించడం గమనార్హం.

చారిత్రక తప్పిదం వల్లే విధ్వంసం..

- విభజన నేపథ్యంలో 2014లో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం వంద శాతం వ్యయాన్ని తామే భరించి పూర్తి చేస్తామని విభజన చట్టంలో హామీ ఇచ్చింది. ఆ మేరకు పనులు చేపట్టేందుకు పీపీఏ (పోలవరం ప్రాజెక్టు అథారిటీ)ని ఏర్పాటు చేసింది. 2014 జూన్ 8న సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు పీపీఏతో ఒప్పందం చేసుకోకుండా పోలవరం నిర్మాణ బాధ్యతలను రాష్ట్రానికి అప్పగించాలని కేంద్రాన్ని కోరుతూ వచ్చారు. ఈ క్రమంలో ప్రత్యేక హోదాను కూడా తాకట్టు పెట్టేందుకు సిద్ధమవడంతో 2016 సెప్టెంబరు 7న అర్ధరాత్రి పోలవరం నిర్మాణ బాధ్యతలను రాష్ట్రానికి కేంద్రం అప్పగించింది. నీటిపారుదల విభాగానికి అయ్యే వ్యయాన్ని మాత్రమే 2013–14 ధరల మేరకు ఇస్తామని కేంద్రం పెట్టిన మెలికకు చంద్రబాబు అంగీకరించారు. ఆ మరుసటి రోజే అంటే 2016 సెప్టెంబరు 8న హెడ్‌వర్క్స్ (జలాశయం) పనుల అంచనా వ్యయాన్ని రూ.1,481 కోట్లు పెంచేశారు.
- ప్రాజెక్టు కన్‌స్ట్రక్షన్ ప్రోటోకాల్‌ను తుంగలో తొక్కిన చంద్రబాబు కమీషన్ల దాహంతో ప్రధాన కాంట్రాక్టర్ ట్రాన్స్‌ట్రాయ్‌ని అడ్డుపెట్టుకుని పనులన్నీ సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించారు. గోదావరి వరదను మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ చానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులను పూర్తి చేయకుండానే.. 2017 నవంబర్‌లో ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో 1,396 మీటర్ల పొడవున పునాది డయాఫ్రమ్ వాల్ పనులు చేపట్టి 2018 జూన్ 11 నాటికి పూర్తి చేశారు.
- స్పిల్‌వే పునాది స్థాయిలో ఉండగానే.. 2018 నవంబర్‌లో 35 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తామని పీపీఏ, సీడబ్ల్యూసీకి హామీ ఇచ్చి ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను చంద్రబాబు ప్రారంభించారు. వాటిని ప్రధాన ప్రాజెక్టుగా భ్రమింపజేసి 2019 ఎన్నికల్లో లబ్ధి పొందాలన్నది ఆయన ఎత్తుగడ. కానీ 2019 ఫిబ్రవరి నాటికి కూడా నిర్వాసితులకు పునరావాసం కల్పించలేదు. నిర్వాసితులకు పునరావాసం కల్పించలేక.. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేసి చివరకు చేతులెత్తేశారు.
- 2019 మే 30న సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. 2019 జూన్ రెండో వారంలోనే గోదావరికి వరద ప్రారంభమైంది. ఆ ఏడాది వచ్చిన భారీ వరద ప్రవాహం ఎగువ కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల గుండా అధిక ఉధృతితో ప్రవహించడంతో ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై సగటున 26 నుంచి 36.5 మీటర్ల లోతుతో భారీ అగాధాలు ఏర్పడ్డాయి. ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో డయాఫ్రమ్‌వాల్ కోతకు గురై నాలుగు చోట్ల 485 మీటర్ల మేర దెబ్బతింది.
- ఎగువ కాఫర్ డ్యామ్ ఇరువైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేయడం వల్లే గోదావరి వరద అధిక ఉధృతితో ప్రవహించి ఈసీఆర్‌ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో కోతకు గురై విధ్వంసం చోటు చేసుకుందని, డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని, ఇది పూర్తిగా మానవ తప్పిదం వల్లే జరిగిందని ఐఐటీ–హైదరాబాద్, ఎన్‌హెచ్‌పీసీ (నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్) నిపుణులు స్పష్టంగా తేల్చిచెప్పారు. తద్వారా చంద్రబాబు నిర్వాకాలను నిర్ధారించారు. 2019 మే 30న వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు స్వీకరించగా అదే ఏడాది జూన్ రెండో వారంలో వరద ప్రారంభమైంది.

కొసమెరుపు...

"గోదావరి వరద ప్రవాహాన్ని మళ్లించేలా ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను కట్టాలి. కట్టాక ఎర్త్ కమ్ ర్యాక్ ఫిల్ డ్యామ్ పునాది డయాఫ్రమ్ వాల్ వేయాలి"అని అన్యాపదేశంగా తాజాగా సీఎం చంద్రబాబు అంగీకరించడం కొసమెరుపు. కాఫర్ డ్యామ్‌ల జీవితకాలం మూడు నాలుగేళ్లకు మించి ఉండదని అధికారులకు చెబుతున్న సమయంలో అన్యాపదేశంగా తాను చేసిన చారిత్రక తప్పిదాన్ని అంగీకరించారు.

అలాంటప్పుడు 12 రోజుల్లో కాఫర్ డ్యామ్‌ల ఖాళీలను పూర్తి చేసి, నిర్వాసితులకు పునరావాసం కల్పించడం అసాధ్యం. దీన్నిబట్టి నాడు చంద్రబాబు సర్కార్ తప్పిదం వల్లే ఈ విధ్వంసం చోటుచేసుకుందని ఐఐటీ–హైదరాబాద్, ఎన్‌హెచ్‌పీసీలు తేలిచ్చెప్పినట్లు స్పష్టమవుతోంది. తాను చేసిన ఈ చారిత్రక తప్పిదాన్ని వైఎస్ జగన్‌పై నెట్టేందుకు చంద్రబాబు పదేపదే యత్నిస్తుండటాన్ని నిపుణులు తప్పుబడుతున్నారు.

సవాళ్లను అధిగమిస్తూ వడివడిగా..

– చంద్రబాబు చారిత్రక తప్పిదాల వల్ల పోలవరంలో చోటుచేసుకున్న విధ్వంసాన్ని చక్కదిద్దుతూ పనులను వైఎస్ జగన్ ప్రణాళికాబద్ధంగా పరుగులెత్తించారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులను ప్రారంభించడానికి ముందు అంటే 2018 నవంబర్‌కు ముందు.. నిర్మాణ వ్యయాన్ని తగ్గించుకోవడం కోసం గోదావరిలో ఇసుక సాంద్రతను ట్రాన్స్‌ట్రాయ్ తప్పుగా లెక్కించింది. ఆ తప్పుడు లెక్క ప్రకారమే ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లకు పునాదిగా 20 మీటర్ల లోతు నుంచి స్టోన్ కాలమ్స్ వేసి జెట్ గ్రౌటింగ్ చేసింది. కానీ.. గోదావరి ఇసుక సాంద్రతను పరిగణలోకి తీసుకుంటే 30 నుంచి 35 మీటర్ల లోతు నుంచి స్టోన్ కాలమ్స్ వేసి జెట్ గ్రౌటింగ్ చేయాలి. కానీ 20 మీటర్ల లోతులోనే స్టోన్ కాలమ్స్ వేసి జెట్ గ్రౌటింగ్ వేయడం వల్ల ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లలో లీకేజీలు అధికంగా ఉన్నాయి. ఆ లీకేజీలను అధిగమిస్తూ ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన భారీ అగాధాలను ఇసుకతో పూడ్చి వైబ్రో కాంపాక్షన్ చేస్తూ యథాస్థితికి తెచ్చారు.
- దెబ్బతిన్న డయాఫ్రమ్‌వాల్ స్థానంలో సమాంతరంగా కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మించాలా? లేదంటే దెబ్బతిన్న చోట్ల 'యూ'ఆకారంలో కొత్త డయాఫ్రమ్‌వాల్ నిర్మించి పాత దానితో అనుసంధానం చేయాలా? అనే విషయంపై తేల్చిచెబితే 18 నెలలల్లోగా ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని 2022 డిసెంబర్ నుంచి వైఎస్ జగన్ కేంద్రాన్ని కోరుతూ వచ్చారు.
- 2013–14 ధరల ప్రకారం పోలవరం అంచనా వ్యయం రూ.20,396 కోట్లుగా ఉంది. అయితే 2017–18 ధరల ప్రకారం నిర్వాసితుల పునరావాసం, భూసేకరణకే రూ.33 వేల కోట్లు అవసరం. ఈ నేపథ్యంలో పాత ధరలతో ప్రాజెక్టును పూర్తి చేయడం అసాధ్యమని, తాజా ధరల మేరకు నిధులిచ్చి పోలవరం పూర్తి చేసేందుకు సహకరించాలని ప్రధాని మోదీని నాడు వైఎస్ జగన్ పలుదఫాలు కోరారు. దీనిపై ఎట్టకేలకు సానుకూలంగా స్పందించిన ప్రధాని మోదీ ఆ మేరకు నిధులు విడుదల చేయాలని కేంద్ర జల్ శక్తి శాఖను ఆదేశించారు. ఈ నేపథ్యంలో తొలి దశ పూర్తికి రూ.12,157.53 కోట్లు విడుదల చేయాలని సూచిస్తూ మార్చి 6న కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ కేంద్ర కేబినెట్‌కు ప్రతిపాదనలు పంపారు. అయితే అప్పటికే బీజేపీతో టీడీపీకి పొత్తు కుదరడంతో నిధులు ఇచ్చే ఫైలుపై ఆమోదముద్ర వేస్తే రాజకీయంగా ఇబ్బందులు వస్తాయని భావించిన చంద్రబాబు తెరచాటున బీజేపీ పెద్దలతో మంత్రాంగం నడిపారు. దీంతో ఆ ఫైలును కేంద్ర కేబినెట్ పక్కన పెట్టింది.

45.72 మీటర్లకు ఒక్క ఇంచ్ కూడా తగ్గదు..

పోలవరం ఎత్తును 41.15 మీటర్లకు తగ్గిస్తున్నారంటూ 2021 నుంచి పాడుతున్న పాటనే చంద్రబాబు తాజాగా మరోసారి పాడారు. అయితే ప్రాజెక్టు స్పిల్‌వేను ఇప్పటికే నిర్మించామని.. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పూర్తయ్యాక టేపు తీసుకుని వెళ్లి కొలుచుకోవాలని.. 45.72 మీటర్ల కంటే ఒక్క ఇంచ్ కూడా తగ్గదని 2021 నుంచి 2024 దాకా వైఎస్ జగన్ చెబుతూనే ఉన్నారు. అప్పటి కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ కూడా ఇదే అంశాన్ని లోక్‌సభ, రాజ్యసభలో రాతపూర్వకంగా తేల్చి చెప్పారు. ఏదైనా ప్రాజెక్టు పూర్తయ్యాక డ్యామ్ భద్రత దృష్ట్యా ఒకేసారి గరిష్ట స్థాయిలో నీటిని నిల్వ చేయరు. సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు ప్రాజెక్టు పూర్తయిన మొదటి ఏడాది నీటి నిల్వ సామర్థ్యంలో 1/3వ వంతు.. ఆ తర్వాత నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తూ 2/3వ వంతు.. డ్యామ్ భద్రతను పరిశీలిస్తూ, నిర్వాసితులకు పునరావాసం కల్పించి మూడో ఏడాది పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేస్తారు. ఈ మార్గదర్శకాల మేరకే పోలవరంలో తొలి ఏడాది 41.15 మీటర్ల ఎత్తులతో నీటిని నిల్వ చేస్తారు. దాన్నే ప్రాజెక్టు ఎత్తుగా చంద్రబాబు చిత్రీకరించటాన్ని అధికారవర్గాలే తప్పుబడుతున్నాయి.

పోలవరం పనులను 2014–19 మధ్య తాను 72 శాతం చేస్తే.. 2019–24 మధ్య వైఎస్ జగన్ అరకొరగా చేశారంటూ సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. కానీ.. పోలవరం పనులు ఇప్పటికి పూర్తయింది 49.79 శాతమే. ఇందులో 2005 నుంచి 2019 మధ్య జరిగిన పనులు 24.85 శాతం కాగా మిగతా 24.94 శాతం పనులు 2019–24 మధ్య వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో పూర్తి కావడం గమనార్హం. 2005–14 మధ్య దివంగత వైఎస్సార్ హయాంలో రూ.4,730.71 కోట్ల విలువైన పనులు జరిగాయి. 2014–19 మధ్య చంద్రబాబు రూ.10,649.39 కోట్లు వ్యయం చేశారు. 2019–24 మధ్య వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో రూ.8,629 కోట్లు వ్యయం చేశారు. వాస్తవం ఇలా ఉంటే.. 2014–19 మధ్య తాను రూ.11,762.47 కోట్లు వ్యయం చేశానని.. 2019–24 మధ్య కేవలం రూ.4,167 కోట్లను మాత్రమే జగన్ సర్కార్ ఖర్చు చేశారని చంద్రబాబు చెప్పడం విస్మయం కలిగిస్తోంది. ఇక పోలవరం పనులకు రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి వెచ్చించిన రూ.3,385.58 కోట్లను కేంద్రం రీయింబర్స్ చేసింది. అంటే.. ఆ డబ్బు రాష్ట్ర ఖజానాలోకి చేరింది. కానీ.. దాన్ని వైఎస్ జగన్ సర్కార్ దారి మళ్లించినట్లుగా చంద్రబాబు చిత్రీకరించడాన్ని ఆర్థిక నిపుణులు తప్పుబడుతున్నారు.

14 ఏళ్లలో... 24.85%
ఐదేళ్లలోనే... 24.94%

బాబు చేస్తే ఒప్పు.. జగన్ చేస్తే తప్పా?

పోలవరం హెడ్ వర్క్స్ పనుల నుంచి ప్రధాన కాంట్రాక్టర్ ట్రాన్స్‌ట్రాయ్‌ని 2018లో తప్పించి రూ.2,917 కోట్ల విలువైన వాటిని నామినేషన్ పద్ధతిలో నవయుగకు నాడు చంద్రబాబు అప్పగించడాన్ని పీపీఏ తప్పుబట్టింది. దేశ చరిత్రలో నామినేషన్ పద్ధతిలో ఇంత పెద్ద ఎత్తున పనులు కట్టబెట్టిన దాఖలాలు ఎక్కడా లేవు. కాంట్రాక్టర్‌ను మార్చితే పనుల్లో ఏదైనా సమస్య తలెత్తితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ అప్పటి కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి అమర్జీత్‌సింగ్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక చంద్రబాబు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టిన పనులను 2019 ఆగస్టులో రద్దు చేసి, వాటికి జలవిద్యుత్కేంద్రం పనులను జత చేసి రివర్స్ టెండరింగ్ నిర్వహించారు. దీని ద్వారా ఖజానాకు రూ.784 కోట్లు ఆదా అయ్యాయి. రివర్స్ టెండరింగ్‌తో తన అక్రమాలు బయటపడటాన్ని జీర్ణించుకోలేని చంద్రబాబు కాంట్రాక్టర్‌ను మార్చడం వల్లే పోలవరం పనుల్లో విధ్వంసం చోటుచేసుకుందని తాజాగా సూత్రీకరించడం గమనార్హం. రివర్స్ టెండరింగ్‌లో పనులు దక్కించుకున్న మేఘా సంస్థ గోదావరి వరద తగ్గాక 2019 నవంబర్‌లో పనులు ప్రారంభించింది. 2020 మార్చి నుంచి 2021 ఆఖరు వరకూ కరోనా విజృంభించినా పనులను కొనసాగించింది. చంద్రబాబు సర్కార్ పునాది స్థాయిలోనే వదిలేసిన స్పిల్‌వేను 48 గేట్లతో సహా రికార్డు సమయంలో పూర్తి చేసింది వైఎస్ జగన్ ప్రభుత్వమే. స్పిల్‌వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేసి 2021 జూన్ 11న గోదావరి వరద ప్రవాహాన్ని స్పిల్‌వే మీదుగా 6.1 కి.మీ. పొడవున మళ్లించారు. వాస్తవాలు ఇలా ఉండగా 2021 వరకూ కాంట్రాక్టర్ లేకపోవడం వల్ల పనులు ఆగిపోయినట్లు సీఎం చంద్రబాబు చెప్పడంపై అధికార వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది.

బాబు తప్పిదాలే శాపం



- టీడీపీ హయాంలోనే వ్యూహాత్మక తప్పిదాలు
- మాజీ మంత్రి అంబటి ధ్వజం
- అన్ని అనుమతులూ తీసుకొచ్చింది డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డే
- కేంద్రం పూర్తి చేయాల్సిన ప్రాజెక్టును బాబు ఎందుకు తీసుకున్నారు?

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



- ఇంకో ఆర్నెళ్లు సందిగ్ధ వాతావరణమే
- వేచి చూసే ధోరణిలో కొనుగోలుదారులు
- స్థిరమైన నిర్ణయాలు, పాలసీల అమలుతో మళ్లీ జోరు
- గృహ కొనుగోళ్లకు ఇదే కరెక్ట్ టైం

సాక్షి, హైదరాబాద్: రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారడం స్థిరాస్తి మార్కెట్‌పై గట్టి దెబ్బే పడింది. సాధారణంగా హైదరాబాద్‌లో 80 శాతం గృహ కొనుగోలుదారులు తెలుగు మాట్లాడే వాళ్లే ఉంటారు. ఇందులోనూ 30 శాతం మాత్రమే స్థానికులు కాగా.. 70 శాతం పొరుగు రాష్ట్రాలకు చెందిన వాళ్లు ఉంటారు. అది ఇన్వెస్టర్లయినా, రిటైల్ కస్టమర్లయినా సరే! అయితే ఇటీవల ఎన్నికల్లో ప్రభుత్వాలు మారడంతో ధరలు తగ్గుతాయేమోనని, అభివృద్ధి పరుగులు పెడుతుందనే భావనలో వీరంతా వేచి చూసే ధోరణిలో ఉండిపోయారు. ప్రస్తుత ఈ సందిగ్ధ వాతావరణం ఇంకో ఆర్నెళ్ల పాటు కొనసాగుతుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ప్రభుత్వం స్థిరమైన, వేగవంతమైన నిర్ణయాలు, పాలసీల అమలుతో 2025 ఆరంభం నుంచి మార్కెట్ రెట్టింపు వేగంతో పరుగులు పెడుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

● రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలోనూ ఇలాంటి సందిగ్ధ పరిస్థితులున్నాయి. పెట్టుబడులన్నీ పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోతాయని భావించారు. కానీ, స్థానిక ప్రభుత్వ విధానాలు, దార్శనిక నిర్ణయాలతో రియల్టీ మార్కెట్ రెండింతలైంది. వాస్తవానికి పొరుగు రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టే వారంతా హైదరాబాద్‌లో స్థిర నివాసం ఏర్పరుచుకున్న వాళ్లే. గతంలో లాగే ఇప్పుడూ ఇదే ధోరణితో ఇక్కడ కొనుగోళ్లు నిలిపివేశారు. ఇప్పటికే పొరుగు రాష్ట్రాల్లో భూముల ధరలు తారా స్థాయిలో ఉన్నాయి. దీంతో ఇప్పటికిప్పుడు రేట్లు పెరిగే అవకాశం లేదు. ప్రస్తుతం చెబుతున్న అధిక రేట్లన్నీ నోటిమాటలకే పరిమితమవుతున్నాయే తప్ప రిజిస్ట్రేషన్లు జరగడం లేదు.

ఈ నాలుగు ఉంటే ఢోకా లేదు..

ఏ పట్టణ ప్రాంతం అభివృద్ధికైనా కావాల్సింది విద్యా, వైద్యం, వినోదం, ఉద్యోగ అవకాశాలు. నగరవాసుల నాణ్యమైన జీవితాన్ని నిర్ణయించేవి ఈ నాలుగే. వీటిల్లో భాగ్యనగరం కేంద్ర బిందువు. మెడికల్ టూరిజం, ఎడ్యుకేషనల్ హబ్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లకు పెట్టింది పేరైన నగరంలో ఐటీ, ఫార్మా, తయారీ రంగాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయి. ఇతర నగరాలతో పోలిస్తే భాగ్యనగరానికి ఉన్న మరో అద్భుతమైన అవకాశం మెరుగైన మౌలిక వసతులున్న అపారమైన భూముల లభ్యత, ఔటర్, మెట్రోలతో కనెక్టివిటీ. దీంతో నగర రియల్టీ మార్కెట్‌కు ఎలాంటి ఢోకా ఉండదు.

ప్రతికూలమే రైట్ టైం



హైదరాబాద్ స్థిరాస్తి మార్కెట్‌లో రెండు రకాల కస్టమర్లు ఉంటారు. ప్రవాసులు, హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్‌ఎన్‌ఐ) వీళ్లంతా పెద్ద స్థాయిలో భూములు, అల్ట్రా లగ్జరీ అపార్ట్‌మెంట్లను కొనుగోళ్లు చేస్తుంటారు. రెండో రకం రిటైల్ కస్టమర్లు. వీళ్లు సొంతంగా ఉండేందుకు గృహాలను కొనుగోలు చేస్తారు. మొదటి రకం కస్టమర్లేమో.. మార్కెట్ బాగాలేనప్పుడు కొనుగోలు చేసి, బాగున్నప్పుడు ఎక్కువ ధరకు విక్రయిస్తారు. రెండో రకమేమో.. మార్కెట్ బాగాలేనప్పుడు ధరలు తగ్గుతాయేమోనని భ్రమలో వేచి చూసి, మార్కెట్ బాగున్నప్పుడు ఎక్కువ ధర పెట్టి మరీ కొనుగోలు చేస్తారు. స్థిరాస్తి మార్కెట్‌లో లాభాలు ఆర్జించాలంటే మొదటి రకమే కరెక్ట్. అందుకే ప్రస్తుత సందిగ్ధ వాతావరణంలో గృహాలను కొనుగోలు చేయడమే మంచి నిర్ణయం. ఇలాంటి ప్రతికూల మార్కెట్‌లోనే ధర, వసతుల విషయంలో బిల్డర్లతో బేరసారాలకు అవకాశాలుంటాయి.

– నరేంద్ర కుమార్, ఎండీ, ప్రణీత్ గ్రూప్

సీఎం చంద్రబాబును కలిసిన తెలంగాణ గవర్నర్



సాక్షి, అమరావతి/ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): తెలంగాణ రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిశారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చిన ఆయన ఉండవల్లిలోని సీఎం నివాసానికి వెళ్లారు. తెలంగాణ గవర్నర్ మర్యాదపూర్వకంగానే సీఎంను కలిసినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.

దుర్గమ్మ సన్నిధిలో... : తెలంగాణ గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో కె.ఎస్.రామారావు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని, మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈవో రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

రేపు పెడల్ ఫర్ ద ప్లానెట్

రాష్ట్రపతి నిలయం నుంచి ఈసీఐఎల్ క్రాస్‌రోడ్ వరకు సైక్లోథాన్

సాక్షి, హైదరాబాద్: పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడంలో భాగంగా ఈనెల 30న 'పెడల్ ఫర్ ద ప్లానెట్ ఇతివృత్తంతో సైక్లోథాన్ నిర్వహించనున్నట్లు రాష్ట్రపతి నిలయం అధికారులు తెలిపారు. సైక్లథాన్ నిర్వహణతోపాటు రాష్ట్రపతి నిలయంలో సందర్శకుల కోసం చేస్తున్న ప్రత్యేక ఏర్పాట్లు, ఆకర్షణగా నిలుస్తున్న పలు అంశాలను రాష్ట్రపతి నిలయం ఎస్టేట్ ఆఫీసర్ రజిని అధికారులతో కలిసి శుక్రవారం మీడియాకు వెల్లడించారు. నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎమ్‌డీసీ) సహకారంతో హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు రాష్ట్రపతి నిలయం వద్ద ప్రారంభమయ్యే ఈ సైక్లథాన్ ఈసీఐఎల్ క్రాస్‌రోడ్ వరకు కొనసాగుతుందన్నారు. ఇప్పటికే 850 మంది సైక్లిస్టులు కార్యక్రమంలో పాల్గొనేందుకు అంగీకరించారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, జాతీయ వారసత్వ కట్టడాలను కాపాడటంలో ప్రజలు తమ పాత్ర పోషించాలని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రపతి నిలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. అందులో భాగంగానే రాష్ట్రపతి నిలయం సందర్శనకు ప్రజలను ఏడాదిపొడవునా అనుమతిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రపతి నిలయం సందర్శించాలనుకునే వారు visit.rashrapatibhavan.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్ ద్వారా కూడా టికెట్లు బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఐసీఎంఆర్–ఎన్‌ఐఎన్ 'న్యూట్రిషన్ అట్లాస్' వెబ్ యాప్

సాక్షి, హైదరాబాద్: పౌష్టికాహారానికి సంబంధించిన వివిధ అంశాలు, వాటికి సంబంధించి ప్రస్తుతం, గతంలో జాతీయస్థాయిలో నిర్వహించిన అధ్యయనాల సమాచారాన్ని ఒకచోట చేర్చిన 'న్యూట్రిషన్ అట్లాస్'(ఆన్‌లైన్ వర్చువల్, ఇంటరాక్టివ్ వెబ్ అప్లికేషన్)ను ఐసీఎంఆర్–ఎన్‌ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.హేమలత విడుదల చేశారు. ఈ వెబ్ యాప్‌ను ఐసీఎంఆర్–నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ అభివృద్ధి చేసింది. ఈ యాప్‌ను న్యూట్రిషన్ కమ్యూనికేషన్ డివిజన్ హెడ్ డాక్టర్ ఎం.సుబ్బారావు ఎం.గవరవరపు నేతృత్వంలోని బృందం తయారుచేసింది. ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా యూజర్లు ఒకే ప్లాట్‌ఫాంలో పౌష్టికాహారానికి సంబంధించిన వివిధ అంశాలతో ముడిపడిన డేటాను పొందేందుకు ఇది సహాయపడనుంది. దేశీయ ప్రమాణాలకు అనుగుణంగా వెబ్ ఆధారిత డాష్‌బోర్డు అప్లికేషన్, ఇంటరాక్టివ్ యూజర్–ఇంటర్‌ఫేస్‌తో నేషనల్ అట్లాస్ 2.0ను డిజైన్ చేసినట్టు ఈ సందర్భంగా ఎన్‌ఐఎన్ డైరెక్టర్, ఈ ప్రాజెక్ట్ సమన్వయకర్త డాక్టర్ హేమలత తెలిపారు. ఇది www.nutritionatlasindia.in లేదా www.nutritionatlasindia.com అందుబాటులో ఉంది.

జగన్ వల్లే.. ప్రమాదంలో పోలవరం



పోలవరంపై శ్వేతపత్రంలో సీఎం చంద్రబాబు

- జగన్ అసమర్థత, అహంకారం, దుస్సాహసం వల్ల పోలవరం మనుగడే ప్రమాదంలో పడింది
- మూడు డ్యామేజీలకు ఆయన నిర్వాకాలే కారణం.. అందుకే ఆలస్యం
- టీడీపీ హయాంలో 72% పనులు.. గత ప్రభుత్వం చేసింది 3.84 % మాత్రమే

సాక్షి, అమరావతి: పోలవరంలో విధ్వంసంతో మాజీ సీఎం జగన్ రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆరోపించారు. జగన్ మూర్ఖత్వం వల్లే డయాఫ్రం వాల్ దెబ్బతిందని, ఆ విషయం ఆయనకు రెండేళ్ల తర్వాత తెలిసిందన్నారు. గత సర్కారు నిర్వాకంతో ప్రాజెక్టు భౌగోళిక పరిస్థితులు కూడా పూర్తిగా మారిపోయాయని చెప్పారు. పోలవరంపై శుక్రవారం సచివాలయం మొదటి బ్లాక్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్వేతపత్రం విడుదల చేసిన చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

ఇష్టానుసారంగా నిర్ణయాలు..

రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరంపైనే మొదటి శ్వేతపత్రం విడుదల చేస్తున్నాం. పోలవరానికి టీడీపీ హయాంలో రూ.11,762.47 కోట్లు ఖర్చు చేస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.4,167 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. జగన్ చేతకానితనం, అహంభావం వల్లే ప్రాజెక్టు దెబ్బతింది. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రోజే ప్రాజెక్టు పనులు నిలిపేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండానే పనులు చేస్తున్న ఏజెన్సీలను తొలగించారు. వరదలతో డయాఫ్రం వాల్ దెబ్బతిందని హైదరాబాద్ ఐఐటీ నిపుణులు స్పష్టం చేశారు. డయాఫ్రం వాల్ దెబ్బతిందని రెండేళ్ల తర్వాత కనుక్కున్నారు. టీడీపీ హయాంలో నియమించిన కాంట్రాక్టరు పనితీరు సంతృప్తికరంగానే ఉందని, మార్చాల్సిన పనిలేదని పీపీఏ మినిట్స్ లో పేర్కొంది. 2009లో కాంట్రాక్టర్‌ను మార్చడం వల్ల హెడ్ వర్క్స్ పనులు నిలిచిపోయాయి. డయాఫ్రం వాల్, ఎగువ కాఫర్ డ్యాం, దిగువ కాఫర్ డ్యాంలు దెబ్బతిన్నాయి. 2018లో రూ.436 కోట్లతో డయాఫ్రం వాల్ పూర్తి చేశాం. గత ప్రభుత్వ నిర్వాకంతో డ్యామేజ్ అయిన పనులకు రూ.447 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు చెబుతున్నారు. కొత్త డయాఫ్రం వాల్ కట్టాలంటే రూ.990 కోట్లు ఖర్చు అవుతుంది. అందుకు మూడు నాలుగు సీజన్లు పడుతుందంటున్నారు. జగన్ మూర్ఖత్వంతో చేసిన పనికి ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. పోలవరంలో టీడీపీ ఐదేళ్లలో 72 శాతం పనులు పూర్తి చేస్తే వైఎస్సార్ సీపీ 3.84 శాతం మాత్రమే పూర్తి చేసింది. దానికి తోడు నిధుల కొరత తీసుకొచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన నిధులు కూడా ప్రాజెక్టు కోసం ఖర్చు చేయకుండా రూ.3,385 కోట్లు దారి మళ్లించింది. 45.72 మీటర్ల ఎత్తుతో ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడితే గత ప్రభుత్వం 41.15 మీటర్లకు కుదించింది. రూ.55,548 కోట్లకు కేంద్రం ఆమోదం తెలిపేలా మేం కృషి చేస్తే గత ప్రభుత్వం అసలు నిధులు కూడా అడగలేదు. నిర్వాసితులకు జగన్ ఎన్నో హామీలిచ్చి మోసం చేశారు. అధికారం, ఓట్ల కోసం ఎన్ని అబద్ధాలు చెప్పాలో అన్నీ చెప్పారు. పునరావాసానికి టీడీపీ ప్రభుత్వం రూ.4,114 కోట్లు ఖర్చు చేసి మోడల్ కాలనీలను నిర్మిస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.1,687 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది.


జగన్ దుస్సాహసమే కారణం..

ఐదేళ్లు మేం పడ్డ కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరైంది. ప్రజలకు వాస్తవాలు తెలియకుండా దాచి పెట్టారు. కాఫర్ డ్యాం, డయాఫ్రం వాల్, గైడ్ బండ్‌తో పాటు అన్ని చోట్లా సమస్యలు సృష్టించారు. ప్రాజెక్టు సర్వ నాశనానికి జగన్ దుస్సాహసమే కారణం. కాఫర్ డ్యాం పర్మినెంట్ కాదు. నీటి డైవర్షన్ కోసం చేపట్టిన కాఫర్ డ్యాం మూడు నాలుగేళ్ల పాటు ఉంటుంది. కాఫర్ డ్యాం ద్వారా నీరు లీక్ అవుతోంది. దాన్ని పరిష్కరించకుండా పనులు ముందుకు సాగవు.

అశ్వత్థామకు దుస్తులు కుట్టింది

న్యూస్‌మేకర్


అర్చనా రావు



అశ్వత్థామకు మరణం లేదు. మహాభారత కాలం నుంచి కల్కి వచ్చే కాలం వరకూ బతికే ఉండాలి. మరి అతను ఎలా ఉంటాడు? ఆ పాత్ర ధరించింది సాక్షాత్తు అమితాబ్ అయితే అతన్ని అశ్వత్థామలా మార్చే దుస్తులు ఎలా ఉండాలి? తెలుగు ఫ్యాషన్ డిజైనర్ అర్చనా రావు 'కల్కి' సినిమాకు చీఫ్ ఫ్యాషన్ డిజైనర్‌గా అద్భుతంగా కాస్ట్యూమ్స్ డిజైన్ చేసి ప్రశంసలు అందుకుంటోంది. హైదరాబాద్ నిఫ్ట్‌లో, న్యూయార్క్‌లో చదువుకున్న అర్చనా రావు పరిచయం.

'సినిమాకు పని చేయడంలో అసలైన సవాలేమిటంటే పేపర్ మీద గీసుకున్నది తెర మీద కనిపించేలా చేయగలగాలి. అందుకు టీమ్ మొత్తంతో మంచి కోఆర్డినేషన్‌లో ఉండాలి' అంటుంది అర్చనా రావు.

హైదరాబాద్‌కు చెందిన అర్చనా రావుకు 'అర్చనా రావు లేబుల్' పేరుతో సొంత బ్రాండ్ ఉంది. ఆమె దుస్తుల డిజైనింగ్ మాత్రమే కాదు ప్రొడక్ట్ డిజైనింగ్ కూడా చేస్తుంది. అంటే పాదరక్షలు, హ్యాండ్ బ్యాగ్‌లు, బెల్ట్‌లు... అన్నీ హ్యాండ్‌మేడ్. ఆమె సృజన మొత్తంలో తప్పనిసరిగా భారతీయత కనిపిస్తుంది.

'నాకు ఇండియన్ కళాత్మక విలువలంటే ఇష్టం. అవే నన్ను కల్కి సినిమా కాస్ట్యూమ్ డిజైనింగ్‌లో గెలిచేలా చేశాయి. నేడు నా పనికి మంచి ప్రశంసలు అందుతుంటే ఆనందంగా ఉంది' అందామె.

నిఫ్ట్ స్టూడెంట్

అర్చనా రావు హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగింది. చిన్నప్పటి నుంచి బొమ్మలు వేయడం ఆమెకు ఇష్టంగా ఉండేది. ఏదో ఒక సృజనాత్మక రంగంలో చదువు కొనసాగించాలనుకున్నా స్పష్టత రాలేదు. ఇంటర్ ముగిసే సమయానికి హైదరాబాద్‌లో నిఫ్ట్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ) ఏర్పడింది. అందులో క్లాత్ డిజైనింగ్ కోర్సుకు అప్లై చేస్తే సీటు వచ్చింది. 'కాలేజీలో చేరాక ఇదే నేను చదవాల్సింది అని తెలిసొచ్చింది. మన దగ్గర క్రియేటివిటీ ఉండటం ఒకటైతే చదువు వల్ల తెలిసే విషయాలు ఉంటాయి. నిఫ్ట్‌లో ఒక ఫ్యాబ్రిక్‌కు సంబంధించిన టెక్నికల్ నాలెడ్జ్ పూర్తిగా తెలిసింది. ఫ్యాషన్ డిజైన్ చేయాలంటే ముందు ఫ్యాబ్రిక్‌ని కనిపెట్టాలి. అలా చదువు పూర్తయ్యాక పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోసం న్యూయార్క్ వెళ్లాను. న్యూయార్క్ నగరమే ఒక క్యాంపస్. ఏ మనిషిని చూసినా ఏ వీధిని చూసినా ఫ్యాషన్ కనపడుతూనే ఉంటుంది. నేను మరింత ఎదగడానికి న్యూయార్క్ ఉపయోగపడింది. అయితే నేను అమెరికాలో స్థిరపడాలనుకోలేదు. ఇండియా ఫ్యాషన్ రంగంలో పుంజుకుంటోంది. నా పని ఇక్కడే అని నిశ్చయించుకుని వచ్చేశాను. నా బ్రాండ్ మొదలెట్టాను' అని తెలిపిందామె.

మహానటితో...

దర్శకుడు నాగ్ అశ్విన్ ఏదో సందర్భంలో పరిచయం కావడంతో అతను 'మహానటి' చిత్రం కోసం కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేయమన్నాడు. 'అప్పటికి నాకు సినిమాలకు కాస్ట్యూమ్స్ ఎలా తయారు చేయాలో తెలియదు. కాని నాగ్ అశ్విన్ ప్రోత్సాహంతో మహానటిలో సమంత, విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్‌లకు కాస్ట్యూమ్స్ చేశాను. కథాకాలాన్ని బట్టి 1940ల నాటి ఫ్యాషన్‌లను, 1980ల నాటి ఫ్యాషన్‌లను స్టడీ చేయాల్సి వచ్చింది. సినిమాలకు కాస్ట్యూమ్స్ చేయడంలో ముఖ్యమైన సంగతి ఏమిటంటే లైట్ పడితే ఏ రంగు ఎక్కువ మెరుస్తుంది తెర మీద ఏ రంగు మృదువుగా ఉంటుందో తెలుసుకోవడమే. మహానటితో నేను పని తెలుసుకున్నాను. ఆ సినిమాకు నాకు జాతీయ అవార్డు రావడం మరింత సంతోషం' అందామె.

కల్కి సినిమాలో మహామహులకు...

'కల్కి సినిమా మొదలెట్టే ముందు నిర్మాత దగ్గర నాగ్ అశ్విన్ పెట్టిన మొదటి షరతు నన్ను చీఫ్ ఫ్యాషన్ డిజైనర్‌గా ఉంచాలని. నా మీద నాగ్ పెట్టుకున్న నమ్మకం అది. నాలుగేళ్ల క్రితం అతను ఈ కథను చెప్పినప్పుడు చాలా పెద్ద ప్రాజెక్ట్ అని అర్థమైంది. అశ్వత్థామ పాత్ర గురించి చెప్తే ఎవరు చేస్తున్నారు అనడిగాను. అమితాబ్ అన్నాడు. దాంతో నాకు ఎక్కడ లేని నెర్వస్‌నెస్ వచ్చింది. ఆయనను అశ్వత్థామగా చూపించడం ఎలా? మహాభారత కాలం నుంచి ఆయన జీవించే ఉన్నాడంటే నా మనసులో వచ్చిన భావం మనిషిని చూడగానే ఒక పురాతన వృక్షాన్ని చూసినట్టు ఉండాలని. ఆయనకు వాడే దుస్తులను మళ్లీ మళ్లీ పరీక్షకు పెట్టి తయారు చేశాను. ఆయన ముఖానికి శరీరానికి ఉండే కట్లు రక్తం, పసుపు కలిసిపోయి ఏర్పడిన రంగులో ఉంచాను. మొదటిసారి అమితాబ్ నా కాస్ట్యూమ్స్ ధరించినప్పుడు అది సినిమా అని అక్కడున్నది సినిమా సెట్ అని తెలిసినా రోమాలు నిక్కపొడుచుకున్నాయి. ఇక ప్రభాస్ కోసం నేను డిజైన్ చేసిన సూట్‌ను కాలిఫోర్నియాలో తయారు చేయించాం. కమలహాసన్‌కు ఆయన వ్యక్తిగత డిజైనర్ సహాయంతో కలసి కాస్ట్యూమ్స్ చేశాను. సినిమాలో మూడు ప్రపంచాలుంటాయి. పిరమిడ్ సిటీలో కనిపించే ఆర్మీ కోసం కాస్ట్యూమ్స్‌ని మన దిష్టిబొమ్మల నుంచి ఇన్‌స్పైర్ అయి చేశాను. కల్కి సినిమాకు అందరం కష్టపడి పని చేశాం. అది ప్రేక్షకులకు నచ్చడం చాలా సంతోషంగా ఉంది' అందామె.

బ్యూటిప్స్
వర్షాకాలం పాదాల సంరక్షణ



- ఐదు టేబుల్ స్పూన్ల ఎప్సమ్ సాల్ట్, కప్పుడు వైట్ వెనిగర్, గోరువెచ్చని నీళ్లలో కలపాలి. ఆ నీటిలో పాదాలను పదిహేను నిమిషాలు ఉంచాలి. తర్వాత పొడి క్లాత్‌తో తుడిచి, మాయిశ్చరైజర్ రాసుకోవాలి. రోజూ రాత్రి పడుకునే ముందు ఈ విధంగా చేస్తుంటే కాలి పగుళ్లు తగ్గుతాయి. పాదాల చర్మం మృదువుగా మారుతుంది.
- వాన నీళ్లలో నానితే వేళ్ల మధ్య తడి వల్ల ఫంగస్ చేరుతుంటుంది. ఇలాంటప్పుడు బేకింగ్ పౌడర్‌లో మూడు చుక్కల ఎసెన్షియల్ ఆయిల్ కలిపి, పాదాలకు, వేళ్ల మధ్య రాసుకోవాలి. ఫంగస్ తగ్గడంతో పాటు చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది.

ఆర్ట్

జ్యూట్ బ్యాగులపైన భారతీయ కళ


• శిక్షణనిస్తూ...

కళాకారులు మనదైన ఆత్మను కళ ద్వారా జీవం పోస్తారు. ఆ కళను నలుగురికి పరిచయం చేయడమే కాకుండా దానిని ఉపాధి వనరుగా మార్చి మరికొంత మందికి చేయూతగా నిలుస్తున్నారు డాక్టర్ ముప్పిడి రాంబాబు. హైదరాబాద్ రాయదుర్గంలో ఉంటున్న ఈ కళాకారుడు ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో లెదర్ గూడ్స్ అండ్ యాక్సెసరీస్ డిజైనింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఫ్యాకల్టీగా ఉన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆరేళ్లుగా మహిళలకు, యువతకు జ్యూట్ బ్యాగ్‌ల తయారీలో ఉచితంగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాలోని మహిళలకు శిక్షణ ఇస్తున్న సందర్భంగా భారతీయ కళను జ్యూట్ బ్యాగుల మీదకు ఏ విధంగా తీసుకువస్తున్నారో తెలియజేశారు.


• రాంబాబు

"జ్యూట్ బ్యాగుల తయారీ సాధారణమే కదా అనుకుంటారు. కానీ, ఇండియన్ ఆర్ట్ మోటిఫ్స్ కలంకారీ, చేర్యాల, వర్లీ, గోండు, పటచిత్ర, మధుబని... డిజైన్స్‌ను ఉపయోగిస్తూ, స్క్రీన్ ప్రింటింగ్ ద్వారా జ్యూట్ మీదకు తీసుకువస్తున్నాం. దీని ద్వారా జ్యూట్‌కి కొత్త కళ వస్తుంది. అలాగే, మొన్నటి ఏరువాక పౌర్ణమిని దృష్టిలో పెట్టుకొని రైతు పొలం పనులకు వెళ్లే డిజైన్‌ని తీసుకువచ్చాను. ఈ కళ ద్వారా పర్యావరణ హితం, మనదైన ఆత్మను పరిచయం చేస్తున్నాం.

ఉపాధికి మార్గం

కరీంనగర్, ఏలూరు, జంగారెడ్డి గూడెం, పార్వతీపురం, బొబ్బిలి.. మొదలైన ప్రాంతాలలో ఉచితంగా శిక్షణ ఇస్తూ వచ్చాను. నేషనల్ జ్యూట్ బోర్డ్ వాళ్లు నన్ను సర్టిఫైడ్ డిజైనర్‌గా తీసుకున్నారు. స్వచ్ఛంద సంస్థలతో కలిసి ఈ స్కిల్ క్రాఫ్ట్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్స్ చేస్తుంటాను. ప్రస్తుతం మన్యం జిల్లా పార్వతీపురంలో 24 మంది మహిళలు శిక్షణ తీసుకుంటున్నారు. 45 రోజుల శిక్షణ కార్యక్రమంలో బ్యాగుల తయారీ, స్క్రీన్ ప్రింటింగ్ నేర్చుకుంటున్నారు. ఇప్పటికే బ్యాగుల తయారీ నేర్చుకున్నవారు, సొంతంగా ఉపాధి మార్గాలను పొందుతున్నారు. ఈ స్కిల్ ప్రోగ్రామ్‌లో పదవ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకున్నవారు ఉన్నారు. బ్యాగులే కాకుండా పాదరక్షలు, లెదర్ బ్యాగులు, వైర్లతో చెయిర్లు, ఇతర యాక్సెసరీస్ తయారుచేస్తుంటాను. వీటితో కంప్యూటర్ ఆధారిత త్రీడీ సాఫ్ట్‌వేర్ డిజైన్లు కూడా ప్లాన్ చేస్తుంటాను.

కళాకారులను కలిసి...

మా ఊరు పశ్చిమగోదావరి దగ్గరిలోని జంగారెడ్డి గూడెం. సినిమా నటుల బ్యానర్లను సృజనాత్మకంగా తయారు చేసి, అందించిన కుటుంబం మాది. నాకున్న పెయింటింగ్ ఆసక్తిని మా అన్నయ్య శ్రీనిసవాసరావు గుర్తించాడు. దీంతో ఇంటర్మీడియెట్ తర్వాత ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పైన పూర్తి దృష్టి పెట్టాను. ముంబయ్ నిఫ్ట్ నుంచి మాస్టర్ ఆఫ్ డిజైన్ చేశాను. స్కూల్ చదువు నుంచి డాక్టరేట్ చేసేవరకు మా అన్నయ్య ప్రోత్సాహం ఎంతో ఉంది. ప్రస్తుతం హైదరాబాద్ ఎఫ్‌డిఐలో ఉద్యోగం చేస్తున్నాను. సాంకేతికంగానూ భారతీయ



కళను క్రాఫ్ట్ తయారీలో ఎలా మేళవించవచ్చో పరిశోధన, ప్రాక్టీస్ చేస్తుంటాను. రాబోయే తరాల కోసం క్రాఫ్ట్స్‌ని డిజిటలైజేషన్ చేసే పనిలో ఉన్నాను. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న హస్తకళాకారులను నేరుగా కలుసుకొని చేసిన పరిశోధనకు బంగారు పతకాన్ని అందుకున్నాను. నా పరిశోధన ద్వారా తెలుసుకున్న విషయాలను జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో మన కళ, కళాకారుల ప్రత్యేకతను తెలియ జేయడం అదృష్టంగా భావిస్తాను. ఏటి కొప్పాక కొయ్యబొమ్మల కళాకారులతో కలిసి, బొమ్మల తయారీ నేర్చుకున్నాను. నేను తయారు చేసిన కొయ్య బొమ్మలకు డిజైన్లకు, పేపర్ బాస్కెట్ డిజైన్స్‌కి పేటెంట్ హక్కులు పొందాను. కళను భవిష్యత్తు తరాలు గుర్తించేలా మరింత సృజనతో మెరుగ్గా తీర్చిదిద్దాలని.. దీని ద్వారా యువతకు, మహిళలకు ఉపాధి అవకాశాలు లభించాలన్నదే లక్ష్యంగా పనిచేస్తున్నాను' అని చెప్పారు రాంబాబు.

ఈ కళాకారుడు తన పనిలో సంపూర్ణ విజయాన్ని సాధించాలని కోరుకుందాం.

– నిర్మలారెడ్డి

లైఫ్@360

పరిసరాలను పట్టించుకుంటున్నారా?



చాలామంది ఇంటిని, ఒంటిని శుభ్రంగా ఉంచుకుంటారు కానీ మన చుట్టూ ఎలా ఉంటే ఏమవుతుందిలే అన్నట్లు ఉంటారు. అయితే ఇల్లు, ఇంటిలోని మనుషులు మాత్రమే శుభ్రంగా ఉండి పరిసరాలన్నీ అపరిశుభ్రంగా ఉంటే ఏం ప్రయోజనం? అనారోగ్యం, అంటువ్యాధులు పొంచే ఉంటాయి. ఇంతకీ పరిసరాల పరిశుభ్రత అంటే ఏమిటో, పరిసరాలను ఏవిధంగా పరిశుభ్రంగా ఉంచుకోవాలో చూద్దామా?





ఇంట్లో మురికిగా ఉండే ప్రదేశాలను శుభ్రం చేయడం ఎంత ముఖ్యమో, చుట్టుపక్కల ఉండే హానికారక సూక్ష్మజీవులను నిరోధించడంపై దృష్టి పెట్టడం కూడా అంతేముఖ్యం. చేతులు కడుక్కోవడం, బట్టలు ఉతకడం, ఫ్లోర్‌ని తుడవటం ఆరోగ్యవంతమైన వాతావరణానికి కీలకం.

ఒక సర్వే మేరకు అపరిశుభ్రమైన పరిసరాలలో మెసలడం వల్ల పిల్లలు ప్రమాదకరమైన అంటురోగాల బారిన పడతారని తెలిసింది. అందువల్ల ఆయా ప్రదేశాలను శుభ్రం చేయడంపై దృష్టి పెట్టాలని, అవి శుభ్రంగా కనిపించినప్పటికీ తగిన శ్రద్ధ పెట్టి ఎలాంటి క్రిములూ లేకుండా చూడాలని, అప్పుడే హానికారక సూక్ష్మ క్రిముల వ్యాప్తిని అడ్డుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

బ్యాక్టీరియా ఎలా పోతుంది?

ఆహారాన్ని తయారు చేసిన తర్వాత నేలను, రాతి దిమ్మెలను శుభ్రం చేయడానికి క్లాత్‌కు బదులు పేపర్ టవల్స్ వాడి చూడండి. ఇలా చేయడం వల్ల వంటగదిలో ఉపయోగించే గుడ్డలు అపరిశుభ్రం కాకుండా, కలుషితం కాకుండా ఉంటాయి.

ఎలా శుభ్రం చేయాలి?

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అంటే మురికితోపాటు రోగకారక క్రిములను అరికట్టడం. తద్వారా అంటువ్యాధులు సోకకుండా చూసుకోవడం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటురోగాల వ్యాప్తిని తగ్గించొచ్చు. తద్వారా మన పిల్లల్ని రక్షించుకోవడంతో పాటు, ఆసుపత్రులపై ఒత్తిడిని కూడా తగ్గించొచ్చు.

ఇంటిని మాత్రమే కాదు, ఇంటి పరిసరాలలో ఎక్కడైనా మురికిగుంటలు, చెత్తకుప్పలు, అపరిశుభ్ర వాతావరణం ఉంటే దానిపై దృష్టి పెట్టాలి. శ్రమ అనో, ఖర్చనో అనుకోకుండా చెత్తను క్లీన్ చేయాలి లేదా చేయించాలి. కొంతమంది తమ ఇంటిలోని చెత్తనంతటినీ తీసుకొచ్చి ఖాళీగా ఉన్న ప్రదేశాలలో పడేస్తుంటారు. క్రమేణా అవి చెత్తకు, ఆ తర్వాత అపరిశుభ్రతకు, అంటువ్యాధులకు నిలయాలుగా మారతాయి. అందువల్ల చొరవ తీసుకుని క్లీన్ చేయించాలి. అలాగే మురికిగుంటలపై కూడా దృష్టి సారించాలి. పరిసరాలలో నీరు నిలవకుండా చూసుకోవాలి. ఇంటిలోని చెత్తను, తడి చెత్త, పొడిచెత్తగా వేరు చేసి పడెయ్యడం, గాజుపెంకుల వంటి వాటిని విడిగానూ వేరు చేసి పడెయ్యాలి. ఇలాంటి వాటన్నింటినీ బాధ్యతగా చేసినప్పుడే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే సూక్ష్మక్రిములు, తద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా ఉంటాయి. మనం ఆరోగ్యంగా ఉండగలుగుతాము.

ఏయే పరిసరాలు?

- వంటశాలలు, భోజన శాలలు
- మరుగుదొడ్లు,
- ఇల్లు, వంటగదిలో ఉండే మురికి బట్టలు, మసిగుడ్డలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- పెంపుడు జంతువులతో ఉన్నప్పుడు
- చెత్త, వ్యర్థాలను చేత్తో తాకినప్పుడు, పారేసేటప్పుడు
- అంటువ్యాధి సోకిన వారికి సపర్యలు చేసేప్పుడు శుభ్రత పాటించడం అత్యవసరం
- మాంసం వంటి వంటకాలు చేసినప్పుడు వంటగదిలోని నేలను, దిమ్మల్ని, మాంసం కోసిన చెక్క/బోర్డుల్ని శుభ్రం చేయడం చాలా కీలకం. అలాగే, కలుషితమైన ప్రదేశాన్ని, పాత్రల్ని శుభ్రం చేశాక ఆయా గుడ్డలు, స్క్రబ్‌లను, బ్రష్‌లను కడగాలి
- ఇంట్లో నేలపైన, కుర్చీలు, బల్లల వంటి ఫర్నీచర్‌పైన చాలా దుమ్ము పట్టినట్లు ఉంటుంది. వాటిని కూడా శుభ్రం చేయాలి.

ఏ వయసులో ఏ ఆహారం?



ఆహారానికి వయసు ఉండదు కానీ, ఏ వయసుకు తగ్గ ఆహారం ఆ వయసులో తీసుకోవడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలుంటాయంటున్నారు పోషకాహార నిపుణులు. ఎదిగే వయసు పిల్లలు తీసుకోవలసిన ఆహారంలో ఉండవలసినవి వృద్ధులు తీసుకోవలసిన ఆహారం ఒకటి కాదు. అదేవిధంగా టీనేజీ అమ్మాయిలు, యాభైలలో ఉండే స్త్రీలు వేర్వేరు ఆహారాలు తీసుకోవాలి. ఇంతకీ ఏ వయసు వారు ఏ ఆహారం తీసుకుంటే మంచిదో చూద్దామా?

ఇప్పుడు పిల్లలు తినే ఆహారంలో ప్రొటీన్లు తక్కువ; పిండి పదార్థాలు, కొవ్వులు ఎక్కువ ఉంటున్నాయి. ఇలాంటి ఆహారం తినటం వల్ల వయసుకు తగిన పెరుగుదల ఉండదు. అధిక బరువు, హార్మోన్లలో మార్పుల లాంటి సమస్యలు మొదలవుతాయి. కాబట్టి ఈ వయసు నుంచే సమతులాహారం ఇస్తూ ఆహారంలో ప్రొటీన్లు ఎక్కువగా ఉండేలా చూసుకోగలిగితే భవిష్యత్తులో హైపర్ టెన్షన్, మధుమేహం, రక్తపోటు మొదలైన ఆరోగ్య సమస్యలు రాకుండా ఉంటాయి కాబట్టి గుడ్లు, ఆకుకూరలు, తాజాపళ్లు, కూరగాయలు
- బాదం, వాల్‌నట్స్, వేరుసెనగ
- గోధుమలు, పెసలు, పాలు, వెన్న, పెరుగు
- మాంసం, చేపలు, జున్ను
- రాజ్మా, సెనగలు, బొబ్బర్లు, సాయంత్రం అల్పాహారంగా బాదం, పిస్తా, వాల్‌నట్స్, ఉడకబెట్టిన సెనగలు, మొక్కజొన్నలాంటివి ఇవ్వాలి.

15 నుంచి 25 ఏళ్ల వయసు



- తక్కువ నూనె, తీపి, మసాలాలతో రుచికరమైన స్నాక్స్ వండే విధానాలను నేర్చుకుని పిల్లల మనసు గెలవగలిగితే బజార్లో దొరికే ఫాస్ట్ ఫుడ్స్‌కు పిల్లలు ఆకర్షితులవకుండా ఉంటారు
- అలాగే మాంసాహారం వండేటప్పుడు ఎక్కువ నూనెలో వేయించకుండా ఆవిరి మీద ఉడికించి ఇవ్వాలి. మాంసాహారంతోపాటు కూరగాయలు కూడా ఇవ్వాలి
- ఆహారంలో తగినంత పీచు పదార్థం ఉండేలా చూసుకుంటే ప్రొటీన్ ఫుడ్ వల్ల మలబద్ధకం తలెత్తకుండా ఉంటుంది
- ఉదయం అల్పాహారంలో బ్రెడ్, శాండ్‌విచ్‌లకు బదులుగా గోధుమ రవ్వతో చేసిన ఉప్మా, పెసలతో చేసిన పొంగల్, పెసరట్టు, రాగి, క్యారట్ ఇడ్లీ లాంటివి ఇవ్వాలి
- కేక్‌ల తయారీలో డ్రై ఫ్రూట్స్, పళ్ల ముక్కలు ఎక్కువగా వాడాలి. బాదం, పిస్తా, వాల్‌నట్స్, ఉడకబెట్టిన సెనగలు, మొలకలు అందుబాటులో ఉంచాలి
- ఫ్రిజ్ ట్రేలలో చాక్లెట్లు, బిస్కెట్లకు బదులుగా పళ్లు, సలాడ్లు, పాలు, గుడ్లు ఉంచాలి. ఎక్కువగా ఆటలాడుతూ ఉంటారు కాబట్టి రోజుకి కనీసం గుప్పెడు డ్రై ఫ్రూట్స్ తినేలా చూసుకోవాలి. ఉదయం, సాయంత్రం కలిపి కనీసం అర లీటరు పాలు తాగేలా చూసుకోవాలి
- ఉడికించిన సెనగలు, బొబ్బర్లు ఎక్కువ సమయంపాటు శక్తినిస్తాయి. కాబట్టి బాస్కెట్‌బాల్, క్రికెట్‌లాంటి ఆటల్లో పాల్గొనే పిల్లలకు వీటిని స్నాక్స్‌గా ఇస్తూ ఉండాలి.

టీనేజ్‌లో... కొంతమంది టీనేజర్లు...మరీ ముఖ్యంగా అమ్మాయిలు బరువు పెరిగిపోతామనే బెంగతో తగినంత ఆహారం తీసుకోకుండా పోషక లోపాలకు గురవుతూ ఉంటారు. ఇలాంటి టీనేజర్లను కని పెట్టి తల్లులు పౌష్టికాహారం వల్ల భవిష్యత్తులో ఒరిగే ప్రయోజనాల గురించి వారికి అవగాహన కల్పించాలి
- చిన్న వయసు నుంచే శరీరానికి పోషకాలు అందిస్తూ గర్భం దాల్చే సమయానికి శరీరాన్ని ఎలా సన్నద్ధం చేయాలో, అలా చేయకపోతే ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయో వివరించాలి
- ఉదయం అల్పాహారం స్కిప్ చేయకుండా చూసుకోవాలి
- తగినంత క్యాల్షియం, ప్రొటీన్ తీసుకుంటూ వ్యాయామం చేస్తే ఎత్తు పెరగటంతోపాటు, చక్కటి శరీర సౌష్ఠవం కూడా సొంతమవుతుంది.

45 ఏళ్ల నుంచి వృద్ధాప్యం వరకూ...

- ఈ వయసు స్త్రీలలో హార్మోన్ల స్రావాలు తగ్గిపోతాయి కాబట్టి శరీరం కాల్షియంను శోషించుకునే శక్తి కోల్పోతుంది. ఫలితంగా ఎముకలు, కీళ్ల నొప్పులు మొదలవుతాయి. పురుషుల్లో కండరాల పటుత్వం కోల్పోతాయి కాబట్టి క్యాల్షియంను సప్లిమెంట్ల రూపంలో తీసుకోవటం అవసరం. దీంతోపాటు మాంసకృత్తులు, విటమిన్లు, ఖనిజ లవణాల సప్లిమెంట్లను వైద్యుల సూచనమేరకు వాడాలి
- ఈ వయస్సుల్లో కంటి చూపు, జ్ఞాపక శక్తి తగ్గిపోతూ ఉంటుంది. బీటా కెరోటిన్, యాంటీ ఆక్సిడెంట్లు ఉండే కాలిఫ్లవర్, క్యారెట్, చిలకడ దుంపలు, గుమ్మడికాయ మొదలైనవి తీసుకోవాలి
- వాల్‌నట్స్, బాదం కూడా ఎక్కువగా తినాలి.

ఆకలి... నిద్ర సరిగా లేవా? మెగ్నీషియం లోపం కావచ్చు



మన శరీరం ఫిట్‌గా ఉండాలంటే మెగ్నీషియం దేహంలో అధికంగా ఉండాలి. కార్బోహైడ్రేట్స్, కొవ్వు, ప్రోటీన్స్ నుంచి మనకు శక్తి వచ్చేలా చేయడంలో మెగ్నీషియం కీలక పాత్ర పోషిస్తుంది. ఇది మంచి శక్తితోపాటు చక్కటి నిద్ర పట్టేలా చేస్తుంది. రక్తంలో చక్కెరలను, హార్మోన్లను క్రమబద్ధీకరిస్తుంది. మెగ్నీషియం తగినంత లేకపోతే కలిగే అనర్థాలేమిటో తెలుసుకుందాం.

అనారోగ్యాలు వేధిస్తుంటాయి!

శరీరంలో మెగ్నీషియం లోపం ఉంటే ఆకలి వేయదు. వికారంగా... వాంతులు వస్తున్నట్టుగా అనిపిస్తుంది. నీరసంగా ఉంటారు. హార్ట్ బీట్‌రేట్ లో హెచ్చుతగ్గులు వస్తాయి. కళ్ళు మసక బారుతుంటాయి. కండరాలలో నొప్పి వస్తుంది. ఒత్తిడి పెరుగుతుంది. నిద్ర సరిగ్గా పట్టదు. హై బీపీ వస్తుంది. ఆస్తమా రోగులకు మెగ్నీషియం లోపిస్తే ఈ సమస్య తీవ్రంగా మారుతుంది.

ఆకుకూరలలోనూ, అవకాడో, అరటి పండ్లు, రాస్ బెర్రీస్, ఫిగ్స్ వంటి పండ్లలోనూ మెగ్నీషియం ఉంటుంది. అలాగే బ్రకోలీ, క్యాబేజీ, పచ్చి బఠానీలు, మొలకలు వంటి వాటిలో కూడా ఇది దొరుకుతుంది. బ్రౌన్ రైస్, ఓట్స్, సీఫుడ్స్‌లో మెగ్నీషియం లభిస్తుంది. మెగ్నీషియం వెంటనే రావాలి అంటే ఒక కప్పు కాఫీ తాగాలి. చాక్లెట్ తిన్నా ఫలితం ఉంటుంది. మెగ్నీషియం లోపానికి వెంటనే జాగ్రత్తలు తీసుకోకుంటే అనారోగ్యానికి గురవుతారు.

సబ్జా గింజలు, ప్రోటీన్, కాల్షియం, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్స్, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలతో కూడిన ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకుంటే మెగ్నీషియం లోపించదు.

వ్యూహాలు... ప్రతివ్యూహాలు...

ఆరంభంలో లెఫ్టార్మ్ పేసర్లను ఎదుర్కోవడంలో రోహిత్ ఇబ్బంది పడే బలహీనతను సొమ్ము చేసుకునేందుకు జాన్సెన్‌ను దక్షిణాఫ్రికా ఉపయోగించవచ్చు. ఫామ్‌లో లేని కోహ్లిపై రబాడ పైచేయి సాధించే ప్రయత్నం చేస్తాడు. డికాక్‌ను బుమ్రా నిలువరించగలిగితే భారత్‌కు ఆధిపత్యం ఖాయం. పంత్ జోరును ఆపేందుకు లెఫ్టార్మ్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌ను వాడే అవకాశం ఉంది. మిడిలార్డర్‌లో అక్షర్, కుల్దీప్, జడేజాల స్పిన్‌ను క్లాసెన్, మిల్లర్‌లు ఎలా ఎదుర్కొంటారనే దానిపైనే మ్యాచ్ గమనం ఆధారపడి ఉంది.



ఇద్దరికీ చివరి మ్యాచా?

భారత్ క్రికెట్‌కు సంబంధించి ఆల్‌టైమ్ గ్రేట్‌లుగా రోహిత్, కోహ్లిలది ప్రత్యేక స్థానం. గత 11 ఏళ్లుగా భారత్ ఓడిన ఐసీసీ ఫైనల్స్‌లో వీరిద్దరూ సభ్యులుగా ఉన్నారు. వన్డే వరల్డ్ కప్ చేజారాక టి20 వరల్డ్ కప్ విజయంతోనైనా ముగించాలనే పట్టుదలతో ఈ టోర్నీకి సిద్ధమయ్యారు. టెస్టు, వన్డేలను పక్కన పెడితే ఈ ఫార్మాట్‌లో కొత్త కుర్రాళ్లు దూసుకొచ్చేశారు. సత్తా చాటి తమదైన అవకాశం కోసం సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇంకా కొనసాగడం అనేది ఇద్దరికీ మేలు చేయకపోవచ్చు. కాబట్టి గెలిచినా, ఓడినా వీరికి ఇదే చివరి అంతర్జాతీయ టి20 మ్యాచ్ అయ్యే చాన్స్ ఉంది. రోహిత్ 2007 టి20 వరల్డ్ కప్ నెగ్గిన జట్టులో సభ్యుడు కాగా, కోహ్లి 2011 వన్డే వరల్డ్ కప్ విన్నింగ్ టీమ్ మెంబర్.

ఈసారి వదలొద్దు!

నేడు టి20 వరల్డ్ కప్ ఫైనల్

దక్షిణాఫ్రికాతో భారత్ 'ఢీ'

రెండో టైటిల్ వేటలో టీమిండియా

తొలి వరల్డ్ కప్ కోసం సఫారీలు

రాత్రి 8 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్): టి20 క్రికెట్‌లో ప్రపంచ చాంపియన్‌ను తేల్చే సమయం ఆసన్నమైంది. 27 రోజులు, 54 మ్యాచ్‌ల తర్వాత అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) తొమ్మిదో టి20 వరల్డ్ కప్ ఫైనల్ సమరానికి సర్వం సిద్ధమైంది. కెన్సింగ్టన్ ఓవల్ మైదానంలో నేడు జరిగే తుది పోరులో భారత్, దక్షిణాఫ్రికా తలపడనున్నాయి. గతంలో భారత్ ఒకసారి ఈ టోర్నీని గెలుచుకోగా, దక్షిణాఫ్రికా ఫైనల్ చేరడం ఇదే తొలిసారి. ఆఖరి సమరానికి ముందు ఇరు జట్లు టోర్నీలో ఓటమి లేకుండా అజేయంగా ఉన్నాయి. భారత్ తాము ఆడిన ఏడు మ్యాచ్‌లు, దక్షిణాఫ్రికా తాము ఆడిన ఎనిమిది మ్యాచ్‌లు గెలిచి సమరోత్సాహంతో ఫైనల్‌కు 'సై' అంటున్నాయి. ఎవరు విజయం సాధించినా... ఓటమి లేకుండా టైటిల్ అందుకున్న తొలి జట్టుగా నిలుస్తుంది. గతంలో జరిగిన డే అండ్ నైట్ ఫైనల్ మ్యాచ్‌లకు భిన్నంగా తొలిసారి టైటిల్ పోరు డే మ్యాచ్‌గా జరగనుండటం విశేషం.

మార్పుల్లేకుండా...

టీమిండియా ఈ టోర్నీలో ఆడిన 7 మ్యాచ్‌లలో 12 మంది బరిలోకి దిగారు. న్యూయార్క్ వేదికగా జరిగిన తొలి మూడు మ్యాచ్‌లలో పేసర్ సిరాజ్ ఆడగా, వెస్టిండీస్‌లో జరిగిన మ్యాచ్‌లలో అతని స్థానంలో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఆడాడు. ఇది మినహా మిగతా 10 మంది విషయంలో ఎలాంటి మార్పూ జరగలేదు. ఇప్పుడు కూడా సెమీఫైనల్ ఆడిన టీమ్‌తోనే భారత్ తుది పోరుకు వెళ్లే అవకాశముంది. ఒక్క శివమ్ దూబే బ్యాటింగ్ విషయంలోనే కాస్త ఆందోళన కనిపించినా... మిడిలార్డర్‌లో అతనికి బదులు సంజూ సామ్సన్‌ను నేరుగా ఫైనల్లో ఆడించే సాహసం చేయకపోవచ్చు. రోహిత్ శర్మ బ్యాటింగ్ పదును ఏమిటో గత రెండు మ్యాచ్‌లలో కనిపించింది. అతను ఇదే జోరు సాగిస్తే ఆరంభంలోనే మ్యాచ్ భారత్ చేతుల్లోకి వచ్చేస్తుంది. కోహ్లి వరుసగా విఫలమైనా... రోహిత్ ఆశించినట్లుగా ఫైనల్లో అతని స్థాయి ప్రదర్శన కనబరిస్తే చాలు. సూర్యకుమార్ మెరుపు ఇన్నింగ్స్‌తో పాటు పంత్, పాండ్యాలు ధాటిగా ఆడితే జట్టుకు తిరుగుండదు. బౌలింగ్‌లో టీమిండియా మరింత బలంగా కనిపిస్తోంది. పేసర్లు బుమ్రా, అర్ష్‌దీప్‌లను సమర్థంగా ఎదుర్కోవడంలో ప్రత్యర్థి ఆటగాళ్లు విఫలమవుతుండగా... స్పిన్ త్రయం కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా చెలరేగితే సఫారీలు కుప్పకూలడం ఖాయం. ముఖ్యంగా కుల్దీప్ బౌలింగ్‌లో బ్యాటర్లు బాగా ఇబ్బంది పడగా, బుమ్రా ముందు అంతా తలవంచారు.

సమష్టితత్వంతో...

దక్షిణాఫ్రికా ఇద్దరు ప్రధాన పేసర్లు రబాడ, నోర్జే ఆరుకంటే తక్కువ ఎకానమీతో ప్రత్యర్థి వికెట్లను పడగొట్టారు. వీరు ఇన్నింగ్స్ ఆరంభంలో బ్యాటర్లను కట్టడి చేయగల సమర్థులు. జాన్సెన్ రూపంలో లెఫ్టార్మ్ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ ఆ జట్టులో ఉండటం అదనపు ప్రయోజనం. ఇద్దరు స్పిన్నర్లు కేశవ్ మహరాజ్, షమ్సీ కూడా అన్ని పిచ్‌లపై చెలరేగారు. అయితే పిచ్ పేస్‌కు అనుకూలంగా కనిపిస్తే ఒక స్పిన్నర్ స్థానంలో బార్ట్‌మన్‌ను తీసుకునే అవకాశం ఉంది. ఓపెనర్ డికాక్ బ్యాటింగ్‌కు మూల స్తంభంలా ఉండగా, మరో ఓపెనర్ హెన్‌డ్రిక్స్ చెప్పుకోదగ్గ ప్రభావం చూపలేదు. టోర్నీలో ఆకట్టుకోని కెప్టెన్ మార్క్‌రమ్ నుంచి ఒక మంచి ఇన్నింగ్స్ ఫైనల్లో రావాలని జట్టు ఆశిస్తోంది. మిడిలార్డర్‌లో క్లాసెన్, మిల్లర్‌లపైనే జట్టు ఆధారపడుతోంది. ఇప్పటి వరకు అంచనాలకు తగినట్లుగా ఆడకపోయినా స్టబ్స్ దూకుడుగా ఆడగలడు. విడిగా చూస్తే ఒక్కొక్కరి ప్రదర్శన గొప్పగా లేకపోయినా... జట్టుగా తాము ప్రభావం చూపగలమని టీమ్ విశ్వాసంతో ఉంది.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), కోహ్లి, పంత్, సూర్యకుమార్, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, జడేజా, అక్షర్, కుల్దీప్, బుమ్రా, అర్ష్‌దీప్.

దక్షిణాఫ్రికా: మార్క్‌రమ్ (కెప్టెన్), డికాక్, హెన్‌డ్రిక్స్, స్టబ్స్, క్లాసెన్, డేవిడ్ మిల్లర్, జాన్సెన్, కేశవ్ మహరాజ్, షమ్సీ, రబాడ, నోర్జే.



2013లో చాంపియన్స్ ట్రోఫీ విజేత... ఆ తర్వాత ఐదుసార్లు ఐసీసీ ఫైనల్ మ్యాచ్‌లు... అన్నింటా నిరాశే... 2014 టి20 వరల్డ్ కప్, 2017 చాంపియన్స్ ట్రోఫీ, 2021 టెస్టు చాంపియన్‌షిప్, 2023 టెస్టు చాంపియన్‌షిప్, 2023 వన్డే వరల్డ్ కప్... ఈ ఐదు సందర్భాల్లో బరిలో నిలిచిన భారత జట్టు సభ్యులకే కాదు... గెలుపును ఆశించిన అభిమానులకు కూడా తెలుసు ఆ వేదన ఎలాంటిదో! ముఖ్యంగా గత ఏడాది నవంబర్ 19న లక్ష మంది సొంత అభిమానుల సమక్షంలో ఆస్ట్రేలియా చేతిలో మన జట్టు ఓడిన క్షణాలు ఇంకా కళ్ల ముందే నిలిచాయి. వరుసగా 10 మ్యాచ్‌లలో విజయాల తర్వాత తుది మెట్టుపై రోహిత్ బృందం తడబడింది. ఇప్పుడు ఆ బాధను మరచి కాస్తంత ఉపశమనం పొందే అవకాశం వచ్చింది. 11 ఏళ్ల తర్వాత ఐసీసీ టైటిల్‌ను అందుకునే అరుదైన సందర్భం మళ్లీ టీమిండియా ముందు నిలిచింది. ఈసారి కూడా టోర్నీలో అజేయంగా భారత్ ఫైనల్ పోరుకు సిద్ధమైంది. ఆటగాళ్లంతా ఫామ్‌లో ఉన్నారు. కెప్టెన్‌గా వన్డే వరల్డ్ కప్‌లో చేజారిన ట్రోఫీని టి20ల్లో అందుకొని రోహిత్ శర్మ సగర్వంగా నిలుస్తాడా? తన అద్భుత కెరీర్‌లో లోటుగా ఉన్న టి20 ప్రపంచ కప్‌తో విరాట్ కోహ్లి సంబరాలు చేసుకుంటాడా ఈరోజు రాత్రికల్లా తేలిపోతుంది..!

మరోవైపు దక్షిణాఫ్రికా అన్ని అస్త్రాలతో సిద్ధంగా ఉంది. సఫారీ బృందం కూడా విజయం కోసం కసిగా, ఆకలిగా ఉంది... ఆ జట్టుకు కూడా వరల్డ్ కప్ టైటిల్ అనేది 32 ఏళ్ల కల... ఎప్పుడో 1998లో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ గెలిచినా ఆ లెక్క వేరు... మొత్తంగా ఐదుసార్లు వన్డే వరల్డ్ కప్‌లలో, రెండుసార్లు టి20 వరల్డ్ కప్‌లో సెమీ ఫైనల్ వరకు రాగలిగినా ఆ గండం దాటి ముందుకు వెళ్లలేకపోయింది. ఇప్పుడు మొదటిసారి ఫైనల్ వరకు వచ్చిన టీమ్ ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ చేజార్చుకోరాదని పట్టుదలగా ఉంది. కీలక సమయాల్లో తడబడే 'చోకర్స్' ముద్రను చెరిపేసుకునే విధంగా సౌతాఫ్రికా టీమ్ చెలరేగింది. టోర్నీలో అక్కడక్కడా కాస్త ఇబ్బంది పడ్డా చివరకు ఫలితాన్ని తమవైపు మార్చుకొని వరుసగా ఎనిమిది విజయాలతో ఓటమి లేకుండా తుది పోరుకు అర్హత సాధించింది. అటు బ్యాటింగ్‌లో, ఇటు బౌలింగ్‌లో ఏ ఒక్కరిపైనో ఆధారపడకుండా సమష్టి ప్రదర్శనతో టీమ్ దూసుకుపోతోంది. దశాబ్దం క్రితం అండర్–19 కెప్టెన్‌గా దక్షిణాఫ్రికాకు ఇప్పటి వరకు ఏకైక ప్రపంచకప్ ట్రోఫీని అందించిన మార్క్‌రమ్ గతంలో తమ దేశపు దిగ్గజాలకు సాధ్యం కాని ఘనతను నాయకుడిగా అందుకుంటాడా ఈరోజు రాత్రికల్లా తేలిపోతుంది...!

పిచ్, వాతావరణం

కెన్సింగ్టన్ ఓవల్ మైదానంలో తాజా ప్రపంచకప్‌లో 8 మ్యాచ్‌లు జరిగాయి. ఒక మ్యాచ్ రద్దు కాగా, మరో మ్యాచ్ స్కోర్లు సమమై 'సూపర్ ఓవర్' వరకు వెళ్లింది. మిగిలిన వాటిలో 3 సార్లు ముందుగా బ్యాటింగ్ చేసిన జట్టు, 3 సార్లు ముందుగా బౌలింగ్ చేసిన జట్టు గెలిచాయి. కాబట్టి పిచ్ పెద్ద విషయం కాకపోవచ్చు. డే మ్యాచ్ కాబట్టి మంచు ప్రభావం ఉండదు. తీవ్ర ఒత్తిడి ఉండే మ్యాచ్ కాబట్టి టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకోవచ్చు. భారత్ ఇప్పటికే ఈ పిచ్‌పై అఫ్గానిస్తాన్‌తో ఆడగా, దక్షిణాఫ్రికా ఇప్పటి వరకు ఆడలేదు. మ్యాచ్ రోజున వర్ష సూచన ఉంది. అయితే సెమీస్ తరహాలోనే అక్కడక్కడా అంతరాయాలు కలగవచ్చు కానీ పూర్తిగా మ్యాచ్‌కు ఇబ్బంది ఉండదు. మ్యాచ్‌ను శనివారమే పూర్తి చేసేందుకు నిర్ణీత సమయంకంటే అదనంగా మరో 190 నిమిషాల సమయం కేటాయించారు. ఫైనల్‌కు రిజర్వ్ డే కూడా ఉంది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో 10 ఓవర్లు పూర్తయితే శనివారమే ఫలితం తేల్చేస్తారు. అది కూడా సాధ్యం కాకపోతేనే ఎక్కడ ఆట ఆగిందో అక్కడి నుంచి రిజర్వ్ డే రోజు ఆట కొనసాగుతుంది. అదీ సాధ్యం కాకపోతే ఇరు జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటిస్తారు.

2 వన్డే, టి20 ఫార్మాట్‌లలో కేవలం రెండుసార్లు మాత్రమే రెండు జట్లు ఒక్క మ్యాచ్‌లో కూడా ఓడిపోకుండా ఫైనల్‌కు చేరాయి. 1979 వన్డే వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్, వెస్టిండీస్ జట్లు... 2024 టి20 ప్రపంచకప్‌లో భారత్, దక్షిణాఫ్రికా జట్లు ఈ ఘనత సాధించాయి.

1 నేటి ఫైనల్లో విజేతగా నిలిచిన జట్టు అరుదైన ఘనత సాధిస్తుంది. ఒక్క మ్యాచ్‌లోనూ ఓడిపోకుండా టి20 ప్రపంచకప్ టైటిల్ నెగ్గిన తొలి జట్టుగా రికార్డు నెలకొల్పుతుంది. వన్డే వరల్డ్‌కప్‌లో మాత్రం వెస్టిండీస్ (1975, 1979), ఆస్ట్రేలియా (2003, 2007) జట్లు రెండుసార్లు చొప్పున ఈ ఘనత సాధించాయి.

2 కేన్ విలియమ్సన్ (న్యూజిలాండ్) తర్వాత మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20) ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో జాతీయ జట్టుకు సారథ్యం వహించిన రెండో కెప్టెన్‌గా రోహిత్ శర్మ గుర్తింపు పొందనున్నాడు.

26 అంతర్జాతీయ టి20ల్లో భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఇప్పటి వరకు 26 మ్యాచ్‌లు జరిగాయి. 14 మ్యాచ్‌ల్లో భారత్ గెలుపొందగా... 11 మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. ఒక మ్యాచ్ రద్దయింది. టి20 ప్రపంచకప్‌లలో ఈ రెండు జట్ల మధ్య 6 మ్యాచ్‌లు జరిగాయి. 4 మ్యాచ్‌ల్లో భారత్, 2 మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా గెలుపొందాయి.



"ఫలానావారి కోసం కప్ గెలవాలనే నినాదాలకు నేను వ్యతిరేకం. బాగా ఆడి మ్యాచ్ గెలవడం ముఖ్యం తప్ప ఇతర విషయాలు పట్టించుకోను. 12 నెలల వ్యవధిలో మూడు ఐసీసీ ఫైనల్స్‌కు చేరడం అదీ మూడు వేర్వేరు ఫార్మాట్‌లు కావడం మా జట్టు నిలకడను చూపించింది. ఫైనల్‌కు ముందు ప్రాక్టీస్ కోసం సమయం లేకపోయినా ఆటగాళ్లంతా సిద్ధమయ్యే ఉన్నారు. మానసికంగా కూడా ఎలాంటి గందరగోళం లేకుండా ప్రశాంతంగా తుది పోరుకు రెడీ అయ్యాం. ఇక్కడ ఇప్పటికే ఒక మ్యాచ్ ఆడటం మాకు సానుకూలాంశమే. వన్డే వరల్డ్ కప్ ఫైనల్‌నుంచి పాఠాలు నేర్చుకోవడం వంటిదేమీ లేదు. దాని కోసం కూడా బాగా సిద్ధమయ్యాం కానీ ఆ రోజు ప్రత్యర్థి మాకంటే మెరుగ్గా ఆడింది. అయినా పరాజయాలు మరచి ముందుకు సాగిపోవడం ఆటగాళ్ల లక్షణం. రెండు అత్యుత్తమ జట్ల మధ్య జరగబోతున్న ఈ ఫైనల్ మాకు అనుకూలంగా సాగాలని కోరుకుంటున్నా

–రాహుల్ ద్రవిడ్, భారత హెడ్ కోచ్

డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో గాయత్రి–ట్రెసా జాలీ జోడీ



టెక్సాస్: యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన ప్రీక్వార్టర్ ఫైనల్లో గాయత్రి–ట్రెసా ద్వయం 16–21, 21–11, 21–19తో సెయి పె షాన్–హంగ్ ఎన్ జు (చైనీస్ తైపీ) జంటను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో ప్రియాన్షు రజావత్, మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోద్ కూడా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో ప్రియాన్షు 21–18, 21–16తో హువాంగ్ యు కాయ్ (చైనీస్ తైపీ)పై, మాళవిక 15–21, 21–19, 21–14తో తెరెజా స్వబికోవా (చెక్ రిపబ్లిక్)పై గెలుపొందారు.

కాంస్య పతకాలు నెగ్గిన నిత్య, జ్యోతికశ్రీ





పంచ్‌కుల (హరియాణా): జాతీయ సీనియర్ ఇంటర్ స్టేట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రెండో రోజు శుక్రవారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అథ్లెట్‌లకు ఒక్కో పతకం లభించింది. మహిళల 100 మీటర్ల విభాగంలో నిత్య గాంధీ, మహిళల 400 మీటర్ల విభాగంలో దండి జ్యోతికశ్రీ కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. నిత్య 11.79 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచింది. జ్యోతికశ్రీ 52.11 సెకన్లలో రేసును ముగించి మూడో స్థానాన్ని దక్కించుకుంది.

షఫాలీ విశ్వరూపం

భారత మహిళా క్రికెటర్లా... మజాకా! దక్షిణాఫ్రికా మహిళల జట్టుతో చెన్నైలో ఆరంభమైన ఏకైక టెస్టును టీమిండియా రికార్డుల జడివానతో మొదలుపెట్టింది. 'ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ'... తొలి వికెట్‌కు అత్యధిక భాగస్వామ్యం... ఒకేరోజు అత్యధిక జట్టు స్కోరు... ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్స్‌లు... ఇలా ఒకటే మిటి అన్ని కలగలిపి అతివల క్రికెట్లో అపూర్వ రికార్డుల జాతరను మన మహిళల జట్టు ఆవిష్కరించింది. ఈ మ్యాచ్‌ను చూసిన వారందరికి ఆడుతోంది అమ్మాయిలేనా? జరుగుతోంది టెస్టా లేదంటే వన్డేనా అన్న అనుమానం కలగకమానదు. అంతలా... ఆకాశమే హద్దన్నట్లుగా హర్మన్‌ప్రీత్ బృందం సఫారీపై సూపర్‌గా ఆడింది.



షఫాలీ డబుల్ సెంచరీ అభివాదం

చెన్నై: భారత మహిళల క్రికెట్ జట్టు దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ఏకైక టెస్టులో విశ్వరూపమే చూపెట్టింది. డాషింగ్ ఓపెనర్ షఫాలీ వర్మ (197 బంతుల్లో 205; 23 ఫోర్లు, 8 సిక్స్‌లు) అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో వేగవంతమైన డబుల్ సెంచరీ సాధించింది. మరో స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన (161 బంతుల్లో 149; 27 ఫోర్లు, 1 సిక్స్) కూడా సఫారీ బౌలర్లను చితగ్గొట్టి మరీ శతకాన్ని పూర్తి చేసుకుంది. దీంతో శుక్రవారం మొదలైన ఈ ఏకైక టెస్టులో భారత మహిళల జట్టు తొలి రోజు ఆట ముగిసేసరికి 98 ఓవర్లలోనే 4 వికెట్ల నష్టానికి 525 పరుగుల భారీస్కోరు కాదు... ఒక్క రోజే రికార్డు స్కోరు నమోదు చేసింది.

పరుగు... ప్రవాహమైందిలా!

టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ చేపట్టింది. ఓపెనర్లు స్మృతి, షఫాలీ పరుగులు మొదలుపెట్టారు. ఇది పట్టాలెక్కగానే ప్రవాహం ఆ వెంటే రికార్డుల విధ్వంసం రోజంతా కొనసాగింది. 14వ ఓవర్లో భారత్ స్కోరు 50కి చేరింది. స్మృతి 78 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. దీంతోనే ఇది టెస్టు కాదని వన్డేనేమో అనే అనుమానం మొదలైంది. షఫాలీ 66 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించడం, జట్టు స్కోరు వన్డేలకు దీటుగా 24.4 ఓవర్లలోనే 100కు చేరడంతో ఇది ఏ మ్యాచ్ అబ్బా అని అభిమానులు క్రికెట్‌కు సంబంధించిన వెబ్‌సైట్‌లలో ఏ ఫార్మాట్ అనే ఎంక్వైరీ చేసుకునేలా చేసింది. లంచ్ విరామానికి 130/0 స్కోరు చేసింది. ఆ తర్వాత రెండో సెషన్‌లోనూ ఓపెనర్లు షఫాలీ, స్మృతిల బ్యాటింగ్ దూకుడుతో 39 ఓవర్లలోనే భారత్ 200 స్కోరును అవలీలగా దాటేసింది. ఈ క్రమంలో ముందుగా షఫాలీ 113 బంతుల్లో సెంచరీని పూర్తి చేసుకోగా, స్మృతి 122 బంతుల్లో శతకాన్ని సాధించింది.



స్మృతి

194 బంతుల్లో 'ద్విశతకం'

ఎట్టకేలకు 52వ ఓవర్లో స్మృతి అవుటైంది. 54వ ఓవర్లో జట్టు స్కోరు 300 పరుగులకు చేరుకుంది. అప్పుడు తెలిసొచ్చింది స్కోరైతే వన్డే తీరు... ఫార్మాట్ అయితే సంప్రదాయ పోరు అని! కాసేపటికే శుభా సతీశ్ (15) వెనుదిరిగింది. 334/2 స్కోరు వద్ద టీ బ్రేక్‌కు వెళ్లారు. తర్వాత జెమీమా రోడ్రిగ్స్ (94 బంతుల్లో 55; 8 ఫోర్లు) అండతో షఫాలీ 194 బంతుల్లో డబుల్ సెంచరీ సాధించింది. 73వ ఓవర్లోనే భారత్ 400 పరుగుల మైలురాయిని వేగంగా అందుకుంది. షఫాలీ రనౌట్ కాగా... క్రీజులో పాతుకుపోయినా జెమీమా కూడా (85 బంతుల్లో) ఫిఫ్టీ సాధించింది. 95వ ఓవర్లో భారత్ 500 అసాధారణ స్కోరును ఒక్కరోజులోనే సాధించింది.

- టెస్టుల్లో ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ చేసిన భారత ఓపెనర్
- స్మృతి మంధాన సెంచరీ
- తొలి వికెట్‌కు ప్రపంచ రికార్డు భాగస్వామ్యం
- తొలి రోజే 525 పరుగులు చేసిన భారత మహిళల జట్టు

1 మహిళల క్రికెట్లో షఫాలీ 194 బంతుల్లో సాధించిన వేగవంతమైన డబుల్ సెంచరీ కొత్త రికార్డు. ఇదే ఏడాది దక్షిణాఫ్రికా జట్టుపైనే అనాబెల్ సదర్లాండ్ (ఆస్ట్రేలియా) 248 బంతుల్లో ద్విశతకం చేసింది.

2 మిథాలీ రాజ్ (214: 2002లో ఇంగ్లండ్‌పై) తర్వాత టెస్టుల్లో డబుల్ సెంచరీ సాధించిన రెండో భారతీయ మహిళా క్రికెటర్‌గా షఫాలీ నిలిచింది.

292 తొలి వికెట్‌కు షఫాలీ, స్మృతి జోడించిన పరుగులు. ఇది కొత్త ప్రపంచ రికార్డు. 2004లో పాక్ ఓపెనర్లు సాజిదా, కిరణ్ బలూచ్‌లు విండీస్‌పై తొలి వికెట్‌కు 241 పరుగులు జతచేశారు.

525 టెస్టు క్రికెట్‌లో మ్యాచ్ తొలిరోజుతోపాటు ఒకే రోజు అత్యధిక పరుగులు చేసిన జట్టుగా భారత్ రికార్డు సృష్టించింది. 1935లో న్యూజిలాండ్‌పై ఇంగ్లండ్ తొలిరోజు 431 పరుగులు చేసింది.

స్కోరు వివరాలు

భారత మహిళల తొలి ఇన్నింగ్స్: షఫాలీ వర్మ (రనౌట్) 205; స్మృతి (సి) డెర్క్‌సెన్ (బి) టకర్ 149; శుభ (సి) జాఫ్టా (బి) డి క్లెర్క్ 15; జెమీమా (సి) డి క్లెర్క్ (బి) టకర్ 55; హర్మన్‌ప్రీత్ (బ్యాటింగ్) 42; రిచా ఘోష్ (బ్యాటింగ్) 43; ఎక్స్‌ట్రాలు 16; మొత్తం (98 ఓవర్లలో 4 వికెట్లకు) 525. వికెట్ల పతనం: 1–292, 2–325, 3–411, 4–450. బౌలింగ్: క్లాస్ 14–2–63–0, డెర్క్‌సెన్ 11–0–60–0, నదినె 10–1–62–1, టుమి 10–0–55–0, నొంకు లులెకొ లబ 24–1–113–0, డెల్మి టకర్ 26–1–141–2, సునె లుస్ 3–0–15–0.

సుమిత్ ప్రత్యర్థి కిచ్‌మానోవిచ్

వింబుల్డన్ టోర్నీ 'డ్రా' విడుదల



లండన్: తొలిసారి వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో పోటీపడుతున్న భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్‌కు క్లిష్టమైన 'డ్రా' ఎదురైంది. సోమవారం మొదలయ్యే ఈ ప్రతిష్టాత్మక టోర్నీ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 53వ ర్యాంకర్ మియోమిర్ కిచ్‌మానోవిచ్ (సెర్బియా)తో ప్రపంచ 72వ ర్యాంకర్ సుమిత్ తలపడతాడు. నాలుగేళ్ల క్రితం జర్మనీలో జరిగిన ఏటీపీ–250 టోర్నీలో కిచ్‌మానోవిచ్‌తో ఏకైకసారి ఆడిన సుమిత్ మూడు సెట్‌లలో ఓడిపోయాడు. పురుషుల డబుల్స్‌లో సుమిత్ సెర్బియాకు చెందిన దుసాన్ లజోవిచ్‌తో కలిసి బరిలోకి దిగనున్నాడు. భారత నుంచి డబుల్స్‌లో రోహన్ బోపన్న, శ్రీరామ్ బాలాజీ, యూకీ బాంబ్రీ వేర్వేరు భాగస్వాములతో కలిసి ఈ టోర్నీలో ఆడనున్నారు. బోపన్న–ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి రెండో సీడింగ్ లభించింది.

డోపింగ్‌లో పట్టుబడ్డ జావెలిన్ త్రోయర్ మనూ



పంచ్‌కుల (హరియాణా): పారిస్ ఒలింపిక్స్ ఆశాకిరణం, భారత జావెలిన్ త్రోయర్ డీపీ మనూ డోపింగ్ పరీక్షల్లో దొరికిపోయాడు. అతను నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు పరీక్షల్లో తేలడంతో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) తాత్కాలిక నిషేధం విధించింది. ఈ ఏప్రిల్‌లో భారత గ్రాండ్‌ప్రిలో అతను పోటీపడ్డాడు. ఆ సమయంలో అతని నుంచి సేకరించిన రక్త, మూత్ర నమూనాలను 'నాడా' ల్యాబ్‌లో పరీశీలించగా నిషిద్ధ ఉత్ప్రేరకాలు వాడినట్లు రిపోర్టులో వచ్చింది. గతేడాది ఆసియా చాంపియన్‌షిప్‌లో 24 ఏళ్ల మను రజత పతకం సాధించాడు.

సాక్షి బిజినెస్
శనివారం
29-6-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
210	34
79,033	24,011

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	17,835	▽	24
డోజోన్స్	39,109	▽	55
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,164	▽	16
డాక్స్	18,235	△	25
షాంఘై	2,967	▽	22
నికాయ్	39,583	△	242

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,835	△ 444
బంగారం (99.5 స్వచ్ఛత)	71,547	△ 442
వెండి (కిలో)	88,000	△ 497

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.00	84.02
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.21	106.77
€	యూరో	ఒకటి	90.47	88.05
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	52.44	54.28
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.41	56.38
S$	సింగపూర్ డాలర్	ఖామపరిక	59.20	69.88
SAR	సౌదీ రియాల్	ఖామపరిక	21.33	22.90
UAE D	యూఏఈ దిర్హామ్	ఖామపరిక	21.82	23.60
¥	చైనా యువాన్	ఖామపరిక	10.35	12.43

పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు యథాతథం

కేంద్ర ఆర్థిక శాఖ నోటిఫికేషన్



న్యూఢిల్లీ: చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు జూలై 1తో ఆరంభమయ్యే త్రైమాసికానికి యథాతథంగా కొనసాగుతాయని కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. అంటే ప్రస్తుతం అమల్లో ఉన్న రేట్లే వచ్చే త్రైమాసికానికీ (జూలై–సెప్టెంబర్) కొనసాగనున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి (2024–25 ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు) నోటిఫై చేసిన రేట్లు కొనసాగుతాయని నోటిఫికేషన్‌లో పేర్కొంది. ప్రతి త్రైమాసికానికీ వివిధ పొదుపు పథకాల రేట్లను కేంద్ర సర్కారు సమీక్షిస్తుండడం తెలిసిందే.

వివిధ పథకాల రేట్లు..: సుకన్య సమృద్ధి యోజన పథకంలో పెట్టుబడులపై 8.2 శాతం రేటు అమలు కానుంది. పీపీఎఫ్ వడ్డీ రేటు 7.1 శాతంగా కొనసాగుతుంది. కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ)లో పెట్టుబడులపై 7.5 శాతం రేటు అమలవుతుంది. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ)లో చేసే పెట్టుబడులపై 7.7 శాతం రేటు పొందొచ్చు. పోస్టాఫీస్ నెలవారీ ఆదాయ పథకంలో రేటు 7.4 శాతంగా కొనసాగుతుంది. రికరింగ్ డిపాజిట్‌కు 6.7 శాతం రేటు వర్తిస్తుంది. సీనియర్ సిటిజన్స్ సేవింగ్ స్కీమ్‌కు 8.2 శాతం రేటు వర్తిస్తుంది.

బేసిక్ డీమ్యాట్ ఖాతా పరిమితి పెంపు

రూ. 4 లక్షల నుంచి రూ. 10 లక్షలకు ● పెట్టుబడులపై సెబీ తాజా నిర్ణయం



న్యూఢిల్లీ: చిన్న ఇన్వెస్టర్లను ఆకట్టుకునే యోచనతో సెబీ ప్రాథమిక(బేసిక్) డీమ్యాట్ ఖాతాలో పెట్టుబడుల పరిమితిని పెంచింది. ప్రస్తుతం ఈక్విటీలలో రూ. 2 లక్షలు, రుణ సెక్యూరిటీలు (బాండ్లు)లో రూ. 2 లక్షలు చొప్పున ఇన్వెస్ట్ చేసేందుకు వీటిని అనుమతిస్తున్నారు. సెబీ తాజా నిర్ణయంతో ఇకపై బేసిక్ సర్వీస్ డీమ్యాట్ ఖాతా(బీఎస్‌డీఏ)లో రూ. 10 లక్షల వరకూ పెట్టుబడులను కలిగి ఉండేందుకు వీలుంటుంది. తాజా మార్గదర్శకాలు సెప్టెంబర్ 1నుంచి అమలుకానున్నాయి. రెగ్యులర్ డీమ్యాట్ ఖాతా నుంచి 2012లో సెబీ బీఎస్‌డీఏను సెబీ ప్రవేశపెట్టింది. దీంతో చిన్న పోర్ట్‌ఫోలియోలు కలిగి ఉండే ఇన్వెస్టర్లకు డీమ్యాట్ చార్జీల భారాన్ని తగ్గించే ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది. బీఎస్‌డీఏ అర్హత కలిగిన ఇన్వెస్టర్ రూ. 4 లక్షలలోపు విలువైన పోర్ట్‌ఫోలియో(ఈక్విటీ, డెట్)ను కలిగి ఉంటే డీమ్యాట్ ఖాతాకు వార్షిక నిర్వహణ చార్జీలు ఉండవు. రూ. 4 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకూ విలువగల ఖాతాలకు రూ. 100 చార్జీ వసూలు చేస్తారు. విలువ ఇంతకుమించితే రెగ్యులర్ డీమ్యాట్ ఖాతాగా పరిగణిస్తారు.

అన్‌లిమిటెడ్ 'రెడ్ అలర్ట్ సేల్'కు అపూర్వ స్పందన

హైదరాబాద్: ఫ్యాషన్ దుస్తుల సంస్థ అన్‌లిమిటెడ్ ఇటీవల ప్రకటించిన 'రెడ్ అలర్ట్ సేల్' ఆఫర్‌కు అపూర్వ స్పందన లభిస్తుండంతో మరిన్ని కొత్త కలెక్షన్లను చేర్చింది. పరిమిత కాల ఆఫర్‌ను కస్టమర్లు వినియోగించుకోవాలని కంపెనీ కోరింది. బ్రాండెడ్ ఉత్పత్తుల కొనుగోలుపై 50% తగ్గింపుతో పాటు రూ.3000 కొనుగోలుపై రూ.3000 ఉచిత షాపింగ్ ఆఫర్ పొందవచ్చు.

మలబార్ 'నువా' డైమండ్ కలెక్షన్



బెంగళూరు: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 'నువా' పేరుతో డైమండ్ కలెక్షన్ విడుదల చేసింది. యూఏఈలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బాలీవుడ్ నటి కరీనా కపూర్ ఖాన్ కొత్త కలెక్షన్‌ను ఆవిష్కరించారు. అత్యంత విలాసవంతమైన ప్రత్యేక వజ్రాలు ఇందులో పొందుబరిచారు. 'ప్రకృతిలోని రమణీయ అందాలు, స్త్రీలలోని మొక్కవోని ధైర్యసాహసాల నుంచి ప్రేరణ పొంది ఈ కలెక్షన్ తీర్చిదిద్దాము. భారత్‌లోని అన్ని మల్‌బార్ స్టోర్లలోనూ 'నువా' డైమండ్ కలెక్షన్ అందుబాటులో ఉంటుంది' అని గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ తెలిపారు.

ఎయిర్‌టెల్ చార్జీల వడ్డన

వొడాఫోన్ ఐడియా కూడా.. ● టారిఫ్‌లు 10–24 శాతం పెంపు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెలికం కంపెనీ ఎయిర్‌టెల్ చార్జీల మోత మోగించింది. ప్రీ–పెయిడ్, పోస్ట్ పెయిడ్ మొబైల్ టారిఫ్‌లను 10–21 శాతం పెంచుతున్నట్టు శుక్రవారం ప్రకటించింది. సవరించిన ధరలు జూలై 3 నుంచి అమలులోకి వస్తాయని వెల్లడించింది. పోటీ సంస్థ రిలయన్స్ జియో టారిఫ్‌లను అధికం చేస్తున్నట్టు ప్రకటించిన మరుసటి రోజే ఎయిర్‌టెల్ సైతం అదేబాట పట్టడం గమనార్హం. టెలికం రంగంలో గడిచిన రెండున్నరేళ్లలో ఈ స్థాయిలో చార్జీలను పెంచడం ఇదే తొలిసారి.

కొత్త చార్జీలు..

రోజుకు 1 జీబీ డేటా ఆఫర్ చేసే రూ.19 ప్లాన్ కాస్తా రూ.22 కానుంది. రోజుకు 2 జీబీ డేటాతో 365 రోజుల వ్యాలిడిటీ ప్యాక్ ధర రూ.2,999 నుంచి రూ.3,599కి చేరనుంది. 28 రోజుల కాలపరిమితితో రూ.179 ధర కలిగిన అపరిమిత వాయిస్ ప్లాన్ ఇక నుంచి రూ.199కి పెరగనుంది. రోజుకు 1.5 జీబీ డేటాతో 56 రోజుల వ్యాలిడిటీ గల రూ.479 ప్యాక్ ధర రూ.579 కానుంది. అలాగే పోస్ట్ పెయిడ్ రేట్ల సవరణతో ఒక్కో ప్లాన్‌పై కస్టమర్‌కు నెలకు రూ.50–200 అదనపు భారం కానుంది.



రోజుకు 70 పైసల లోపే..

చార్జీల భారం ఎంట్రీ లెవెల్ కస్టమర్లపై రోజుకు 70 పైసలలోపే ఉంటుందని ఎయిర్‌టెల్ ప్రకటించింది. దేశంలోని టెలికం కంపెనీలు ఆర్థికంగా ఆరోగ్యకర వ్యాపార విధానం అనుసరించాలంటే ఒక్కో వినియోగదారు నుంచి నెలకు సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) రూ.300 కంటే అధికంగా ఉండాలని భారతీ ఎయిర్‌టెల్ వెల్లడించింది. ఈ స్థాయి ఏఆర్‌పీయూ ఉంటే నెట్‌వర్క్ టెక్నాలజీ, స్పెక్ట్రమ్‌లో అవసరమైన గణనీయ పెట్టుబడులు చేసేందుకు మార్గం ఏర్పడుతుందని తెలిపింది. కాగా, జూలై 3 నుంచి టారిఫ్‌లను 12–27 శాతం పెంచుతున్నట్టు రిలయన్స్ జియో గురువారం ప్రకటించిన సంగతి తెలిసిందే.

వొడాఫోన్ ఇలా..

నష్టాల్లో ఉన్న వొడాఫోన్–ఐడియా సైతం చార్జీల వడ్డనకు సిద్ధం అయింది. జూలై 4 నుంచి మొబైల్ టారిఫ్‌లను 11–24 శాతం పెంచాలని నిర్ణయించింది. 28 రోజుల వ్యాలిడిటీతో రూ.179 విలువగల ప్రారంభ ప్లాన్ రూ.199 కానుంది. రోజుకు 1.5 జీబీ డేటాతో 84 రోజుల కాలపరిమితిగల రూ.719 ప్లాన్ కాస్తా రూ.859కి చేరింది. వార్షిక అపరిమిత ప్లాన్ ధర రూ.2,899 నుంచి రూ.3,499 అయింది.

కొత్త శిఖరాలు... చివరికి నష్టాలు

- బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లలో లాభాల స్వీకరణ
- వారాంతాన నష్టాలతో ముగిసిన సూచీలు



ముంబై: బ్యాంకింగ్, ఫైనాన్స్, టెక్ షేర్లలో ఇన్వెస్టర్లు లాభాలు స్వీకరించడంతో శుక్రవారం స్టాక్ సూచీలు నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 210 పాయింట్లు పతనమై 79,033 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 34 పాయింట్లు నష్టపోయి 24,011 వద్ద నిలిచింది. దీంతో సూచీల 3 రోజుల రికార్డుల ర్యాలీకి, 4 రోజుల లాభాలకు ముగింపు పడింది. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలతో ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 428 పాయింట్లు పెరిగి 79,672 వద్ద, నిఫ్టీ 130 పాయింట్లు బలపడి 24,174 వద్ద జీవితకాల గరిష్టాల నమోదు చేశాయి. ప్రథమార్ధమంతా స్థిరమైన లాభాలతో ట్రేడయ్యాయి. లాభాల స్వీకరణ ప్రభావంతో మిడ్‌సెషన్ నుంచి అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. చివరికి నష్టాలతో ముగిశాయి. మరోవైపు ఫార్మా, ఇంధన, మెటల్, ఆయిల్‌అండ్‌గ్యాస్, యుటిలిటీ, కమోడిటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించాయి. బీఎస్ఈ స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు వరుసగా 0.56%, 0.41 శాతం పెరిగాయి. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లపై ప్రభావం చూపే యూఎస్ పీసీఈ ద్రవ్యోల్బణ గణాంకాల వెల్లడికి ముందు అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- తన టెలికం అనుబంధ సంస్థ జియో ప్రీపెయిడ్, పోస్ట్ పెయిడ్ సేవల టారిఫ్‌లను 12–27% మేర పెంచడంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు రాణించింది. బీఎస్ఈలో 2.31% లాభపడి రూ.3,132 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 3.27% పెరిగి రూ.3,161 వద్ద జీవితకాల గరిష్టాన్ని తాకింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.47,777.57 కోట్లు ఎగసి రూ.21.18 లక్షల కోట్లకు చేరింది.
- జేకే టైర్స్ షేరు 9% పెరిగి రూ.430 వద్ద స్థిరపడింది. బ్రోకింగ్ సంస్థ ఎంకే గ్లోబల్ ఈ షేరుకు 'బై' రేటింగ్ కేటాయింపుతో పాటు షేరు టార్గెట్ ధరను రూ.700కు పెంచడం ఇందుకు కారణం. ట్రేడింగ్‌లో 10% ఎగసి రూ.435 వద్ద స్థిరపడింది.

ఐపీవో స్ట్రీట్

స్టాన్లీ లైఫ్‌స్టైల్స్ లిస్టింగ్ సక్సెస్



ముంబై: లగ్జరీ ఫర్నిచర్ బ్రాండ్ స్టాన్లీ లైఫ్‌స్టైల్స్ షేర్లు లిస్టింగ్‌లో అదరగొట్టాయి. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.369)తో పోలిస్తే 35% ప్రీమియంతో రూ.499 వద్ద లిస్టయ్యాయి. కొనుగోళ్ల మద్దతు లభించడంతో ట్రేడింగ్‌లో 38% ఎగసి రూ.510 వద్ద గరిష్టాన్ని తాకాయి. చివరికి 28% లాభంతో రూ.474 వద్ద స్థిరపడ్డాయి. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2,702.62 కోట్లుగా నమోదైంది. ఎక్స్ఛేంజీలో మొత్తం 55.85 లక్షల ఈక్విటీలు చేతులు మారాయి. మంగళవారం ముగిసిన ముగిసిన ఈ ఐపీఓకి 96.98 రెట్ల అధిక స్పందన లభించింది.

ఎమ్‌క్యూర్ @ రూ. 960-1008

జూలై 3–5 మధ్య పబ్లిక్ ఇష్యూ



న్యూఢిల్లీ: బెయిన్ క్యాపిటల్‌కు పెట్టుబడులున్న హెల్త్‌కేర్ రంగ కంపెనీ ఎమ్‌క్యూర్ ఫార్మాస్యూటికల్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 960–1008 ధరల శ్రేణిని ప్రకటించింది. జూలై 3న ప్రారంభంకానున్న ఇష్యూ 5న ముగియనుంది. ఐపీవోలో భాగంగా రూ. 800 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 1.14 కోట్ల షేర్ల(రూ. 1,152 కోట్ల విలువ)ను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా రూ. 1,952 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ప్రమోటర్ సతీష్ మెహతా, పీఈ దిగ్గజం బెయిన్ క్యాపిటల్ ఐపీవోలో షేర్లను ఆఫర్ చేయనున్నాయి. రిటైలర్లు కనీసం 14 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేయాలి.

బన్సల్ వైర్ ఐపీవో 3న

ధరల శ్రేణి రూ. 243–256



న్యూఢిల్లీ: స్టీల్ వైర్ల తయారీ కంపెనీ బన్సల్ వైర్ ఇండస్ట్రీస్ పబ్లిక్ ఇష్యూకి రూ. 243–256 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూ జులై 3న ప్రారంభమై 5న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 2న షేర్లను కేటాయించనుంది. ఐపీవోలో భాగంగా రూ. 745 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. తద్వారా రూ. 745 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కంపెనీ ప్రధానంగా స్టీల్ వైర్ల తయారు చేసి విక్రయించడంతోపాటు.. ఎగుమతులను సైతం చేపడుతోంది. రిటైలర్లు కనీసం 58 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేయవలసి ఉంటుంది.


వ్రజ్ ఐరన్ ఐపీవోకు క్యూ

119 రెట్లు అధిక స్పందన

న్యూఢిల్లీ: స్పాంజ్ ఐరన్, టీఎంటీ బార్ల తయారీ కంపెనీ వ్రజ్ ఐరన్ అండ్ స్టీల్ పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. ఇన్వెస్టర్లు క్యూ కట్టడంతో చివరి రోజు శుక్రవారానికల్లా 119 రెట్లు అధికంగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది. కంపెనీ 61,38,462 షేర్లు విక్రయానికి ఉంచగా.. 73 కోట్లకుపైగా షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 209 రెట్లు, అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) నుంచి 164 రెట్లు అధికంగా స్పందన నమోదైంది. ఇక రిటైల్ ఇన్వెస్టర్లు సైతం 55 రెట్లు అధికంగా దరఖాస్తు చేశారు. ఇష్యూ ధరల శ్రేణి రూ. 195–207.

సినిమా

సేనాపతి... ఓ సూపర్ హీరో



● కమల్‌హాసన్

హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'ఇండియన్ 2' (తెలుగులో 'భారతీయుడు 2'). 1996లో విడుదలైన బ్లాక్‌బస్టర్ సినిమా 'ఇండియన్'కి సీక్వెల్స్‌గా 'ఇండియన్ 2, ఇండియన్ 3' సినిమాలు రూపొందాయి. కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వం వహించిన ఈ సీక్వెల్స్‌లో ముందు 'ఇండియన్ 2' చిత్రం తెలుగు, తమిళ, హిందీ భాషల్లో జూలై 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇటీవల ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్‌లో సేనాపతిగా కమల్‌హాసన్ కొన్ని మార్షల్ ఆర్ట్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు చేశారు. అయితే 'ఇండియన్' సినిమాలో సేనాపతికి 75 సంవత్సరాలు. ఈ ప్రకారం 2024లో ఆయన వయస్సు 103కి చేరుతుంది. అలాంటప్పుడు అంత వయసులో సేనాపతి మార్షల్ ఆర్ట్స్, భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు ఎలా చేయగలుగుతున్నాడు అనే సందేహాలను వ్యక్తపరిచారు కొందరు నెటిజన్లు. ఈ విషయంపై ఇటీవల జరిగిన ఓ మీడియా సమావేశంలో శంకర్ స్పందించారు. ''నా దృష్టిలో సేనాపతి ఓ సూపర్ హీరో. 'భారతీయుడు' కథ రాసుకున్నప్పుడు సేనాపతిని ఓ స్వాతంత్య్ర సమరయోధుడిగా చూపించాలని అప్పుడు సేనాపతికి 75 సంవత్సరాలు అన్నట్లుగా చూపించాం. అప్పుడు సీక్వెల్ ఆలోచన లేదు. ఇప్పుడు 'భారతీయుడు 2'లో చైనా మార్షల్ ఆర్ట్స్ ఫైటర్‌గా సేనాపతి కనిపిస్తాడు. అత్యధిక వయసు కలిగిన ఫైటర్స్ చైనాలో ఉన్నారు. 108 సంవత్సరాలు ఉన్న లు జీజీయన్ అనే చైనా మార్షల్ ఆర్ట్స్ ఫైటర్ ఇప్పటికీ యాక్టివ్‌గా ఉన్నారు. వారి సాధన, క్రమశిక్షణ వారిని అలా తీర్చిదిద్దుతుంది. సేనాపతి కూడా అలాంటివాడే'' అని చెప్పుకొచ్చారు శంకర్. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, బాబీ సింహా, ఎస్‌జే సూర్య, గుల్షన్ గ్రోవర్ కీలక పాత్రల్లో నటించారు. ఇక 'ఇండియన్ 3' చిత్రం వచ్చే ఏడాది ప్రారంభంలో విడుదల కానుంది.

జస్ట్ బ్రేక్... అంతే!



● అనుష్క ● విజయశాంతి ● నభా నటేశ్

మనసుకి నచ్చిన కథ వచ్చే వరకూ కొందరు స్టార్స్ ఖాళీగా ఉంటారు తప్ప ఏ సినిమా పడితే అది చేయరు. కొందరికి నచ్చిన కథ వచ్చినా ఆరోగ్యం బాగా లేక ఇంటిపట్టున ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. వేరే వ్యక్తిగత కారణాల వల్ల కూడా కొందరు బ్రేక్ తీసుకుంటారు. కారణాలు ఏమైనా ఈ మధ్య కొందరు స్టార్స్ సినిమాలకు గ్యాప్ ఇచ్చారు. బ్రేక్ తర్వాత కెమెరా ముందుకి వచ్చి, ఆ తారామణులు చేస్తున్న, చేసిన చిత్రాల గురించి తెలుసుకుందాం.

- తెలుగు ప్రేక్షకుల మనసుల్లో లేడీ సూపర్ స్టార్‌గా నిలిచిపోయారు నటి విజయశాంతి. 'నాయుడమ్మ' (2006) సినిమా తర్వాత పూర్తి స్థాయిలో రాజకీయాల్లోకి వెళ్లారామె. దాదాపు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మహేశ్‌బాబు హీరోగా నటించిన 'సరిలేరు నీకెవ్వరు' (2020) సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చారు విజయశాంతి. ప్రొఫెసర్ భారతి పాత్రలో తనదైన నటనను, భావోద్వేగాలను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారామె. 'సరిలేరు నీకెవ్వరు' తర్వాత మళ్లీ రాజకీయాల్లో బిజీ అయిన విజయశాంతి దాదాపు మూడున్నరేళ్ల తర్వాత ఓ సినిమా కమిట్ అయ్యారు. కల్యాణ్ రామ్ హీరోగా రూపొందుతున్న తాజా చిత్రంలో నటిస్తున్నారామె. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో వైజయంతీ ఐపీఎస్ అనే పవర్‌ఫుల్ పాత్ర చేస్తున్నారు. ఈ నెల 24న విజయశాంతి పుట్టినరోజుని పురస్కరించుకుని ఆమె పాత్ర తాలూకు గ్లింప్స్ రిలీజ్ చేశారు మేకర్స్. 'వైజయంతీ ఐపీఎస్. తాను పట్టుకుంటే పోలీస్ తుపాకీకి ధైర్యం వస్తుంది.. వేసుకుంటే యునిఫామ్‌కి పౌరుషం వస్తుంది.. తనే ఒక యుద్ధం. మేమే తన సైన్యం' అంటూ విడుదలైన గ్లింప్స్‌కి అద్భుతమైన స్పందన వస్తోంది.
- తెలుగులో జేజమ్మగా ప్రేక్షకుల మనసు దోచుకున్నారు అనుష్క. గత ఏడాది 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రంతో ప్రేక్షకుల ముందు కొచ్చారు ఈ బ్యూటీ. 2018లో విడుదలైన 'భాగమతి' మూవీ తర్వాత 'నిశ్శబ్దం' (2020)లో కథానాయికగా నటించారు. ఈ రెండు చిత్రాలకు మధ్య 'సైరా'లో అతిథి పాత్ర చేశారు. 'నిశ్శబ్దం' తర్వాత కాస్త గ్యాప్ తీసుకుని, 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' (2023) చేశారు. ఈ చిత్రం విడుదలైన ఏడాదికి కొత్త చిత్రాలు కమిట్ అయ్యారు. ప్రస్తుతం ఆమె 'కథనార్–ది వైల్డ్ సోర్సెరర్' అనే మలయాళ సినిమాలో నటిస్తున్నారు. తెలుగులో అంగీకరించిన చిత్రం 'ఘాటీ'. ఈ చిత్రానికి క్రిష్ దర్శకుడు. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ సినిమా రూపొందుతోంది. ఒడిశాలోని ఒక మహిళ జీవితంలో జరిగిన వాస్తవ ఘటన నేపథ్యంలో 'ఘాటీ'ని తెరకెక్కిస్తున్నారని టాక్. అందుకే ఆంధ్రా–ఒడిశా బోర్డర్‌లో తొలి షెడ్యూల్ చిత్రీకరణ జరిపారట. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతోంది.
- మలయాళ తార మమతా మోహన్‌దాస్ తెలుగులో హీరోయిన్‌గా నటించిన తొలి చిత్రం 'యమదొంగ'(2007). ఈ చిత్రంలో 'చంపేస్తానా రేయ్.. ఆగంద్రా.. రేయ్ యాడికి పోతాన్రా.. ఏదో ఒక రోజు దొరకాల.. నెల్లూరు ట్రంకు రోడ్డులో గుడ్డలూడదీసి తంతాను నాయాల్లారా..' అంటూ 'యమదొంగ'లో మమతా మోహన్‌దాస్ చెప్పిన డైలాగ్స్ బాగా పాపులర్ అయ్యాయి. ఆ తర్వాత తెలుగులో వరుస అవకాశాలు అందుకున్నారామె. నాగార్జున హీరోగా నటించిన 'కేడీ (2009) తర్వాత మరో తెలుగు సినిమా చేయలేదు. దాదాపు 14 ఏళ్ల తర్వాత 'రుద్రంగి' (2023) చిత్రంతో తెలుగులో రీ ఎంట్రీ ఇచ్చారు మమతా మోహన్‌దాస్. ఇటీవల ఆమె నటించిన 'మహారాజ' (విజయ్ సేతుపతి హీరో) సినిమా ఈ నెల 14న తెలుగు, తమిళ భాషల్లో విడుదలైంది.
- తెలుగు ప్రేక్షకులకు పరిచయం అక్కర్లేని పేరు శోభన. కృష్ణ, చిరంజీవి, మోహన్‌బాబు, నాగార్జున, వెంకటేశ్, బాలకృష్ణ, రాజేంద్ర ప్రసాద్, జగపతిబాబు వంటి హీరోలందరికీ జోడీగా నటించారామె. ప్రత్యేకించి కార్తీ హీరోగా నటించిన 'అభినందన' (1988) సినిమాలో ఆమె నటన అద్భుతం. ఇక 'సూర్య పుత్రులు' (1997) తర్వాత దాదాపు పదేళ్లు తెలుగు సినిమాల నుంచి విరామం తీసుకున్న ఆమె మోహన్‌బాబు, విష్ణు మంచు నటించిన 'గేమ్' (2006) మూవీతో రీ ఎంట్రీ ఇచ్చారు. ఆ చిత్రం తర్వాత తెలుగులో దాదాపు పద్దెనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రభాస్ హీరోగా నటించిన 'కల్కి 2898 ఏడీ' మూవీతో రీ ఎంట్రీ ఇచ్చారు శోభన. ఈ చిత్రంలో శంబాల రాజ్యానికి చెందిన నాయకురాలు మరియంగా తనదైన నటనతో ఆకట్టుకున్నారామె. ఈ చిత్రం ఈ గురువారం (మే 27) విడుదలైంది.



● 'కల్కి'లో శోభన

- 'ఛాతీ మీద చటాకు మాంసం లేదు నువ్వు పెద్ద రౌడీవా?, రేయ్.. నీకంటే పెద్ద రౌడీరా నేను.. ముందు నాతో కొట్లాడు.. సిద్దిపేటలో అడుగు చాందినీ గురించి చెబుతారు' అంటూ 'ఇస్మార్ట్ శంకర్' చిత్రంలో నభా నటేశ్ చెప్పిన మాస్ డైలాగులు ప్రేక్షకుల మనసుల్లో లోతుగా గుచ్చుకున్నాయి. సుధీర్ బాబు హీరోగా నటించిన 'నన్ను దోచుకుందువటే' (2018) సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చారీ బ్యూటీ. ఆ తర్వాత 'అదుగో', ఇస్మార్ట్ శంకర్, డిస్కో రాజా, సోలో బ్రతుకే సో బెటర్' వంటి మూవీల్లో నటించారు. కాగా 'ఇస్మార్ట్ శంకర్' మూవీతో హిట్‌ని తన ఖాతాలో వేసుకోవడంతో పాటు ప్రేక్షకుల్లో 'ఇస్మార్ట్ బ్యూటీ'గా పేరు తెచ్చుకున్నారు నభా. ఓ కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆమె దాదాపు మూడేళ్లు సినిమాలకు బ్రేక్ ఇచ్చారు. ప్రస్తుతం నిఖిల్ హీరోగా రూపొందుతున్న 'స్వయంభూ'లో హీరోయిన్‌గా నటిస్తున్నారు నభా.



● మమతా మోహన్‌దాస్

ఫైట్ షురూ



● తమన్నా

తమన్నా భాటియా, హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్. సింహా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఓదెల 2'. 2021లో వీక్షకుల ముందుకు వచ్చిన 'ఓదెల రైల్వేస్టేషన్' సినిమాకు సీక్వెల్‌గా 'ఓదెల 2' తెరకెక్కుతోంది. అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్ పతాకాలపై డి. మధు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు, యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ''ఈ సినిమాలోని యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం తమన్నా ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. అత్యున్నత ప్రమాణాలతో ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్స్ డిజైన్ చేసిన ఈ ఫైట్ సీన్స్ ప్రేక్షకులకు విజువల్ ట్రీట్‌గా ఉంటాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. యువ, నాగ మహేశ్, వంశీ, గగన్ విహారి కీలక పాత్రలు చేస్తున్న ఈ సినిమాకు సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: సౌందర్ రాజన్ .ఎస్.

సికందర్‌కు విలన్?



● ఫాహద్ ఫాజిల్

సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సికందర్'. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఏఆర్ మరుగదాస్ దర్శకత్వంలో సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఇటీవల ముంబైలోని ఓ స్టూడియోలో ప్రారంభమైంది. సల్మాన్ ఖాన్ పాల్గొంటుండగా యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రంలో సికందర్‌గా సల్మాన్ ఖాన్ టైటిల్ రోల్ చేస్తున్నారు. విలన్‌గా సత్యరాజ్ నటించనున్నట్లు వార్తలు వినిపించాయి. తాజాగా ఫాహద్ ఫాజిల్ పేరు తెరపైకి వచ్చింది. మరి... సత్యరాజ్, ఫాహద్ ఫాజిల్‌లలో 'సికందర్'కు విలన్‌గా ఎవరు ఉంటారు? లేకపోతే ఈ ఇద్దరూ నటిస్తున్నారా? అనే విషయాలపై క్లారిటీ రావాలంటే కొన్ని రోజులు వెయిట్ చేయాలి. ఒకవేళ ఫాహద్ నటిస్తే ఆయనకు హిందీలో ఇదే తొలి చిత్రం అవుతుంది.

దీక్ష పూర్తి



● ప్రతాని రామకృష్ణ గౌడ్

కిరణ్‌కుమార్, అలేఖ్య రెడ్డి జంటగా నటించిన 'దీక్ష' మూవీ షూటింగ్ పూర్తయింది. ప్రతాని రామకృష్ణగౌడ్ దర్శకత్వం వహించారు. ఆర్.కె. ఫిలింస్, స్నిగ్ధ క్రియేషన్స్‌పై పినిశెట్టి అశోక్ కుమార్, మదాడి కృష్టారెడ్డి నిర్మించారు. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ– ''కృషి, పట్టుదల, దీక్ష ఉంటే ఏదైనా సాధించగలం అనే పాయింట్‌తో ఈ మూవీని తెరకెక్కించాం. ఈ సినిమా ద్వారా నలుగురు హీరోయిన్స్‌ని పరిచయం చేస్తున్నాం. అలాగే 'మహిళా కబడ్డీ' అనే మరో చిత్రాన్ని 18 భాషల్లో తెరకెక్కించబోతున్నాం. కబడ్డీ ఆడగల యంగ్ హీరోయిన్స్ మమ్మల్ని సంప్రదించవచ్చు'' అన్నారు. ''దీక్ష'తో నాకు మంచి పేరుతో పాటు అవార్డ్స్ వస్తాయని ఆశిస్తున్నాను'' అన్నారు కిరణ్. రచయిత రాంప్రసాద్, నటి తులసి మాట్లాడారు.

క్లుప్తంగా...

అతిపెద్ద వెటర్నరీ ఆస్పత్రి ఏర్పాటుకు సన్నాహాలు

సత్యం శివం సుందరం గోశాల వద్ద జూలై మొదటివారంలో సేవలు అందుబాటులోకి...

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే అతిపెద్ద వెటర్నరీ ఆస్పత్రి త్వరలోనే అందుబాటులోకి రానుంది. అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లేదారిలో గగన్‌పహాడ్ సత్యం శివం సుందరం గోశాల వద్ద సుమారు 5,100 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆపరేషన్ థియేటర్, ఇంటెన్సివ్ కేర్ యూనిట్, రోగనిర్ధారణ పరీక్షలు, ప్రత్యేక వైద్యులు ఇలా అధునాతన సౌకర్యాలతో డిస్పెన్సరీ సిద్ధమవుతోంది. గగన్‌పహాడ్‌లో 3,200 ఆవులు, బుర్జుగడ్డ వద్ద 2,800 ఆవులకు ఆశ్రయం కల్పిస్తూ సత్యంశివంసుందరం గోశాల ఇప్పటికే ప్రసిద్ధి చెందింది. జూలై మొదటి వారంలో అత్యాధునిక సౌకర్యాలతో ఆస్పత్రిని ప్రారంభించే అవకాశముందని గోశాల ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 30 ఏళ్లుగా గోవులను రక్షించే లక్ష్యంతో పనిచేస్తున్న 85 ఏళ్ల ధరమ్‌రాజ్ రాంఖాకు ఇది చిరకాల స్వప్నమన్నారు. గోశాలలోని పశువులకే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లోని గొర్రెలు, మేకలు, కుక్కలు వంటి జంతువులకు కూడా సేవలందిస్తామని తెలిపారు.

సింగరేణి ఈపీ ఆపరేటర్ పోస్టుల పెంపు

సింగరేణి కార్పొరేట్ పర్సనల్ జీఎం బీఆర్ దీక్షితులు



గోదావరిఖని: సింగరేణివ్యాప్తంగా ఇంటర్నల్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఈపీ ఆపరేటర్ ట్రైనీ పోస్టులను 60 నుంచి 100కు పెంచినట్లు కార్పొరేట్ పర్సనల్ జీఎం దీక్షితులు శుక్రవారం తెలిపారు. మణుగూరు ఏరియాలో ఖాళీగా ఉన్న ఈపీ ఆపరేటర్ ట్రైనీ (కేటగిరీ–5) పోస్టులను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేయాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 18 నుంచి 21 వరకు డ్రైవింగ్ పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో ఉత్తీర్ణులైన 828 అభ్యర్థులకు ఈనెల 30న కొత్తగూడెంలోని మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు. రాత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి అసెస్మెంట్ మార్కులు, డ్రైవింగ్ ప్రొఫీషియెన్సీ పరీక్ష మార్కులు కలిపి, అభ్యర్థుల ఫైనల్ మార్కుల జాబితా అదేరోజు హెడ్ ఆఫీసు నోటీస్ బోర్డుపై అంటిస్తామని దీక్షితులు వివరించారు. మెరిట్ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్, స్థానిక రిజర్వేషన్ ప్రకారం వంద పోస్టులు భర్తీ చేస్తామన్నారు.

ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం అధ్యక్షునిగా ఫణి



సాక్షి, హైదరాబాద్: దక్షిణమధ్య రైల్వే ప్రయాణికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం ఆవిర్భవించింది. ఈ సందర్భంగా శుక్రవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. అధ్యక్షునిగా ఫణి, ఉపాధ్యక్షునిగా అజయ్ క్రాంతి సింగ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ కలవేని, సంయుక్త కార్యదర్శిగా సిరిపురం సాయి కృష్ణ, కోశాధికారిగా మోహన్ గంగుల ఎన్నికయ్యారు. వివిధ మార్గాల్లో కొత్త రైళ్లు, స్టేషన్లలో నెలకొన్న సమస్యలు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిల నిర్మాణం, ప్రయాణికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు అధ్యక్షుడు ఫణి తెలిపారు.

సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్



435 - ఎంబీబీఎస్ అర్హతతో భర్తీ చేయబోయే పోస్టులు ఇవి..

- ప్రైవేట్ ప్రాక్టీస్ చేయడానికి అర్హులు కాదని వైద్య, ఆరోగ్యశాఖ స్పష్టీకరణ
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే 351 పోస్టులు
- వచ్చే నెల 2 నుంచి 11వ తేదీ మధ్య ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- పాయింట్ల ఆధారంగా ఎంపిక ప్రక్రియ

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్ అర్హతతో సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది. ఈ మేరకు తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు శుక్రవారం నోటిఫికేషన్ జారీచేసింది. మొత్తం పోస్టులు 435 కాగా, అందులో 351 ప్రాథమికఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ)లో మెడికల్ ఆఫీసర్ పోస్టులు, మరో 80 పోస్టులు డీఎంఈ పరిధిలో ఆస్పత్రుల్లో ఆర్ఎంఓ పోస్టులు. ఐపీఎంలో భర్తీ చేసే పోస్టులు నాలుగు. ఈ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించారు. బోర్డు వెబ్‌సైట్ (https://mhsrb. telangana.gov.in)లో దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చే నెల రెండో తేదీన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమవుతుంది. దరఖాస్తులు సమర్పించడానికి చివరితేదీ అదే నెల 11వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు అవకాశం కల్పించారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తులను మాత్రమే ఆమోదిస్తారు. ఈ పోస్టులకు పేస్కేల్ రూ.58,850 నుంచి రూ.1,37,050 మధ్య ఉంటుంది. ఫలితాల ప్రకటన వరకు సంబంధితశాఖ నుంచి ఖాళీలు ఏవైనా ఉంటే వాటిని చేర్చడం లేదా తొలగించడం జరుగుతుంది. ఎంపికైన అభ్యర్థులు ప్రైవేట్ ప్రాక్టీస్‌కు అర్హులు కాదని స్పష్టం చేశారు. అభ్యర్థులను 100 పాయింట్ల ఆధారంగా ఎంపిక చేస్తారు. గరిష్టంగా 80 పాయింట్లు అర్హత పరీక్షలో పొందిన మార్కుల శాతం ప్రకారం ఇస్తారు. అంటే ఎంబీబీఎస్‌లో అన్ని సంవత్సరాలలో పొందిన మొత్తం మార్కులు 80 శాతంగా మార్చుతారు. విదేశాల్లో ఎంబీబీఎస్ చేసిన అభ్యర్థులకు సంబంధించి, ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ పరీక్ష (ఎఫ్ఎంజీఈ)లో పొందిన మార్కులశాతాన్ని పరిగణనలోకి తీసుకొని 80 శాతంగా మార్చుతారు. కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వ ఆస్పత్రులు/సంస్థల్లో పనిచేసే వారికి గరిష్టంగా 20 పాయింట్లు ఇస్తారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసిన వారికి 6 నెలలకు 2.5 పాయింట్లు, ఇతర ప్రాంతాల్లో పనిచేసిన వారికి 6 నెలలకు 2 పాయింట్లు ఇస్తారు. అక్కడ పనిచేస్తున్నట్టు అనుభవ ధ్రువ పత్రాన్ని సంబంధిత అధికారి ద్వారా తీసుకోవాలి. అనుభవ ధ్రువ పత్రాన్ని పొందిన తర్వాత అభ్యర్థి ఈ పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఆయా జోన్లలో పోస్టులు ఇలా...

కేటగిరి	మల్టీ జోన్-1	మల్టీ జోన్-2
ఓసీ	68	43
ఈడబ్ల్యూఎస్	27	18
బీసీ-ఏ	18	12
బీసీ-బీ	27	15
బీసీ-సీ	02	02
బీసీ-డీ	19	11
బీసీ-ఈ	11	06
ఎస్సీ	39	25
ఎస్టీ	27	17
స్పోర్ట్స్	05	03
ఓహెచ్	24	09
ఎక్స్ సర్వీస్	04	03
మొత్తం	271	164

ఇతర ముఖ్యాంశాలు...

- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడానికి ముందు, దరఖాస్తు దారులు సాఫ్ట్‌కాపీని దగ్గర ఉంచుకోవాలి.
- ఆధార్ కార్డు, పదోతరగతి సర్టిఫికెట్ (పుట్టిన తేదీ రుజువుకు), ఎంబీబీఎస్ సమగ్ర మార్కుల మెమో, సర్టిఫికెట్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, అనుభవ ధ్రువపత్రాలు, స్థానికతను తెలియజేసే స్టడీ సర్టిఫికెట్లు (1 నుంచి 7వ తరగతి), ఎస్సీ, ఎస్టీ, బీసీ కమ్యూనిటీ సర్టిఫికెట్, బీసీల విషయంలో నాన్–క్రీమిలేయర్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కోరేవారు తాజా ఆదాయ, ఆస్తి సర్టిఫికెట్, స్పోర్ట్స్ కేటగిరీ వారు స్పోర్ట్స్ సర్టిఫికెట్, దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, మాజీ సైనికులు వయస్సు సడలింపునకు సర్వీస్ సర్టిఫికెట్, ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్ కోసం సర్వీస్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాలి.
- నోటిఫికేషన్ తేదీ నాటికి దరఖాస్తుదారులు తప్పనిసరిగా ఎంబీబీఎస్ లేదా తత్సమాన అర్హత చదివి ఉండాలి. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సమయంలో, ఏదైనా దరఖాస్తుదారుడు అవసరమైన అర్హత కాకుండా ఇతర అర్హతలు ఉంటే (అర్హతకు సమానమైనవి) వాటిని 'నిపుణుల కమిటీ'కి సిఫార్సు చేస్తారు. నిపుణులకమిటీ' నివేదిక ప్రకారం బోర్డు నిర్ణయిస్తుంది.
- తెలంగాణ కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన దరఖాస్తుదారులు ఎలాంటి రిజర్వేషన్లకు అర్హులు కారు.
- పోస్టులను మల్టీ–జోనల్‌గా వర్గీకరించారు.
- **మల్టీ జోన్-1లో జిల్లాలు:** ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, హన్మకొండ, వరంగల్.
- **మల్టీ జోన్-2 :** సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి, జనగాం, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ–గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్

ఇకనుంచి విడతల వారీగా మిగిలిన పోస్టులకు నోటిఫికేషన్లు

వైద్య,ఆరోగ్యశాఖలో పెద్ద ఎత్తున ఖాళీలను భర్తీ చేయాలని పార్లమెంట్ ఎన్నికల కోడ్ సమయంలో ప్రభుత్వం నిర్ణయించడం తెలిసిందే. 5,348 వైద్య పోస్టులు భర్తీ చేసేందుకు గత మార్చి 20వ తేదీన ఆర్థికశాఖ అనుమతించింది. ఈ పోస్టులను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ద్వారా భర్తీ చేస్తామని తెలిపింది.

- డీఎంఈ విభాగం పరిధిలో 3,235 పోస్టులు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో 1,255 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది.
- ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో 575 పోస్టులు, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలో 11 పోస్టులు, ఆయుష్ విభాగంలో 26 పోస్టులు, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్‌లో 34 పోస్టులు, ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి పరిధిలో 212 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది.
- తొలుత 435 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు నోటిఫికేషన్ జారీచేశారు. మిగిలిన పోస్టులకు విడతల వారీగా నోటిఫికేషన్లు విడుదల చేస్తామని బోర్డు ప్రకటించింది.

ఆ ఐటీఐలు ఇక నుంచి ఏటీసీలు



- 25 ఐటీఐల అప్‌గ్రేడేషన్‌కు ఎల్ఈటీ కార్యాచరణ
- తొలివిడతలో ఎంపిక చేసిన వాటి ఆధునికీకరణ, వసతుల కల్పనకు ప్రాధాన్యం
- అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలోనే ఐదు ఐటీఐలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్(ఏటీసీ)లుగా అప్‌గ్రేడ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించగా, ఆ దిశగా రాష్ట్ర కార్మిక శిక్షణ, ఉపాధి కల్పన విభాగం కార్యాచరణ వేగవంతం చేసింది. గతవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఏటీసీ ప్రాజెక్టు కార్యరూపం దాల్చగా, మాసబ్‌టాంక్‌లో నాలుగు ఏటీసీల భవన నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 65 ఐటీఐలు ఉన్నాయి. వీటన్నింటినీ ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా, తొలివిడతలో 25 ఐటీఐలను మాత్రమే అప్‌గ్రేడ్ చేస్తారు. ఇవన్నీ 2024–25 నుంచే సేవలు ప్రారంభిస్తాయి. తొలివిడతలోకి వచ్చే ఐటీఐలతో కూడిన ప్రతిపాదిత జాబితాను సిద్ధం చేసేందుకు శిక్షణ, ఉపాధికల్పన శాఖ కసరత్తు చేస్తోంది. తొలివిడత ప్రాజెక్టులో అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలోనే ఐదు ఐటీఐలు ఏటీసీలుగా మారనున్నాయి. మిగతా వాటిని కూడా ఎంపిక చేసి జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించేందుకు ఆ శాఖ చర్యలు చేపట్టింది.

ఇండస్ట్రీస్ 4.0....

అప్‌గ్రేడ్ చేసే క్రమంలో ప్రస్తుతమున్న శిక్షణ కార్యక్రమాలు సైతం కొత్తరూపు సంతరించుకోనున్నాయి. రెండుమూడు దశాబ్దాల క్రితం ఉన్న శిక్షణ కార్యక్రమాలనే ఐటీఐల్లో కొనసాగిస్తున్నారు. ఇకపై ఏటీసీల్లో సరికొత్త కోర్సులు అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కోర్సుల ఎంపికపైనా కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే ఆరు రకాల ట్రేడ్‌లు ఎంపిక చేసి వాటిని ఈ ఏడాది నుంచే ప్రవేశపెట్టేలా చర్యలు వేగవంతం చేసింది. ఇవన్నీ నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్(ఎన్‌సీవీటీ) నిబంధనలకు అనుగుణంగా మార్పు చేసి అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రొడక్ట్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్, ఐఓటీ డిజిటల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, మోడ్రన్ ఆటోమేటివ్ మెయింటెనెన్స్, ఆర్క్ వెల్డింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వెల్డింగ్, పెయింటింగ్ తదితర కొత్త ట్రేడ్‌లు ఏటీసీల ద్వారా అందుబాటులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. కొత్తగా ఇండస్ట్రీస్ 4.0 పేరిట లాంగ్‌టర్మ్, షార్ట్ టర్మ్ కోర్సులను, పారిశ్రామిక అవసరాలకు అనుగుణమైన ట్రేడ్‌లను ఏటీసీల్లో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. చాలా ఐటీఐల్లో మౌలిక వసతులు, ఫ్యాకల్టీ సమస్య, స్థలాభావం కారణంగా భవనాల సమస్య ఉండడంతో యుద్ధప్రాతిపదికన ఏటీసీలుగా మార్పు చేయడం కత్తిమీద సాములా పరిణమించిందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులో..

బ్రీత్ అనలైజర్‌తో ఉడాయించాడు



పోలీసులకు ఝలక్ ఇచ్చిన మందుబాబు

కంటోన్మెంట్ (హైదరాబాద్): డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల్లో పోలీసులను ముప్పుతిప్పలు పెట్టాడో మందుబాబు. వారినుంచి తప్పించుకోవాలన్న ఆత్రుతలో ఏకంగా బ్రీత్ ఎనలైజర్‌నే లాక్కొని పారిపోయాడు. ఈ నెల 27 అర్ధరాత్రి దాటాక బోయిన్‌పల్లి మల్లారెడ్డి గార్డెన్స్ సమీపంలో బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. అశోకా గార్డెన్స్ నుంచి బోయిన్‌పల్లి చౌరస్తా, మల్లారెడ్డి గార్డెన్స్ మార్గాల్లో వెళ్లే వాహనాలను ఆపుతూ డ్రైవర్‌లను పరీక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఓ స్విఫ్ట్ డిజైర్ వాహనాన్ని ఆపారు. ట్రాఫిక్ జామ్ దృష్ట్యా కారును బారికేడ్‌ను దాటాక రోడ్డుకు ఎడమవైపు నిలపాలని సిబ్బంది సూచించారు. ఈ క్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ డ్రైవర్‌ను బ్రీత్ అనలైజర్ ఊదాలని చెప్పాడు. మద్యం సేవించి వాహనం నడిపితే భారీ జరిమానా, కౌన్సెలింగ్, డ్రైవింగ్ లైసెన్సుపై ఆంక్షలు ఉన్న నేపథ్యంలో భయపడ్డ కారు డ్రైవర్ ఒక్కసారిగా బ్రీత్ అనలైజర్‌ను లాక్కుని పారిపోయాడు. రోడ్డు ఖాళీగా ఉండటం, మిలటరీ ప్రాంతంలో వెలుతురు తక్కువగా ఉండటంతో క్షణాల్లో దూసుకెళ్లిపోయాడు. తేరుకున్న ట్రాఫిక్ సిబ్బంది కారును వెంబడించేలోపే బోయిన్‌పల్లి చౌరస్తా దాటిపోయాడు. రాత్రి వర్షం కురుస్తూ ఉండటం కూడా ఇబ్బందిగా మారిందని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగయ్య తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి బోయిన్‌పల్లి లా అండ్ ఆర్డర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాహనం ఆనవాళ్లు దొరికినప్పటికీ, వెలుతురు సరిగ్గా లేకపోవడంతో కారు నెంబర్‌ను గుర్తించలేకపోతున్నట్లు వెల్లడించారు.

రానున్న రెండ్రోజులు తేలికపాటి వానలు

వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం



సాక్షి, హైదరాబాద్: పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దాన్ని ఆనుకుని ఉన్న వాయవ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శుక్రవారం ఉత్తర ఒడిశా తీరం వద్ద వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉత్తర, తూర్పు ప్రాంత జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ప్రస్తుతం వాతావరణంలో నెలకొన్న మార్పుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పతనమయ్యాయి. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు 2 డిగ్రీల నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. శుక్రవారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే గరిష్ట ఉష్ణోగ్రత రామగుండంలో 33.7 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 21.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

టెన్త్ అడ్వాన్స్‌డ్‌లో 73.03% ఉత్తీర్ణత

మొదటి స్థానంలో నిర్మల్

ఆఖరి స్థానంలో వికారాబాద్



సాక్షి, హైదరాబాద్: పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో 34,126 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 20,694 మంది పాసైతే, బాలికలు 13432 మంది పాసయ్యారు. 73.03 శాతం ఉత్తీర్ణత నమోదైంది. టెన్త్ కామన్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకూ నిర్వహించారు. మొత్తం 46,731 మంది హాజరయ్యారు. పరీక్ష ఫలితాలను టెన్త్ పరీక్షల విభాగం శుక్రవారం హైదరాబాద్‌లో విడుదల చేసింది. నిర్మల్ జిల్లా 100 శాతం ఉత్తీర్ణతతో మొదటి స్థానంలో నిలిస్తే, వికారాబాద్ జిల్లాలో అతి తక్కువ ఉత్తీర్ణత (42.14 %) నమోదైంది. హైదరాబాద్‌లో 71.22 శాతం విద్యార్థులు పాసయ్యారు. కొంతమంది విద్యార్థులకు సంబంధించిన సరైన సమాచారం లేనందున వారి ఫలితాలను విత్‌హెల్డ్‌లో ఉంచారు. త్వరలో వీరి ఫలితాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. ఫలితాలు www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో పది రోజుల పాటు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

రీ కౌంటింగ్‌కు జూలై 8 వరకూ చాన్స్

మూల్యాంకన పత్రాలు, మార్కులపై అభ్యంతరాలు ఉన్న విద్యార్థులు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. జూలై 8వ తేదీ వరకూ ప్రతి సబ్జెక్టుకు రూ. 500 చెల్లించి రీ కౌంటింగ్ చేయించుకోవచ్చని అధికారులు తెలిపారు. రీ వెరిఫికేసన్ కోరే విద్యార్థులు హాల్ టికెట్ జిరాక్స్, కంప్యూటరైజ్డ్ ప్రింటెడ్ మెమో కాపీతో సంబంధిత పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలి. రీ వెరిఫికేసన్ కోసం ఒక్కో సబ్జెక్టుకు రూ.1,000 చెల్లించాల్సి ఉంటుంది.

విధుల్లోకి 1,654 మంది గెస్ట్ లెక్చరర్లు



సాక్షి ఎఫెక్ట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అతిథి అధ్యాపకులను కొనసాగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. దీనివల్ల 1,654 మంది గెస్ట్ లెక్చరర్లు తిరిగి విధుల్లోకి రానున్నారు. 'ఇంటర్ క్లాసులు చెప్పేదెవరు?' శీర్షికతో 'సాక్షి' దినపత్రిక శుక్రవారం కథనాన్ని ప్రచురించింది. గెస్ట్ లెక్చరర్లను ఇంకా తీసుకోకపోవడంపై వారి ఆందోళనను, ఇంటర్ విద్యార్థుల, తల్లిదండ్రుల మనో వేదనను కథనంలో పేర్కొంది. దీనిపై సీఎంవో స్పందిస్తూ వెంటనే అధికారులకు ఆదేశాలిచ్చింది. అయితే గెస్ట్ లెక్చరర్లను జూలై 31 వరకు మాత్రమే కొనసాగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. శాశ్వత లెక్చరర్ల నియామకం చేపడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. నియామక ప్రక్రియ పూర్తవకపోతే గెస్ట్ లెక్చరర్లకు పొడిగింపు ఇచ్చే వీలుంది.

బాసర ఆలయంలో ప్రసాదాల గోల్‌మాల్

- రీసైక్లింగ్‌లో టికెట్ల విక్రయాలు
- బాధ్యుల్ని సస్పెండ్ చేస్తామన్న ఈవో



రీసైక్లింగ్‌కు ప్రసాదాల టికెట్లను చింపకుండా ఉంచిన సిబ్బంది

భైంసా: నిర్మల్ జిల్లా బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో ప్రసాదాల కౌంటర్‌లో అక్రమాల బాగోతం శుక్రవారం బయటపడింది. బాసర గ్రామస్తులు ప్రసాదాల తయారీకేంద్రం నుంచి విక్రయ కేంద్రానికి వెళ్తున్న వాహనాన్ని అడ్డుకున్నారు. అందులో నాలుగు ట్రేలలో 400 పులిహోర ప్యాకెట్లు తీసుకువెళ్తున్నట్లు రికార్డుల్లో రాశారు. ట్రేలలో లెక్కించగా 640 ఉంది. ఒక్కో ట్రేలో 60 పులిహోర ప్యాకెట్లు అధికంగా ఉన్నాయి. గ్రామస్తుల ఫిర్యాదులతో ఆలయ ఈవో విజయరామారావు విక్రయ కేంద్రానికి వెళ్లి పరిశీలన చేశారు. ప్రసాదాలు లెక్కించగా తేడా ఉన్నట్లు గుర్తించారు. గ్రామస్తులు నిలదీయడంతో ప్రసాదాల కౌంటర్ వద్ద టికెట్లు చింపి ఉంచిన బుట్టను పరిశీలించారు. అందులో ప్రసాదాల కోసం భక్తులు ఇచ్చిన టికెట్లను చింపకుండానే అలాగే ఉంచారు. ఈ టికెట్లతోనే ప్రసాదాల రీసైక్లింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. ఇలా వచ్చిన సొమ్మును జేబుల్లో వేసుకుంటూ ఆలయ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ సందర్భంగా ఈవో విజయరామారావు మాట్లాడుతూ స్టోర్‌రూం, టికెట్ కౌంటర్లలో పరిశీలించి అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారు. ఇందుకు బాధ్యులైన ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులు, నలుగురు ఎస్ఎంఆర్‌లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. టికెట్లు రీసైక్లింగ్ జరగకుండా జూలై 1 నుంచి ఆన్‌లైన్ విధానంలో టికెట్లను విక్రయిస్తామని చెప్పారు. గ్రామస్తులు మాత్రం ఈ అవినీతిలో ఉన్నతాధికారుల పాత్ర ఉందని, వారి కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతోందని ఆరోపిస్తున్నారు. రోజూ లక్షల రూపాయలు సంపాదించే అధికారులు ఇలాంటి సంఘటనలు బయటకు పొక్కినప్పుడు చిన్న ఉద్యోగులపై చర్యలు తీసుకుని మళ్లీ యథావిధిగా తమ అక్రమాలు కొనసాగిస్తూ అమ్మవారి సొమ్ము కాజేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.